సాహిత్య

# ప్రస్థానం

జనవరి-మార్చి 2005

వెల: రు.10



సాహితీ స్రవంతి

సాహిత్య
ప్రస్థానం
జనవరి - మార్చి 2005
సంపుటి :1 సంచిక : 4

# విశాల వేదిక

సాహిత్యరంగంలో జరగాల్సిన కృషిపైనా, ప్రజలకు దాన్ని చేరువ చేసే విధానాలపైన విశాల సమాలోచన జరగాలని దాదాపు ఏడాది కిందట ప్రస్థానంలో పిలుపునిచ్చాము.

ఆ తర్వాత ఆ దిశలో చాలా ప్రయత్నాలు జరిగాయి. మార్చి 5,6 తేదీలలో విజయవాడలో జరిగిన సాహిత్యశాల ఆ పయనంలో ముఖ్యమైన ముందడుగు. 250 మందికి పైగా సాహితీ మిత్రులసమక్షంలో ముప్పై మందికి పైగా పెద్దలు తమ భావాలు పంచుకున్నారు. సందేహాలకు తమ సమాధానాలు చెప్పారు. వచ్చిన వారందరికీ అదో మంచి అనుభవమైంది. అభినందనలు తెచ్చింది.

ఆ ఉత్సాహంతోనే ఇప్పుడు హైదరాబాదులో మరోసారి అలాటి ప్రయోగం జరగనుంది. ఈ ప్రయత్నాలలో లోపాలు వుండొచ్చు. మెరుగుపరచే అవకాశమూ వుంటుంది. అంతా పరిపూర్ణమనే భ్రమ ఏమీ లేదు. హైదరాబాదు సాహిత్యశాల కూడా ముగిశాక దాన్ని పరిశీలించి మరింత బాగా జరిపే ఆలోచనలు చేయొచ్చు.

F F F

ఈ కాలంలో వడ్డెర చండీదాస్, మద్దూరి నగేష్ బాబులు కన్నుమూశారు. ప్రస్థానం వారి మృతికి సంతాపం ప్రకటిస్తోంది. నగేష్‌బాబుకు ఈ సంచికలో ఒక యువమిత్రుడు రాసిన నివాళి ప్రచురిస్తున్నాం. చండీదాస్‌పై చండప్రచండమైన సాహిత్య చర్చ ఇప్పటికే జరుగుతున్నది. మా అభిప్రాయంలో చర్చకు ఇలాటి ఆవేశకావేశాలు అవసరం లేదు. ఈ నేపథ్యాన్ని కూడా గమనంలో పెట్టుకుని ఆయన కంట్రిబ్యూషన్‌పై మిత్రులు ఏదైనా రాసి పంపితే ప్రచురించగలం.

F F F

వచ్చే సంచిక నుంచి ప్రస్థానం చందా కట్టించుకునే అవకాశం రాబోతున్నది. అప్పుడు సరఫరాలో వున్న ఇబ్బందులు తొలగిపోతాయి. ఈ లోగా సాహితీ మిత్రులు ప్రస్థానం పట్ల ఆసక్తి వున్నవారి వివరాలు తెల్పితే మేము అవసరమైన సమాచారం, తర్వాత పత్రిక పంపే ఏర్పాటు చేస్తాము.

ముఖచిత్రం : అక్బర్
లోపలి చిత్రాలు : మోహన్, అక్బర్, జె. వెంకటేష్

## ఈ సంచికలో...

| | |
|---|---|
| వికర్షణా దర్పణం (కవిత) | ........ 2 |
| ప్రాణశంఖం (కథ) | ........ 3 |
| దీపకల్ప పరిహాసం (కవిత) | ........ 7 |
| పాలమూరు లంబాడి | ........ 8 |
| పచ్చని స్వప్నం (కవిత) | ........ 9 |
| ది పోయెట్ (కవిత) | ....... 10 |
| కథకులు, పాఠకుల మధ్య అవినాభావ సంబంధం | ........ 11 |
| చెదిరిన బింబం (కథ) | ....... 16 |
| వల్లభాపురం "పహరా కాస్తున్న రాత్రి" | ...... 22 |
| గ్లోబల్ ప్రవచనం (కవిత) | ...... 23 |
| త్రిముఖి (కవిత) | ...... 23 |
| హాప్ట్‌మన్-గురజాడ | ...... 24 |
| శబ్దాల యుద్ధం తర్వాత (కవిత) | ...... 28 |
| గావు (కథ) | ...... 29 |
| స్త్రీ సాహిత్యంలో ప్రపంచీకరణ వ్యతిరేకత | ...... 33 |
| తెరచిన-మూసిన (కవిత) | ...... 34 |
| కనుమరుగవుతున్న వేమన తత్త్వము | ...... 35 |
| డ్రాపౌట్ (కథ) | ...... 37 |
| నూరు పువ్వులు, వేయి భావాల కలనేత 'సాహిత్యశాల | ...... 40 |
| యుగాంతం (కవిత) | ...... 42 |
| బాల సాహిత్యంపై చర్చ | ...... 43 |
| కొక్కరోకో (కవిత) | ...... 43 |
| సాహిత్యసీమలో సరికొత్త ప్రయోగం | ...... 44 |
| మట్టి పరిమళం మద్దూరి నగేష్‌బాబు | ...... 47 |
| స్వీకారం | ...... 48 |
| సమీక్షాపర్వం | ...... 49 |
| జయకాంతన్‌కు జ్ఞానపీఠం | ...... 56 |
| పావలా తాత | ...... 57 |
| దగ్ధమౌతున్న పాట (కవిత) | ...... 58 |
| ఒక అభయార్ణవం కావాలి (కవిత) | ...... 58 |
| పండగచీర (కవిత) | ...... 59 |
| డైరీ | ...... 59 |

సంపాదకుడు
తెలకపల్లిరవి
ముద్రాపకులు, ప్రచురణకర్త
వి. కృష్ణయ్య
మేనేజర్
కె. లక్ష్మయ్య

ఎడిటోరియల్ బోర్డ్ అడ్రస్ :
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

కవిత


# వికర్షణా దర్పణం

బడబాగ్ని శంకరరాజు



చెయ్యెత్తు పందిటి మీదికి పాకిన
మనిషి ఆర్థిక ఎదుగుదల తీగె నుంచి
ఆప్తులందరూ పళ్ళను తెంపుకొనేవారు
శాఖోపశాఖలుగా ఎదుగుతున్న కొలదీ
తీగెలు విస్తరించే కొలదీ, నేల వాలకుండా
లబ్దిదారులందరూ ఊతకర్రలను నాటేవారు
చేతికందకుండా ఎత్తులకు
ఎంతో ఎత్తులకు విస్తరించాక
ఆప్తులకు ఫలాలు అందకుండా పోయాయి
ఊతకర్రల అవసరము ఇపుడు ఏ మాత్రం లేదు
ఎదిగిన మనిషి క్రిందికి చూస్తే
ఆప్తులందరూ అల్పంగా అనిపించారు
ఎదిగిన అతనిని చూస్తే ఆప్తులకు,
అతనెంతో ఉన్నత స్థాయికి ఎదిగిపోయాడనిపించాడు
ఒకరినొకరు దరిచేరాలని ఏర్పరచుకొన్న
ఆప్యాయతా అనురాగాల నిచ్చెనలను
అనుసంధాన సాధనాలను, ఏదో అడ్డుకొంది?
ఎవరో ఆర్థిక హోదా, అద్దాలతో
అడ్డుగోడ కట్టేశారు!
అతని ఇన్ఫ్రారెడ్ కళ్లద్దాలకు
వాళ్ళ చత్వారం అద్దాలకు
జీవన చిత్రాలు భిన్నంగా కనిపిస్తున్నాయి
చత్వారం అద్దాల్లోంచి
అతను ఒక రంగు ముద్దగా కనిపిస్తే
ఇన్ఫ్రారెడ్ అద్దాల్లోంచి వాళ్ళు
అర్ధనగ్నంగా ఆటవికుల్లా కనిపిస్తున్నారు
చత్వారం అద్దాల్లోంచి
అతను కాంక్రీటు కట్టడంలో బందీ అయినట్లుగా కనిపిస్తున్నాడు
ఇంటి చలువ అద్దాల్లోంచి
వాళ్ళు అతనికి చీకట్లో బ్రతుకుతున్నట్లు కనిపిస్తారు
చత్వారం అద్దాల్లోంచి
అతను కారు యంత్రంలో ఒక భాగంగా కనిపిస్తాడు
కారు చలువ అద్దాల్లోంచి
వాళ్ళు వెనక్కి వెనక్కి నడుచుకెళుతున్నట్లు కనిపిస్తారు
యాదృచ్ఛికంగా కుటుంబ సంక్షోభం తుఫాను గాలికి
అద్దాల అడ్డుగోడ పగిలి బద్దలై
అనుసంధాన సాధనాలకు మార్గం సుగమనం చేస్తుంది
ఎవరో అంతుబట్టకుండా తనకదలికలను
వాళ్ళ కదలికలను తూగుడు బల్లలో అమర్చేసారు
తూకం! బేకం! అంటూ ఒకే స్థాయి ఉత్థానపతనాలు
జీవితం ఏటవాలు బండ మీద
ఎవరో బలవంతాన అతికించిన పరాయి విలువల నాచు
అడుగుతీసి అడుగు వేస్తున్నా గమనంలో దూరం తరగదు
మనిషి జీవితాన్ని ఎవరు ముక్కలుగా కత్తిరించారు?
ఎవరు? – ఈ జీవిత విభాగాల్ని
ఉపభాగాలుగా కత్తిరించి మధ్య మధ్యలో
మానవతా విలువల్ని, ఆర్థిక విలువల ముక్కలతో
కప్పివేసి కుట్టిన షేర్, బిజినెస్ మాయగాడు
అందరూ తమ జీవితాల్ని తామే
నిర్మించుకొన్నామని భ్రమించారు.
భ్రమలు వాళ్ళిద్దరి మధ్యా శూన్యాన్ని ఏర్పరచాయి
శూన్యాన్ని జ్యోతిష్యులు లాభాల హామీ మైలురాళ్ళతో నింపేశారు
వారిద్దరి మధ్య భూస్థాపితమైపోయిన దృష్టిరేఖలు
వారి పునాదిని పగుళ్ళు చారేట్లు చేసాయి
వారు ఒకరికొకరు ఎదురుపడినప్పుడు
వారి కళ్ళ చూపుల మధ్య శూన్యంలోకి
విడుదలయిన మౌనరోదనా భావాలు
వాయు జీవావరణాన్ని మత్తుకమ్మేస్తాయి
నెరవేరని కోరికలు వైఫల్యాలు
సిగరెట్టు పీకల గుట్టలుగా మారుతాయి
కంటిలో మొలచిన నోటితో మాత్రమే
సంభాషణ సాగుతుంది
అంతా శ్మశానం దారిలో ఏర్పడే విషాద మౌనం
ఏవో అనిర్వచనీయమయిన
సామాజిక, ఆర్థిక రాజకీయ శక్తులు
వారి మధ్య వికృతపు అడ్డంకులు సృష్టించాయి
అతనికి తెలుసు తన జీవిత ఔన్నత్య మూలాలు
ఆ శక్తులలోనే ఇమిడి ఉన్నాయని
అతనికి తెలుసు
ఆ శక్తులను కదిలిస్తే జీవిత పునాదులు కదిలిపోతాయని అందుకే, అతను
ఎపుడూ గుంభనంగా నవ్వుతూ
మౌనంగా చూస్తూనే ఉంటాడు
వాళ్ళూ మౌనంగా అమాయకత్వాన్ని పెంచుకొంటూ
అడ్డుగోడల మీద, అంతస్తుల గాజు ముక్కల మీద
క్షుద్రశక్తుల ప్రతిమలు మలచి పూజల్లోకి దిగుతారు
సామాజిక విలువల ముడిపదార్థాలతో
తయారు చేయవలసిన అనుసంధాన సాధనాలను
వ్యక్తిగత విలువల ముడి పదార్థాలతో తయారు చేస్తే
అడ్డుకొనే హోదా అద్దాల అడ్డంకులు ఎన్నిసార్లు పగిలినా
మళ్ళీ నిరంతరం పుట్టుకొస్తూనే ఉంటాయి
అంతరాలు పెరిగిపోతూనే ఉంటాయి
అవాంఛనీయ అంతరాలను అంతం చేయాలంటే
జారుడు బండను ముక్కలు చేయాలి
ముక్కలతో సహకారం, స్వాలంబన శాసనాలు రాయించి
మనిషికీ మనిషికీ మధ్య
ఆర్థిక అనుసంధాన సోపానాలుగా అమర్చాలి

# ప్రాణశంఖం



**కదులుతోన్న రైలు కిటికిలో నుండి కార్తీక మాసపు చలి ఎంత వెచ్చగా తాకింది... అప్పటి దాకా కమ్ముకుని వున్న చిరుచలి వంటి భావమేదో కరిగినట్టయింది.... అయితే గుండె చుట్టూ పేరుకుపోయిన రాతిలాంటి మంచుని ఏ మండే సూర్యుడు కరిగించగలడు?.... సర్దుకుని కూర్చుని కిటికీలో నుండి బయటికి చూపులు సారించింది సంధ్య...**

**వి. ప్రతిమ**

నల్లమబ్బుల్ని ముసుగేసుకుని నిల్చుని వున్న ఆ కొండలు... ఏ జీవిత చిత్రకారుడో గీసిన అద్భుతమైన చిత్రరాజాల్లా, గాజుకొండల్లా అన్పిస్తున్నాయే తప్ప నిజమైన కొండల్లా లేవు... గతంలో తిరుపతి దారిలో ప్రయాణించేప్పుడు కూడా కొండలు.. కొండల్లా కాక కాన్వాస్‌ల్లా అన్పించేవి... సంధ్యకి... అందరికీ యిలానే కన్పిస్తాయా కొండలు... అందరికీ ఈ చెట్లూ, పుట్టలూ, నదులూ కాలువలూ యింత అద్భుతంగా తోస్తాయా?

అవును ప్రతాప్‌కి కూడా యిలానే కన్పించేవి... ఆ కొండల మీద దూరంగా పచ్చిక మేస్తోన్న ఆవుల్ని బినాకా టూత్‌పేస్ట్ కాంప్లిమెంట్ బొమ్మల్లా కన్పిస్తున్నాయనే వాడు... మబ్బుల చుట్టూ అద్దినట్లున్న ఆ కాషాయపు బంగారు వర్ణాన్ని ఏ కుంచెతో అద్ది వుండొచ్చో వూహించమనేవాడు... ఆ లోయల్లో అక్కడక్కడా వున్న బుజ్జిబుజ్జి ఎర్రపెంకుటిళ్ళని పిల్లలాడుకునే బొమ్మరిళ్ళనే వాడు... కాస్త సమయం దొరికితే చాలు ఏదో ఒక కథ మొదలుపెట్టి అలా అలా అల్లుకుంటూ పోయేవాడు.... ఆ కథ ఎంతకీ తెగేది కాదు... అలా కంటిన్యువస్‌గా ఎలా కల్పించుకుంటూ పోగలడోనని సంధ్యకి ఆశ్చర్యమేసేది...

ప్రతాప్‌లోని ఆ ఈస్తటిక్ సెన్సంతా ఎలా ఆవిరయిపోయింది?

పంజరం తలుపులు బద్దలు కొట్టి ఎగిరి పొమ్మన్నా రామచిలుక తనని వదిలివెళ్ళనట్లే ఏ స్నేహ పరీమళమో, ఏ అనుబంధపు మాధుర్యమో ఏ మృదుమధుర ప్రేమస్పర్శో సంధ్యని వెంటాడుతూ వస్తున్నాయి.... వాటి వెంటనే వైరుధ్యమైన భావాలు మరెన్నో....

అప్పుడప్పుడూ సంధ్యకి తాను చుట్టూ వున్న మనుషుల్ని వొదిలి ఏదో ప్రత్యేకమైన ప్రపంచంలోకి వెళ్ళినట్లుగా ఆ గోళంలో తాను ఒంటరినై తిరుగాడుతున్నట్లుగా అన్పిస్తుంది... అలా అని అది నిద్రా?... కలా?.... కాదు కాదు వాస్తవమే...

ఆశ్చర్యంగా... అభద్రంగా... ఆ గోళంలో గిర్రున తిరిగిపోతూ ఏదో తెలీని తనమూ... అంతా తెలిసిన తనమూ ఒక దానితో మరోటి పోటీ పడుతూ... సంధ్యకి హఠాత్తుగా ఏడుపొస్తుంది... అప్పుడప్పుడూ ఆశ్చర్యకరంగా నవ్వాలనీ అన్పిస్తుంది...

ఒక భయంకరమైన లోతైన చీకటిలోకి వింతయిన శబ్దాన్ని రెట్టింపు చేస్తూ ప్రవేశించింది రైలు...

అప్రయత్నంగా సంధ్య చేయి సతీష్ చేయి మీదానింది...

ఏ వేదనా రహస్తంత్రి ఈ చేతిలో నుండి ఆ చేతిలోకి ప్రవహించిందో సంధ్య చేతి మీద ధైర్యమిస్తున్నట్లుగా కుడి అరచేత్తో తట్టాడతడు... చీకటి ధైర్యమో, జీవిత ధైర్యమో తెలీనట్లుగా...

టనెల్లో నుండి రైలు క్రమంగా వెలుతురులోకి ప్రవేశించింది... గొప్ప జీవిత సత్యాన్ని తెలియజేస్తోన్న వేదాంతిలా... రైలు

అలా చీకట్లో నుండి వెలుతురులోకి... వెలుతురులో నుండి చీకట్లోకి ప్రవేశిస్తోంటే చీకటి వెలుగులు నిండిన జీవితపు విలువల్ని బోధించే తాత్త్వికుడిలా వుంది...

సంధ్యకి నవ్వొచ్చింది... నవ్వుని అదుపు చేసుకునే క్రమంలో ఏడుపూ వచ్చింది...

గాయాల పరంపరని కెలుకుతూ జ్ఞాపకాలు మనస్సుని వెనక్కు లాగుతుంటే... మిగిలి వున్న ఒకింత తడినయినా ఆవిరికాకుండా వుంచుకోవడం ఎంత కష్టం?...

తనని వివాహం చేసుకోవడం కోసం ఎన్నిసార్లు తనయింటి చుట్టూ తిరిగాడతడు... ఎంత మందిని రాయబారం పంపాడు?... సంధ్య నవ్వు... సంధ్యనడక, సంధ్యమాట, సంధ్యకళ్ళు, సంధ్య ప్రేమ చాలునన్నాడు... మరే యితర కానుకలయినా సంధ్యముందు దిగదుడుపే అన్నాడు... యింకా అది అన్నాడు... యిది అన్నాడు...

అప్పటికీ తన తండ్రి జిల్లాలో పరపతి, పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుడు... ఒక మామూలు రైతు బిడ్డకి... అందునా చిన్న ఉద్యోగస్థుడికి బిడ్డనివ్వడానికతడు సిద్ధంగా లేడు... తండ్రికి దగ్గరి వ్యక్తులతో విన్నపాలు పంపించాడు... యింకా యింకా పైచదువులు చదివి నీ కూతుర్ని ఉద్ధరిస్తానన్నాడు... తనకున్న చిన్నవో, పెద్దవో ఆస్థిపాస్థులు ఏకరువు పెట్టాడు...



తనకు రాగల ప్రమోషన్లని కళ్ళకు కట్టించాడు... జీవితపు భద్రతంతా తన చేతుల్లోనే వుందన్నాడు....

జిమ్మిక్కులతో, మేజిక్కులతో, వాక్చాతుర్యంతో, చాకచక్యంతో అతడు సమితి ప్రెసిడెంటు అల్లుడయిపోయాడు... సంధ్యకంత ఆసక్తి లేకపోయినా అభ్యంతరం కూడా కన్పించలేదు...

నిరంతరమైన, నిత్యమనుకున్న ఆనందాన్ని పంచి... దూరంగా వున్నా... దగ్గరగానే వున్నట్లు... యిప్పుడు దగ్గరే వున్నా దూరంగా... సుదూరంగా

అప్పుడు కళ్ళు మూసుకున్నా కూడా అతడ్ని చూడగలిగేది...

ఇప్పుడు మూసినా, తెరిచినా కూడా అతడి పూర్తి రూపం కంటికానడం లేదు... దీర్ఘంగా నిట్టూర్చింది సంధ్య...

ఏలోయవంతెన మీదో తెలీదుగానీ రైలుబండి తన వేగాన్ని తగ్గించుకున్నది... రైల్లో కూర్చుని ప్రయాణిస్తూ... అదే రైలు యొక్క తోకని చూడగల్గడం వింతయిన అనుభూతి... అది బహుశా ఆంధ్రదేశంలో ఈ ఒక్క లోయలోనే సాధ్యమవుతుందేమో...

సంధ్య మౌనాన్ని గమనించి సతీష్ సంధ్యని కిటికీలో నుండి చూడమని వేలుపెట్టి చూపించాడు...

ఆలోచన లోయల్లో నుండి సంధ్య ఉలిక్కిపడి తేరుకుంది...

వదిన కూడా సంధ్య పక్కగా వచ్చి కూర్చుని బయటికి చూడసాగింది. రైలుబండికి రెండు వైపులా అరణ్యం పచ్చగా, ప్రశాంతంగా వుంది...

అక్కడ్నుండే లోయ అందాలు మొదలవుతాయని సతీష్ అంటున్నాడు. కానీ అప్పటికి చాలా సేపటి ముందునుండే హరితానందం మొదలయింది... అయితే సంధ్య విషయంలో మాత్రం ఆ పచ్చదనం మెదడును తాకనంటోంది...

ఆ సంగతి గమనించి బైనాక్యులర్స్‌తో దూరపు కొండల్ని చూస్తోన్న వదిన ఆ భూతద్దాల్ని సంధ్య కళ్ళముందుంచింది... అయినా సంధ్యలో కదలిక లేదు...

ప్రతాప్ పక్కనుంటే పెదాలపై చిరునవ్వుల్ని, గుండెల్లో సప్తస్వరాలనీ పలికించాల్సిన వనరాణి సౌందర్యం... చూసేకొద్దీ గుండెను గాయం చేస్తోంది.

ఇంటినిండా నిర్లక్ష్యం, నిరాదరణ, పరుగులతో నిండిన ఒత్తిడి, ప్రేమరాహిత్యం అలుముకుని జీవితాన్ని దుర్భరం చేస్తుంటే ఎక్కడో దూరాన కొండల్లో, లోయల్లో, చెట్లల్లో, పుట్టల్లో మనశ్శాంతిని వెదుక్కోవడం సాధ్యమయ్యే పనేనా?

ఈ శరీరంలో, ఈ హృదయంలో హఠాత్తుగా ముఖ్యమైన అంశమేదో మాయమయిపోయినట్లు శూన్యం.... అంతంలేని భరింపరాని నిశ్శబ్దం...

నిశ్శబ్దం ఊడలు దిగిన మహావృక్షం... నిశ్శబ్దం నిష్క్రమణ ద్వారం... నిష్క్రమణ... ఊరి నుండి... యింటి నుండి... మనసు నుండి నిష్క్రమణ...

స్టేషన్లో రైలు ఆగిన చోట సతీష్ దిగి కొండ కమలాఫలాలు తెచ్చినట్టున్నాడు... వదిన ఒలిచి ఒక ముక్క అందించింది...

భరింపరాని పులుపు... జీవితంలోని పులుపు దాన్ని అధిగమిస్తూంటే నాలిక్కి పులుపెలా అందుతుంది...

ఇంటినీ, ప్రేమనూ, సహజానుబంధాలన్నింటినీ పక్కకు పెట్టి లేదా మరిచిపోయినట్లు నటిస్తూ... ఏ మిధ్యా విలువల కోసమో, కీర్తి కోసం, కోరికల సాధన కోసం.. పరిమితి లేని డబ్బు కోసం పరిగెత్తి... పరిగెత్తి అలిసిపోయి... ఖాళీ అయిపోయిన హృదయాలతో అటు నువ్వు, ఇటు నేను.

మనుషుల జీవితాలను శాసించే హక్కు ఈ డబ్బు ఎవరిచ్చారసలు? ఇంకెవరు? మనిషే యిచ్చాడు... ఉన్నట్టుంది చాలా పాతబడి పోయిన మైకం లాంటి వొణుకు గుండె నిండా పాకి.. కొండ కమలాపండ్ల పులుపుతో సంగమించి...

తన ప్రేమ.. సాన్నిహిత్యం కూడా యివ్వని ఆనందం.. ఆ కీర్తి, పేరు డబ్బు... చుట్టూ మనుషులు... మద్యస్థాలూ ఫోన్లో పనులూ, ఆఫీసర్లూ, ఎమ్మెల్యేలూ, మంత్రులూ... కాంట్రాక్టులూ, పర్సంటేజీలూ ఆ ప్రపంచంలో స్త్రీలూ, పురుషులూ – మందూ, మాకూ...

అతడు తన వాక్చాతుర్యంతో అందర్నీ అద్భుతంగా ట్యాకిల్ చేయగలడు... కానీ ఆడవాళ్ళు, మగవాళ్ళు కూడా అతడి వెంటబడుతుంటారని అంతా అనుకుంటూ వుంటారు...

"నేను చెప్పేది విను"అంటూ మొదలయి 'నేను చెప్పిందే విను' 'నోరు మూసుకో'గా మారి... 'ఆ నవలలు చదవడం ఆపేయి' 'సీరియల్స్ చూడ్డం మానేయి' అంటూ...

"ఎంతసేపూ నీతోనే వుంటే అవతల పనులెట్లా జరుగుతాయి".

కసుర్లూ, విసుర్లూ యివి మాత్రమే యింట్లో జరిగే ఏకధృవ సంభాషణలు... ఎప్పుడయినా సంధ్య ప్రేమపూర్వకంగా మాట్లాడాలనీ, మార్చాలనీ ప్రయత్నం చేస్తే అది కాస్తా నానా కంగాళీ అయి చివరికి సంధ్య మనసు గాయపడ్డంతో ముగుస్తుంది.

అతడికి అవతల పనులంటే ఆస్థులను పెంచుకోవడం, అంతస్థులు నిర్మించుకోవడం... ప్రత్యర్థుల కదలికల మీద నిఘా... రాత్రికి రాత్రి కొత్త పథకాలతో ప్రత్యర్థుల ప్లాన్లనీ, ఆలోచనలనీ మట్టి కరిపించడం ఆ క్రమంలో పార్టీలూ, మీటింగులూ, గుంపు చర్చలూ అప్పుడప్పుడూ యింట్లోని సంభాషణల తీరు మారుతుంటుంది... "ఈ

రోజు భోజనానికి రాను... బ్యాంక్ మేనేజరుతో డిన్నరు"

"రేపు మధ్యాహ్నం సిఐని భోజనానికి పిల్చాను. పది మంది దాకా రావొచ్చు"

"ఇవ్వాళ రాత్రికి హైదరాబాద్ ప్రయాణం.. బ్రీఫ్‌కేస్ సర్దు"

ఇంట్లోని అన్ని విషయాల్లో నిర్ణయాధికారం అతడిదే...

ఈ అధికారం, అరుపులూ కస్సుబుస్సులూ హింసకాదని ఎంత సరిపెట్టుకుందామన్నా... పలచటివో, మందమైనవో తెరలేవో ఈ అసమ సంబంధాలు అలాగే అసమంగా వుండడానికి దోహదం చేస్తూంటాయి... పైకి తెలీకుండానే... ఏ మాత్రం కన్పించకుండానే ముసుగుతో ఈ హింస ఆ అసమానత్వాన్ని అలా కొనసాగిస్తూనే వుంటుంది...

చాలా మౌనంగా, అత్యంత సహజంగా భరిస్తూ పోవడమొక్కటే పరిష్కార మార్గం... అసలు దీన్ని ఒక సమస్యగా చూడరెవరూ...

సంధ్య ఆశిస్తోన్న ప్రేమ, దగ్గరితనం పుస్తకాల్లో, సినిమాల్లో నాయికా నాయకుల నడుమ మాత్రమే వుంటుందని అతడి నమ్మకం... అటువంటి ప్రేమతోనే కదా అతడు సంధ్యని చుట్టేశాడు.. అటువంటి అనురాగ ప్రవంతిలోనే కదా కొన్నేళ్ళు ఓలలాడించాడు.

నాయికా, నాయకుల మధ్య మాత్రమే వుండే ప్రేమనీ, దగ్గరితనాన్నీ జీవితాల్లో ఎందుకు మిగుల్చుకోలేం?... మన జీవితానికి మనమే కదా నాయికా, నాయకులం... అన్నీ పాతవై పోయినట్లు ప్రేమకి కూడా పాతదైపోయే ఒక స్థితి వుంటుందా? తను పాత సంధ్య పాతమ్మ... పాతమ్మ... సంధ్యకి మళ్ళీ గట్టిగా నవ్వునాపుకునే క్రమంలో ఏడుపొచ్చింది...



సంధ్య తన గోళంలో తాను గిర్రున తిరుగుతుండగా వచ్చే దుఃఖం అది... దాన్ని ఆపడం ఎవరితరం?... వెక్కిళ్ళనాపాలని ప్రయత్నించే కొద్దీ మరింత ఉధృతంగా దుఃఖం బయటికి తన్నుకొస్తుంది...

"స్పెల్ ఆఫ్ క్రై" సతీష్ గొణుగుతున్నాడు... అతడి గొంతుబొంగురు పోయినట్లుగా వుంది... రైల్లో పక్కవాళ్ళు చూస్తున్నారేమొనని వదిన మదన పడ్తోంది... దిగులు నిండిన కళ్ళతో సతీష్ సంధ్యని దగ్గరికి తీసుకుని ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నాడు...

వదినకిదంతా ఎంబరాసింగ్‌గానూ వుంది... కించిత్ అర్థం కాకుండానూ వుంది... ఊళ్ళో యింతింత పేరు ప్రతిష్టలూ, డబ్బూ, భవంతులూ కోరిన నగలూ, చీరలూ... చుట్టూ మనుషులూ పూర్వకాలంలో అంతఃపుర రాణికిలా పరిచారికలూ ఒక గొప్ప రాజకీయ నాయకుడి భార్యగా వుండడానికి ఎంత చేసి పెట్టుకుని వుండాలి...? ఈ సంధ్యకు ఏం రోగమో అర్థం కావడంలేదు... హాయిగా తిని కూర్చోక ఏంటీ డిప్రెషన్? మనుషులు మదన లేకుండా వుండలేరేమో... అలా పూర్తి మనశ్శాంతిగా వుండాల్సి రావడం కూడా ఒక డిప్రెషనేనా?...

వదినకి అర్థమయ్యీ, అర్థం కాకుండా వుంది... ఆలోచిస్తూనే లేచి సంధ్యకి కళ్ళూ, మొహం తుడిచి వూరుకోబెట్టాలని ప్రయత్నించింది... ఆ తడబాటులోనే చుట్టూ వున్న ప్రయాణీకులు తమని గమనిస్తున్నారేమొనని పరికించింది...

రైలు చివరి టనెల్లో నుండి బయటకొచ్చే క్రమంలో ఒక సుకుమార సమీరం విసురుగా వచ్చి సంధ్యను తాకింది...

చాలా సేపటికి మెల్లిగా వెక్కిళ్ళనాపి సతీష్ భుజం మీది నుండి తలలేపి వదినకేసి నిశితంగా చూసింది... సతీష్ సంధ్య కంటే కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే పెద్దవాడు కావడంతో చిన్నప్పట్నుండీ యిద్దరూ స్నేహితుల్లా మెలిగారు.. తండ్రి సర్వకాల సర్వావస్థల్లోనూ ప్రజాసేవలో మునిగి వుండటంతో తల్లి, సతీష్, సంధ్య ఒక దీవిలా జీవించారు... ఆ చిన్న వయసు నుండే సతీష్‌కి రాజకీయాల పట్ల రోత... తన తల్లి మీద, స్వంత వ్యక్తిత్వం మీద ప్రేమ జనించాయి... పట్టుదలగా చదివి, డాక్టరయ్యాడు... ఆంధ్రదేశానికంతట్లో తనకు నచ్చిన ఈ సుందర సాగరతీరంలో ప్రాక్టీసు పెట్టుకున్నాడు...

చాలా చిన్న కుటుంబంలో నుండి లక్ష్మిని పెళ్ళి చేసుకున్నాడు... ఆ కృతజ్ఞతతో వదిన యివ్వాల్టికీ వొదిగి వొదిగి వుంటుంది... తనకున్న ఏకైక ఆత్మసంబంధం సతీష్ భార్య లక్ష్మి చాలా మంచిది... నిజానికి తండ్రి రాజకీయవారసుడు సతీష్ అయినా, అల్లుడు ఆ స్థానాన్ని కైవసం చేసుకున్నా కూడా, ఆస్థులన్నింటినీ వొదులుకుని... తృప్తి పడి దూరంగా ఈ పట్టణంలో జీవించేస్తోంది...

అక్కడ వదిన తమ్ముడు హర్షవర్ధనే ప్రతాప్‌కి రాజకీయ ప్రత్యర్థి. మధ్యంతర ఎన్నికల్లో వదిన తమ్ముడికి ప్రత్యర్థిగా తన మనిషిని నిలబెట్టాడితడు... అప్పటి దాకా బంధువర్గం మధ్య లోలోపలే వున్న స్పర్థలేవో ఒక్కసారిగా భగ్గుమన్నట్లయింది... ఊరంతా గుప్పుమన్నది.

అన్నయ్య ఆస్థినంతా అనుభవిస్తోందని అంతా సంధ్యని దోషిలా చూడ్డం మొదలయింది... వీటన్నింటి మధ్యా నలిగిపోయిన మనసుని సాపు చేయడం ఈ జీవితానికి సాధ్యపడుతుందా?

అసలు సంధ్యకి ఆలోచించడం చాతకాకుండా వున్నట్లయితే ఎంత బావుండేది?.. ఎక్కువ ఆలోచించినందుకు, ఎక్కువ తెలివితో వున్నందుకు... ఎక్కువ మాట్లాడినందుకూ... ఎక్కువ ఏడ్చినందుకూ సంధ్య మానసిక వైద్యుడి వద్దకు తీసుకపోబడుతుంది...

విశ్రాంతి కావాలి...

''వద్దా'' అంటూ నరాలు పగిలేలా అరవాలన్పిస్తుంది సంధ్యకి...

స్ట్రెస్... విశ్రాంతి... సెడేషన్... సైకో ఎనలిటిక్ ట్రీట్‌మెంట్, 'స్పెల్ ఆఫ్ క్రై'... జీవితాన్ని గురించిన వివరణాత్మక బోధనలు... పర్సనాలిటీ క్లాసులు...

అదీ... యిదీ వెరశి కొన్నాళ్ళు యింటికి దూరంగా ఏదైనా మంచి ప్రదేశానికి యిద్దరూ వెళ్ళిరండి.. యిద్దర్నీ కదా వెళ్ళిరమ్మన్నారు డాక్టర్లు...

సైకో సంధ్యే కాబట్టి అతడికి విశ్రాంతి అవసరంలేదు... అన్ని హంగుల్నీ సౌకర్యాలనీ, పనులనీ వదులుకుని దూర ప్రదేశంలో గడపాల్సిన నికృష్ట స్థితి అతడికి లేదు... సంధ్య మాత్రమే దూరంగా సతీష్ వద్దకి, ఈ సముద్రతీరానికి పంపబడింది..

ఈ లోయలోని ఈ చెట్లూ, ఆకులూ, కొమ్మలూ, ఆ పచ్చటి పోడుపైరూ... బుజ్జిబుజ్జి ఎర్ర పెంకుటిళ్ళూ... వీటన్నిటినీ కలుపుతూ కిచకిచా మాట్లాడుతూ పైపైన ఎగురుతున్న పక్షులూ... పాతాళంలో వున్నట్టున్నప్పటికీ ఈ లోయ ఎంత చైతన్యవంతంగా వుంది?

ఈ మొక్కలన్నీ ఎవరు నాటి వుంటారు?.. ఇన్ని మొక్కల్ని నాటడానికి ఎవరికి వీలవుతుంది?... తను ఎన్నెన్ని కలల్ని నాటుకుంది? చిన్న చిన్న పక్షులై విహరిస్తూన్న స్వప్నాలన్నీ వేటగాడి దెబ్బకు ఒక్కొక్కటి నేలరాలిపోయినట్లుగా అయింది... పక్షిజాతులన్నీ అంతరించి పోతున్నట్లుగా కలలు కనే స్థితి కూడా అంతరించి పోతోందా?... అంతా ప్రాక్టికల్... కలలు కనడానికిక్కడెవరికీ అర్హత లేదు... ప్రాక్టికల్‌గా వుండాలి జీవితం.

సంధ్య ఉబికి ఉబికి వస్తోన్న దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నించకుండా... ఆపాలని ప్రయత్నిస్తూ... మరొకవంకా...

తండ్రి లేదుగాని... వుండి వుంటే

"ఏంటమ్మా?... అతడెన్నెన్నో పనుల్లో వుంటాడు... అతడితో సహకరించాల్సింది పోయి... లాపాయింట్లు తీస్తే ఎట్లమ్మా? కసురుకున్నాడంటే ఎట్లా?

అసలీ ప్రపంచాన్ని గురించి నీకు తెలీదు... తాగొచ్చి భార్యని కొట్టే మగాళ్ళు, ఆస్థినంతా హారతి కర్పూరంలా కరిగించేసి డబ్బు తెమ్మని పుట్టింటికి తరిమేవాళ్ళు, చంపి ఆత్మహత్యగా నిరూపించేవాళ్ళు... హాయిగా మంచి, మంచి పుస్తకాలు చదువుకో... వీణ వాయించుకో, సీరియల్స్ చూడు సంగీతం విను..." అంటూ సలహాలిచ్చి వుండేవాడే... ఎందుకంటే అతనూ మగవాడే..

అమ్మకూడా తనలాగే మదనపడి వుంటుందా?

లేదు...లేదు... ఆవిడెప్పుడూ దీన్ని హింసనుకోలేదు... చాలా మౌనంగా, హాయిగా భరించేస్తూ నవ్వుతూ యింటిని చక్కదిద్దుకునేది... పిల్లల్ని అపురూపంగా చూసుకునేది... వచ్చిన అతిధులందరికీ శక్తివంచన లేకుండా చేసి పెట్టేది... అదే తన జీవిత లక్ష్యంలా బతికేసేది...

హింసనేది తెలీకుండానే మనిషి ప్రవర్తనలో లోతుగా పాతుకుని పోయివుంటుంది... అది వివిధ సమయాల్లో వివిధ రకాలుగా బయటపడుతూ వుంటుంది.

V V V

పదమూడు మంది గిరిజన స్త్రీలు కుడిపైటలతో వింతగా పిక్కల దాకా కట్టుకున్న చీరలతో ఒకరి నడుం మీద మరొకరు దట్టంగా చేతులు వేసుకుని గుంపుగా, కలిసికట్టుగా అడుగులు వేస్తూ నృత్యం చేస్తుంటే సంధ్య అనిమిష అయిపోయింది. ఈ దట్టమైన అడవిలో ఈ లోతైన లోయలో వీళ్ళకి యింత అందంగా ఒకే రిథమ్‌లో అడుగులు వేయడం, యింత శ్రావ్యంగా పాటలు పాడడం, యింత అద్భుతంగా నాట్యం చేయడం ఎవరు నేర్పి వుంటారు?

ఎక్కడయినా సరే స్త్రీలు సమూహంగా వుండాల్సిన అవసరాన్ని ఆ గిరిజన నృత్యం బోధిస్తున్నట్లుగా వుంది.... మరో బస్సు తాలూకూ యాత్రికుల కోసం ఆ గిరిజన స్త్రీలు చేసే రెండో నృత్యం పూర్తయ్యే దాకా అక్కడ్నుండి కదల్లేదు సంధ్య... ఒక అలౌకిక స్థితిలో వుండిపోయిన సంధ్యని సతీష్ కూడా తొందర చేయలేదు... వదిన మాత్రం బస్సు వాళ్ళు పిలుస్తున్నారంటూ సంధ్యనీ, సతీష్‌నీ లేపి తీసికెళ్ళింది...



లోయనుండి తిరుగు ప్రయాణం బస్సు మార్గంలో మొదలయింది. బస్సు చాలా దూరం ప్రయాణించే దాకా ఆ ఆడవాళ్ళు నాట్యం వెంటాడుతూనే వుంది సంధ్యని... ఎంతకీ వదిలిపెట్టని జీవితంలా...

కొంత దూరం ప్రయాణించి లోయ అందాలన్నీ పోగుబడ్డ ఒక వ్యూపాయింటు వద్ద బస్సునాపి... నిర్దేశించిన సమయంలో ఆ సీనరీని చూసి తిరిగి రావల్సిందిగా నిర్దేశించి డ్రైవరు దిగిపోయాడు.

వృద్ధ బెంగాలీ వనిత ఒకామె ఎడాపెడా లోయ అంచుల్లోకి వెళ్ళిపోతున్న పిల్లల్ని అదుపు చేయడం కోసం వాళ్ళ భాషలో కాసర బీసరగా అరుస్తోంది... ఆవిడ్ని ఉడికించడం కోసమేనన్నట్లుగా ఆ పిల్లలు మరింత అంచులకి వెళ్ళి నాట్యం చేస్తున్నారు...

సతీష్, లక్ష్మి వ్యూపాయింటు వద్దకి నడుస్తున్నారు కబుర్లాడుకుంటూ...

సంధ్య మరో వైపుగా అడుగువేసింది... అలరించే ఆ అందాల్ని తిలకిస్తూ నోటమాటరానిదై అంచుల దాకా నడిచింది సంధ్య...

ఈ అడవిలో చెట్టులో చెట్టునై, ఆకులో ఆకునై, పువ్వులో పువ్వునై శాశ్వతంగా వుండిపోతేనో?

అసలీ ప్రపంచంలో ఏదయినా శాశ్వతంగా వుంటుందా? వుంటుంది... వుంటుంది... మరణం మాత్రమే ఈ ప్రపంచంలో శాశ్వత స్థానం కలిగి ఉంటుంది.

సంధ్యకి ఎందుకో ఆ లోయలోకి దూకేయాలన్న కోరిక బలంగా కలిగింది... జీవితం నిశ్చలంగా ఆగిపోయిన చోట బతకడం కన్నా మరణించడమే మిన్న... మిన్న....

'అమ్మా... అమ్మా... అడవి ఉసిరిక్కాయలమ్మా... రూపాయే'... అంటున్నాడు... చప్పున తలతిప్పి వొణుకుతున్న గుండెతో వాడికేసి చూసింది సంధ్య...

ఆరేడేళ్ళ పిల్లవాడు... వాడి చిట్టి దోసిలి నిండా నెల్లికాయలు... వాడి ఒంటి మీద చొక్కాలేదు... మురికి పట్టి చీలిపోయిన డ్రాయరొకటి పేరుకి నడుంమీద వేళ్ళాడుతోంది... బయటి ప్రపంచంలో హీనపక్షంలో పది పదిహేను రూపాయలమ్మే కాయల్ని వాడు ఒక్క రూపాయికే అమ్మడానికి సిద్ధపడుతున్నాడు..

వాడి చిన్ని చిన్ని కళ్ళల్లో దృఢమైన జీవితేచ్ఛ...

సిగ్గుతో చితికిపోయింది సంధ్య... తనకొచ్చిన మకిలి ఆలోచనని మళ్ళించుకుని వాడి చేతిలోని కాయల్ని తీసుకుని వాడికి ఇరవై రూపాయలిచ్చింది...

తన గమనాన్ని లయతప్పని రీతిలో కొనసాగించే భూచక్రాన్ని గుర్తుకు తెచ్చుకుందామె... చలనం ఆగిపోతే ప్రాణధారలెలా ప్రవహిస్తాయి... జీవమెలా వుంటుంది..?

అప్పుడే అక్కడికొచ్చిన సతీష్, సంధ్య భుజం మీదుగా చేయివేసి బస్సు వైపు నడిపించాడు... బస్సు ఆగిన చోట నిల్చుని వదిన దీర్ఘంగా లోయకేసి చూస్తోంది...

వదినకి సంధ్య మీద కోపంగా వుందా?... వాళ్ళ సమయాన్నీ, డబ్బునీ, ప్రశాంతతనీ కొల్లగొడుతోందని సంధ్య మీద అసహనంగా వుందా?.. లేక జాలిగా వుందా? వదిన ఏమనుకుంటోంది..?

అక్కడ వదిన తండ్రీ, తమ్ముడూ యిద్దరూ ప్రతాప్ మీద వ్యతిరేకతతో వున్నారు.... ఒకప్పుడు వదిన తండ్రి రాజారెడ్డి సంధ్య తండ్రికి ఆప్తుడైన కార్యకర్త... ఒక్క రాజారెడ్డనే ఏముంది?... రాజారెడ్డి వంటి ఎన్నో వందల మంది కష్టపడితేనే సంధ్య తండ్రి వంటి వారు వూరి నాయకులవుతారు... జిల్లా నాయకులవుతారు... రాష్ట్ర స్థాయి కీర్తి ప్రతిష్టలు పొందగల్గుతారు. అయితే అప్పుడు వూళ్ళో వున్న ఏకసూత్రత, ఏకనాయకత్వం యిప్పుడు లేవు... ఇప్పుడు ఎక్కడయినా సరే పార్టీల కన్నా, పార్టీ సిద్ధాంతాల కన్నా వారి వ్యక్తిగత భౌగోళిక పరిస్థితులే ముఖ్యంగా వుంటున్నాయి... ఈ పరుగులూ, ఆస్థులూ, అంతస్థులూ... బ్యాంక్ బ్యాలెన్సులూ, హోదాలూ, ఆడంబరాలూ, రాజకీయాలూ, కీర్తి కిరీటాలూ అన్నీ చాలక మెలమెల్లిగా ఫాక్షన్ కూడా వూళ్ళోకి ప్రవేశిస్తోందా?

వాడెవడో ఏదో అంటాడు.. కింది స్థాయి కార్యకర్త... దాంతో గొడవ మొదలవుతుంది... చిన్నచిన్న పొట్లాట, కొట్లాటై, కాళ్ళో,చేతులో చివరికి తలలో పణం పెట్టాల్సిన స్థితి...

ఉన్నట్టుండి మైకంలాంటి వొణుకు గుండె నిండా పాకింది. సంధ్యకి హఠాత్తుగా ప్రతాప్‌ని చూడాలన్న కోరిక ప్రబలంగా కలిగింది.

# ద్వీపకల్ప పరిహాసం

**అడిగోపుల వెంకటరత్నమ్**

క్రమం తప్పని ఆదిత్యుని యానం
వసుధైక కుటుంబాన సాగుతూంది
నా నివాసం ద్వీపకల్పం!
ఒకానొక రక్షకభట నిలయంలో
నేరం ప్రముఖ వార్తయి దావాలనం అవుతుంది
దర్యాప్తుల కాళ్ళు వెంటాడుతాయి
కళ్ళు వేటాడతాయి
అపరాధికి ఆసరాగా మారి
కేసును కంచికి తరలిస్తాయి!
ఒకానొక ధర్మక్షేత్రంలో
న్యాయదేవత గాంధారిని అనుకరిస్తుంది
చేతిలో సుతారంగా తాసు
దాళా లేక తూగుతూ
తూకం సరిచూసుకోమంటుంది
న్యాయదేవత నివేశన స్థలాన్ని
అన్యాయం ఆక్రమించి
సాక్ష్యాలను వశీకరించి
అధర్మం పట్టాభిషిక్తం అవుతుంది!
ఒకానొక ప్రతినిధుల సభలో
దూషించుకుంటారు
చెప్పులు విసురుకుంటారు
వందేమాతరాన్ని పరాభవించి



ప్రజాస్వామ్యానికి వలువలు వూడ్చి
చట్టసభలు రచ్చసభలై
రూపొందిన శాసనాలు
నీటి జల్లెళ్ళవుతాయి!
ఒకానొక కార్యనిర్వాహక కేంద్రంలో
కర్తవ్యాన్ని మరిచిన యంత్రాంగం
చట్టాన్ని నడపదు
నడిచే చట్టాన్ని నడవనివ్వదు
చట్టానికి ప్రజలు
ప్రజలకు అధికార్లు
సమాంతర రేఖలై ప్రయాణం!
నలుదిక్కుల పొంగిపొర్లిన
చీకటి కడలిపై పవ్వళించి
కళ్ళున్న కబోది
తిమిర సంహర్తకానందుకు
ద్వీపకల్పం పరిహసిస్తుంది
అస్తిత్వం ప్రశ్నిస్తుంది!

---

ఆ వొణుకు సముద్రంలా ఎగిసి చల్లని గాలితోపాటు సంధ్యని చుట్టేస్తోంది... మళ్ళీ తన గోళంలో గిర్రున తిరుగుతున్న సంధ్య ఏడవాలన్న ఆలోచననని బలవంతాన బిగపట్టుకుంటోంది...

ప్రవాహవేగంలో నాటుపడవలా అటు, ఇటు ఊగులాడుతూ భయం గొల్పుతోంది బస్సు ఆ ఘాట్‌రోడ్డులో... బస్సుకు రెండు వైపులా అరణ్యం ముదురు పచ్చగా వుంది... ఆకాశం కురవడానికి సిద్ధంగా మేఘావృతమైవుంది...

"దిగు సంధ్యా... ఇదే జెంగిల్‌బెల్స్, బావుంటుంది. చూద్దాం బొర్రా గుహలు కూడా పూర్తిగా చూడకుండా వెనక్కొచ్చేశావు... ఇక్కడ బావుంటుంది రా చూద్దాం..." వదిన సంధ్య భుజం మీద చేయి వేసింది.

రానన్నట్లుగా తలూపింది సంధ్య అడ్డంగా...

"సంధ్యా టీ తాగొద్దాంరా..." అంటూ సతీష్ బలవంత పెట్టాడు..

అప్పటికీ లేలేత చీకట్లు కమ్ముకుంటున్నాయి...

దూరంగా ఎక్కడి నుండో ఒక చిరుదీపపు కాంతి... శరీరంలోపలి నుండి విడివడిన ఆత్మకులా స్వయం ప్రకాశంలా వుంది... చిరుచీకట్లలో ఆ సౌందర్యాన్ని ఆఘ్రాణించడానికి ప్రయత్నిస్తోంది సంధ్య...

పగలంతా అత్యంత హొయలు పోతూ సౌందర్యాలు ఒలకబోసిన ఈ లోయ యిప్పుడు ఈ రాత్రి వేళ యింత భయం గొల్పుతోందేమిటి? సౌందర్యానికి మరోవైపు భీకర నిశ్శబ్దమా? భయమా?.. కాదుకాదు హింస...

ఎక్కడి నుండో వీచినగాలి మంచులా సంధ్య గుండెల్లోపల దూరి గుబులు రేపుతోంది...

సంధ్య చేతి మీద చేయి వేసిన సతీష్ షాక్ కొట్టినట్లుగా వెనక్కి లాక్కున్నాడు... విపరీతమైన జ్వరంతో ఒళ్ళు పేలిపోతోంది సంధ్యకి.... నిస్సత్తువతో వేళ్ళాడబడినట్లయింది సంధ్యకి....

V V V

సతీష్ సొంత వైద్యశాలకి పెద్దపెద్ద సైకియాట్రిస్టులు రప్పించబడ్డారు. సంధ్యని అనేక చోట్లకి తీసికెళ్ళడంలోనూ, సంధ్య 'స్పెల్ ఆఫ్ క్రై'కి కారణం తెలుసుకోవడంలోనూ నిమగ్నమయ్యాడు సతీష్.. సంధ్య శరీరానికి కొంత విశ్రాంతి కలిగింది.

V V V

ఆ వీణని ఆత్మీయంగా గుండెల కదుముకుంది సంధ్య...

ఆ వీణపైనే చెంపలానించి ఆరమోడ్పుగా కళ్ళు మూసుకుందో క్షణం.

ఇది తన తల్లి చేతి ముని వేళ్ళు పారాడిన వీణ...

ఈ లౌకిక ప్రపంచంలోకి ఆస్థులన్నింటినీ నిస్సంకోచంగా వదిలి పెట్టి తన అత్తగారి ఆరోప్రాణం... యిదిగో ఈ అలౌకికమైన వీణను మాత్రం వెంట తెచ్చుకుంది వదిన...

అప్రయత్నంగా సంధ్య చిటారు చిగురు వేళ్ళు కదిలాయి...

ఒక జీవన తాప దుఃఖాన్నీ, నిరాదరణనీ తీగెల మీద పరిచి ఒక అపభ్రంశ గీతిక నుండి క్రమక్రమంగా చైతన్యగీతిలోనికి ఆ గానం ప్రవహిస్తూ వుంది...

భార్యా భర్తలిరువురూ జీవిత పర్యంతం నాయికా నాయకులుగానే వుండగలిగే ఒక స్థితి కోసం కలగంటున్నట్లుగా వుందామె గొంతు...

ఆ నిశీధిలో సున్నితపు వీణ తీగలను మీటి సంధ్య చేతివేళ్ళు వెలువరిస్తున్న ఆ సవ్వడి జీవరహస్యాల్ని పట్టుకునే ప్రాణశంఖాన్ని పూరిస్తున్నట్లుగా వుంది.

V

కవితానిక

# పాలమూరు లంబడి




**జనజ్వాల**

నడుస్తూనే వున్నాడు అతడు బైరాగి కాడు... యోగికాడు... భోగికాడు... గాలిని ఒంటికి చుట్టుకొని... కళ్ళకు రెక్కలు అతికించుకొని... అగ్ని బ్రతుకును నెత్తి మీద పెట్టుకొని, దేవకీ దేవి భర్త వసుదేవుడిలా రెండుగా చీలిపోతున్న వీడు నది మధ్యకాదు సముద్ర మధ్య నుంచి నడుస్తున్నాడు.

.... నడుస్తూనే వున్నాడు.... పల్లెదాటి... జిల్లా అంచుల్నిదాటి నడుస్తూనే వున్నాడు. వాడు తల్లి పాలమూరు ముద్దుబిడ్డ... వాడు కాలం మాయాల మరాఠీ గీసిన సరిహద్దుల రేఖల్ని దాటుతూ అయిన వాళ్ళకు... ప్రేమకు దూరంగా వలసపోతున్న బాలపోరగాడు. వాడికి తెలియకుండానే తల్లి గర్భంలోనే బ్రతుకుగాసం పత్రం మీద వలస అగ్రిమెంటు మీద వేలు ముద్ర సంతకం పెట్టినవాడు. వాడు లంబడి లచ్చిగాడు.

వాడు హైటెక్ భాగ్యనగరం బారులో బాయ్‌గా కనిపిస్తాడు... ముంబాయిగా మారిన బొంబాయి మురికి కాల్వల దగ్గర కనిపిస్తాడు... వాడొక్కడే సినిమాలో ఒకే హీరో డబుల్ రోల్‌గా– ఎందిరా లచ్చిగా నీకెప్పుడైనా నీ అమ్మ గుర్తుకుందా! నీఅయ్య గుర్తుకురాదా! పిల్లల మధ్య ఆటలాడాలనిపించదా! అని ఎవరైనా అడిగారనుకోండి. ఇంకేముంది. ప్రశ్నార్థక చూపులతో... తెగి రాలిపడుతున్న తోకచుక్కల్ని... హిమసముద్రపు అలల తాకిడిని మనకు చూపిస్తాడు.

పాపం లచ్చిగాడని తెచ్చిపెట్టుకున్న జాలితో అతని తలను నిమరపోతే, మన చేతుల్ని అతని తల మీదున్న బ్రతుకు అగ్ని కొలిమిసెగ విసిరి కొడుతుంది.

ఒకసారి లచ్చిగాడికి చిల్లర నాణేలు ఇవ్వబోయాను... ఒలంపిక్ క్రీడలో జావలిన్‌త్రో విసిరినట్టుగా నాణ్యాన్ని విసిరికొట్టాడు. అప్పుడు అతని పెదవులు ఈ దేశంలో ఏ బ్రాహ్మణుడు నేర్చుకొని... చెప్పలేని సంస్కృత శ్లోకాలు వినిపించాయి.

ఇవేసారూ. ఈ పైసలే మమ్ముల్ని మాబోటివాళ్ళని.... మా బతుకులు మాకు కాకుండా... మా మీద పెత్తనం చేస్తున్నాయిసారూ... ఈ పైసల్ని ఈ లోకానికి ఎవరు తెచ్చిండ్రుసారూ... దీని కోసమే సారూ మా తాత చేసిన అప్పుని మా పొలం గుంజుకున్నారు. అది తీర్చక మా అయ్య చచ్చిండు. మా అమ్మను పశువును చేసి ఆగం చేసిండు దొర. ఇప్పటికీ నా అక్కను వాడే దొరగాని కొడుకే ఆగం చేస్తున్నాడు. అప్పుడప్పుడు ఆ దొరగాని కొడుకే ఇలాగే పైసల్ని చేతిల పెట్టెటోడు. నానుతాండ విడిచి పక్కపల్లె పోయొచ్చేడప్పటికి ఎక్కిఎక్కి ఏడుస్తూ గుడిసె ముందు కూసున్‌ది సారూ నా అక్క లక్ష్మిక్కా.

పైసలు ఎనక మాయ ఎరుకలేక... ఓదంతా సూడలేకనే... తాండా... పల్లేవదిలి వచ్చిన సారూ...

అతని పెదవుల్ని... పెదవుల మీది ఆకాశాన్ని... ఆకాశం మీద మెరుపుల్ని... ఉరుముల్ని... చూడలేక తలను భూమికేసి విసిరాను. ఎక్కడి నుంచో "సారే జహాసే అచ్చా హిందుస్తాన్ హమారా" పాట వినిపిస్తుంది. విసిరిన తలను భుజం మీదికి తీసుకొని చూశాను, ఎక్కడి నుంచో కాదు, యాభైనాలుగేళ్ళ రాజ్యాంగపు సాక్షిగా... అరువు తెచ్చుకున్న పైసలతో ఎగురుతున్న మూడు రంగుల జెండా రెపరెపల్నించి... జెండాకేసి ఒకసారి పరీక్షగా చూశాను. ధర్మ చక్రం కనిపించడంలేదు. కంటి రెప్పల మధ్య గుండె తడిని తుడుచుకొని... మరోసారి చూశాను... ధర్మచక్రం ఉండేచోటు రూపాయి బొమ్మ కనిపిస్తుంది. దాని అంచునే పాలమూరులచ్చిగాని ముఖం స్పష్టంగా కనిపిస్తుంది.

---

# పచ్చని స్వప్నం

**మహ్మద్ ఫసి**

నను 'పరదేశీ' అనే
ఓ... నా ప్రియమిత్రుడా!
గుర్తుపట్టావా... నన్ను... అదే సాయేబుని,
కోడికూయక ముందే 'అజా'తో నిన్ను నిద్దుర లేపేటోన్ని
నీ ఆకలి తీర్చే 'చాయ్ చపాతి'ని
చౌరస్తాలో 'హర్ ఏక్ మాల్'ని
తులం బంగారం పోయినా సరే.
తుర్కోని ఆడదాన్ని... అన్నా...
వినిపించుకోని బధిరుడిని
'నవాబు'ని ఐనా పూటలు గడవని గరీబుని
ఈ దేశంలో పుట్టినోన్ని,
ఈ గాలిని పీల్చినోన్ని,
నా స్వేదంతో ఈ నేలను తడిపినోన్ని,
ప్రపంచ శాంతి కోసం,
ప్రతీ తల్లి ఆరోగ్యం కోసం

నే చాచిన ఈ 'దోసిలి' అంతరంగం సాక్షిగా
కలనైన సరిహద్దులు దాటనోన్ని
ఐనా 'తురకలు' అని పిలుస్తవెందుకు?
ఈ దేశ ప్రగతి రథ సారధివి నీవైతే,
ఆ రధ చక్రాన్ని నేనే కదా!
ఐనా నీలో భాగంగా చూడవెందుకు?



ఐనా నన్నెవరు నిందించేది?
భరతమాత ముద్దుబిడ్డను
పచ్చని స్వప్నాన్ని నేను
"ఇండియన్ ముసల్మాన్"ను నేను

# జన కవనం మెరుపులు.. చురకలు...(కొన్ని భాగాలు)

### పతాక సన్నివేశం

మనుగడ ఒయాసిస్సు
మనిషి జీవధార
కలల ఖర్జూరం
సహస్ర బాహువుల ఖడ్గధారి
ఎడారి ఓడ మహాప్రస్థానం
ఆత్మ విశ్వాసం జైత్రయాత్ర
.......
ఒక అర్థ శతాబ్దం పోరుబాటలో
ఆలాపనగా రగిలి పాటగా మారింది
ఒక జాతి జీవితం విలయంలో లయగా నిలిచింది
మృత్యువు ఒడిలో కూడా ఆ పాట నిద్ర పోలేదు
...
ఎడారి ఒయాసిస్సు కలల ఖర్జూరం
ఆలివ్ ఆకుల్లో పాలస్తీనా పోరు
ఆరాఫత్‌ల పరంపర కోసం
పృధ్వి నేత్రాల వెతుకులాట

– జ్వాలాముఖి

### శేషప్రశ్న

కత్తి ఎత్తిన వాడికి ఉపాధి
చచ్చి శవమైన వాడికి ఎక్స్ గ్రేషియా
పలాయన వాదం ఎనస్తీషియా
పాలకవర్గం పెద్ద మాఫియా
హిపోక్రసీ అయిన డెమోక్రసీలో
తుపాకులు తూటాల మధ్య
చర్చలు పెద్ద తమాషా

–ముత్యాల మనోహర రావు

### మనిషిగా పుట్టాలి

ఆట సాగుతూనే వుంది
వీక్షకులు లేరు
వేట సాగుతూనే వుంది
వేటగాడి ఆనవాళ్లు లేవు–
..
మానవుడా ఇది నీ సమయం
వేల ఏళ్ల స్తబ్దత
వదిలించుకునే తరుణం
నిర్లిప్తతకు నిలువునా
నిప్పుపెట్టే సమయం
వేటగాళ్లనిప్పుడే
వేటాడాల్సిన అదును
వంచకులనిప్పుడే
వంచాల్సిన అవసరం
స్పందించడానికి ఇదే
సరియైన తరుణం
మనిషిగా మళ్లీ
పుట్టాల్సిన మహదవకాశం

– నెల్లుట్ల రమాదేవి

### కొట్లు కొట్టేస్తున్నారా?

రాచబాట దారివెంబడి
బతుకుతెరువు వెతుక్కుంటున్న
బడుగు జీవుల మీద పడుతున్న
వామనుడు చాచిన మూడో అడుగు..
..
ఇది నిర్మాణం కోసం చేసే విధ్వంసంలా కాక
ఒక్క బతుకుల్ని కుక్కలు చింపిన విస్తరి చేసే
కుతంత్రంలా కనిపిస్తుందెందుకో!

–డా.కె.ఎస్.రామచంద్రమూర్తి

### ప్రతిజ్ఞ

నీతో వస్తాలే నీతో వస్తాలే
చేతిలో చైతన్యపు ఆయుధముంటే
గుండెలో రగిలే రసాయనాలుంటే
ఎగురుతున్న పతంగం స్వేచ్ఛా పిపాస నీలో వుంటే
కరుగుతున్న కొవ్వొత్తి స్వంతమైన త్యాగనిరతి నీలో వుంటే
యుద్ధానికి నీతో వస్తాలే
ఆహ్వానాలు ఆర్భాటాలు లేకుండానే
ఒక ఉషోదయపు ఆవిష్కరణకు రావడానికి నేను సిద్ధం

– తురాయి మురళీధర్

### ఎక్కడిదో ధూళి

ఎంత పరిచయమున్నా
కొత్తగానే కలుసుకుంటారు
మార్కెట్లో వాల్తున్న వస్తుప్రపంచం
సంభాషణల్లోకి అత్యవసరంగా
దిగుమతవుతుంది
కాయిన్ల సంగీతం
మాటల్లో ప్రసారమవుతున్నప్పుడు
ముఖాల్లో నవ్వులు
పాప్ నృత్యం చేస్తుంటాయి

– పరిమళ్

### విశ్వం నిండా

పుట్టుక నాకో మతాన్నిచ్చింది
అది నీ మతం కాకపోవచ్చు
...
అయితే పుట్టిన మతం నుండి మాత్రం
నిన్ను ప్రేమించడం నేర్చుకున్నాను
.. ఒక్కొక్కటిగా సంకుచితాలను ఛేదిస్తూ
వ్యాకోచించడం నేర్చుకున్నాను
అంతా ఇదంతా నిన్ను నిన్నుగా ప్రేమించడం కోసం
నువ్వు నన్ను నన్నుగా చూడగలిగితే నాకది చాలు
మనం మనంగా రెండు కపోతాలై
విశ్వం నిండా విహరిద్దాం

– మహమ్మద్ సిరాజుద్దీన్

### ఎగోనీలు

వేసేమి లాభం విత్తనం
పంట చేతికొచ్చినా
దళారీదేగా పెత్తనం

తెగిన చోటనే
తెలంగాణా తీగలు
మరోసారీ
ప్రజలు మూగలు

– గుండెబోయిన శ్రీనివాస్

### టు వర్డ్స్ ఫ్రీడం

ఇప్పటిదాకా దేశాల మధ్య చిచ్చుపెట్టి
ఆయుధాలు అమ్ముకుంటాడనుకున్నాం
కానిప్పుడు వాడు
వాని సరిహద్దులు దాటి
సార్వభౌమత్వాలు కూలద్రోస్తూ
టెర్రరిజం సాగిస్తున్నాడు
...
నిన్న వాడి వధ్య శిలపై ఆఫ్ఘన్
పరిష్కారం లేని చావులో పాలస్తీనా

అయినా మనం ఎదురు మాట్లాడలేదు
ఇవ్వాలా ప్రపంచ నాగరికతల మాత
మెసపుటేమియా వంతు
రేపు వాడి రక్త దాహానికి మరో పథకం
మనం ఇంకా మాట్లాడకపోతే
మనవంతు వచ్చేప్పటికి ఎవరూ మిగిలుండరు!

**- నరసింహుడు**

## ఎన్నాళ్లీ యుద్ధం?

మళ్లీ తుపాకులు పేలుతున్నాయి
రక్తపు ధారల చరిత తిరగ రాస్తున్నాయి
..
శాంతి కోసం చేసుకున్న బాసలు
తెగిన గాలిపటాలవుతున్నాయి
..
ఆ ఒప్పందాలేమైనాయి?
ఆ ఓపికలెటుపోయాయి?
....
ఎవరిది తప్పు? ఎవరిది ఒప్పు?
ఎవరికి ముప్పు? ఎవరికి మెప్పు?
ఎంతకాలమీ భయం నీడలు?
ఎంతవరకీ ద్వంద్వ క్రీడలు?
మళ్లీ మళ్లీ శాంతి కపోతాలెగరాలి
సామరస్యం విరియాలి

**- గజ్జె సురేష్‌బాబు**

## అగ్నికీల

.......
నమ్మకాల భవనంలో
అగ్నికీల రగిలింది
నా దేశపు మూల్యాలకు
చావుదెబ్బ తగిలింది
నా అమ్ముల పొదిలో బ్రహ్మాస్త్రం
తమ్ముడి గదిలో అణ్వస్త్రం
జగతి సమస్తం సమాధి ఐతే
మిగిలేదిక శ్మశాన శాస్త్రం
..........

**- డా.బండారు ఉమామహేశ్వరరావు**

ఎన్ని సార్లు పంచారో
మిగులు భూమి
పేపర్లలో టీవీల్లో!

రొయ్య మింగింది
రైతును
చేపల చెరువును

**-రౌతు రవి**

అమ్మాయి
వంకర టింకరగా మాట్లాడుతుందా?
యాంకరవుతుందేమో!!

మనం మళ్లీ
బడికెళ్లాల్సిన అవసరం
అ అంటే అమ్మ కాదట-అమలాపురం

డబ్బుల నాడి
దొరికింది డాక్టర్లకు
అదిగో సూపర్ స్పెషాలిటీ కేర్

పొద్దున్నే ఓ పీడకల
పెరుగన్నానికీ
పేటెంట్ వచ్చిందని.

**-బి.ఇందిర**

## టెర్రర్

ఒక రక్త సిక్త స్వప్నం
ఆకాశ హర్మ్యాలనునేలకూల్చిన ఘట్టం
చరిత్ర కన్నీరు పెట్టిన నరబలి
స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ కంపించిన వైనం
...
ఒక టెరరిస్టు ఒక దేశంపై దాడి చేస్తే
వార్ ఆన్ టెర్రర్ -ఒక్క దేశం ప్రపంచంపై
దాడి చేస్తోంది
..
ఇప్పుడు ప్రపంచమంతా స్టాచ్యూలే
లిబర్టీ లేదు

**- నాగళ్ల శిరీష్ కౌండిన్య**

# "దిపోయెట్"

## గరికపాటి మణీందర్



పూల వనంలో మనల్ని
చేయి పట్టి నడిపిస్తాడు
పారిజాత పరిమళాలను
మలాం పట్టిగా వేస్తాడు
మందార మరంధ ధారలలో వేలు ముంచి
పెదవులపై అపురూపంగా రాస్తాడు

V V V

తేల వెన్నెలలో, తెలిమంచుపరదాల
హరిత శాద్వల లోయలలో
తల్లి జింకలా తిప్పుతాడు
కొండల పై నుండి దూకే
వెండి వాగుల జలపాతంలో
లాలపోస్తాడు
హరివిల్లును ఊయల చేసి
తానొక జోలపాటలా మారతాడు
చంద్రుడ్ని కుండలావంపి
దోసిళ్ళకొద్దీ అనురాగామృతాన్ని
తాపుతాడు

V V V

బైబిల్ లోంచి నడచి వచ్చే క్రీస్తులా
ప్రేమగా చేతులు చాచుతాడు
బ్రతుకు పద్మవ్యూహాన్ని ఛేదించే
గీతోపదేశమవుతాడు
బోధి వృక్షం కింద బుద్ధునిలా
సుఖ దుఃఖాలను నిర్వచిస్తాడు

V V V

దుఃఖితమతులను
దయతో నిమురుతాడు
కష్టితజన కన్నీళ్ళను
తన కళ్ళలో పోసుకుంటాడు
చీమ చిటుక్కుమన్నా
కలం ఆయుధం అందుకొని
అంగరక్షకుడిలా
ఆయత్తమవుతాడు

V V V

మిధ్యా ఇజాల భుజాల్ని
నిర్దయగా చరుస్తాడు
నిజాల్ని నిర్భయంగా
అక్షరాల నినదిస్తాడు
సత్య సంధతను కాపాడే
ప్రజాపక్ష నాయకుడవుతాడు

## పరిశీలన

# కథకుల, పాఠకుల మధ్య అవినాభావ సంబంధం

***కథకుడు కథని ప్రచురించడం నీటిలో రాయి విసరడం వంటిది. ఆ రాయి తాకిడికి లేచే చిరుతరగల వంటివే పాఠకుడిలో కలిగే స్పందనలు. అలా స్పందించిన పాఠకుడు తన సొంత ఆలోచనలతో కూడిన అభిప్రాయాలు వెలిబుచ్చినప్పుడు తన ఆలోచనలకి అనుగుణంగా మరొక కథకి నాంది పలుకు తున్నాడు అనుకోవాలి. పాఠకుడు ఎప్పుడయితే, "అలా జరిగివుండకూడదు. ఇలా జరిగి వుండవలసింది" అనుకున్నాడో, అప్పుడే అతను మరొక కథ రాస్తున్నాడు అనుకోవచ్చు. మొదటి కథ సాధించిన విజయం ఆ పాఠకుడికి సంబంధించినంత వరకూ అదే.***

**నిడదవోలు మాలతి**[v]

**1950–60** దశకాలలో నేను చదివిన అభిప్రాయాలతో ఈనాడు పాఠకులు పత్రికలలో వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను పోల్చి చూడగా కలిగిన ఆలోచనల సారాంశమే ఈ వ్యాసం. సామాన్య పాఠకులు, ఒక కథ చదివి, తమ అనుభవాలు ఆధారంగా స్పందించి వెలిబుచ్చే అభిప్రాయాలు, ఈనాటి కథని ఎలా తీర్చిదిద్దుతాయి అన్నది నన్ను వేధిస్తున్న సమస్య. ఆ దృష్టితో, నేను గమనించిన కొన్ని విషయాలు ఇక్కడ మీ ముందుంచుతున్నాను.

స్వాతంత్ర్యానంతరం, పత్రికల సంఖ్యతోపాటు పాఠకుల సంఖ్య పెరిగింది. విద్యాస్థాయి పెరిగింది. కథలో, కథనంలో లాగానే పాఠకులలో, వారి దృక్పథాలలో, వారు స్పందించే విధానంలో కూడా అనేకమయిన మార్పులు వచ్చాయి. భిన్న దృక్కోణాలూ, భిన్న రీతులు కథల్లో ద్యోతకమయినట్టే, పాఠకుల దృష్టిలో కూడా పరిమాణాత్మకమయిన మార్పులు కనిపిస్తున్నాయి. పాఠకులు కథని ఎలా విశ్లేషిస్తున్నారు. తమకి ఎలా అన్వయించు కుంటున్నారు. రచయిత/రచనల నుండి ఏమిటి ఆశిస్తున్నారు. అన్న అంశాలను పరిశీలించడమే ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

తమ అభిప్రాయాలని వెలిబుచ్చే పాఠకులని స్థూలంగా మూడు భాగాలుగా విభజించవచ్చు : 1. ఒక కథ చదివిన తక్షణం తమ అనుభవాల పరిమితిలో స్పందించే వారు, 2. కథలో లీనమై, కథలో ఒక పాత్రనో ఒక సన్నివేశాన్నో, సంఘర్షణనో తమ కన్వయించుకుని, తదనుగుణంగా స్పందించే వారూ, 3. వర్ణన, వాస్తవికత, భాషలకి సంబంధించిన శల్య పరీక్ష చేసేవారు.

వీరిలో మొదటి తరగతి పాఠకులు చాలా వరకు స్థాలీపులాకన్యాయంగా అక్కడక్కడ చదివేసి కథలో ముఖ్యమైన అంశాన్ని సూచన ప్రాయంగా గ్రహించేస్తారు. అలా కప్పదాటుగా చదవడంలో కొన్ని విషయాలు తెలిసో తెలియకో గమనించకపోవడం కూడా జరుగుతుంది. వారు వెలిబుచ్చే అభిప్రాయాల్లో కూడా ఆ లోపం కనిపిస్తుంది. వారికి తమ అభిప్రాయం వెలిబుచ్చే ఉత్తేజం కలిగించడమే ఆ కథ సాధించిన విజయంగా భావించుకోవచ్చు ఆ కథకుడు.

ఈ అభిప్రాయాలలో ఒకొక్కప్పుడు దూషణ, భూషణ, తిరస్కారాలు కూడా చోటు చేసుకోవడం కూడా గమనించగలం. ఇక్కడ మనం మరొకమాట కూడా చెప్పుకోవాలి. వ్యక్తిగత విమర్శ మనకి కొత్తకాదు. వెనక రాయలవారి సభలో అల్లసాని పెద్దన "అమవసనిశి" అని వాడినందుకు, తెనాలి రామకృష్ణుడు, "ఎమి తిని సెపితివి కపితము, ఉమెతః తిని సెపితొ... అలసని పెదన" అంటూ తను కూడా ఒత్తులూ, దీర్ఘాలూ తీసేసి పద్యం చెప్పి హేళన చేసినట్టు నా చిన్నప్పుడు చదివాను. ఈ మధ్య నాయని కృష్ణకుమారిగారు ఒక వ్యాసంలో వీరేశలింగంగారూ, కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు వారి వారి పత్రికలలో ఒకరినొకరు హేళన చేసుకోవడం గురించి "వారిలాటి మహానుభావులకే చెల్లింది" అన్నారు చమత్కారంగా (యుగపురుషుడు వీరేశలింగం, ఎపి సాహిత్య అకాడమీ ప్రచురణ అని గుర్తు). అంటే అది సభ్యలక్షణం కాదు అంటూ వాచ్యం చేయకుండా.

రెండో రకం పాఠకుడు, కథలో లీనమయిపోయి, తానొక పాత్ర అయినట్టుగా వ్యాఖ్యానాలు చేస్తాడు. ఫలానా పాత్ర అలా అనకుండా ఉండవలసింది, అలా చెయ్యకుండా ఉండవలసింది, మరోలా జరిగివుంటే బాగుండును వంటి అభిప్రాయాలు ప్రకటించడంలో అంతర్యం అతడు అలా కథలో లీనమయిపోవడమే. ఆ పాఠకుడు తనవైన అనుభవాలు ఆధారంగా చేస్తున్న వ్యాఖ్యానాలు అవి. మరొక విధంగా చెప్పాలంటే, కథకుడు కథని ప్రచురించడం నీటిలో రాయి విసరడం వంటిది. ఆ రాయి తాకిడికి లేచే చిరుతరగల వంటివే పాఠకుడిలో కలిగే స్పందనలు. అలా స్పందించిన పాఠకుడు తన సొంత ఆలోచనలతో కూడిన అభిప్రాయాలు వెలిబుచ్చినప్పుడు తన ఆలోచనలకి అనుగుణంగా మరొక కథకి నాంది పలుకు తున్నాడు అనుకోవాలి. పాఠకుడు ఎప్పుడయితే, "అలా జరిగివుండకూడదు. ఇలా జరిగి వుండవలసింది" అనుకున్నాడో, అప్పుడే అతను మరొక కథ రాస్తున్నాడు అనుకోవచ్చు. మొదటి కథ సాధించిన విజయం ఆ పాఠకుడికి సంబంధించినంత వరకూ అదే. ఏడు చేపల కథలో "చేపా, చేపా, ఎందుకు ఎండలేదు" అని చేపని ప్రశ్నిస్తేనే కథ ముందుకి సాగుతుంది. చేపని అడిగేదేమిటి, తీసి ఎండ ఉన్న చోట పడేస్తే పోతుంది కదా అనుకుంటే ఆ తరువాత కథ లేదు మరి.

మూడో రకం పాఠకులు ఇంకా ముందుకు వెళ్ళి, కథని శల్యపరీక్ష చేస్తారు. వీరు భాష, శైలి, పాత్రచిత్రణ, వాస్తవికత వంటి అంశాల విశ్లేషణ చేస్తారు. ఒక్కొక్కప్పుడు తాము చదివిన విదేశీ రచయితలతో పోల్చుకునో, వారి విమర్శలనాధారం చేసుకునో వ్యాఖ్యానాలు చేయడం కూడా కద్దు.

ప్రతి పాఠకుడూ తప్పనిసరిగా ఈ మూడింటిలో ఏదో ఒక కోవకి చెంది వుంటాడని కాదు నా అభిప్రాయం. సుమారుగా ఇటువంటి విభజనకి ఆస్కారం కనిపిస్తోంది అని మాత్రమే చెప్తున్నాను. చదివిన ప్రతి

v అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో

పాఠకుడూ పత్రికా ముఖంగా తన అభిప్రాయాలు వెలిబుచ్చడు అన్న విషయం కూడా మనం గుర్తుంచుకోవాలి ఇక్కడ.

1950, 60 దశకాల్లో కూడా పాఠకులకి కథలు కొంత వరకూ కాలక్షేపమే అయినా, కథలో సంఘటనతోనో ఒక పాత్రతోనో తమ అనుభవాలతో పోల్చుకుని, ఆ కథని తమ కథగా మలుచుకోవడం, ఆ కథలలో సంఘర్షణలని తమకి అన్వయించుకుని, పరిష్కారాలు వెతుక్కోవడం జరిగింది. కె. వసుంధరాదేవి, ఒక వ్యాసంలో తమ అనుభవం గురించి ఇలా రాశారు (తెలుగు కథ – తీరు తెన్నులు వ్యాసం, మహిళ, ఎపి సాహిత్య ఎకాడమీ, 1982). సందర్భం ఏమిటి అంటే – క్షయతో బాధపడుతున్న ఒక యువకుడు మూడు కథలు చదివాడు, ఒకటి ఆవిడ రాసిందే. అందుచేత ఆ యువకుడు ఆవిడ దగ్గరికి వచ్చాడు. కథా నాయకుడు క్షయరోగి, కొంత కాలం బాధపడి, చనిపోవడంతో ముగుస్తాయి మూడు కథలూను. అతడు ఆ రచయిత్రిని అడిగిన ప్రశ్న. "ఏమండీ, అన్ని కథల్లోనూ కథానాయకుడు చచ్చిపోయాడు. అంటే క్షయరోగులకి బతికే అవకాశమే లేదా?" అని. దానికి ఆవిడ బాధపడి, రచయితలందరి తరఫునా క్షమాపణలు చెప్పుకున్నాననీ, మళ్ళీ జన్మలో ఎప్పుడూ చావుని పరిష్కారంగా రాయకూడదని నిశ్చయించుకున్నాననీ, అయినా ఆ పాఠకుడి ప్రశ్న తనని వేధిస్తూనే ఉందనీ రాశారు. ఈ కథ ఇక్కడ ఉదహరించడానికి కారణం ఆనాడు పాఠకులలో కథలంటేనూ, కథకులంటేనూ ఉన్న నమ్మకం ఎత్తిచూపడానికే, ఈనాడు మాలతీచందూర్ వంటి వారికి గల కీర్తి ప్రతిష్ఠలకి వెనక ఉన్న కారణం కూడా పాఠకులకి ఆనాడు రచయిత మాట మీద ఉన్న గౌరవమే. మరొక విధంగా చెప్పాలంటే, ఆనూచానంగా మనం జ్ఞానానికి ఇస్తూ వస్తున్న విలువ అది. రచయితకి ఏదో తెలుసునని నమ్మి, తాను ఏదో కొత్త సంగతి తెలుసుకోగలనన్న ఆశతో కథ చదివాడు ఆనాటి పాఠకుడు. అది గురు శిష్య సంబంధం. ఈనాడు గురుశిష్య సంబంధంలో మార్పు వచ్చింది. ఆనాడు ఎదుటివాడి మాట స్వీకరించడం/ అంగీకరించడం నీతి అయితే, ప్రశ్నించడం ఈనాటి న్యాయం. ఈ మార్పు పాఠకులలో కూడా గమనించగలం.

ఈనాడు పత్రికలలో వెలువడుతున్న అభిప్రాయాల ప్రకారం, పాఠకుల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నవి. స్థూలంగా వస్తువు/ సంఘర్షణ, పరిష్కారం. ఆపైన కొంత వరకూ భాష, వాటికి అనుబంధంగా వాస్తవికత,

.............. O ..............

**ఈనాడు పత్రికలలో వెలువడుతున్న అభిప్రాయాల ప్రకారం, పాఠకుల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నవి. స్థూలంగా వస్తువు/సంఘర్షణ, పరిష్కారం. ఆపైన కొంత వరకూ భాష, వాటికి అనుబంధంగా వాస్తవికత, ప్రయోజనం గురించిన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కథకి ముఖ్యమైన ప్రయోజనం ఒక దృక్కోణాన్ని జనబాహుళ్యానికి అందించడమని దాదాపు అందరం గుర్తించాం. అది పది మంది గమనించినదే కావచ్చు. లేదా ఎవరూ గమనించని/గమనించినా పట్టించుకోని కోణం కావచ్చు.**

.............. O ..............

ప్రయోజనం గురించిన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కథకి ముఖ్యమైన ప్రయోజనం ఒక దృక్కోణాన్ని జనబాహుళ్యానికి అందించడమని దాదాపు అందరం గుర్తించాం. అది పది మంది గమనించినదే కావచ్చు. లేదా ఎవరూ గమనించనీ/గమనించినా పట్టించుకోనీ కోణం కావచ్చు. సామాజిక ప్రయోజనం అంటే సమాజంలో లోపాలను గర్హించేదీ, పరిష్కారాలను సూచించేదీ అని స్థూలంగా చెప్పుకుంటున్నాం. నిజానికి ఈ వివరణే ప్రమాణం అయిపోయినట్టు కనిపిస్తోంది. ఈనాడు మంచివి అని చెప్పుకుంటున్న కథలూ, విమర్శలూ చదువుతుంటే. ఇది కూడా విమర్శకుల పాఠకుల దృష్టిలో మార్పుకి ఒక చిహ్నమే.

వస్తువుకి ఈనాటి పాఠకులు ఇస్తున్న ప్రాధాన్యతకి మంచి ఉదాహరణ ఈ మధ్య ఆంధ్రజ్యోతి (ఆన్‌లైన్ ఆదివారం, జనవరి 16)లో ప్రచురించిన "కడలూరు వెళ్ళాలి ఒక నీలిమ కోసం" అన్న కథ. సునామీ బీభత్సానికి సమస్త ప్రపంచం స్పందించింది నీ, నా వివక్షత లేకుండా "కడలూరు" కథలో విశేషం వస్తువు/ రచయిత అవగాహన మానవ సంబంధిగా మలచడం. చాలా మంది పాఠకులు ఆ భాగానికి అద్భుతంగా స్పందించారు. అయితే, కథలో ఒక సన్నివేశం – కథానాయకుడు ఫోన్ చెయ్యాలనుకున్న సందర్భం స్పష్టంగా లేదు. ఎవరికి, ఏమని ఫోన్ చెయ్యాలనుకున్నాడు, చేశాడా, లేదా అన్న వివరాలు లేవు. కథలో ప్రధానాంశం ముందు పాఠకులు దీన్ని లెక్కలోకి తీసుకున్నట్టు కనిపించలేదు ప్రచురింపబడిన అభిప్రాయాలు చదివినప్పుడు.

కథా వస్తువు/సంఘర్షణ : 1970 దశకంలో తెలుగు కథకి సాంఘిక ప్రయోజనం ముఖ్యమైన ప్రాతిపదికగా విశేషాదరణ పొందింది. నేను ఇక్కడ నా చర్చకి అనుకూలంగా 1950 దశకానికి పూర్వపు కథలు మూడు తీసుకున్నాను. కారణం పాఠకులు ఆనాడు అడగని ప్రశ్నలను ఎత్తిచూపడంలో ఉన్న సౌలభ్యం.

ఏది వాస్తవికత ఏది కాదు అన్న ప్రశ్నకి ఉదాహరణగా ఈ కథ చూడండి. ఒకాయన సానివాడలు తిరుగుతుంటాడు. ఆయనకి బుద్ధి చెప్పి, దారిలో పెట్టాలనుకుంటుంది భార్య. ఒక రోజు ఆయన అలవాటు ప్రకారం చాంద్రాయణం ముగించుకుని, ఇంటికి వస్తాడు. అమ్మగారేరీ అని పనివాడిని అడుగుతాడు. అతను అమ్మగారు పుట్టింటికి వెళ్ళిపోయారని చెబుతాడు. దాంతో ఆయన కంగారు పడిపోయి, బుద్ధి తెచ్చేసుకుంటాడు.

పాఠకులు చాలా మంది గ్రహించే ఉంటారు, ఇది గురజాడ వారి దిద్దుబాటు కథ అని. ఇది తెలుగులో తొలికథగా, అంటే మంచికథకి ఉండవలసిన లక్షణాలు ఉన్న కథగా గుర్తింపబడింది. కాని ఇదే కథని ఈ రోజుల్లో నాలాటి రచయిత రాస్తే, ఈనాటి పాఠకులు సంఘర్షణకి తగినబలం ముగింపులో లేదు అంటారు. దాని మీద అనేక ప్రశ్నలు లేవదీయొచ్చు. భార్య పుట్టింటికి పోతే స్త్రీలోలుడయిన మగాడికి అంత త్వరగా బుద్ధి వచ్చేస్తుందా? నిజానికి అతగాడికి భార్య ఎదురుగా లేకపోతే మరింత ఆటవిడుపు కదా అని అడుగుతాడు ఈనాటి పాఠకుడు.

ఆ తరువాత వచ్చిన కథల్లో కుటుంబరావుగారి కథ, ఆడజన్మ, చూడండి ఇందులో లక్ష్మి ప్రధానపాత్ర. ఆమె తండ్రి పోయిన తరువాత, అతని అన్నగారు లక్ష్మినీ, తల్లినీ చేరదీసి, లక్ష్మిని రెండోపెళ్ళి ముసలాయనకిచ్చి చేతులు దులుపుకుంటాడు. ఆ ముసలాయనకి అనుమానం, లక్ష్మి సవతి కొడుకుతో సంబంధం పెట్టుకుందేమోనని, ఆ బాధల మధ్య లక్ష్మి ఒక కూతురిని కంటుంది. ఆ కూతురు పెరిగి పెద్దదయిన తరువాత ఎవరితోనో లేచిపోవడం, గర్భవతిగా తిరిగి రావడం – ఇంతే కథ. ముప్పై ఏళ్ళు నిండని లక్ష్మికి మూడు తరాల బాధలు అనుభవమయాయి, చివర, ఇంకా ఏమి జరగనున్నదో అనుకుంటుంది ఏడుస్తూ.

ఈ కథలో పరిష్కారం లేదు. ఆ రోజుల్లో ఒక దిక్కుమాలిన ఆడదాని సాంఘిక దుస్థితిని చిత్రించడం మాత్రమే జరిగింది.

నిజానికి ఈ కథ చదువుతున్నప్పుడు నాకు అదొక కథలా అనిపించలేదు. మాటవరసకి పాత్రలకి పేర్లు పెట్టి ఒక సాంఘిక సమస్యని వివరిస్తున్నట్టు అనిపిస్తుంది. ఇందులో ఇద్దరు స్త్రీలు ఎట్టి సాహసానికీ పాల్పడరు. సాహసించి పారిపోయిన చిన్నది, మోసపోయి మళ్ళీ ఇల్లు చేరుతుంది. ఈ కథే ఈనాడు పత్రికలో కనిపిస్తే, ఈనాటి పాఠకులు వేసి ప్రశ్నలు సులువుగానే ఊహించుకోవచ్చు. లక్ష్మి ఎందుకు తిరగబడలేదూ? తనకి సవతి కొడుకుతో సంబంధంలేదని ఎందుకు రుజువు చెయ్యలేదూ? కనీసం అలా చేయడానికి ఎందుకు ప్రయత్నించ లేదూ? సాహసించి పారిపోయిన చిన్నది అయినా సుఖపడినట్టు రచయిత ఎందుకు చిత్రించలేదూ? అని అడగవచ్చు. నిజానికి, అదే స్థితిలో ఉన్న ఏ ఆడదానిగ్గానీ ఊరట కలిగించే ఏ ప్రయత్నమూ లేదు ఈ కథలో. ఎందుచేత? ఈ కథ పాఠకులలో సామాజిక స్పృహ కలిగించడానికి మాత్రమే అని జవాబు చెప్పుకోవలసి వస్తుంది. అంటే సంఘంలో జరుగుతున్న అత్యాచారాలు, చూసీ చూడనట్టు దాటుగాపోయేవారికి హెచ్చరికగా, మరొకసారి ఎత్తిచూపి, జనసామాన్యంలో ఆలోచనలు రేకెత్తించడానికే అని. అంతే కాక, దారిద్ర్యానికీ, నైతిక విలువలకీ మధ్యగల అనుబంధం కూడా తెలియచేస్తుంది ఈ కథ.

కనుపర్తి వరలక్ష్మమ్మగారి కుటీర లక్ష్మి ఇంచుమించు అదే పరిస్థితిలో ఉన్న మరొక స్త్రీ ప్రవృత్తిని, మరొక దృక్కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్ర రామలక్ష్మి కలిమిలేములు అనుభవించి, భర్త పోయిన తరువాత, కేవలం మనోబలంతో జీవితంతో పోరాడుతూ పిల్లలని సాక్కువస్తుంది. అయితే ఇందులో కూడా ఆమె సాధించిన ఘన విజయమేమీ లేదు. పాఠకుడు కథ అయిపోయిన తరువాత, హమ్మయ్య సుఖపడింది అనుకుని ఆనందించే అవకాశం లేదు. చివరంటా ఆమెకి దినదిన గండమే. కాని, ఇందులో నమ్మదగ్గ పరిష్కారం ఉంది. గుండెబలం గల ఆడది నా ఖర్మ అంటూ చేతులు ముడుచుకు కూచోదు. కడవరకూ పోరు సలుపుతూనే ఉంటుంది. వరలక్ష్మమ్మ ఈ కథలో వెల్లడి చేసిన మరొక విషయం ఆనాటి తెలుగుదేశంలో కనీసం ఒక నియమిత పరిధిలో స్త్రీలకి గల సామాజిక స్ఫూర్తి. ఆనాడు ఐరోపా మహాసంగ్రామం మూలంగా సామాన్యుల మనుగడ, కుటీర పరిశ్రమల మీద ఆధారపడిన వారి జీవితాలు ఎంతగా అల్లకల్లోలం అయిపోయాయో ఈ కథ వివరిస్తుంది. ఆనాటి తెలుగు రచయిత్రులకి


............. O .............

**సూక్ష్మాతిసూక్ష్మ వివరణలు, స్పష్టత, poetic license : వివరాలు, స్పష్టతల విషయాలలో ఈనాడు పాఠకులు చూపుతున్న శ్రద్ధ అపూర్వం. నాకు వస్తున్న ప్రశ్నలలో పదేపదే కనిపించేవి, స్థల, కాలనిర్ణయాలు, కదాచితుగా పాత్రల ప్రవృత్తి, ఈ విషయంలో మొదటి రచయిత అభిప్రాయం చెప్తాను. నిజానికి, రచయితలూ పాఠకులూ కూడా తమ అనుభవాలు, అవగాహనల (perceptions) పరిమితిలోనే రాయడం, చదవడం, విశ్లేషించడం జరుగుతుందన్నది మనకి తెలిసిందే.**

............. O .............


సాంఘిక పరిస్థితుల పట్లగల అవగాహన, అది కథగా మలచగల నైపుణ్యం కూడా మనం చూడగలం ఈ కథలో. అయితే ఇందులో రచయిత్రి చాదస్తంగా ఉపన్యాసాలు జొప్పించకపోవడంచేత మంచి కథగా గుర్తించారు ఆనాటి విమర్శకులు. ఇదే ఈనాడయితే స్త్రీవాద రచనగానో, దళితవాద రచనగానో ముద్రపడి, బోలెడు చర్చలకి అవకాశం ఉండేది. అటువంటి విస్తృతమైన చర్చ లేకపోతే, రచయిత్రికి సాంఘికపరమైన అవగాహన లేదని కథని పక్కన పెట్టేస్తారు.

ఉదాహరణకి పాఠకులు అడగగల ప్రశ్నలు ఊహించుకుందాం. రచయిత చెప్పకుండా వదిలేసిన అంశాలు – రామలక్ష్మి కొడుకులు చదువుకున్నారా లేదా, ఆ తరువాత తల్లిని ఆదుకున్నారా, లేదా – వంటి ప్రశ్నలకవకాశం ఉంది. లక్ష్మి సుఖపడే రోజు వచ్చిందా; రాలేదా? రాకపోతే, ఈ కథ విషాదాంతం అనుకోవాలా? విషాదాంతం అయితే, ఎందుకు ఇలాటి కథలు రాయడం అన్న ప్రశ్నలు కూడా ఉదయిస్తాయి. కాని ఆనాడు (ఇంకా నాలాటి కొందరు రచయితలు ఈనాటికీను). కథ ఎంత వరకూ చెప్పాలన్న నిర్ణయం రచయితదిగానే భావించారు. ఇతివృత్తానికీ, కథ నడపడానికీ పనికొచ్చే సన్నివేశాలు, పాత్రలు ఎంచుకోవడం మాత్రమే జరుగుతుంది. అంతకంటే ఎక్కువ వివరాలు ఎందుకు ఇవ్వలేదు అన్న ప్రశ్న లేదు అప్పట్లో.

సూక్ష్మాతిసూక్ష్మ వివరణలు, స్పష్టత, poetic license : వివరాలు, స్పష్టతల విషయాలలో ఈనాడు పాఠకులు చూపుతున్న శ్రద్ధ అపూర్వం. నాకు వస్తున్న ప్రశ్నలలో పదేపదే కనిపించేవి, స్థల, కాలనిర్ణయాలు, కదాచితుగా పాత్రల ప్రవృత్తి, ఈ విషయంలో మొదటి రచయిత అభిప్రాయం చెప్తాను. నిజానికి, రచయితలూ పాఠకులూ కూడా తమ అనుభవాలు, అవగాహనల (perceptions) పరిమితిలోనే రాయడం, చదవడం, విశ్లేషించడం జరుగుతుందన్నది మనకి తెలిసిందే. బడిపంతులు కథలు పంతుళ్ళ పిల్లల దృష్టిని చప్పున ఆకట్టుకుంటే, సాఫ్ట్‌వేరు ఇంజనీర్ల కథలు సాఫ్ట్‌వేరు ఇంజనీర్లకి బావుంటాయి స్థూలంగా. పోతే రచయితకి సంబంధించినంత వరకూ ఏ కథలోనైనా ప్రధానాంశం సాధారణంగా తాను గమనించిన ఒక సాంఘిక లేక మానసిక ప్రవృత్తి అయివుంటుంది. ఆ అంశానికి అనుగుణంగా పాత్రల, స్థల, కాలాల ఎంపిక చేసుకుంటాడతను. అంటే తాను గమనించిన విషయాన్ని, తన స్ఫూర్తికి అననింత వరకూ, తాను చెప్పదలుచుకున్న విషయానికి ఎంత వరకూ అవసరమో అంత వరకూ మాత్రమే ఎంచుకుంటాడు వివరాలు. అంటే స్థూలంగా ఒక మానసిక ప్రవృత్తిని ఆవిష్కరించదల్చుకున్నప్పుడు, ఏవూళ్ళో అన్న విషయం అనవసరంగా తోచవచ్చు. ఒక సామూహిక ప్రవృత్తిని ప్రతిపాదిస్తున్నప్పుడు, సోమవారమా, శుక్రవారమా అన్నది అస్పష్టంగా వదిలేయవచ్చు. లేదా, అసందర్భంగా, సోమవారం తరువాత రోజు శుక్రవారం అని రాయొచ్చు. ఇది ఒక రకంగా సినిమాల్లో మొదటి సీనులో పసిబాలుడు మూడో సీనులో నవయువకుడిగా సాక్షాత్కరించడంలాటిదే. సినిమాలో లాగే కథ కూడా స్థల, కాలాల్లో చిన్న చిన్న కప్పదాట్లు వేయొచ్చు. ఇటువంటి లోపాలను పూర్వకాలపు పాఠకులు పట్టించుకోలేదు. ఈనాటి పాఠకులు సోమవారానికి, శుక్రవారానికి మధ్య మూడు రోజులున్నాయి. కదండీ అని ఎత్తి చూపుతున్నారు. అది తప్పని కాదు నేను అంటున్నది. పాఠకులు ఎంత సూక్ష్మంగా పరిశీలిస్తున్నారో ఎత్తి చూపడానికే. ఇటువంటి పాఠకులు కారణంగా రచయితలు వాస్తవికత విషయంలో మరింత శ్రద్ధ చూపవలసిన అగత్యం ఏర్పడుతోంది. ఇది ఒక కోణం.

స్థల, కాల విషయాలలోలాగే వస్తువుని గురించిన వివరణలు కోరడం కూడా. కథని కథగా కాక, అందులో స్థలం గురించో, ఇతర వివరాలు తెలుసుకోడానికో చదువు తున్నట్టు అనిపిస్తుంది కొన్ని అభిప్రాయాలు చదువుతుంటే. కొందరు రచయితలు పాఠకులతో పాటు వారి స్థాయికి ఎదిగి అటువంటి

"విషయచర్చ" రచనలు చేయడం కూడా చూడగలం. అంటే కథలో ఏదయినా జబ్బు ప్రసక్తి వస్తే, ఆ జబ్బు లక్షణాలూ, వాటి మందుల పేర్లూ, మోతాదులూ, వాటి సత్ఫలితాలూ, దుష్ఫలితాలూ వంటివి ఓ పేజీ పొడవున చర్చించడం. అలాగే డయాస్పొరా రచన అయితే అమెరికాలో జీవన సరళి మీద విస్తృతమయిన చర్చ. ఒక్కొక్కప్పుడు పాఠకులు అసలు కథని వదిలేసి ఈ డయాస్పోరా కథలను కేవలం విషయసంగ్రహణ కోసమే చదువుతున్నారేమో అనిపిస్తుంది.

ఈ విషయంలో నా అభిప్రాయం మాత్రం ఈ వివరణ మోతాదు మించరాదనే. కేవలం విషయ సంగ్రహణ కోసమే చదివే పాఠకులు కథల మీద ఆధారపడకూడదనే నా నమ్మకం. వాటికి వేరే పుస్తకాలు ఉంటాయి. కథా రచయితకి కొంత స్వేచ్ఛ అవసరం. అంటే, అక్షరాలా ఉన్నదున్నట్టు, కనిపించినది కనిపించినట్టు కాక, కథ చిక్కగా నడవడానికి అనువుగా కల్పన చేసుకోగలగాలి. కథకి కేంద్రం కథాంశమే. ఇతర వివరాలు కథాంశాన్ని తినేయకూడదు. కథకి క్లుప్తత ఒక ముఖ్య లక్షణం కదా. ఇటు రచయిత స్వేచ్ఛ, అటు పాఠకుడి కోరికలకనుగుణంగా నూటికి నూరుపాళ్ళు స్పష్టత, వాస్తవికత – వీటి మధ్య పొత్తు కూర్చగల ఒక మధ్యేమార్గం కావాలి. తమ అభిప్రాయాలు వెలిబుచ్చే పాఠకులూ, ఆ అభిప్రాయాలని గౌరవించే రచయితలూ కూడా గమనించవలసిన విషయం ఇది.

అసలు పాఠకుల దృష్టిలో ఈ మార్పు – రచయితని ప్రతి చిన్న విషయం వాచ్యం చేయమనడం అభిలషనీయమేనా? మరీ అంత చాదస్తంగా సమస్తం వివరించుకుంటూ పోతే పాఠకుడికి నిజంగా తృప్తి కలుగుతుందా? ఈ విషయంలో వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి అభిప్రాయం చూడండి. రచయిత తన సందేశం పూర్తిగా వాచ్యం చేస్తే, పాఠకుల వూహకి కొన్ని విషయాలు వదిలిపెట్టకపోతే, అది పాఠకుడి మేధస్సుని అవమానించినట్టే అంటారు వల్లంపాటి వారు (కథ చదవడం ఎలా? తెలుగు వెలుగు టి.ఎ.జి.సి. వార్షిక సంచిక). కాని ఈనాడు పత్రికలలో వస్తున్న కొన్ని అభిప్రాయాలు చూస్తే, కనీసం కొందరు పాఠకులు వెంకట సుబ్బయ్యగారి అభిప్రాయంతో ఏకీభవించినట్టు కనిపించదు. నేను మాత్రం ఇది కథకీ వ్యాసానికీ మధ్యగల ఒక ముఖ్యమయిన తేడాగా గుర్తిస్తాను. పాఠకుడిలో ఆలోచనలు, ఉత్కంఠ రేకెత్తించే గుణం కథకి అవసరం. ఋజువూ, సాక్ష్యాబలంతో పాఠకుడిని నమ్మించవలసిన అవసరం వ్యాసానికి మాత్రమే ఉంది.

............ O ............

**రచయితని ప్రతి చిన్న విషయం వాచ్యం చేయమనడం అభిలషనీయమేనా? మరీ అంత చాదస్తంగా సమస్తం వివరించుకుంటూ పోతే పాఠకుడికి నిజంగా తృప్తి కలుగుతుందా? ఈ విషయంలో వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి అభిప్రాయం చూడండి. రచయిత తన సందేశం పూర్తిగా వాచ్యం చేస్తే, పాఠకుల వూహకి కొన్ని విషయాలు వదిలిపెట్టకపోతే, అది పాఠకుడి మేధస్సుని అవమానించినట్టే అంటారు వల్లంపాటి వారు**

............ O ............

వర్ణనల విషయంలో కూడా ఇటువంటి సందర్భమే తటస్థపడుతోంది ఈనాడు. కథకి తగిన వాతావరణానికి, పాత్ర చిత్రణకి పాఠకుడి మనసులో రూపు కట్టడానికి కావలసిన వివరాలు లేక వర్ణనలు కథలో చొప్పించడం సహజం. మన ముందు తరాల వారి కథల్లో – మధురాంతకం రాజారాం, కాళీపట్నం రామారావు వంటి వారి కథల్లో "కన్నుల కట్టినట్టు" చిత్రీకరించడం చూడగలం. కాని రాను రాను, కథలో కేవలం వస్తువు/ సందేశానికి ప్రాముఖ్యత పెరిగిపోవడం వల్లా, కొంత వరకూ పేజీల లెక్కల మూలంగానూ ఈ వివరాలు తగ్గిపోతున్నాయి.

నాకు తోచినంత వరకూ, మరొక కారణం – చారిత్రకంగా ఆలోచిస్తే మన కథలు మౌఖికం. దాదాపు 1960వ దశకం వరకూ పాఠకులు – రచయితల మధ్య మనకలవాటయిన ఆ "చెప్పే" పద్ధతే కనిపిస్తుంది కథన రీతిలో. అంటే, ఎదురుగా ఉన్న శ్రోతల అభిరుచులకి అనుగుణంగా కథకుడు మార్పులూ, చేర్పులూ చేస్తూ, అవగాహనకి కావలసిన వివరాలు అందిస్తాడు. కాని కథ రాయడం దగ్గరకొచ్చేసరికి ఆ వెసులుబాటు లేదు. ఈనాడు పాఠకులు ప్రపంచవ్యాప్తంగా వారి అభిరుచులు అనంతం. అందుకే ఒక కథ ఒకరికి చాలా బాగుంటే మరొకరికి గందరగోళంగా ఉంటుంది. ఈనాటి రచయిత తనకు తానే కొన్ని పరిధులు ఏర్పరుచుకుని, తనకి అర్థమయిన రీతిలో పాఠకులని ఏర్పర్చుకుంటాడు. తదనుగుణంగానే వివరణలూ, వర్ణనలూ ఉంటాయి తన కథలలో. కాని ఇందులో ప్రమాదం ఏమిటంటే, ఎప్పుడు అవి మితిమీరుతాయో, ఏ క్షణంలో కథ సోదిగా మారిపోతుందో అన్న బాధ. ఒక పాఠకుడికి అవసరం అనిపించింది మరొక పాఠకుడికి అవసరం కనిపించొచ్చు. ఎప్పుడయితే పాఠకుడు 'అలాటి సన్నివేశం జరిగి ఉండదు, అట్టి పాత్ర ఉండదు, ఇది అసహజం" అంటాడో అప్పుడే అతడు తనకి సుపరిచితమైన వాతావరణం అధిగమించి చూడడానికి ప్రయత్నించడంలేదు అనుకోవాలి. ఈ సందర్భంలో రచయితకి జవాబు చెప్పుకోవలసిన అవసరం ఉందా లేదా అన్నది నాకు అనుమానమే.

ఉదాహరణకి 1960 దశకంలో వచ్చిన "మారిన విలువలు" (ద్వివేదుల విశాలక్షి, విశాలాంధ్ర ప్రచురణ, 1968)లో ప్రధానాంశం జానకి పెళ్ళి ఆగిపోయిన తరువాత, పెళ్ళి కూతురు అర్ధరాత్రి పెళ్ళికొడుకుతో మాట్లాడడానికి రైలు స్టేషనుకి వెళ్ళడం. ఆ కాలంలో పీటల మీద పెళ్ళి ఆగిపోవడం ఆశ్చర్యం కాదు కాని పెళ్ళికూతురు పెళ్ళికొడుకుని నిలదీసి, అతని వ్యక్తిత్వాన్ని ప్రశ్నించడానికి అర్ధరాత్రి స్టేషనుకి వెళ్ళడం మాత్రం అసాధారణమే. కాని ఆనాటి పాఠకులెవరూ "ఇది అసహజం. అయినింటి అడబడుచులు మరీ అంత బరితెగించరు. మనయిళ్ళల్లో" అనలేదు ఆ రోజుల్లో. కాని ఆ నవల సీరియల్‌గా ముగిసిన తరువాత, ఒక పాఠకుడు నవలలో జానకి తల్లి, అన్నగారు, తదితరుల జీవితాలు ఏమయాయో చెప్పలేదు కనక అది అసంపూర్ణం అని తన అభిప్రాయం వెలిబుచ్చాడట. దానికి విశాలాక్షిగారు "ఈ నవల ఒక వ్యక్తి కథ కాదు, ఒక కుటుంబ చరిత్ర, ఎంత రాసినా అసమగ్రమే" అని సమాధానం ఇచ్చారు (మారిన విలువలు, ముందుమాట). పైన ఉదహరించినట్టు, ఇక్కడ పాఠకుడిలో రచయిత చెప్పని విషయాల గురించిన చర్చ గమనార్హం.

నిజానికి ఈ వ్యాఖ్యానం అన్ని నవలలకీ, కథలకీ కూడా వర్తిస్తుంది అనుకుంటాను. రచయిత తాను ఆవిష్కరించిన సందేశానికి తగినంత వరకే పాత్రలూ, సన్నివేశాలూ సమకూర్చుకోవడం జరుగుతుంది. అంతకంటే ఎక్కువ చెప్పినప్పుడు కథ పక్కదారి పట్టి, నీరసించిపోయే అవకాశం ఉంది. అలాగే అసాధారణమయిన సన్నివేశాలు సృష్టించడం కూడా. ఒక మనిషి కోపంతో "తాడెత్తున లేచాడు" అన్న వాక్యంలో వాస్తవికతలాటిదే కథలలో వాస్తవికత కూడా.

ఈనాడు వస్తున్న అభిప్రాయాలకి మరొక ఉదాహరణ చెప్తాను. ఈ మధ్యనే వచ్చిన

నవలలో ఒక సన్నివేశం (చాతకపక్షులు, ఎపివీక్లీకామ్) – న్యూయార్కు ఎయిర్‌పోర్ట్‌లో తొలిసారిగా దిగిన ఒక కొత్త పెళ్ళికూతురు కన్వేయరు బెల్టు మీద జారిపోతున్న సూట్‌కేసును అందుకోబోతుంది గాభరాగా. పక్కనున్న అమెరిను ఒకతను ఆ సూట్‌కేసుని అందుకుని ఆమెకిస్తాడు. దీని మీద ఒక పాఠకుడి ప్రశ్న అమెరికన్ (పరపురుషుడు అనా?) దగ్గర నుంచి ఆమె సూట్‌కేస్ ఎలా అందుకున్నది అని.

ఇదే సన్నివేశం మీద మరొక పాఠకుడి అభిప్రాయం – న్యూయార్కు ఎయిర్ పోర్టులో చాలా హడావుడిగా ఉంటుంది. సాధారణంగా మన వారందరూ ఎవరికి వారు తమ సామానుల్లా, తమరి పిల్లా మేకా చూసుకోవడంతోనే సరిపోతుంది. రెండో విషయం, మన దేశంలో అమెరికన్‌ల గురించి ఉన్న అభిప్రాయం – వాళ్ళు సొంత లాభం లేనిదే పొరుగువారికి సాయం చేయరన్నమాట – పూర్తిగా నిజం కాదని చెప్పడానికి అమెరిన్ సాయం చేసినట్టుగా అనిపిస్తోంది. అంతేకాక, ఈ సన్నివేశం ఒక నవల మొదట్లో జరిగింది. దరిమిలా ఈ అంశాన్ని మరింత స్పష్టం చేయడానికి ఇది పరిచయ వాక్యం అనుకోవచ్చు. ఈ రెండో అభిప్రాయంలో పాఠకుడి ఆలోచనలు కథాంశం మీద కేంద్రీకృతం అయినట్టు కనిపిస్తుంది. మొదటి అభిప్రాయంలో తన వ్యక్తిగత/తెలుగు సాంప్రదాయక విలువలని కథకి ఆపాదించినట్టు కనిపిస్తుంది.

ఈ మధ్య నేను చూసిన "అమ్మపెళ్ళి" (సూర్యకుమారి.కామ్, తెలుగు సైటు) కథ మీద కూడా ఇలాటి వ్యాఖ్యానాలే వచ్చాయని రచయిత్రి నాకు రాశారు. ఈ కథ నాకు నచ్చడానికి కారణం ఈనాడు మామూలుగా దయాస్పోరా కథల్లో అట్టే కనిపించని ఒక కోణం – ఎన్నారయ్ కుటుంబాల్లో, తల్లి – కూతుళ్ళమధ్య సాంస్కృతిక విలువల గురించిన సంఘర్షణ. ఇది పశ్చిమ దేశాలలో ఉన్న తెలుగువారి పరస్పర విరుద్ధభావాలకి (నిర్దిష్టత లోపం?) మచ్చుతునక అనుకోవచ్చు.

పాఠకుడు తనకు తాను ఆలోచించుకోవడం మానేసి, పూర్తి వివరణల కోసం రచయిత మీద ఆధారపడితే, ఆ కథ కథగా రక్తి కట్టదనే నా అభిప్రాయం. కథ పాఠకుడిలో వాస్తవికతకి సంబంధించిన అల్ప విషయాలు కాక మౌలికంగా రచయిత ఆవిష్కరించిన, కథాంశానికి సంబంధించిన ఆలోచనలు పాఠకుడిలో రేకెత్తించాలి అనుకుంటాను నేను.

పోతే భాష విషయం. కథనంలోనూ,


............. O .............

**ఈనాడు మామూలుగా దయాస్పోరా కథల్లో అట్టే కనిపించని ఒక కోణం – ఎన్నారయ్ కుటుంబాల్లో, తల్లి – కూతుళ్ళమధ్య సాంస్కృతిక విలువల గురించిన సంఘర్షణ. ఇది పశ్చిమ దేశాలలో ఉన్న తెలుగువారి పరస్పర విరుద్ధభావాలకి (నిర్దిష్టత లోపం?) మచ్చుతునక అనుకోవచ్చు.**

............. O .............


విమర్శల్లోనూ కూడా కనివిని ఎరగని మార్పులొచ్చాయి. గత ఇరవై ఏళ్ళలోనూ ఇంగ్లీషు తెలుగుని చాలా వరకూ ఆక్రమించేసింది (దయాస్పోరా కథల్లో ఇది మరీ అన్యాయం). పాఠకులలో, ముఖ్యంగా ఈనాటి యువతలో తెలుగు భాషాజ్ఞానం చాలా తగ్గిపోయింది. ఇది నేను ఎవరినీ తప్పు పట్టే ఉద్దేశంతో అంటున్న మాట కాదు. ఈనాడు కథలలో భాషని గురించిన అభిప్రాయాలు చదివి, ఈ విషయం ప్రస్తావిస్తున్నాను.

మనకి వివిధ ప్రాంతాల కులాలు, వృత్తులు ప్రాతిపదికగా గొప్ప పదసముదాయమేకాక, ఒక్కొక్క పదానికి అనేక రూపాంతరాలు ఉన్నాయి. 80వ దశకంలో వచ్చిన మాండలీకపు కథలూ, పాటకజనం మాట్లాడుకునే భాషలలో వస్తున్న కథల మూలాన, కేవలం స్థానికులకి మాత్రమే తెలిసిన వాడుకపదాలు వేలకొద్దీ కథల్లో చోటు చేసుకుంటున్నాయి. పాఠకులకి భాషని గురించిన ఆలోచన ఉండడం ఎంతైనా హర్షించదగ్గ విషయం. కాని వారు ఈ భేదాలని కూడా గమనించాలి. నిజానికి నేను తెలుగులో రాస్తున్నప్పుడు, కొంత శ్రమ పడతాను, తగిన పదాలు గుర్తు చేసుకోవడానికి, ఎందుకు అంటే మరిచిపోతున్న తెలుగుని ఆచివట్టుకు నిలబెట్టుకోవడానికి, అలాగే కథలు చదివినప్పుడు కూడా నాకు తెలీని మాండలీకాలు శ్రమపడి నేర్చుకోవలసి వస్తుంది అప్పుడప్పుడు. నా తెలుగుని నేను విస్తృతపరుచుకునే విధానం ఇది. మరి ఈనాటి పాఠకులకి ఆ ఓపిక తగ్గిపోతోందా? లేక అసలా దృష్టి లేదా?


చివరిమాటగా, ఫెమినిజం గురించి ఒక మాట చెప్పి ముగిస్తాను. ఎందుకంటే, ఈ మధ్య కాలంలో ఏ కథలోనైన ఒక స్త్రీపాత్ర ఏ మాత్రం అభిప్రాయం వెలిబుచ్చినా, అది ఫెమినిస్టు కథ అనీ, రచయితని ఫెమినిస్టు అనీ ముద్ర వేయడం పరిపాటి అయిపోతోంది.

ఉదాహరణకి, ఒక నవలలో ఒక పార్టీలో భర్త తన భార్య "గిన్నెలు తీసి పెడుతుందిలెండి" అంటాడు. దానికి ప్రధాన పాత్ర అయిన గీత ఆలోచనలో పడుతుంది, "నేను చెప్తాను" అనడానికీ, "ఆవిడ చేస్తుంది" అనడానికి మధ్యగల అంతరం గురించి. మరి ఈ వాక్యం మూలాన ఇది ఫెమినిస్టు కథ అవుతుందా? అదే ఆ భార్యే "మా ఆయన చేస్తాడులెండి" అంటే బాగుండునా? ఇది ఒక సందేహం. అది అలా ఉంచి, ఈ కథని మరోకథతో పోల్చి చూడండి (గుడ్డిగవ్వ, వార్త, జనవరి 9) ఒక చిన్నవాడికి ఏదో జబ్బు మూలంగా గొంతు పూడుకుపోతుంది. అమెరికాలో ఉన్న అన్నగారు అతడికి ఆపరేషను చేయిస్తానని అమెరికా తీసుకువస్తాడు. ఇంట్లో పనుల్లో ఆ అబ్బాయి సాయం చేస్తుంటాడు. ఒకసారి స్నేహితులు వచ్చినప్పుడు, అన్నగారు, "సూట్‌కేసులు నేను తెస్తానులెండి" అంటాడు, తాను కదలకుండా. తమ్ముడు వెళ్ళి అందుకుంటాడు. ఈ రెండు సన్నివేశాల్లోనూ రచయితగా నా అభిప్రాయం ఒకటే – ఒక మనిషి మరొక మనిషిని ఉదారంగా "ఆఫర్" చేయడం. ముఖ్యంగా ఈ ఆచారం మన వారి ఇళ్ళల్లోనే కాని అమెరిన్ కుటుంబాలలో లేదు. ఇది మన వారి మనస్తత్త్వాలలోగల పరస్పర వైరుధ్యానికి ఒక (contradictions in values) ఉదాహరణ.

ఈ కథలో మరొక విశేషం – ఒక పత్రిక సంపాదకులు (ఈ సందర్భంలో పాఠకులుగా) "నేను తెస్తాను" అన్న వాక్యాన్ని ''ముత్యం తెస్తాడు'' అని మార్చేయడం రచయితగా నేను ఉద్దేశించినది, కొందరు ఎంత నాజూగ్గా మరొకరిని పనిలో పెడతారో అన్నది! మరి ఇటువంటి సూక్ష్మాలు గమనించే పాఠకులూ, సంపాదకులూ, విమర్శకులూ తగ్గిపోతున్నారనుకోవాలా? లేక రచనల్లోనే ఉందా ఈ లోపం?

ఇంతకీ ఈ సందర్భంలో నాకు కలిగిన సందేహాలు – ఈ వాదాల ముద్రలేయడంలో పాఠకులు తొందరపాటు చూపుతున్నారా? లేక, రచయితలే ఈ విషయం తగినంతగా స్పష్టం చేయలేకపోతున్నారా? అదలా వుంచి, అసలు ఈ వాదవివాదాలకి అతీతంగా "కథ కోసం కథ" (art for art's sake) చదువుకోవడానికి సాధ్యపడదా? పోతన కానీ, వేమన కానీ ఎవరి మెప్పుకోసమో, కథా రచయితలు – కనీసం కొందరు – కూడా అంతే అనుకోవడానికి అవకాశం ఉందా లేదా? V

# చెదిరిన బింబం



సుంకోజి దేవేంద్రాచారి

**శివరాం నాకొక పాత జ్ఞాపకంలా మిగిలిపోయాడు. వాడిని కలిసే అవకాశం వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. చామనఛాయ, కోలముఖం, నూనూగుమీసాలు, గిరిజాల జుట్టు, చెరగని చిరునవ్వు, నా కన్నా పొడవు... యిదీ అప్పటి వాడి రూపం. దాదాపు యిరవై సంవత్సరాల ముందుమాట. మేమప్పుడు పీలేరులో యింటర్మీడియెట్ చదువుతుండే వాళ్ళం. శివరాంది కెవిపల్లె. పీలేరులో అద్దెగదిలో వుండేవాడు. మా యిద్దరి మధ్యా స్నేహం కుదిరింది.**

పీలేరు నడుమును చుట్టిన కొంగులా వుండే ఏటి యిసుకలో సాయంకాలాలు షికారుకెళ్ళే వాళ్ళం. వంతెన మీద నిల్చుని ఉషను, సంధ్యను చూడటం మాకిష్టం. నాకప్పుడు ఈతరాదు. నీళ్ళంటేనే భయం. వాడు గజ ఈతగాడు. ఏటినీటిలో మునకలేపించి ఈత నేర్పించాడు. నాన్నకు స్వస్థలమయిన కృష్ణాజిల్లాకు ట్రాన్స్‌ఫర్ కావడంతో మా స్నేహం రెండు మూడుత్తరాలతో ఆగిపోయింది.

ఉత్తరాలు ఆగిపోయిన వాడూ... ఆ ఊరూ... యేరూ... మధుర జ్ఞాపకాల్లా నన్ను వెన్నంటే వుంటున్నాయి. మా పై అధికారి కూతురి పెళ్ళి కడపలో జరుగుతుండటంతో నేను తప్పకుండా రావాల్సి వచ్చింది. కడప నుంచి తిరుగు ప్రయాణంలో శివరాంను కలుద్దామనిపించింది. మళ్ళీ ఎప్పుడో... అందుకే మా వాళ్ళతో వెళ్ళకుండా కెవిపల్లెకు బయలుదేరాను. నేను దిగాల్సిన వూరు వచ్చింది. నాతోపాటు ఐదారుమంది దిగారు.

శివరాం ఆ రోజుల్లో ఎన్నిసార్లు వాళ్ళ వూరికి రమ్మన్నా వెళ్ళలేక పోయాను. కానీ వాడి మాటల ద్వారా కెవిపల్లె నాకు కొత్తకాదు. బస్సు దిగుతూనే ఎడమవేపున రెండు పెద్ద గంగిరావిచెట్లు. వాటినీడలో కునికిపాట్లు పడుతుంటే పోలీస్‌స్టేషన్. రామకృష్ణ, అగ్బర్‌సాబ్‌ల బంకులు, కుడివేపు పాకల్లో సరోజమ్మ, రామచంద్ర హోటళ్ళు. వాటి నానుకుని సహదేవ బంకు. వాటి వెనక చింతచెట్లకింద పాఠశాల. వాటిల్లో పాఠశాల మాత్రం వుంది. గంగరావి చెట్లు లేవు. పోలీస్‌స్టేషన్ స్థానభ్రంశం చెందింది. రోడ్డు కిరువైపులా బంకుల స్థానంలో చాలా దుకాణాలున్నాయి. పాకలుపోయి డాబాలల్లో హోటళ్ళున్నాయి. పాఠశాల వద్దకు పోయాను. అక్కడి నుండి ఎడమవైపు రెండు నిమిషాల నడక. కుడివైపున రంగులు వెలసిన రాముల వారి గుడి. ఎడమ వైపుండేది శివరాం యిల్లు. కానీ ఆ యింటి ముందు వసారా, దానికింద పశువులు, గుడి పక్కన ఎద్దులబండి లేవు. ఆ యిల్లు శివరాం వాళ్ళది అవునో కాదో అనే సందేహం. యింతలో పదేళ్ళ అబ్బాయి వచ్చి "ఎవరుకావాల" అన్నాడు బయటకు వెళ్ళబోతూ.

"శివరాం..." అన్నాను వాడిలో శివరాం పోలికల కోసం వెదకుతూ.

"నాయనా... నీ కోసరం ఎవురో వచ్చినారు" అంటా తుర్రుమన్నాడు.

"ఎవరూ..." అంటూ బయటకు వచ్చాడు శివరాం.

లోతుకు పోయిన కళ్ళు, బట్టతల, పొట్టి చేతుల చొక్కా, తెల్లపంచె... వాడుతున్న నాగరికతకు చిహ్నంగా కనిపించాడు వాడు. చదువుకునే రోజుల్లో గదిలో వున్నంతసేపూ బనియన్ వేసుకునేవాడు. భుజం మీద తుండుగుడ్డ వుండేది.

నన్ను గుర్తు పట్టినట్లు లేదు.

"నేనురా... రమణను" అన్నాను నవ్వుతూ.

వాడికళ్ళలో ఆనందమూ, ఆశ్చర్యమూ.

"ఒరొరొరే... ఎంత మారిపోయినావురా... నాకన్నా జానడెత్తుండావు లావయినావు... బాగుండావా...? యాట్నుంచి? రాలోపలికి" అంటూ నా చేతిలోని బ్యాగ్‌ను తీసుకుని మరో చేత్తో నా చేతిని పట్టుకుని లోపలకు లాక్కుపోయినంత పని చేశాడు.

"ఏయ్ లక్ష్మి... ఎవరొచ్చినారో చూడు... కూర్చో" అంటూ మంచం చూపించాడు.

పొయ్యి ముందు కూర్చుని పొగతో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఊదన బుర్రతో ఊదుతున్న ఆమె మా వైపు తిరిగి చూసింది. మళ్ళీ తన పనిలో లీనమయింది.

"నేనెప్పుడూ చెప్తాంటాను చూడే... మా ఫ్రెండ్ రమణగాడని. వాడే వీడు" అన్నాడు నా పక్కన కూర్చుంటూ గట్టిగా.

పొయ్యిలో కర్రలు ఒక్కసారిగా వెలిగాయి. ఆమె ముఖంలోనూ వెలుగు.

మా వద్దకొచ్చి "బాగుండారాన్నా... మా ఆయన ఎప్పుడూ చెప్తాంటాడు మీ గురించి. అమ్మానాయన అంతా బాగుండారా? అనడిగింది.

వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాను. లక్ష్మి మంచినీళ్ళు తెచ్చిచ్చింది. యింటిని పరిశీలనగా చూశాను. ఆరంకణాల స్థలం. అందులో ఒక మూల బాత్‌రూం. దానికి ఆనుకునే వంట పొయ్యిలు. వాటి పక్కన్నే డాబా మీదకు మెట్లు. లోపల మరో గదుంది. ఆ గది ద్వారం పక్కన స్టాండు. స్టాండులో ముందుకు వాలి వున్న అద్దము, దాని పక్కనే పౌడర్ డబ్బా.



"శివరాం.. ఏందిరా ఇల్లు... యిక్కడ అరుగూ... దానికా పక్క పశువులూ.. డాబా..."

"ఈ గోడ వుంది చూడు... ఈన్నే అరుగున్నింది. మేం అన్నదమ్ములం యిద్దరం కదా. ఏరు భాగాలు పొయ్యి చానా రోజులాయ. మా తమ్ముడు ఆపక్కనుండాడు" అన్నాడు నవ్వుతూ.

పెళ్ళిళ్ళవుతూనే అన్నదమ్ములు వేరుపోవడం మామూలయింది. అందులో అసహజం అన్పించలేదు. కాకపోతే వాళ్ళ యింట్లో పాడి గేదెలు, బండ్లు లాగే కోడెలు, మడకలు లాగే ఎద్దులు ఏమయ్యాయనేదే సందేహం.

నా భావం వాడికి అర్ధమయిందేమో.

"ఆ గొడవలన్నీ ఒక మాటలో చెప్పాలంటే కాదులేరా? తీరిగ్గా మాట్లాడుకుందాం. నీ సంగతి చెప్పు. ఏం చేస్తాండావు? ఎక్కడుండావు?" అన్నాడు.

"నాన్న విఆర్ఎస్ తీసుకున్నాడు. నాకు ఉద్యోగం వచ్చింది. తెనాలి అని, గుంటూరు జిల్లాలో పని చేస్తాండా. ఇద్దరు పిల్లలు" అన్నాను.

యింతలో కాఫీ తెచ్చిచ్చింది లక్ష్మి.

"రమణకు పంచె ఈ" అన్నాడు శివరాం.

"ఉన్నీలేరా... ఫర్వాలేదు" అన్నాను మొహమాటంగా.

నా మాటలను వాళ్ళు పట్టించుకోలేదు. లక్ష్మి పంచె తెచ్చి మంచం మీద పెట్టింది. కాఫీ తాగి గదిలోకి వెళ్ళాను పంచె కట్టుకోవడానికి. నా వెంట శివరాం వచ్చాడు.

దొంగలు శుభ్రం చేసిన గదిలా వుందది. అప్పటికి సంక్రాంతిపోయి రెండు వారాలే అయింది. మరి గది అంతగా నిండుకోవడమేమిటి? వాడి మాటల ప్రకారం అలాంటి సమయానికి ఆ గది నిండుకు ధాన్యం వుండేది. తలుపు కూడా పూర్తిగా తెరుచుకోదు. యిప్పుడేమయింది? నాకన్నీ సందేహాలే. ప్యాంటు తీసి కొక్కేనికి తగిలించి పంచె కట్టుకున్నాను. పంచెను పెట్టెలోనించి తీశారేమో... నేఫ్తలీన్ వుండల వాసన.

యిక వుండబట్టలేక "ఈ గది నిండుకు ధాన్యం వుండేదనే వాడివి కదరా... ఏమయింది" అన్నాను.

శివరాం ఒక వెర్రి నవ్వు నవ్వాడు.

"అది ఎప్పటి మాట" అని అక్కడే వున్న కుర్చీలో కూర్చుంటూ నన్నూ కూర్చోమన్నాడు.

"మా నాయన ఆస్తిని పెంచలా. యిద్దరు కొడుకులను కనుక్కొని ఉన్నిందాన్ని పంచినాడు. ఈ రూము నిండతాన్నింది అందరం కలిసున్నప్పటి మాట. అప్పుడు చెరువులు నిండతాండె, పంటలు పండతాండె. ఈడ యిట్ల కుర్చీ ఏసుకోని కుచ్చోను తావుంటాన్నిందా? వడ్లు సంచుల్లో ఏసి సుట్టకారం మోటలు నెట్టుకట్టేవాళ్ళం. వాటి మద్దెలో చెనిక్కాయలు రాశిపోసే వాళ్ళం. అదొక ఎర్రికాలంలే" అన్నాడు నిర్లిప్తంగా శివరాం.

"వేరు భాగాలు పోయినంత మాత్రాన పూర్తిగా లేకుండా పోతాయా?"

"బో... ఏంబా... పాలుపోసిరావా?" అనరచింది పొయ్యిదగ్గర నుంచే లక్ష్మి.

'రమేష్‌ను పిలు... పోసొస్తాడు"

అప్పట్లో సరోజమ్మ హోటలుకు ఎక్కువగా పాలు పోసేవాళ్ళు. శివరాం వాళ్ళ నాయన మంచి రసికుడు. చాలా మంది "నారాయణ పాలు పోస్తాండాడో, పాలు తాగతాండాడో' అనే వాళ్ళని శివరాం తనతో చెప్పాడు. అదంతా గుర్తు రావడంతో "సరోజమ్మ హోటలు కాపాలు" అన్నాను నవ్వుతూ.

"కాదురా... డిపోకు. యిప్పుడు మా బతుకుతెరువు అదేగదా"

ఒకప్పుడు వాడు చెప్పిన మాటలు నా మనసులో సజీవ చిత్రంలా నిలిచిపోయాయి. ఆ చిత్రాన్ని నేను కళ్ళ చూడకముందే మాయమయిపోవడం... నాకంతా భ్రాంతిలా వుంది. యింతలో వాడే అన్నాడు.

"ఆడ చూడరా... ఎక్కువ స్టీలు బోకులే కదా వుండాయి... మా చిన్నప్పుడంతా మట్టియి వుంటాన్నేయి. ఈడ పైన రెండు కొక్కీలు వుండాయి చూడు. వాటికి అడ్డంగా ఒక ఎదురుకట్టి ఏలాడతండేది. దాని మింద ఎర్రగడ్డల కట్టలు కుచ్చోన్నెట్లు వుంటాన్నేయి. ఆ ఎదురుకే రెండు ఉట్లు. ఒక వుట్టిలో సట్టిలో ఎన్న, యింగో సట్టిలో నెయ్యి ఎప్పుడూ వుంటాన్నేయి. మా తమ్మునికి నెయ్యన్నా, ఎన్నన్నా చానా యిష్టం. యింట్లో మేమందరం తినేంత వాడొగడే తినేవాడు. మా అమ్మ పద్దన్నే ఐదుగంటలకే కవ్వమేసి చిలికేది. మేం కొంచెం పెద్దయినాక యిద్దరం పోటీ పడేవాళ్ళం – చిలకతామని రెండు మూడు ఎనుములు, మూడు నాలుగు ఆవులు, రెండు జతల కోడెలు, ఒక జత ఎద్దులు ఎప్పుడూ వుంటాన్నేయి. మా నాయనకు అన్నంలో పాలు బెల్లం ఏసుకోని తినేది అలవాటు. చిన్నప్పుడు నన్ను దెగ్గిర కుచ్చో పెట్టుకోని తినిపించేవాడు. యిప్పుడు ఆవుల్లేవు, ఎనుముల్లేవు, ఎన్నలేదు, నెయ్యిలేదు..." అన్నాడు నిరుత్సాహంగా శివరాం.

"ఏమయ్యాయి... యిప్పుడు డిపోకు పాలెక్కడ నుంచి వస్తున్నాయి?" ప్రశ్నించాను. నాకెందుకో వాడిమాటలకు, అక్కడ పరిస్థితులకు పొంతనలేదనిపిస్తోంది.

"అప్పుడంతా రెండు మూడుశేర్ల పాలు ఎప్పుడూ వుంటాన్నేయి. యిప్పుడూ పదీ పదైదు లీటర్ల పాలుంటాయి. కానీ ఏం లాభం?"

"బో... వాడు పోడంట చూడు" అంది లక్ష్మి మేమున్న చోటికి వచ్చి.

"ఏంరా..." అంటా కోపంగా అరచాడు శివరాం.

అప్పటికే వాడు పాలక్యానుతో గుమ్మం దగ్గరున్నాడు.

"మావోనికి భళే తెలివి రమణా. వాళ్ళమ్మను ఏడిపిస్తాంటాడు"

"కరెంటు ఐదు నుంచి ఎనిమిద్దంకా వుండదున్నా... సీరియళ్ళు చూసేదానికే లేకుండా పోతోడాంది" అంది లక్ష్మి లోపల దీపం వెలిగిస్తూ...

గదిలో మూల తుపాను ముందరి ప్రశాంతతలా మౌనంగా వుంది టి.వి.

"దీనికెప్పుడూ సీరియళ్ళ పిచ్చి. యింట్లో వండేసేదానికి కూడా తీరుబాటుండదు." అన్నాడు శివరాం నవ్వుతూ.

దీపం వెలిగించి, అగరొత్తులు ముట్టించి, దేవుని పటానికి దండం పెట్టి వెనుదిరిగిన లక్ష్మి "నీకు లేనట్టు...పిచ్చి" అంటూ బయటకు వెళ్ళింది.

'గేదెలన్నీ ఏం చేశార్రా" ప్రశ్నించాను, వాడు సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నాడేమో అనే అనుమానంతో.

కాసేపు శివరాం మౌనంగా వుండిపోయాడు. వాడిలో ఏమి ఆలోచనలు రగులుతున్నాయో. యింతకు ముందు నాకు తెలిసిన శివరాంకు, యిప్పటికీ మార్పుంది. అప్పుడయితే సమయాన్ని, సందర్భాన్ని బట్టి వాడి మనసులో ఏముందో సులభంగా తెలుసుకుంటా వుంటి. యిప్పుడూ సాధ్యం కావడం లేదు. వాడు మాట్లాడసాగాడు.



''యింకా యాడుండాయిరా? పదైదేండ్లయితాందనుకుంటా, చిత్తూరులో పాల డెయిరీ పెట్టిరి. ఈడ కోడోళ్ళ భాస్కర్రెడ్డి పాలు కొలుస్తాండె. అప్పుడెంత... లీటరుకు మూడు రూపాయలు కూడా లే. పదైదునాళ్ళకొగసారి దుడ్డు చేతికొస్తాండె. యింగ చూస్కో... అందరూ దానికే మళ్ళిరి. యిండ్లకు అరలీటరు పాలు మిగిలిచ్చుకునేది గగనమయిపాయె. అదొగటేనా... ఎమ్మెల్యేదొగటి, మంత్రిదొగటి పాల లారీలు వచ్చె. జనమంతా ఎగబడిరి. ఎనుములు తిండి ఎక్కువ తింటాయి, పాలు తక్కువిస్తాయని అంతా అమ్మికొనిరి. జెర్సీ ఆవలకొనిరి. ఒగో జెర్సీ ఆవు రోజుకు పది లీటర్ల దాంకా యిస్తాది. నీకో సంగతి తెలుసా? యింతకు ముందు ఎనమల మేపేదానికి తూర్పు మాలపల్లెనించి గుడ్డిగంగులు వస్తాన్నేడు. వాళ్ళ కుటుంబం మొత్తం ఎనమల మేపతానే బతకతాన్నింది. ఎనుములు పోయాలకు వాళ్ళకూ బతుకు తెరువు లేకుండా పాయె" అన్నాడు శివరాం.

"యియ్యి తింటా మాట్లాడు కోండిన్నా" పెసలు వేయించి పళ్ళెంలో వేసి శివరాం చేతికి యిచ్చి వెళ్ళింది లక్ష్మి.

కొన్ని తీసి నోట్లో వేసుకున్నాను. వాటి రుచిని పరిచయం చేసింది కూడా వాడే.

"ఆవులేమయినాయిరా" అన్నాను.

"ఆవులంటావా? అప్పుడంతా సేద్దిం చేసే వాళ్ళ యింటిలో రెండు జతల కోడెలు, ఎద్దల బండి వుంటే పెద్ద రైతుకింద లెక్క. తొలిముంగార్ల వానలకు ముందే చేన్లకు ఎరువులు తోలతాంటిమి. గింజలు ఏసి తొవ్వకానికి రాకముందే అడివికి పోయి కట్టెలు కొట్టి బండిలో ఏసకస్తాంటిమి. మడి చేడకేస్తే గెనాలమందుండే చెట్ల ఆకులు చాలవని గుట్టలంటి తిరిగి, సీతాఫలమాకు, తంగేడాకు, మగబేరాకు కోసి బండిలో ఏసకస్తాంటిమి. బండమీందనుంచి వడ్లుగానీ... గడ్డిగానీ... చేనికాన్నించీ చెనిగి తండుగానీ కాయలుగానీ... అన్నీ ఎద్దల బండిమిందనే సమచ్చరానికొగసారి గర్నిమిట్టమ్మ తిరణాలకు చాందినీ బండి కడతాంటిమి. మంచి కోడెల కోసరం వూర్లన్నీ తిరిగి పట్టకచ్చుకునే వాళ్ళం. దిగవగళ్ళలో, ఉస్తికాయల పెంటలో మంచి కోడె వుండేది. ఆవు ఫలమయితే ఆడికి పోయి దాటించకచ్చే వాళ్ళం. ఆవులుంటే మంచి కోడెలూ పుడతాయి, యింటికి పాలూ వుంటాయి అనుకునే వాళ్ళం అప్పుడంతా" అని ఆపాడు శివరాం.

"మంచిదేగదా. అయితే ఎందుకు అమ్మేసినారు అయ్యన్నీ?" అడిగాను. యింతగా అవసరం వుండే వాటిని ఎవరైనా అమ్ముకుంటారా. నిజంగా వీళ్ళకు వెర్రిపట్టింది అనిపించింది.

"అమ్ముకోడానికి కారణం ట్రాక్టర్లు" అన్నాడు నిదానంగా.

ఆ మాటలంటున్నపుడు వాడిలో రకరకాల భావాలు.

"ట్రాక్టర్లా...!"

"అవును... ఎద్దులబండితో నాలుగు ట్రిప్పులకయ్యేపని ట్రాక్టరుతో ఒగసారికే అవతాంది. నాలుగు గాన్ల ఎద్దలతో అన్ని మేలదాంకా అయ్యేపని ట్రాక్టరుతో గంటకే అవతాంది"

"తొందరగా పనికావడం మంచిదేగదా"

"మంచిదే. దానివలనే యివన్నీ మాయమయినాయి"

దానికీ యివి మాయంకావడానికి సంబంధం ఏమిటో నాకు అర్థం కాలేదు. తిరిగి వాడే యిలా అన్నాడు.

"మనసల్ను చూస్తాండావు గదా. యిప్పుడంతా కష్టం తక్కువ ఫలితం ఎక్కువ వుండాలనుకుంటారు. పనుల కాలం వస్తే సేద్దింలేనోళ్ళు కొంత మంది జత ఎద్దులు పెట్టుకోని రెండు మూడు నెలలు కష్టపడేవాళ్ళు. ఆ దుడ్డు ఆరేడు నెలలు జీవనానికి వస్తాన్నింది. మిగిలిన దినాలంతా ఏదో ఒగ కూలి పని చేసుకునేటోళ్ళు. ట్రాక్టరు వచ్చినాంక వోళ్ళను చేను దున్నేదానిగ్గానీ, ఎరువు తోలే దానిగ్గానీ, పిల్చేవాళ్ళేలేరు. అట్లా వోళ్ళందరికీ బతుకు తెరువు లేకుండా పాయె. వోళ్ళు గూడా వాటిని అమ్ముకోని జెర్సీ ఆవల పట్టుకొనిరి. యిది మేలుకదా. రేయింపగలు కష్టపడే పని లేదు. రైతులు కూడా ఆలోచనల్లో పడిరి. సమచ్చరం పొడుక్కూ గొడ్లకు ఎంత మేతవుతాంది? వాటితో ఎంత పని చేసుకుంటాండాం..? అదే పని ట్రాక్టర్‌తో చేపిస్తే ఎంతవుంతాంది? అని అంతా లెక్క లెయ్యబట్టిరి. అప్పటికి గొడ్లుతో చేసే దానికన్నా ట్రాక్టర్‌తోనే అగ్గవగా అయితాన్నింది. యింగ చూస్కో... రైతులు కూడా ఒగొగరే గొడ్లను అమ్ముకోబట్టిరి. బండ్లు అమ్ముకొనిరి. జెర్సీ ఆవులు కొనిరి" అన్నాడు శివరాం పిల్లవాడి సందేహాలు తీర్చే ఉపాధ్యాయునిలా.

''అదంతా ఏం కాదులేన్నా... మొగోళ్ళంతా సోంబేరులయిపోయి అమ్ముకున్నేరు. యిప్పుడు దున్నకాలకు ఆ ట్రాక్టరోడు అడిగినంత దుడ్డు ఈలేకచస్తాండాం" అంది లక్ష్మి. అంత వరకూ జరిగిన మా సంభాషణంతా విందేమో, మేమామెను గమనించలేదు.

శివరాం ఆమె మాటలకు కుర్చీలో ఇబ్బందిగా కదిలాడు. ఆమె తలుపుకానుకుని నిల్చుని భర్తవైపు చూస్తూ "యిద్దోన్నా... మా ఆయనకు ఎప్పుడూ లేంది రాజకీయాల పిచ్చి పట్టుకునింది. రెండేండ్ల ముందుదాంకా కూడా జతకోడెలున్నేయిన్నా. రిజర్వేషన్ కింద మండలానికి నెంబర్‌గా నిలబెట్టినారీయన్ను. గెల్చినాడు. అందరితో కలిసి అరువులు చెయ్యద్దా. పనీపాటా లేకుండా తిరగద్దా. అందుకని అమ్ముకున్నేడు" అంది కాస్తకోపంగా.

లక్ష్మి కాస్తనలుపు. పొట్టి. దేవుని పంటం వద్ద దీపం వెలిగించడానికి ముఖం కడుక్కొందేమో. ముఖం తేటగా వుంది. ముడివేసిన జుట్టు. కష్టంతో రాటుదేలిన శరీరం. శివరాంకు తగిన జోడీయే.

"అవునారా?" అన్నాను.

"అదేం లేదు రమణా... దీని మాటలకేంలే. ఎంత కాలం ఒగన్ని కష్టపడతాను. అందుకుని అమ్మేసినా" అన్నాడు నంగినంగిగా శివరాం.

"ఆయన మాటలు నమ్మద్దన్నా యిప్పుడు పద్దన్నే రోజూ ఐదుగంటలకే లేస్తాడు. నేరుగా రోడ్డు మిందికి పోతాడు. ఆడికి చుట్టుపక్కల వూర్లనించి ఈయన మాదిర్తో వచ్చినోళ్ళుంటారు. టీలు, బీడీలు తాక్కుంటా అరువులు. ఒగటీ పనికొచ్చే మాటుండదు. ఏడుకో, ఎనిమిదికో యింటికొస్తాడు. పొగులు ఆవల తోలుకోని సేద్దిం కాడికి పోతాడు. లేదంటే ఆ పనీ నేనే చెయ్యాల. సందేళయితే ఈపాటికి యింట్లో వున్నిందునా? నువ్వుందావని తీరుబాటుగా కుచ్చోనుండాడుగానీ. లేకపోతే పాలెత్తుకోని రోడ్డు మిందికి పోయి కరెంటొచ్చే యేళకు వచ్చిందు యింటికి" అంది ఫిర్యాదు చేస్తున్న దానిలా లక్ష్మి.

"యింట్లో వుండి మాత్రం ఏం చేస్తాం. మెంబర్‌ను గదా. నలుగురు తెలిసినోళ్ళు వస్తాంటారు. అందుకని రోడ్డుమిందికి పోతాం. నీకు తెలుసుగదా. ఆడది తిరిగి, మొగోడు తిరక్క చెడిపోతారని" ఇన్నాళ్ళు ఇల్లు, సేద్దిం అనుకుని మిగిలిందేమీలే, కష్టం తప్ప. యిప్పుడు ఫర్వాలేదు. సేద్దింకన్నా రాజకీయాలే బాగుండాయనిపిస్తాంది." అన్నాడు శివరాం తనను సమర్థించుకుంటున్నట్టుగా.



"నువ్వంటే నెంబరనుకో... మిగిలిన మొగోళ్ళంతా... ఈయన చెప్పేటియన్నీ కుంటిసాకులేన్నా యిండ్లకాడ గొడ్లకు వామిలో వుండే గడ్డికట్ట ఒగటి కూడా దిగెయ్యరు. గంపెత్తుకోని సేద్దింకాడికి పోయి చెక్కుడు పారతో గడ్డి చెక్కోనిరారు. మడికి నీళ్ళు కట్టరు. అయ్యన్నీ యిప్పుడు ఎక్కువగా ఆడోళ్ళే చేస్తాండారు. ఏం చేస్తాంనా... మొగోళ్ళు సోంబేరులయినాంక ఎవురో ఒగరు కష్టపడి సంసారాన్ని సాదాల కదా?"

నాకు వాళ్ళిద్దరి మాటలు న్యాయంగానే తోస్తున్నాయి. ఎవరినీ ఖండించలేకపోయాను. యింతలో వాళ్ళ కొడుకు వచ్చి టివి ఆన్ చేశాడు.

"కరెంటు లేదురా. వీనికి టివి పిచ్చి. పుస్తకం ఎత్తుకొని చదువుకో" అన్నాడు శివరాం.

"ఈ మాటలకేంగానీ లెయ్‌నా... నీళ్ళు తోడినా స్నానం చేద్దువుగానీ" అంది లక్ష్మి.

"లే... లెయ్ రమణా స్నానం చేద్దువు" అన్నాడు శివరాం.

"స్నానం కాదురా... ఈతకొడదాం. ఎన్నేళ్ళయిందో ఈతకొట్టి..." అన్నాను.

"ఈతా... యాడాడతావు?"

"ఏం... చెరువులు, బావులు వుండాయి కదా"

"నీకు టౌనులో వుండి, పల్లెల్లో ఏం జరగతాందో తెల్దా. ముందుగా స్నానం చెయ్యి. మనం చెరువుకాడ తూము దెగ్గిరికి పోయి మాట్లాడుకుందాం" అన్నాడు.

గబగబా స్నానం చేశాను. ఆ రోజుల్లో వాళ్ళ వూరి చెరువు గురించి, బావుల గురించి ఎన్నిసార్లు వాడి మాటల్లో విన్నానో, లెక్కేలేదు. వాటిని ఈ రోజు చూడబోతున్నందుకు కాస్త ఉద్విగ్నంగా కూడా వుంది నాకు. బట్టలు మార్చుకుని "వెళ్దామా" అన్నాను వాడితో.

"యిప్పుడెందుకునా చెరువు కాడికి. యింకొంచెం సేపుంటే కరెంటొస్తాది. సీరియళ్ళు చూడచ్చు" అంది లక్ష్మి.

"లేదులేమ్మా... సీరియళ్ళు ఎప్పుడూ చూసేవేకదా. మీ వూరి చెరువును మళ్ళీ చూడాలంటే వీలవుతుందా? పోయొస్తాం... రమేష్ నువ్వూ వస్తావా?" అన్నాను.

"వాడు చదువుకోనీలే. మనం పోదాంపారా" అన్నాడు శివరాం.

"రానంకుల్... కరెంటొస్తాది. సీరియల్ చూడాల" అన్నాడు వాడు శివరాం మాటలతోపాటు.

"వెధవా...నోర్మూసుకుని చదువుకో. నేనొస్తానే ప్రశ్నలడుగతా, జవాబులు చెప్పాల. వీడికి సీరియళ్ళ పిచ్చిబాగుంది రమణా. అంతా వోళ్ళమ్మసాలు పోదాంపా" అంటూ బయలుదేరాడు. నేనూ వాడివెంట నడవసాగాను.

మసకచీకట్లు కమ్ముకున్నాయి. సమయం ఏడుగంటలు కావస్తోంది. దశమి చంద్రుడు వెన్నెల విరజిమ్ముతున్నాడు. మేతకు వెళ్ళి తిరిగి వచ్చే గోవులు లేవు, గోధూళీలేదు... లేగదూడల ఎదురు చూపుల్లేవు. కొన్ని యిళ్ళల్లో నూనె దీపాలు వెలుగుతున్నాయి. చాలా యిళ్ళల్లో ఎమర్జెన్సీ లైట్ల కాంతిని చిమ్ముతున్నాయి. పిల్లలు కొందరు వీధిలో ఆడుకుంటున్నారు. యిళ్ళ ముందు అరుగుల మీద యిద్దరు ముగ్గురు ఆడవాళ్ళు, ముసలాళ్ళు మాటల్లో మునిగిపోయున్నారు. నాకది పల్లెలా కన్పించలేదు. నగరపు బిడ్డగా అన్పించింది. అక్కడక్కడా కొన్ని ఇళ్ళు శిథిలమయ్యాయి. వెన్నెల వెలుగులో మొండిగోడలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి. శివరాం యింటి దగ్గర నుంచి తూర్పుగావచ్చి – కుడివేపుకు తిరిగాం. అక్కడి నుంచి అయిదు నిముషాల నడక చెరువు కట్టవచ్చింది. కట్టమీద కొంచెం ముందుకెళ్ళాం. అక్కడ తూము. కట్టకానుకుని చెరువులో రెండు గజాల వెడల్పుతో వృత్తాకారంలో పదడుగుల ఎత్తున్న రాతి కట్టడం దానిపైన సగం మూతలా బండలు. మేము దాని మీదెక్కి కూర్చున్నాం. అంతవరకు శివరాం ఒక్కమాటా మాట్లాడలేదు.

"ఈ చెరువును చూడరా రమణా. సుక్క నీళ్ళన్నా వుండాయా? మా పిల్లప్పుడయితే యిట్లా కాలంలో చెరువు నిండుకు తొణకతాండేది. మూడేండ్లయితాంది సక్రమంగా వానలు పడి. చెరువు మొరవపొయ్యి పదేండ్లేవుతాంది. నిరుడు మాత్రం చెరువు నిండింది. యింతకుముందు చెరువు నిండిందంటే రెండు పంటలు పూర్తిగా పండి మూడో పంట కూడా చెరువుకింద సగం నేల సాగవుతాండె. ఈసారి ఒగ పంటకు కూడా నీళ్ళు సాల్లా" అన్నాడు శివరాం.

"ఏందుకలా? చెరువుకింద సాగయ్యే నేల పెరిగిందేమో"

"అదేం లేదు"

"అయితే ఎందుకు నీళ్ళు చాల్లా?"

"ఏమో... నీళ్ళు చాల్లా... నీళ్ళేమన్నా యింకిపాయనేమో. యింతకు ముందు వానపడిందంటే సక్కన గుట్టకాన్నించీ, ఎజ్జెని పల్లికాన్నించీ, సద్దలనాగమ్మ మట్టకాన్నించీ నీళ్ళు పరిగెత్తా వచ్చి చెర్లోపడేటియి. యిప్పుడు యాడికాడ చెక్‌డ్యాంలు కట్టేసిండారు. అయ్యి నిండితేగానీ చెర్లోకి రావు నీళ్ళు. ఈ డ్యాంలు నిండినా ఏం లాభం చెప్పు? చెరువన్నా నిండితే కొంతనేలన్నా సాగవుతాది. ఎట్లుండే చెరువు. యిట్లయి పోయిందాది. దీన్ని చూస్తే బాధయిపోతాది. మేం పిల్లప్పుడు చెరువు నీళ్ళల ఎగర్లాడేవాళ్ళం. ఎనమల గంగులు ఎప్పుడూ చెరువు సుట్టకారం ఎనమల తోలుకొని వుండేవాడు. అప్పుడు నాక ఈత

వచ్చేదికాదు. పిల్లోల్లతో కలిసి చెర్లో కొచ్చినా. ఆడ.. ఆ పక్కకు పోయినాం. ఆడ సక్కని గుట్టకాన్నించి 'పీతిరొంక' వస్తాది. బాగా తగ్గుగా వుంటాది. దూరంనించి చూసేవాళ్ళకు ఆడుండే వాళ్ళం కనబడం. నేనూ అందర్తోపాటు నీళ్ళల్లో దిగినా. నీళ్ళవారంటీ అట్లా, యిట్లా పోతాన్నే నడస్తా. నడుముల్లోతున్నేయి నీళ్ళు. ఒగతావన గుంతున్నింది మునిగిపోయినా. మాకన్నా పెద్దోడు శీనుగాడని ఒగడున్నేడు. వాడొచ్చి జుట్టుపట్టుకోని పైకి లాక్కచ్చినాడు. లేకుంటేనా... ఆ పొద్దేపోయిండు" అన్నాడు నవ్వుతూ శివరాం.

''మనం కలిసి చదువుకునే రోజుల్లో ఎప్పుడూ చెప్పేవాడివిగదా... మీ వూరి చెరువు గురించి. నీతో కలిసి ఈతకొట్టాలని చాలా కోరిగ్గా వున్నింది నాకు. ప్చ్... ఏం చేద్దాం. పోనీ పద్దన్నే పీలేరుకు పోదామా. ఎన్నేండ్లయిందో ఆ ఏటిలో తిరిగి" అన్నాను.

"ఏముందాడ... యిసికే గదా" అన్నాడు.

"నీళ్ళూ..." అన్నాను అనుమానంగా.

"నీళ్ళేడుండాయి రమణా. మేము వారం వారం సంతకు పోతాండ్లా. అదీ ఎండిపోయింది. ముడ్డి కడుక్కోను గూడా నీళ్ళుండడంలేదు".

దీనికంతా కారణం ఏమిటి? వర్షం లేకపోవడమేనా? ఈ ప్రాంతంలో అప్పుడప్పుడు వర్షాలు కురవకపోవడం మామూలే కదా! అప్పుడంతా ఎండిపోని వంకలు, చెరువులు, యిప్పుడు మాత్రమే ఎందుకు ఎండిపోయాయి? నాలోని ప్రశ్నలు బయటకు రాకముందే రాకముందే వాడు మాట్లాడసాగాడు.



"పిల్లప్పుడు ఈతంటే బళే పిచ్చి... అదో... ఆడ చింతంబాయి వుండేది. అప్పుడు నేను ఎనిమిదో తరగతి. ఒంటిపూట బడి. మద్దేన్నం బడినుంచి వచ్చి అన్నం తింటాండాను. మా నాయన మారేళ్ళకు పోతాండి 'రేయ్ ఈతకు పోవద్దు. ఎండపూట గమ్మున పడుకో' అన్నేడు. సరే అన్నే. గమ్మున వుంటానా? నాయన పల్లెదాటినాడోలేదో, నేనూ అన్నం తినేసి పరిగెత్తినా. మా అమ్మ అరస్తానే వుంది. పోవద్దని. అమ్మకు ఎవురు బయపడతారు. పరిగెత్తాపోయి బాయిలో దుంకినాం. పిల్లోల్లమంతా ఈతాడ తాండాం. గడ్డనుంటాండ్లా ఈ తరానోళ్ళు. వాళ్ళల్లో ఒగదరిసినాడు శివన్నా... మీ నాయన కట్టెత్తుకోని వస్తాండాడు' అని. గడ్డకొచ్చి సొక్కాయి సంకన బెట్టుకోని పరిగెత్తినా. మా నాయన ఎంట పన్నేడు దొంకతానా.. రాత్రికొచ్చినా యింటికి. ఆ మాదిర్తో ఎన్నిసార్లో" అన్నాడు శివరాం నవ్వుతూ.

"ఆ బాయిలో నీళ్ళుంటాయా" అడిగాను.

"నీళ్ళ... బాయిలోనా.. అసలు బాయేలేదు" అన్నాడు.

"ఏమయింది?" అడిగాను ఆశ్చర్యంగా

"పూడ్చేసినారు"

"ఎవరు.. ఎందుకు..."

"యింకెవరు... బాయి గలోళ్ళే... నీళ్ళు లేవని పూడ్చేసినారు"

"నీళ్ళెందుకు లేవు"

"బోర్లేసి"

"బోర్లెందుకేసినారు"

".....''

"చెప్పరా... చెరువుల్లో అంటే వానల్లేక నీళ్ళు లేవంటివి. బావుల్లో నిండుకు లేకపోయినా కొన్నయినా నీళ్ళుంటాయిగదా. బోర్లెందుకు వేశారు'' రెట్టించాను.

వాడు చాలాసేపు మౌనంగా వుండిపోయాడు.

"బోర్లెందుకు ఏసినారు?" వాడిలో వాడే ప్రశ్నించుకున్నాడు.

నేనూ కాసేపు ఆలోచించాను. నాకేం తెలుసని వాటి గురించి ఆలోచించడానికి. ఆలోచనలు మాని చుట్టూ చూడసాగాను. కట్టమీద అప్పుడొకరు అప్పుడొకరు వెళుతున్నారు. కట్ట చివర మర్రిచెట్టు వెన్నెల వెలుగులో నల్లగా కన్పిస్తోంది. చెరువులో అక్కడక్కడా గుంతలున్నాయి. బహుశా అవి కరువు పనుల్లో భాగమేమో. పేపర్లలో చూస్తుంటాను కదా. సక్కని గుట్టమీద లైటు వెలుగుతోంది. అక్కడేదన్నా గుడి వుందేమో.

"ఆలోచిస్తే అర్థమవతాందిరా. చెరువులు, బావులు ఎందుకు ఎండిపోయినాయో." అన్నాడు శివరాం. తిరిగి వాడే మాట్లాడసాగాడు. యాడ దెబ్బకొట్టిందో తెల్సారా. కపిలతోల్తాంటిమా. ఒగ బొక్కెన నీళ్ళు ఎల్లదోలాలకు యింగా బొక్కెన నీళ్ళు వూరతాండె. బాయిలో ఎంతనిండుకు నీళ్ళున్నా, ఎకరా రెండెకరాలకు మించి సేద్దం చేయలేకుండా వుంటిమి. మిషన్లొచ్చె. మీటనొక్కినామంటే రొచ్చేసినోరు మాదిర్తో బాయిలో నీళ్ళన్నీ వూడ్చి పారేయబట్టె. మిషనుతో సులువుగదా అని రెండెకరాలు చేసేవాడు నాలుగెకరాలు చేసె. 'మోరడింట్లో బారడు కట్టె – కొత్రా మొగుడా' అన్నెంటనే. అట్లాయ. నీళ్ళు చాల్లా... దాంతో ఎర్రినాకొడుకులందరూ వూట తగ్గిందనుకో బట్టిరి. అబ్బుటికయినా అర్థం చేసుకోని నీళ్ళు సరిపోయేకాడికి సేద్దం చేసుకోనుంటే యిప్పుడీ యిబ్బంది వచ్చేది కాదు" అన్నాడు జేబులోంచి సిగరెట్ తీస్తూ..

'నువ్వు సిగరెట్లు తాగతావా?'' అన్నాను ఆశ్చర్యరంగా.

''ఆ... ఈ మధ్యే అలవాటయింది. నీకు పొగపడదని అప్పట్నించి తాగలా. తాక్కుంటే యింగ వుండలేను'' అంటూ వెలిగించాడొకటి. వాడి చేతిలోని పెట్టె నుంచి నేనూ ఒకటి తీసుకున్నాను.

"నేనూ నీవు పొగబడదని అప్పట్నించి కాల్చలా. నాకూ అలవాటే" అన్నాను వెలిగిస్తూ.

యిద్దరం నవ్వుకున్నాం. చదువుకునే రోజుల్లో ఎవరయినా మాపక్కన సిగరెట్ తాగతాన్నే ముక్కులు మూసుకునే వాళ్ళం. తిరిగి రమణ మాట్లాడసాగాడు.

"బావుల్ను ఏది దెబ్బతీసిందో తెలుసా? నీకేం తెలుస్తాదిలే. యాడో పట్నంలో వుండే వానివి. నేను చెప్తా. అందులో నిజానిజాలు నువ్వే యోచించుకో. పద్రెదేండ్ల ముందుమాట. అబ్బుడు ఈ పక్క కరువూలే పాడూలే. బాయిలంతా చేపుకొచ్చిన ఆవు పొంగుమాదిర్తో నీళ్ళతో నిండుగా వుండె. ఆ టైములో గవుర్మెంటోళ్ళు 'రిగ్గుబోరు' అని బావుల్లో నీళ్ళు లేకుంటే వూరికే యేస్తామనిరి. ఈ వూర్లో వుండాడే రంగయ్యని, వాడు చేసిన పని యిదంతా" అని కాసేపాగాడు. ఆవేశంగా మాట్లాడాడేమో వాడి ఎద ఎగిరిపడుతోంది.

రంగయ్యకు బావుల్లో నీళ్ళు లేకపోవటానికి లంకె ఏమిటి అనుకున్నా వాడే చెప్పసాగాడు.

"రంగయ్యకు ఎందుకూ కొరగాకుండా వున్నిందొక బాయి. దానికింద సేద్దింనాద్దింలేదు. అట్లా బాయిలో వాళ్ళనూ ఈళ్ళనూ పట్టుకోని రిగ్గుబోరేయించె. నలభై అడుగుల్లో లచ్చణంగా నీళ్ళుపడె. దానికి పైపులు బిగించి రెండు పర్లాంగుల దూరంలో వుండే చేన్ను సదరకట్టి మడిచేసె. యింగ చూసుకో నాసామిరంగా... అంతవరకు పాడుబడిండే అన్ని బావుల్లో రిగ్గుబోర్లేయించిరి. తొలీత అదేదో అందరికీ కుశాలగానే అన్పించె 'తౌడులో లాభం తూట్లా పాయసంటారే' అట్లాయె. కొన్నాళ్ళు బోయాలకు అందాకా అడుగు కనిపించని బావులంతా నోరెళ్ళబెడతా వచ్చె. ముందు మాదిర్తో ఎవురూ పూడుతీయించలా. ఎంత తొగినా రెండు మూడుమట్లకు

మించి తొగలేరుకదా. ఎన్నిరోజులు, ఎంత మంది, ఎంత యిబ్బంది... అదే దుడ్డుతో బోరేయిస్తే అంతకన్నా లోతుగా తెగతాది. పనీ సుళువవుతాదని అందరూ దుడ్డు పెట్టి బోర్లేయను మళ్ళిరి. ఒగడు బోరేస్తే యింగోని బోర్లో నీళ్ళురావు. వాడు మళ్ళా యింగోబోరు.... యిప్పుడు అయిదు నూర్లడుగుల్లో కూడా నీళ్ళుండడంలేదు' అన్నాడు శివరాం.

ఆ మాటలతో నా ఒళ్ళు జలదరించినట్లయింది.

"ఒక వేళ నీళ్ళు పడకపోతే" అన్నాను మెల్లిగా

"నీళ్ళు పడకపోతే కయ్యోగాలవో, కాంపోగాడో అడమానం పెట్టేది. అప్పుడూ నీళ్ళు పడక పోతే అమ్ముకునేది లేకపోతే కూలి పనులు చేసుకుంటా ఆ అప్పులకు వడ్డీలు కట్టుకుంటా వుండేది" అన్నాడు బాధగా. ఆ మాటలంటున్నపుడు వాడి గొంతులో దుఃఖపు జీర.

కాసేపు మౌనంగా వుండిపోయాం.

"అంతంత లోతులో నీళ్ళను మిషన్లు లాగి పైకి ఏస్తాంటే చెరవల్లో, బావుల్లో నీళ్ళు ఎట్లుంటాయిరా?" అన్నాడు శివరాం.

"నిజమే... నీళ్ళు పల్లమెరుగు అంటారు కదా" అన్నాను.

"నీళ్ళు లేవంటే పనులూ లేనట్టే. కూలి పనులతో బతికే వోళ్ళంతా చానా మంది వలసలు పోయినార్రా. యింగేం చేస్తారు? నువ్వు చూస్తివో లేదో, ఆడాడ కొన్ని మొండి గోడలుండాయి. వూరొదిలి నోళ్ళు యిండ్లయ్యి. మొండోళ్ళంగా వుండే రైతులం మాత్రం వుండాం. ఆడ చూడు...." అంటూ ఒక వైపు చేయి చూపించాడు.



అక్కడ ఏమీలేదు. ఎందుకు చూపించాడో అర్థం కాలేదు.

"ఆడసదరంగా వుండాది కదా. యింతకు ముందాడ బాయి వున్నింది. పక్కన్నే పెద్ద గడ్డ వున్నింది. దానిమింద ఏపమాన్లు, కానిగిమాన్లు వున్నేయి. యిప్పుడా బాయిని పూడ్చేసినారు" అన్నాడు.

"ఎందుకు?"

''పనిలేని మంగలోడు పిల్లితల గొరగతాడంటనే... ఆమాదిర్తో. పనులు లేక పోయాలకు కష్టపడేవోళ్ళు వుండమంటే వుంటారా గమ్మున! బావులున్నే నీళ్ళుండేదిలే ఏమీలే... పూడ్చేస్తే కొంచెం జాగా అయినా కలిసొస్తాదని పూడ్చేస్తాండారు" అన్నాడు శివరాం.

ఒకవైపు ప్రభుత్వం యింకుడు గుంతలని చిన్న చిన్న గుంతలు తవ్వడానికి కొన్ని వందల కోట్లు కుమ్మరిస్తా వుంది. యిక్కడ పనీపాటాలేని రైతాంగం కొంత నేల కలిసొస్తుందని యాభై, అరవై అడుగుల్లోతు బావులను కూడా పూడ్చేస్తున్నారు. ఎన్ని యింకుడు గుంతలు తవ్వితే యిలాంటి బావులతో సమానమయ్యేది. ప్రభుత్వం డబ్బు ఖర్చు చేయాల్సింది యింకుడు గుంతలకా, ఎండిపోయిన బావులున్న రైతులకా? అనిపించింది.

"యింగో సంగతి తెలుసారా రమణా... యిప్పుడు పిల్లకాయలు ఈత నేర్చుకుందామన్నా యాడా నీళ్లు లేవు. అసలు బావులే లేవు" అన్నాడు బాధగా.

నా కడుపులో చేయిపెట్టి తిప్పినట్లయింది. ఈ పరిణామం మంచికా, చెడుకా?

"రైతుల పరిస్థితి ఎట్లుండాదిరా" అడిగాను.

"ఎవడ్రారైతు. నీళ్ళుండి సేద్దిం చేస్తే రైతు. ఒగబోర్లో నీళ్ళు పన్నేయంటే శాశ్వతంగా వుంటాయని నమ్మకం లేదు. రెండు మూడు పంటలొచ్చాలకు తగ్గిపోతాయి. మళ్ళా బోరు నీళ్ళు పడితేపడె. లేదంటే లేదు. కొంత మంది అయిన కాడికి తెగ నమ్ముకొని టౌనుకు పోతాండారు. చానామంది వాళ్ళ యిళ్ళల్లో ఆడోళ్ళను కొయ్యేటి కంప తాండారు. మా తమ్ముని భార్యగూడా కొయ్యేటికి పోయిండాది. రెడ్లని లేదు, నాయుళ్ళని లేదు, సాయిబులని లేదు. అందరూ పోతాండారు కొయ్యేటికి" అన్నాడు నిర్వికారంగా శివరాం.

రోడ్డు మీద బస్సాగటి హోరుమనే హోరనుతో పోతోంది.

"అయితే పాలవ్యాపారమన్నా బాగుండాదా?"

"ఏం బాగో... దాంట్లో గూడా పోటీ గదా. తొలిగా అయితే రెండు వారాల కొగసారి బిల్లు యిస్తాండిరి. యిప్పుడు నాలుగైదునెల్లకొగసారి కూడా ఈడంలేదు. చిత్తూరులో పాల డెయిరీ మూసేసినారు. వుండేటియన్నీ ప్రైవేటుయే గదా. వోళ్ళిష్టం... యిదంతా మామూలేగానీ పోదాం పదా. కరెంటొస్తాది. తినేసి పోయి నీళ్ళు కట్టాల" అన్నాడు లేస్తూ శివరాం.

వాడిమాటల్లో ఎంత నిజముందో తెల్లేదు, కానీ కంటికెదురుగా కనపడతాండే వాస్తవం మాత్రం కఠినంగా వుంది. మేము కట్టదిగేప్పటికి కరెంటు వచ్చింది. వూరంతా లైట్లు వెలిగాయి.

"కరెంటొచ్చిందిరా... బిర్నేపోయి నీళ్ళు కట్టాల" గబగబా నడుస్తూ అన్నాడు శివరాం.

"నేనూవస్తాను. చూస్తా" అన్నాను వుత్సాహంగా

అంతలోనే మళ్ళీ కరెంటుపోయింది.

"ఏమీ కరెంటు.. వచ్చినట్టే వచ్చి మళ్ళా పాయనే" అన్నాడు శివరాం.

యిద్దరం యిల్లు చేరాం. లక్ష్మి వేడివేడిగా అన్నం, పప్పు, రసం, ఆమ్లేట్ వడ్డించింది. భోజనం అవుతూనే వాడు తోట దగ్గరకు బయల్దేరాడు. నేనూ చెప్పులేసుకున్నాను.

"నువ్వుండరా యింటికాన్నే" అన్నాడు శివరాం.

"లేదురా వస్తాను"

యిద్దరం యిల్లుదాటి పదడుగులు కూడా వేయకముందే ''అన్నా ట్రాన్స్‌ఫారం కాలిపోయిందంట" అన్నాడొకతను ఎదురుగా వచ్చి.

"ఎవరు చెప్పిర్రా" శివరాం ప్రశ్నించాడు.

"మేమంతా అట్నించే వస్తాండాం"

"సబ్‌స్టేషన్‌కాడికి పోయి ఎఇకి చెప్పదాంపాండి"

"ఆడిగ్గాడా పోయింటిమినా. చానా మంది కరెంటు దుడ్డు కట్టలేదంట. అయ్యన్నీ కట్టిందాంకా రెడీ చెయ్యరంట" అన్నాడతను.

"అంతా కరువుతో చస్తాంటే యిప్పుతేట్నించి వస్తాదిరా దుడ్డు"

"ఏమోన్నా ఏఇ తెగేసి చెప్పినాడు. రేపు మనందరం పోయి మాట్లాడదాం నా" అంటూ వెళ్ళి పోయాడతను.

"చూసినావా రమణా... సేద్దిం పరిస్థితి. వుండే కొన్ని నీళ్ళతో తోటలు పారగడదామన్నా కరెంటు యిట్లయితాంది. అంతా పస్తులుంటాంటే, కరెంటు బిల్లులు ఎట్ల కడతారు. పడుకుందాంపా" అంటూ లోపలకు దారి తీశాడు.

మా యిద్దరికీ పక్కలు డాబా మీద ఏర్పాటు చేసింది లక్ష్మి.

చాలా రాత్రి దాకా మాట్లాడుకుంటూనే వున్నాం. శివరాంతో మాట్లాడుతున్నా, వాళ్ళ బాధలు వింటున్నా, ఉన్నత చదువులు చదివి వుద్యోగం లేక నానా తిప్పలు పడుతున్న నా తమ్ముడు మనసులో మెదులుతూనే వున్నాడు.

**(2004 ఆర్.ఎస్.కృష్ణమూర్తి స్మారక సాహితీ సమితి కథల పోటీలో బహుమతి పొందిన కథ)** V

## నచ్చిన రచన

# వల్లభాపురం "పహారా కాస్తున్న రాత్రి'




**పరిమళ్**

రెక్కలు ముక్కలు చేసుకునే వాడి కన్నీటి బిందువును, చెమట చుక్కను రెండు కన్నులుగా చేసుకున్న వాడే నిజమైన కవి. కొందరు ఆనందం కళ్ళద్దాల్తో జీవితపు రంగుల్ని, సౌందర్యాన్ని తీయగా ఆవిష్కరిస్తారు. వాళ్ళ మార్గం మాత్రం మనది కాదు. రక్త చలనం లేనిదే ముద్ద కూడా సరిగా గొంతులోకి దిగని జనం. సూర్యోదయం జరుగుతున్నా దట్టమైన చీకటి కాటు తింటున్న జనం, మేడలకు రాళ్లెత్తుతూనే ఫలించిన వృక్షాల్లాగా రాళ్ళ దెబ్బలు తింటున్న జనం, ఈ జనాన్నే తన గుండెలయగా చేసుకున్న కవిగా వల్లభాపురం జనార్దన నాకు నచ్చుతాడు.

లోకంలోని విషాదాన్ని, విధ్వంసాన్ని అంతం చేయడం కోసం కలాన్ని ఆయుధంలాగా వాడాడు. సమాజాన్ని ముందుకు నడిపించడం కోసం తనూ పిడికిలి బిగించాడు. సంపదల సృష్టికర్తలు, ఉత్పత్తి శక్తులు కన్నీళ్ళు మోయడం వెనుక ఉన్న కార్యకారణ సంబంధాల్ని విప్పి చూపాడు. సమాజాన్ని వెనక్కి తిప్పాలనుకుంటున్న శక్తుల కుట్రలు భగ్నం అవుతాయనే చారిత్రక సత్యాన్ని చాటుతున్నాడు.

"పహరా కాస్తున్న రాత్రి" సంపుటి నిండా వస్తు వైవిధ్యం పరచుకొని ఉంది. ఏ వస్తువుని ముట్టుకున్నా పైపైన చూడటం కాకుండా విడదీస్తూ విడదీస్తూ దాని రక్త స్పందనని పట్టుకుంటాడు. ఏది ఎందుకు జరుగుతున్నదో, పరిణామాలు ఏవైపుకు ప్రయాణం చేస్తున్నాయో, మనం ఎందుకు కదలాలో? దేన్ని చేరుకోవాలో? అంతా సమగ్రంగా ఆవిష్కరిస్తాడు. ఆశావహ చైతన్యాన్ని మన శ్వాసగా చేస్తాడు.

నేను ఈ సంపుటినంతా ఇక్కడ ప్రదర్శించను కాని ఈ గ్లోబల్ ప్రపంచంలో వస్తున్న మార్పుల్ని అర్థం చేసుకోవడానికి దానిపై యుద్ధానికి ఈ కవిత్వం నిదురలేపుతుందని మాత్రం చెబుతున్నాను.

"ప్రజాస్వామ్యదేశం"లా నటిస్తూ 'అప్పు' కేంద్రంగా దేశాల్ని నంజుకుతింటున్నది "అమెరికన్ సామ్రాజ్యవాదం" తన సంస్కృతిని దిగుమతి చేసి ఆ తర్వాత తన మార్కెట్‌ను దింపి "అప్పు" ఆధారంగా ప్రభుత్వాలతో అన్ని వసతుల్ని, హంగుల్ని ఏర్పరచుకుంటుంది. తర్వాత జరిగేది దోపిడి జాతర. తన దేశంలో వచ్చిన "ఎకనామికల్ క్రైసిస్"ను ఎంత తెలివిగా వర్ధమాన దేశాల దోపిడితో గట్టెక్కుతున్నదో "నా పేరే ప్రజాస్వామ్యం" అనే కవితలో చూపిస్తారు. ఈ కవితంతా వ్యంగ్య వైభవంతో నడుస్తుంది. వ్యంగ్యం జనార్ధనగారి కలంలోంచి సహజ సౌందర్యంతో జాలువారుతుంది.

ఈ కవి స్పర్శించిన మరో ముఖ్యమైన అంశం "పరాయీకరణ" మన సమాజం ఇంత అమానవీయంగా ఉండటానికి బీజాలు "స్వంత ఆస్తి"లో ఉన్నాయంటాడు మార్క్స్. స్వంత ఆస్తి నుండే సమస్త అవలక్షణాలు సమాజంలో ఏర్పడ్డాయి. పరాయీకరణలేని ఉన్నత మానవీయ సమాజాన్ని కోరుతున్నాడు కవి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగానే ప్రైవేటీకరణ ఈ దేశంలో కొనసాగుతున్నది. దానిపైకి మనల్ని

"ఓ కప్పా! నా నోట్లోనే నీ కష్టాలకు విముక్తి ఉందని
ప్రతిపామూ పలుకుతోంది
నా కొండి కాటులోనే సుఖముందని
ప్రతి తేలూ అంటోంది
ప్రైవేటీకరణ పడగ
ప్రపంచ బ్యాంకు గొడుగు
ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మటమనే అడుగు
మీ బతుకులు బాగు చేయటం కోసమే అని
ప్రతి నోరూ వేద పనసలు వల్లిస్తోంది"

సమకాలీన సామాజిక ఉద్యమాల ప్రభావానికి స్పందించాడు. దళితవాదం, స్త్రీవాద దృక్కోణాల్లో ఆధిపత్యాల్ని ప్రశ్నించాడు. ఈ కవి సమాజాన్ని వర్గ దృష్టితో అర్థం చేసుకుంటాడు. అట్లా అని ఉపరితలాంశాల్నీ విస్మరించడు. పునాది. ఉపరితలాలకు సంబంధించి సరైన అవగాహన ఉంది.

దళితులపై కారంచేడు, నీరుకొండ, చుండూరులలో జరిగిన దాడులకు మూలం బ్రాహ్మణిజం, భూస్వామ్యాల కలయిక యొక్క క్రౌర్యరూపమని తేలుస్తాడు.

స్త్రీని పంజరంలో చిలుకలాగా పురుషాధిక్య భావజాలం బంధిస్తున్నది. ఈ కుటుంబంలోని అహంకారం, ఆధిక్యతల్ని ప్రశ్నించాలంటాడు. కుటుంబానికి ఇరుసు ప్రేమానురాగాలే అన్నది ఇతని దృక్పథం.

ఈ సమాజంలోని సమస్యలు పోయే మార్గం ఏమిటి? మార్పు ఎందుకు రావడంలేదు? సమాజం వెలుగును చూసే అవకాశం ఉందా? ఇలాంటి ప్రశ్నలకు సమాధానం జనార్ధనగారి కవిత్వంలో ఈ విధంగా ఉంది.

"భూమి పంచమనే నోళ్లు
అక్కడక్కడా కదుల్తున్నాయి
వెలుగొస్తుందేమోననే భయంతో
ఒళ్ళంతా కళ్ళు చేసుకొని
రాత్రి పహరా కాస్తోంది
అధికారం ఊతగా
అయితే
రాత్రి పహరాను బద్దలు కొట్టి
తూర్పు ఎర్రబడటం ఆగదు
ఉదయం ఒక సత్యంగా"

మనిషిని బంధిస్తున్న గొలుసుల్ని తెంచడమే లక్ష్యంగా, మనిషి కన్నీటిని తుడవడమే గమ్యంగా, సమసమాజమే తన స్వప్నంగా కవిత్వమల్లుతున్న జనార్దన గారి కవితా సంపుటిని మనమంతా ప్రేమిద్దాం. ఈ కవిత్వాన్ని ఆచరిద్దాం.

V

కవిత

# గ్లోబల్ ప్రవచనం

**గుడిపాటి**



"నీళ్ళు లేవు
పనుల్లేవు
గంజయినా లేదు"

కరువు కరువు
ఏకరువులు పెట్టొద్దు
వలపోతలొద్దు
వాపోవొద్దు

హైటెక్ సత్యాల్ని
ఆవాహన చేయడం
కాలధర్మం

ఎవరక్కడ?
తెర ఎత్తండి
....
లోకం సుభిక్షం
నెక్లెస్ రోడ్డులో
జన సంరంభం
పంజగుట్ట చౌరస్తాలో
మార్కెట్ మహోత్సవం
మాల్స్‌లో మనీ పరవళ్ళు
కలలు గనే భూతలస్వర్గం
కళ్ళేదుటే
...
మీట నొక్కితే
డబ్బులు రాలే యుగం
వెంటపడి అప్పులిచ్చే కాలం
ఎల్లెడలా పిజ్జాలు, బర్గర్‌లు
చికెన్ కబాబ్‌ల హేల
...
వెల్లువెత్తిన అభివృద్ధి
జూబ్లీహిల్స్ రోడ్లపై ప్రత్యక్షం
నగరబాటల, పల్లెబాటల
వెలిసే బ్రాందీ షాపులే సాక్ష్యం
...
జలయజ్ఞం
జనయజ్ఞం
సమస్తం
సమర్పయామి

కట్ కట్
కరెంట్ కట్
అంధకారం
చివరి హామీ
...
విసుర్రాయి
ఆరె, కత్తి
నాగలి, కొడవలి
సారె, రోకలి
ఔట్‌డేటెడ్
శిల్పారామం
విలేజీ మ్యూజియం జ్ఞాపికలు
...
బుద్ధుడు, పూలే, అంబేద్కర్
పేరు ఏదయితేనేం
పెట్టండి
అల్లాడే గిరిజనుల మీదనో
తండ్లాడే దళితుల మీదనో
అందమైన ఆంగ్లంలో
ఓ రిపోర్టు రాయండి
ఎన్జీవో ప్రాజెక్టు కొట్టండి
బేఫికర్
బతుక్కి ఢోకాలేదు
...
ఎవరక్కడ?
ప్రశ్నలు నిషిద్ధం
చర్చలు అసంబద్ధం
మాట్లాడకండి
గొంతెత్తకండి
...
ధ్వంసం
విధ్వంసం
పెను విధ్వంసం
విస్ఫోటనం
పెను విస్ఫోటనం
...
ఏదీ లేదు
ఎవరూ లేరుస
ఏమీ లేదు
శకలాలయినా కనిపించవు
బూడిదయినా మిగలదు
ఆనవాళ్ళేవి ఉండవు
ధ్వంసం కావడం అనివార్యం
ముక్కలు కావడం పచ్చినిజం
మహామౌనం ఈ కాలపు లౌక్యం

---


# త్రిముఖి

**మాల్యశ్రీ**

ఇద్దరూ ప్రజారక్షకులే
మధ్య నలిగేవాళ్ళు
జనం!

అడవిలో ఎర్రదుమ్ము
క్రూరమృగాల కుమ్ముదుమ్ము
కుందేళ్ళ కష్టాలు!

ఔటర్ సిగ్నల్ వద్ద
ఆగిపోయే రైళ్ళు
భారతీయ ఓటర్లు!



ఎరుపంటే వెరపు
అది రక్తం వంటి
నిజం గనుక!


నేటి అస్తమయం
రేపటి
ఉదయం!

నవత
కవితకు భవిత
అదే కొలత!

పాఠకుని మార్పు
కవిత కూర్పు
కవి నేర్పు!

జానపదం
జ్ఞానపదం
నిత్యవసంతం!

ఎర్రకుంచెతో
నల్లరంగు చెరిపేస్తోంది
తూర్పున ఉషఃకన్య!



# హౌప్ట్‌మన్ - గురజాడ



*తాత్కాలికమైన సమస్యను ఆధారంగా చేసుకొని సార్వకాలీనమైన చైతన్యాన్ని సృష్టించడంలో ఈ ఇద్దరి ప్రతిభ వికసించింది. సనాతన ప్రపంచానికి ఆధునిక గవేషణలు పరిచయమవుతున్న కొద్దీ క్రమక్రమంగా వైజ్ఞానిక ఫలితాలతోపాటు ఆయా సమాజాలలో ఉత్పన్నమయ్యే తాత్కాలిక సమస్యలు ఏ విధంగా ఉంటాయో ఈ రెండు నాటకాలూ రెండు పక్షాల నుండి ప్రదర్శిస్తాయి.*

**డా. యు.ఎ. నరసింహమూర్తి**

It is a curious indication to the under lying units of human endeavour that two kindered spirits in the field of modern drama should have been born in the same year in two countries as far removed from each other as Germanyand Andhra Pradesh of the Indian Republic[1] 1962లో హౌప్ట్‌మన్ శతవార్షికోత్సవాల సందర్భంగా తెలుగు నాటక విమర్శకుల దృష్టి అతని మీద ప్రసరించింది. హౌప్ట్‌మన్ జర్మనీలోని సైలేషియా ప్రాంతంలోని ఒబర్ సేల్జ్‌బ్రమ్ గ్రామంలో 1862 నవంబరు 15న జన్మించాడు గురజాడ. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జిల్లాలోని రాయవరం గ్రామంలో 1862 సెప్టెంబరు 21న జన్మించాడు. ఈ ఇద్దరి మధ్య ఉన్న పోలిక ఇది ఒక్కటి మాత్రమే కాదు. హౌప్ట్‌మన్‌కి ప్రపంచ ఖ్యాతినార్జించిపెట్టిన "The Weavers" నాటకం 1892లో వెలువడింది. గురజాడ రాసిన కన్యాశుల్కం తొట్టతొలి నాటక ప్రదర్శన కూడా 1892లోనే జరిగింది. వీరిద్దరి మధ్యా ఇంకా పోలికలున్నాయి. 'చేనేత పనివాళ్ళు' అనే నాటకం రాసిన హౌప్ట్‌మన్ సైలేషియాలోని ఒక చేనేత పని వారి కుటుంబంలో జన్మించాడు. గురజాడ కన్యాశుల్కం దురాచారం బాగా వ్యాప్తిలో ఉన్న అగ్రవర్ణ బ్రాహ్మణ కుటుంబాల మధ్య జీవించాడు. ఇద్దరూ సమకాలీనంగా ఒకానొక కులాన్ని పట్టిపీడిస్తున్న సామాజిక సమస్యను గ్రహించి తమ తమ భాషలలో వినూత్న మార్గంలో నాటక రచన చేపట్టారు.

తాత్కాలికమైన సమస్యను ఆధారంగా చేసుకొని సార్వకాలీనమైన చైతన్యాన్ని సృష్టించడంలో ఈ ఇద్దరి ప్రతిభ వికసించింది. సనాతన ప్రపంచానికి ఆధునిక గవేషణలు పరిచయమవుతున్న కొద్దీ క్రమక్రమంగా వైజ్ఞానిక ఫలితాలతోపాటు ఆయా సమాజాలలో ఉత్పన్నమయ్యే తాత్కాలిక సమస్యలు ఏ విధంగా ఉంటాయో ఈ రెండు నాటకాలూ రెండు పక్షాల నుండి ప్రదర్శిస్తాయి. మరమగ్గాలు ఆధునిక నాగరికతలో ఒక భాగంగా ప్రవేశించి చేనేత పని వారి జీవనకు ముప్పు తెచ్చాయి. ఆ కారణంగా చాలా దేశాలలో చేనేత పనివాళ్ళు అన్నం లేక అలమటించవలసి వచ్చింది. 1844లో జర్మనీలోని సైలేషియా ప్రాంతంలో ఎలెంజ్‌బర్గ్ అనే గ్రామంలోని చేనేత పని వాళ్ళు ఆకలి మంటలను తట్టుకోలేక తిరుగుబాటు మార్గం పట్టారు. చేనేత పని వారి కుటుంబంలోనే పుట్టిన హౌప్ట్‌మన్ ఆ సాధక బాధకాలలో మునిగి తేలి ఆ ఉద్యమాన్ని ఒక నాటకంగా మలిచాడు. విజయనగర సంస్థాన ప్రాంతంలోని బ్రాహ్మణ కుటుంబాలలో పసిపిల్లలను పెళ్ళిపేరుతో అమ్ముకొనే దురాచారాన్ని అరికట్టడానికి ఒక చట్టాన్నే తెచ్చే ప్రయత్నంలో ఆనందగజపతి మహారాజు అందించిన స్ఫూర్తితో తాను జీవిస్తున్న సమాజంలో, తన కులంలో జరుగుతున్న సామాజిక దురాచారం మీద దృష్టి నిలిపి కన్యాశుల్కం నాటక రచన చేశాడు. సమాజంలో ఆధునికత బలపడుతున్న కొద్దీ సనాతన బ్రాహ్మణ సంస్కృతి ఏ విధంగా శిథిలమవుతోందో అందులోని అవాంఛనీయ సంప్రదాయాలు ఎంతటి ప్రశ్నార్థకాలయోయో, ఎంతటి విమర్శ పాత్రాలయోయో, ఈ నాటకం చెబుతుంది. ఒక రకంగా ఈ రెండు నాటకాలూ సంప్రదాయ నాటక రచనా మార్గాన్ని అతిక్రమించి సమకాలీన సంఘటన కాలక్రమ నివేదికను సమకూర్చే కళాత్మకమైన నూతన రూపంలో అవతరించాయనిచెప్పాలి.

హౌప్ట్‌మన్, గురజాడ లిద్దరూ ఈ రెండు నాటకాలలో చిత్రించిన సమస్యలలోను, ఆ సమస్యలకు సంబంధించిన వాతావరణంలోను, చరిత్రగతిలోను, భవిష్యద్దర్శనంలోను, కంఠదఘ్నంగా కూరుకొనిపోయారు. ఆ కారణంగానే వారు ఇతర రచనలు కొన్ని చేసినా ఈ రెండు నాటకాలే వారి విజయకేతనాన్ని ఎగురవేశాయి. "హౌప్ట్‌మన్ రాసిన Before dawn (1889), Lonely Lives (1891), The Beaver Coat (1893), The Assumption of Hennale (1893), The Sunken Bell (1896) వంటి ఇతర నాటకాలలో విభిన్న వస్తువులు, శైలులు ప్రాధాన్యం వహించిన ఇతివృత్తాలు సాంకేతిక స్థాయిని అందుకొని వర్తమాన కాలానికే పరిమితం కాకుండా పోయాయి. శైలి తరచు కాశీమజిలీ కథల వంటి స్వాప్నిక లక్షణాన్ని అలవరచుకొంది"[2] అంటే నాటక కర్త తనకు ఊపిరి

సలపనివ్వకుండా కలవరపరచిన చేనేత పని వాళ్ళ వాస్తవ స్థితిని అందించడంలో చూపిన శ్రద్ధ ఈ నాటకాలలో కనబడలేదని తెలుస్తుంది. గురజాడ విషయంలో కూడా ఇదే జరిగింది. కన్యాశుల్కం రాసిన చేతితో బిల్హణీయం, కొండుభట్టీయం అనే రెండు ఇతర నాటకాలను వేరువేరు సందర్భాలలో ప్రారంభించిన గురజాడ వాటి నిర్వహణపట్ల తగినంత తాత్పర్యం కుదరక మధ్యలోనే ఆ రచనా ప్రయత్నాన్ని విరమించుకొని ఉంటాడు. అందుకే అవి అసంపూర్ణ నాటకాలుగా మిగిలాయి.

చేనేత పనివాడైన తన తాత కథనం ప్రకారం హౌప్ట్‌మన్ "The Weavers" నాటకం రూపొందించాడు. అనుకంపాభరితమైన దయనీయ, సామాజిక స్థితిని విస్తృతమైన పరిధిలో ఆయన ఈ నాటకంలో చూపించాడు. సైలేషియాలోని నేత పనివారు తమ ఇళ్ళల్లో మగ్గాలతో నేత పని చేసేవారు. కానీ వారికి న్యాయసమ్మతంగా లభించవలసిన జీతభత్యాలు లభించేవి కావు. ఆ దుర్భర స్థితికి వ్యతిరేకంగా వారంతా తిరుగుబాటు చేశారు. ఆకలికి అలమటించే ఈ బాధాకర సన్నివేశాలను ఇతివృత్తంగా చేసుకొన్న సామాజికంగా నిమ్న స్థితిలో ఉండి రెక్కలు ముక్కలు చేసుకొనే చేనేత పని వారి దయనీయ స్థితిని అభివర్ణించడంతో ఈ నాటకం ఆధునిక నాటకరంగంలో ఒక శకాన్ని సృష్టించింది.

ప్రథమాంకంలో చేనేత పని వారు తాము నేసిన బట్టలను అమ్మకానికి తెస్తారు. ఎప్పుడూ కొనే వ్యాపారితోను, అతని మేనేజరుతోను, డబ్బు చెల్లించే గుమస్తాతోను, అక్కడ పని నేర్చుకొనే వాడితోను మాట్లాడుతారు. రెండవ అంకం దరిద్రుడైన ఒక చేనేత పనివాడి, ఇంటి చుట్టూ తిరుగుతుంది. మూడవ అంకం ఒక సత్రంలో నడుస్తుంది. ఇందులో యాత్రికుడైన ఒక వ్యాపారి చేనేత పనివారికి భృతి కల్పించడానికి సిద్ధ ఒక యజమాని, సత్రాధికారి, రక్షక భటుడు, ఒక కంసాలి, బిచ్చగాడు పాత్రలతో కథలో కొంత వైశాల్యం ఏర్పడుతుంది. నాల్గవ అంకం యజమాని ఇంట్లో జరుగుతుంది. ఆ దృశ్యంలో ఆ యజమాని కుమారునికి పాఠం చెప్పడానికి వచ్చిన మతాధికారి, ఆందోళన జరుపుతున్న చేనేత పని వాళ్ళను అదుపులో పెట్టే పోలీసు సూపరింటెండెంటు కనిపిస్తారు. వారిద్దరూ వారి వారి మార్గాలలో ఉద్యమకారులకు వ్యతిరేకంగా మాట్లాడుతారు. ఉద్యమకారులు ఆ ఇంటిని

............. O .............

**భిన్నభిన్న దేశాలలో సమకాలీనంగా ఏ విధమైన పరస్పర పరిచయమూ లేకుండా ఈ ఇద్దరు నాటకకర్తలు ఇంచుమించుగా సమానమైన పోలికలు కలిగిన వినూత్న నాటక సృష్టి చేయడం వెనుకగల చోదకశక్తి ఏమిటి? అనే ప్రశ్న కలుగుతుంది. 19వ శతాబ్దంలో ఐరోపాలో తలెత్తిన స్వభావవాద చైతన్యం దీనికి మూలశక్తి.**

............. O .............

చుట్టుముట్టడంతో ఆ అంకం ముగుస్తుంది. ఐదవ అంకం ఇంకొక గ్రామంలోని చేనేత పని వారి ఇంట్లో జరుగుతుంది. ఉద్యమ ఎలెంజ్‌బర్గ్ నుండి వేరొక గ్రామానికి వ్యాపిస్తుంది. తిరుగుబాటుదారులైన చేనేత పని వారు యజమానుల ఇళ్ళను, ఫ్యాక్టరీలను ధ్వంసం చేస్తూ ఉంటారు. ఈ సంఘర్షణలో చేనేత పని వారికి, సైనికులకు పోరాటం జరుగుతుంది.

ఈ నాటకానికి ఒక పరిష్కారం లేదు. భవిష్యత్తు వైపు హెచ్చరిక తర్జనని మాత్రం చూపిస్తూ నాటకం ముగుస్తుంది. 'Through the whole play, with in this chronicle framework, the mainspring of the action is not a matter of persons, but of the revolt of the body weavers, springing from this poverty'[3] అన్న విలియమ్స్ మాటలు గమనార్హమైనవి. ఈ నాటకంలోని చర్చలే ప్రధానమైనవిగానీ పాత్రలు ప్రధానమైనవి కావు. ఒక సమకాలీన ప్రాదేశిక వార్తా కథనాన్ని ఆధారం చేసుకొని రూపొందించిన కళాఖండమిది.

కన్యాశుల్కం నాటకంలో కూడా ఏ సమస్యకు పరిష్కారం లభించదు. "డామిట్! కథ అడ్డం తిరిగింది,'' అన్న గిరీశం సంభాషణతో భవిష్యత్ గమనం ఏమిటి? అన్న ప్రశ్న తల ఎత్తుతుంది. హౌప్ట్‌మన్ విమర్శకులు నాటకానికి 'The Weavers' సంబంధించి ఉపయోగించిన "Chronicle" అన్న ప్రయోగం విస్తృత దశలో కన్యాశుల్కానికి కూడా వర్తిస్తుంది. అందులో కూడా కథ కంటే సమకాలీన వార్తా కథనమే ప్రాముఖ్యం వహించింది. అది కేవలం హౌప్ట్‌మన్ నాటకంలా ప్రాదేశిక వార్తా కథనం మాత్రం కాదు. ఆంధ్రదేశపు సరిహద్దులు దాటి దేశ, విదేశ వార్తా సమాహారంగా అది విస్తరించింది.

భిన్నభిన్న దేశాలలో సమకాలీనంగా ఏ విధమైన పరస్పర పరిచయమూ లేకుండా ఈ ఇద్దరు నాటకకర్తలు ఇంచుమించుగా సమానమైన పోలికలు కలిగిన వినూత్న నాటక సృష్టి చేయడం వెనుకగల చోదకశక్తి ఏమిటి? అనే ప్రశ్న కలుగుతుంది. 19వ శతాబ్దంలో ఐరోపాలో తలెత్తిన స్వభావవాద చైతన్యం దీనికి మూలశక్తి.

ఇబ్సన్, స్ట్రిండ్‌బెర్గ్ అలెగ్జాండర్ డ్యూమాస్ ఫిల్స్, చెకోవ్, సింజె, పిరాండెల్లో, హౌప్ట్‌మన్, షాలు రాసిన వచన నాటకాలతో ఐరోపాలోని స్వభావవాద నాటకం (Naturalistic Play) శక్తివంతమైంది. గురజాడ ఇందులో కొందరిని ముఖ్యంగా ఇబ్సన్, షాలను అధ్యయనం చేశాడు. ఇతరులను గూర్చి తెలుసుకొనే అవకాశముంది. వారి రచనల ప్రేరణతోనే కన్యాశుల్కాన్ని స్వభావవాదాన్ని ఆశ్రయించిన పూర్తి వచన నాటకంగా తీర్చిదిద్దాడు. స్వభావవాదాన్ని ఆశ్రయించి రాసిన నాటకకర్తలతో ఇబ్సన్, స్ట్రిండ్‌బెర్గ్, డ్యూమాస్ ఫిల్స్ వంటి వారు హౌప్ట్‌మన్ కంటే ముందే బాగా ప్రసిద్ధులు, అయితే వారి నాటకాలకు, హౌప్ట్‌మన్ రాసిన 'The Weavers' కు ఒక భేదం ఉంది. స్వభావవాదాన్ని ఆశ్రయించిన నాటకాలన్నీ అప్పుడు కుటుంబ జీవన సమస్యలను, వ్యక్తిగత సంబంధాలను చిత్రించాయి. అదంతా ఒక బూర్జువా ప్రపంచం, హౌప్ట్‌మన్ తన నాటకాన్ని బూర్జువా ప్రపంచపు పొలిమేరల నుండి బైటకు లాక్కొచ్చాడు. అంతేకాదు, కుటుంబ సమస్యలను, ఒక గుంపుకు చెందిన సమస్యలను కూడా కాదని ఒక కులానికి సంబంధించిన సమస్యను తొలిసారిగా రంగస్థలానికి ఎక్కించాడు. ఈ వర్గ (Community) దృక్పథం కూడా ----కు చెందినది కాదు. ఆ చూపును వదలి కొత్తగా ఒక కులానికి సంబంధించిన సమస్యను ఎత్తుకొన్నాడు.

హౌప్ట్‌మన్ కంటే ముందు కొందరు వృత్తిపని వారి జీవితం ఆధారంగా రచనలు చేసే ప్రయత్నం చేయలేకపోలేదు. కానీ ఆ ప్రయత్నంలో అద్భుత విజయాన్ని సాధించినది హౌప్ట్‌మన్ మాత్రమే He (Gurajada) also for the first time brought a sense of naturalism to the Telugu theatre and linked it with the broad social problems of the day" అన్న అబ్బూరి వారి మాటలు

గురజాడ తెలుగులో స్వభావ వాద నాటకానికి అంకురార్పణ చేసిన వైనాన్ని వెల్లడిస్తాయి.[4] ఈ విషయంలో గురజాడ కూడా ఇబ్సన్ ప్రభృతుల పరిధిలోనే తన ఉనికిని నిలుపుకొన్నాడుగానీ హౌప్ట్‌మన్‌లా వీధిన పడి విప్లవ పంథాను తొక్కలేకపోయాడు. మధ్య తరగతి కుహనా విలువలను తూర్పారబట్టడానికి నడుం కట్టినా, పెటీబూర్జువా తత్త్వాన్ని నిరసించినా, మెలోడ్రామాను వ్యతిరేకించినా కన్యాశుల్కంలో ఒక సామాన్య తరగతికి చెందిన చైతన్యాన్ని మాత్రం సూటిగా ప్రజ్వరిల్లేలా చేయలేక పోయాడు. పూటకూళ్ళమ్మ, బుచ్చమ్మ, మీనాక్షి రంగం మీదకు రాని అచ్చమ లాంటి వితంతువులనందరను ఒక చోట చేర్చి కథను నడిపిస్తే లేదా కన్యాశుల్కంలోని ఇతర సమస్యలలో ఏదో ఒక దానిని ఏకముఖంగా రంగం మీద కేంద్రీకరించి విప్లవ పంథాన సాగిపోయి ఉంటే కన్యాశుల్కం కూడా ఐదు అంశాలలోనే ముగిసి ఒక బిగువును సాధించి ఉండేది. కానీ గురజాడ లక్ష్యం వేరుగా ఉంది.

'The Weavers' నాటకంలో హౌప్ట్‌మన్ ప్రదర్శించిన స్వభావవాద చిత్రణ ఐరోపా నాటకరంగానికి కొత్తది కాకపోయినా అందులో ఒక విలక్షణమైన నూతన గవేషణ ఉందని విమర్శకులు భావించారు 'It is action rather than plot; and this is the first of Hauptmann's major innovations. The weavers is the first important example in naturalist drama of a method of realistic treatment which is fully emancipated from the ideas of plot of the older romantic drama'[5] స్వభావవాదులు పూర్తిగా వదిలించుకోలేని ఇతివృత్తి ప్రాబల్యాన్ని త్రోసిరాజని సమస్య కభిముఖంగా నాటక గమనాన్ని త్వరితం చేయడంలో హౌప్ట్‌మన్ కొత్త త్రోవ చేశాడు. అందుకే ఆ నాటకంలో అనుభవ తీవ్రత, పాత్ర చిత్రణ అనే స్వభావవాద లక్షణ విరుద్ధమైన అంశాలను వదలి ఇతివృత్తానికిగానీ, సన్నివేశానికిగానీ ఏ ఆచ్ఛాదనా కల్పించకుండా నాటకాన్ని నడిపించాడు. కన్యాశుల్కం కూడా ఇతివృత్త ప్రాబల్యాన్ని తిరస్కరించిన నాటకమే అందులోని ఏ పాత్రా భావతీవ్రతకు లోనుకాదు. ఆ క్షణానికి ఎదురైన స్థితిని ఆధారం చేసుకొని ప్రతిచర్యకు పూనుకొంటుంది. ఇందులోని ఏ ఒక్క సన్నివేశాన్ని రచయిత పని కట్టుకొని కల్పించినట్లు కనబడదు. ఏ ఒక్క పాత్రను నాటక

............. O .............

**"ది వీవర్స్", 'కన్యాశుల్కం' నాటకాలు రెండింటిలోను కూడా అంత వరకు అంతటా బాగా చలామణిలో ఉన్న రంగస్థల నేపథ్యరచన కనబడదు. లోకంలో ఒక సన్నివేశం ఏ నేపథ్య రచనలో జరుగుతుందో అదే దృశ్య పరికల్పన రంగ స్థలం మీద కూడా కనబడుతుంది. అదనంగా చేసే అలంకరణలేమీ ఉండవు. పాత్రల కదలికలు, ఉద్వేగాలు గిరీష్ చంద్రఘోష్ ప్రభృతులు సృష్టించిన నాటకీయ భూమికలో కనబడవు. ఉదాత్త నాటకీయ శైలికి స్వస్తి చెప్పి ఇద్దరూ సరళ దైనందిన సంభాషణ శైలిని స్వీకరించారు.**

............. O .............

కర్త తన ఇష్టాన్నికనుగుణమైన మూసతో పోతపోసినట్లు, పాత్రచిత్రణ అనే బలహీనతకు పాల్పడినట్లు కనబడదు. ప్రతీ పాత్ర లోకంలో ఏ రకంగా ఉంటుందో అదే విధంగా స్వభావ సిద్ధంగా రంగం మీదకు వస్తుంది ఏ ఒక్క పాత్రకు గురజాడ తనకు తానుగా ఒక అదనపు లక్షణాన్ని చేర్చినట్లు కనబడదు.

కొన్ని పాత్రలు తనకు తెలియకుండానే తన చేయి జారిపోయినట్లు గురజాడ తలపోసాడు. ఇటువంటి నూతన దర్శనంతో గురజాడకు, హౌప్ట్‌మన్‌కు పోలిక కనిపిస్తుంది. హౌప్ట్‌మన్ సమాజంలోని ఒక కులాన్ని మిగిలిన సమాజం నుండి వేరు చేసి వారి ప్రత్యేక సమస్యనే చిత్రించడమనే కొత్త పద్ధతికి ఈ నాటకంతో నాంది పలికాడు. కన్యాశుల్కం నాటకం కూడా 19వ శతాబ్ది ఉత్తరార్థం నాటి ఆధునిక భారతీయ సామాజిక వాతావరణంలో తమ సనాతన జీవన విధానంలోని మంచి–చెడులతోపాటు ఇమడలేక త్వరితగతిని ముంచుకు వస్తున్న మార్పులను హరించుకోలేక సతమతమవుతోన్న బ్రాహ్మణ కులాన్ని మిగిలిన సమాజం నుండి వేరు చేసి చూపించే ప్రయత్నం చేసింది. హౌప్ట్‌మన్ నాటకంలో సమస్య ప్రత్యక్షంగా సామూహిక మైనదిగా కనిపిస్తుంది. కన్యాశుల్కం నాటకం స్థూల దృష్టికి ఒక్క సుబ్బి వ్యక్తిగత సమస్యగా కనిపించినా అందులోని అక్షరాక్షరాన్నా ఆ పాత్ర వెనుకనున్న ఒక సామూహిక ఘోష వినిపిస్తూనే ఉంటుంది. అందుచేత ఇది అగ్రవర్ణ సమస్యగా కనిపిస్తుందేగానీ వ్యక్తిగత సమస్యగా ఎక్కడా అనిపించదు. అయితే ఇటువంటి విధానాన్ని అనుసరించడంలో ఐరోపా నాటక రంగంలో హౌప్ట్‌మన్‌కు దక్కిన కీర్తి ఆధునిక భారతీయ నాటక రంగంలో గురజాడకు దక్కిందని చెప్పలేము. గురజాడకు అర్ధశతాబ్ది ముందు కాలం నుంచీ ఆధునిక భారతీయ నాటకకర్తలు ఈ మార్గాన్ని ఎంచుకొన్నారు. కానీ వారెవరిలోను గురజాడలో కనిపించినంత పుష్కలంగా స్వభావవాద నాటక లక్షణాలు బలపడలేదు.

"ది వీవర్స్", 'కన్యాశుల్కం' నాటకాలు రెండింటిలోను కూడా అంత వరకు అంతటా బాగా చలామణిలో ఉన్న రంగస్థల నేపథ్యరచన కనబడదు. లోకంలో ఒక సన్నివేశం ఏ నేపథ్య రచనలో జరుగుతుందో అదే దృశ్య పరికల్పన రంగ స్థలం మీద కూడా కనబడుతుంది. అదనంగా చేసే అలంకరణలేమీ ఉండవు. పాత్రల కదలికలు, ఉద్వేగాలు గిరీష్ చంద్రఘోష్ ప్రభృతులు సృష్టించిన నాటకీయ భూమికలో కనబడవు. ఉదాత్త నాటకీయ శైలికి స్వస్తి చెప్పి ఇద్దరూ సరళ దైనందిన సంభాషణ శైలిని స్వీకరించారు. వాడుకభాషలో పరిపూర్ణంగా నాటకం రాయడంతో గురజాడ తెలుగులో ఒక సరికొత్త ప్రయోగాన్ని విజయవంతంగా చేసి శాశ్వత కీర్తిని సంపాదించుకొన్నాడు. హౌప్ట్‌మన్‌కు కూడా జర్మన్ సాహిత్యంలో ఈ ఖ్యాతి దక్కింది. 'ది వీవర్స్' నాటకంలో అతడు ఉపయోగించిన భాషను విమర్శకులు "రికార్డింగు స్పీచ్" అన్నారు. "Hauptmann's language is authentically realistic, and only rarely forced. He is not striving for effect, of the usual kind, but is recording. Now it is often believed that recording speech is the simplist of writing tasks; but it demands, in fact, an unusual kind of integrety; the greatest dramatic speech is something essentially different from the process of recording. But is requires, nevertheless, an impersonality and a control, which are rare enough"[6] సంభాషణ పరికల్పనలో హౌప్ట్‌మన్, గురజాడలు అనుసరించిన విధానంలో చాలా కాలం తరువాత మార్పులు వచ్చినా సమకాలికంగా వారు చేపట్టిన రీతి కారణంగా ప్రపంచ నాటక చరిత్రలో వారికి గణనీయమైన గుర్తింపు లభించింది. హౌప్ట్‌మన్ ది వీవర్స్ నాటకంలో సాలె పనివారి

మాండలిక భాషని ఉపయోగించినట్లే తన ఇతర నాటకాలలో కూడా వ్యవసాయదారులు, ఒక తరం యువమేధావులు, చాకలి పనివారు, కళాకారులు ఉపయోగించే విభిన్న మాండలిక శైలులు ఉపయోగించాడు. వీరిద్దరినీ సమకాలికుడైన ఐరిష్ నాటక కర్త సింజే జానపదుల భాషను నాటకంలో ప్రవేశపెట్టడానికి సాహసోపేతమైన ప్రయత్నం చేసి విజయాన్ని సాధించాడు. గురజాడ హౌప్ట్‌మన్, సింజేలల విభిన్న మాండలిక శైలులకు ఆకరాలుగా వేరు వేరు నాటకాలను రాయలేకపోయినా కన్యాశుల్కం నాటకాన్నే ఒక విస్తృత సాంఘిక దర్పణంగా సృష్టించి భిన్న వర్గాల, భిన్న కులాల సంభాషణ శైలులకు అందులో స్థానం కల్పించాడు. ఆధునిక ప్రపంచంలో ఆధునిక మానవుని దైనందిన జీవితంలో ప్రతీక్షణం ఎదురయ్యే సంక్షోభాన్నీ, సందిగ్ధతను, సంఘర్షణను నాటక వస్తువుగా ఎంచుకొని హౌప్ట్‌మన్ తన అనంతర నాటక కర్తలకు ఒక వెలుగుబాటను వేశాడు. వైజ్ఞానిక ప్రపంచపు పురోగమనాన్నీ, ఆధునిక సమాజపు వేగవంతమైన పరిణామాలను కంటితో చూడకుండా, చెవులతో వినకుండా, మనసుకెక్కించుకోకుండా, బుద్ధిపెట్టి ఆలోచించకుండా, చిత్ర కళాయాలు, సత్యహరిశ్చంద్రులు, గయోపాఖ్యానాలతో ఆధునిక సమాజం మీద తిరిగి పౌరాణిక వాతావరణపు పొగమంచును కప్పి మారని నూరుపాళ్ళు అంధానుకరణంలో దిక్కుతోచ కుండా చేస్తున్న సమకాలీన తెలుగు నాటక కర్తల తిరోగమన వాదానికి చెప్పి కన్యాశుల్క నాటక రచనతో గురజాడ తెలుగుగడ్డ మీద పరిపూర్ణుడైన ఆధునిక మానవునిగా అవతరించాడు. గురజాడ మీద హౌప్ట్‌మన్ ప్రత్యక్ష ప్రభావం ఏమీలేదు. ఆధునిక భారతీయ నాటకాలలో ఒక్క మేఘ–మాలిని అన్న గుజరాతీ నాటకం మీద మాత్రమే 'ది వీవర్స్' ప్రత్యక్ష ప్రభావం కనబడుతుంది. గుజరాత్‌లో ఆధునికమైన నూలు మిల్లులు స్థాపించబడిన తరువాత స్థానికంగా ఉండే చేనేత పని వారి వృత్తులు చెడి వారి జీవితాలలో తలెత్తిన సంక్షోభం ఈ నాటకం ప్రథమ అంకంలో కనిపిస్తుంది.[7] ఇది తప్ప 20వ శతాబ్ది ప్రథమ పాదం ముగిసే పర్యంతం ఏ ఇతర ఆధునిక భారతీయ నాటకం మీద హౌప్ట్‌మన్ ప్రత్యక్ష ప్రభావం లేదని కచ్చితంగా చెప్పవచ్చును. ఆధునిక ప్రపంచ నాటక గమనాన్ని నిశితంగా

.............. O ..............

**వీరిద్దరికీ లభించిన ప్రతిష్టలో కూడా గొప్ప భేదం కనిపిస్తుంది. నాటకకర్తగా హౌప్ట్‌మన్ ప్రపంచ ప్రఖ్యాతిని పొందాడు. ప్రతిష్ఠాకరమైన నోబెల్ సాహిత్య పురస్కారం ఆయనను వరించింది. గురజాడకు లభించిన ప్రతిష్ఠ ఎంత? తెలుగు దేశపు పొలిమేరలను దాటిన తరువాత గురజాడ ఎందరకు తెలుసు? ఇందుకు తెలుగు వారు ఏ మేరకు బాధ్యులు? అనే ప్రశ్నలు మిగిలి ఉంటాయి.**

.............. O ..............

పరిశీలిస్తూ వచ్చిన కారణంగా మాత్రమే గురజాడ హౌప్ట్‌మన్‌కు సమస్యంధుడుగా మాత్రమే నిలువగలిగాడు. ఆయనకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంది.

హౌప్ట్‌మన్‌కు గురజాడకు కొన్ని భేదాలు కూడా కనిపిస్తాయి. చేనేత పనివారి జీవన సంక్షోభాన్ని చిత్రించడానికి హౌప్ట్‌మన్ గంభీర రచనా మార్గాన్ని అనుసరించాడు. అధిక్షేప సందర్భాలలో కూడా ఆయన గురజాడ కంటే భిన్నమైన మార్గంలో ప్రవర్తించాడు. కెప్టెల్ హౌస్ అనే మతాచార్యుడు చేనేత పనివారి తిరుగుబాటును గూర్చి ఇలా సంభాషిస్తాడు ".... నేత పని వాళ్ళ యాతనలు రవ్వంతైనా తగ్గుతున్నాయా? సంఘంలో శాంతికి మాత్రం భంగం ఏర్పడుతుంది. ప్చ్! లాభంలేదు, లాభం లేదు – ఇలాంటి సందర్భాలలోనే నాకు చెప్పాలనిపిస్తుంటుంది." ఓ చర్మకారుడా! నీ వృత్తిని నీ వంటి పెట్టుకొని ఉండుము. ఇతర ప్రాణులను గూర్చి ఆలోచించవలసి ఉన్న నీవు నీ కడుపు సంగతి పట్టించుకొనరాదు. సుమా! దేవుని శుద్ధ వాక్యమును బోధింపుము. తక్కిన దంతయు పక్షులకు నిలువనీడ, తినుటకు తిండి కల్పించు ఆ ప్రభువు, పొలములోని కలువలకు దుస్తులు తొడుగు ఆ ప్రభువు చేతులలోనే వదలివేయుము.[8] ఇటువంటి సంభాషణలు మతాధికారి దివాలాకోరుతనాన్నీ, నయవంచక మార్గాన్నీ, స్వార్థ చింతనను వెల్లడిస్తున్నాయి. నాటక కర్త మతాధికారిని అధిక్షేపిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కానీ ఇందులో హాస్యస్పర్శలేదు. మిల్లు యజమాని, ప్రభుత్వాధికారి ఎవరు మాట్లాడినా ఈ నాటకంలో ఇలాగే మాట్లాడతారు. ది వీవర్స్‌లోను, కన్యాశుల్కంలోను ఉన్న బీభత్సం సమానమైనదే, అయినా గురజాడ ఆద్యంతమూ కన్యాశుల్కాన్ని హాస్యంలో ముంచెత్తాడు. ఒక దృశ్యంలో కానీ, ఒక సంభాషణలోకానీ బీభత్సకాండ బయటకు కనబడదు.

హౌప్ట్‌మన్ దృశ్యానికి, పాత్రలకు సంబంధించి నవీన నిర్మాణరీతిని అనుసరించిన వర్ణనను సమకూర్చాడు. సంభాషణలలో కూడా వ్యాఖ్యాని ప్రాయమైన వర్ణన కనిపిస్తుంది. 'ది వీవర్స్'లోని దృశ్యాలు సంతృప్తికరంగాను, శక్తివంతంగాను కనిపించినా సహృదయుడు దానిని చూచేటప్పుడు దృశ్య పరికల్పనకు సంబంధించిన పరిమితులకు లోబడి ఉండాలి. ఆ దృశ్యాలలో నిర్వహించబడే వస్తువు ఒక నవలతో వర్ణిస్తే ఏ రకంగా ఉంటుంది? అన్న స్పృహ మాత్రమేకాక నాటకీయమైన ఫలితాన్ని సాధించడంలో ఉండే క్లేశాన్ని కూడా స్పృహలో ఉంచుకోవాలి. నాటకం రంగస్థలం మీద చూపలేని విషయాలను గూర్చి కూడా యోచించాలి.[9] అని విలియమ్స్ భావించారు. "తెలుగులో మొట్టమొదటి నవల కన్యాశుల్కం" అన్న హరిపురుషోత్తంగారి విమర్శను పరిగణించి ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య "కన్యాశుల్కం ఒక నవలా నాటకం, లేదా, నవలా నాటకాల మధ్య నలిగిన కన్యాశుల్కం" అనే శీర్షికతో కొంత చర్చ చేశారు.[10] "కన్యాశుల్కం మహానాటకంగానే కాదు, మహత్తర కావ్యంగా కూడా రాసింది" అని సెట్టి ఈశ్వరరావు పేర్కొన్నారు.[11] శ్రీశ్రీ ప్రభృతులు కూడా కన్యాశుల్కాన్ని మహాకావ్యంగా అభివర్ణించారు. భారతీయ కావ్య శాస్త్ర మర్యాదననుసరించి నాటకాన్ని కూడా మహాకావ్యంగా అభివర్ణించడం సర్వ సాధారణం. కానీ నవల అనడం ఇంతకంటే భిన్నమైన విషయం. నవల లక్షణం వేరు, నాటకం లక్షణం వేరు. కన్యాశుల్కంలోని విస్తృతిని బట్టి, విషయ వైశాల్యాన్ని బట్టి తాత్కాలికాంశాలను ఆశ్రయించినా, శాశ్వతమైన విలువలను సాధించడాన్ని బట్టి దానిని ఆధునిక మహాకావ్యంగా అభివర్ణించడంలో తప్పులేదు. కానీ కన్యాశుల్కంలో నవలా లక్షణాలు కనబడవు. వస్తు సంబంధమైన వాతావరణ పరికల్పనలోను, పూర్వాపర వస్తు సంగ్రథనంలోను, పాత్రల అంతరంగ విశ్లేషణలోను, సంఘర్షణను చిత్రించడంలోను నవలలో ఎక్కువ వెసులుబాటు కనిపిస్తుంది. రచయితకు స్వేచ్ఛ అక్కడ ఎక్కువ. నాటక

శిల్పంలో ఇంతటి స్వేచ్ఛ ఉండదు. నాటకకారుడు ఎన్నో పరిమితులకు లోబడవలసి ఉంది. ప్రపంచ నాటక శిల్పాన్ని ఆమూల చూడంగా ఆకళించుకొన్న ప్రతిభాశాలి గురజాడ. ఎన్నో నాటకాలలో కనిపించే నవలా లక్షణాలను ఆయన బుద్ధి పూర్వకంగా తన నాటకంతో పరిహరించాడు. కన్యాశుల్కం నాటకానికి పూర్వరంగాన్ని ఆయన సృష్టించలేదు. రంగస్థల సూచనలు చేయలేదు. నేపథ్య రచనను గూర్చి నోరెత్తలేదు. సుమారు 50 పైబడిన పాత్రలు కన్యాశుల్కంలో కనిపించేవి, కనిపించనివి ఉన్నాయి. ఏ ఒక్క పాత్ర స్వభావాన్ని కూడా తానై వేరుగా ప్రకటించలేదు. పాత్రల వయస్సునుగానీ, గుణగణాలుగానీ, రూపురేఖా విలాసాలను గూర్చిగానీ, దేహ ప్రమాణాన్ని గూర్చిగానీ చెప్పలేదు. కానీ కన్యాశుల్కం చదివిన వారికి ఎక్కడా గురజాడ ఈ విషయాలను చెప్పవలసిన అవసరం కనిపించదు. ఏ దృశ్యమైనా అసమగ్రంగా గానీ, ఇంకా కొన్ని విషయాలను ప్రేక్షకుల ఊహకు వదిలేసినట్లుగాగానీ, నాటక శిల్పానికి ఒదగనట్లుగానే కనబడవు. ప్రదర్శనకు వీలుకానంతగా విస్తరించిందనే అభియోగమే బలంగా కనిపిస్తుంది. కొన్ని స్వగతాలు తప్ప సంభాషణలు సుదీర్ఘంగా గానీ, వర్ణనాత్మకంగా గానీ ఎక్కడా కనబడవు. ఇటువంటి విషయాలను దృష్టిలో పెట్టుకొని చూసినపుడు ఇబ్సన్, హౌప్ట్‌మన్, షా వంటి స్వభావవాద నాటక కర్తల కంటే మించిన నాటక కళాకుశలతను ప్రదర్శించాడు.

హౌప్ట్‌మన్‌కు గురజాడకు గల స్పష్టమైన భేదం ఇంకొకటి వారి వ్యక్తిత్వంలో కనిపిస్తుంది. హౌప్ట్‌మన్‌ను గూర్చి "Many of his nature works reflect a certain duality of his nature, a tension between the antique and the modern, paganism and christianity, nature and civilization"[12] అన్న విమర్శ ఉంది. గురజాడ గతంతో కానీ, మతంతో కానీ రాజీపడని పరిపూర్ణుడైన ఆధునికుడు, ఈ నిర్ద్వంద్వ వైఖరి కారణంగా ఒక శతాబ్ది కాలం తరువాత కూడా ఆయన గౌరవింపబడుతున్నాడు. భవిష్యత్సమాజం ఆయనను గౌరవిస్తూనే ఉంటుంది. గురజాడ, హౌప్ట్‌మన్ లిద్దరు నాటక ప్రక్రియతోపాటు ఇతర సాహిత్య ప్రక్రియలను కూడా సుసంపన్నం చేశారు. ఆధునిక సాహిత్య ప్రక్రియలకు శ్రీకారం చుట్టడం హౌప్ట్‌మన్‌లో కన్నా గురజాడలో కనిపించే ఇంకొక విశేషం. ఇంత జరిగిన తరువాత వీరిద్దరికీ లభించిన ప్రతిష్టలో కూడా గొప్ప భేదం కనిపిస్తుంది. నాటకకర్తగా హౌప్ట్‌మన్ ప్రపంచ ప్రఖ్యాతిని పొందాడు. ప్రతిష్ఠాకరమైన నోబెల్ సాహిత్య పురస్కారం ఆయనను వరించింది. గురజాడకు లభించిన ప్రతిష్ఠ ఎంత? తెలుగు దేశపు పొలిమేరలను దాటిన తరువాత గురజాడ ఎందరకు తెలుసు? ఇందుకు తెలుగు వారు ఏ మేరకు బాధ్యులు? అనే ప్రశ్నలు మిగిలి ఉంటాయి.

**అధస్సూచికలు**


1. Abburi Ramakrishna Rao, Living Theatre, Appa Rao and Hauptmann, Abburi Trust, Hyderabad, 1996, P.14
2. జర్మన్ సంప్రదాయ సాహిత్య దర్పణం, అనువాదం : బి.వి. సింగరాచార్య, ఎ. పద్మరాజు, బొ. శ్రీనివాసాచార్యులు, దక్షిణ భాషాపుస్తక సంస్థ, మద్రాసు, 1971, పేజి. 343
3. Raymond Williams, Drama from Ibsen to Eliot, Penguin Books in Association with Chatto & Windus, 1967, p.195
4. Abburi Ramakrishna Rao, Living Theatre, Appa Rao and Hauptmann, Abburi Trust, Hyderabad, 1996, p.14
5. Raymond Williams, Drama from Ibsen to Eliot, Penguin Books in Association with Chatto & Windus, 1967, p.194
6. Ibid, p.196
7. R.K. Yagnik, The Indian Theatre It's origin And its listen developments under European Influence, George Allen & Unwin Ltd. London, 1933, p.235
8. జర్మన్ సంప్రదాయ సాహిత్య దర్పణం, అను : బి.వి. సింగరాచార్య, ఎం. పద్మరాజు, బొ. శ్రీనివాసాచార్యులు, దక్షిణ భాషా పుస్తక సంస్థ, మద్రాసు, 1971, పేజి. 346
9. Ramond Williams, Drama from Ibsen to Eliot Penguin Books in Association with Chotto & Windus, 1967, p.195
10. కోవెల సంపత్కుమారాచార్య, కన్యాశుల్కం మరోవైపు అభినవ ప్రచురణలు, హైదరాబాద్ 2000, పుట. 18
11. సెట్టి ఈశ్వరరావు కన్యాశుల్కం ఒక అపూర్వ సృష్టి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1992, పుట. 34
12. Lillian Herlands Hornstein, The Readers companion to world Literature, The New American Library, New York and Toronto, 1956, p.200


V

## పేరు పంపండి

ఈ సంచికలో భూతనక అనే కథ ప్రచురించాలనుకున్నాం. కాని కథారచయిత కథపై తన పేరు రాయలేదు. ఇలాటి సమస్యలు అప్పుడప్పుడూ ఎదురవుతుంటాయి. జత పరచిన ఉత్తరాలపైనే కాదు– రచనపైన కూడా రచయిత పేరురాయడం తప్పనిసరి అని గమనించగలరు. ఈ కథారచయిత తన పేరు వెంటనే మా కార్యాలయానికి తెలియజేయ ప్రార్థితులు.

– ఎడిటర్

# శతాబ్దాల యుద్ధం తర్వాత



**భూషి కృష్ణదాసు**




కోటలో ప్రవేశించే ముందు
సింహద్వారం ముందు
పడివున్న ఫిరంగిని చూస్తాము
ఫిరంగిలో మునుపటి జ్వరం
ఇప్పుడులేదు
శతాబ్దాల యుద్ధం తర్వాత
ఎన్నో రక్తపుటేరుల మధ్య
మూగవోయిన సైనికుని గొంతులా
వుందాఫిరంగి

కథ

# గావు



*గొంతు మీద కత్తి వెనక్కు ముందుకు కదలగానె సర్‌న, గొంతుతెగి రక్తం చిమ్మింది. అట్లా పొద్దంతా కోళ్లను, మేకలను కోస్తూనే ఉంటారు. అంతేకాదు వాటి వాటి కాళ్లను తెగకోసి గుడి ముందలి పందిరికి వేలాడతీస్తారు. గుడిలో దీపధూపాలు వెలుగుతూనే ఉంటాయి. బోనాలు సాకలు సాగుతూనే ఉంటాయి. గుడి చుట్టూర భక్తులు తండోపతండలు. ఇసుక చల్లినా రాలని జనం. ఇక్కడ రెండు గుళ్ళు ఉన్నాయి. ఒకటి వెజిటేరియన్‌ది. రెండవది నాన్ వెజిటేరియన్‌ది. మొదటి గుడి దగ్గర బ్రాహ్మణ పూజారి, రెండవ గుడి దగ్గర దళిత పూజారి.*

**జి. వెంకటకృష్ణ**

ప్రభుత్వం జీవహింస చేయరాదని చాటిస్తూనే ఉన్నా ఎవరు వినటం లేదని అక్కడ పారే రక్తం సాక్ష్యం. ప్రతీ శుక్రవారం అక్కడ ఓ పెద్ద జాతర. ఇదే విషయాన్ని పత్రికల వాళ్ళు పలుమార్లు ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చారు. జీవకారుణ్య సంఘం వాళ్ళు కరపత్రాలు పంచడం ద్వారా, ఉపన్యాసాల ద్వారా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఈసారి తమ సంఘపు కార్యదర్శినే పంపారు. సారధికి నలుబది ఏళ్ళు ఉంటాయి. బాగా చదువుకున్నాడు. సంస్కారవంతుడు జిల్లా యంత్రాంగాన్ని కలిసి సహకారాన్ని కోరగా వాళ్ళు తగు సహకారాన్ని అందిస్తాం అని హామి ఇచ్చి పోలీసు ఫోర్స్‌ను ఆయనకు అందుబాటులో ఉంచారు.

అప్పటికే అక్కడ ఎండోమెంటు వాళ్లు ఆ గుడిని తమ పరిధిలోకి తీసుకుని నిర్వాహణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ వస్తూ వున్నారు. జనం ఇబ్బంది పడకుండా మంచినీళ్ల ఏర్పాటు, నీడ కోసం వెదురు తడికల పందిళ్లు వేయించారు. జంతు బలిని ఆపడం వాళ్ళ వశం కాలేకపోతుంది. ప్రభుత్వ ఆదేశాలను మైక్‌లో చెబుతూనే ఉన్నారు. రక్తం పారుతూనే ఉంది. పోలీసు వాళ్ళు వస్తూపోతూ వున్నారు. జరిగేది జరుగుతూనే ఉంది. జనంలో నిల్చోని తతంగం అంతా చూస్తున్నాడు సారధి. అప్పుడే గ్రామ కార్యదర్శి వచ్చి నమస్కరించి సారధి పక్కన నిలుచోని "తన పేరు రవి" అని పరిచయం చేసుకున్నాడు. అప్పుడే అక్కడికి ఓ కొత్త మోటార్‌బైక్ వచ్చి ఆగింది. నడుపుతూ వచ్చిన యువకుడు వెనుక కూర్చున్న వ్యక్తి దిగిరాగా ఆ పెద్దాయనను చూపిస్తూ రవి, "వీరు లింగన్నగారు మొన్ననే రెవెన్యూ ఆఫీసర్‌గా రిటైర్ అయ్యారు.

"వీరు సారధిగారు, రాష్ట్ర జీవకారుణ్య సంఘ కార్యదర్శి, హైదరాబాద్ నుండి వచ్చారు." బాగా చదువుకున్న వారు ఇదే విషయంపై పరిశోధన చేస్తూ విదేశాలకు వెళ్ళొచ్చారు. ఈ రోజు ఇక్కడ జరగబోయే గావు ఆపించాడానికి వచ్చారు. అంటూ పరిచయం చేసాడు రవి. ఇద్దరు నవ్వు ముఖాలతో చేతులు కలుపుకున్నారు.

'టైంపాస్ పల్లీకాయలు' అంటూ తినుబండారాల గంపతో వచ్చి నిలుచుంది. ఓ ముసలమ్మ

"ఏమిస్తవు గుగ్గిల్లు వద్దు" అన్నాడు కార్యదర్శి.

"అవును జనంలో తిరగడంవల్లా దుమ్ము దూళి పడుతుంది" అన్నాడు సారధి.

"అయితే శనక్కాయలు తీసుకుందాం" అన్నాడు రవి.

"సరే పలుకులు లోపలుంటాయి. ఫరవాలేదు" అనగానే చెరొపొట్లం అందించింది. "అవ్వా రోజుకు ఎన్ని రూపాయలు సంపాదిస్తావు" అన్నాడు సారధి ఆమెకు పైసలిస్తూ...

"ఏం సంపాదన సార్. నేనొక్కదాన్నేనా అటు చూడండి. ఎంత మంది నెత్తిన తట్టలున్నాయో. మొదట ఇక్కడ నేను ఒక్కదాన్నే ఉంటి, రానురాను మంది ఎక్కువైరి. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచగయినట్టు అంతా గిట్టుబాటు ఉండదు. ఈ వయస్సులో వేరే పని చేయలేక ఈ పనిని పెట్టుకున్న. పొట్ట గడవాలిగదా" అన్నది తట్టలోని శనకాయలను కదిలిస్తూ గత వర్తమానాలను గుర్తుకు తెచ్చుకొని...

"నా కంటే అక్కడ పుట్ట ఎదురుగా కూర్చున్నారు చూడండి వాళ్లు చాలా నయం" అంటూ వేలుతో అక్కడ కూర్చున్న వాళ్ళను చూపించింది. అక్కడ నడీడువాళ్లు వరుసగా వడ్డనకు ఎదురు చూస్తూ విస్తళ్ళ ముందు కూర్చున్నట్టు ఎదురుగా గుడ్డలను పరుచుకొని ఓ పది మందిదాకా కూర్చున్నారు. వాళ్ళ ఎదురుగా కూర్చున్న వాళ్ళు ప్రశ్నలు వేస్తుంటే వెంట్రుకలు ఈరపోసుకుని తలలను అటు ఇటు ఊపుతూ మధ్యమధ్య కేకలు వేస్తూ కొలుపు చెబుతూ ఉన్నారు. "పది రూపాయల నోటు గుడ్డలో ఉంచి తమ అనుమానాలకు చెప్పే జవాబులను వింటూ, మధ్యమధ్య వాళ్ళ ముందున్న గవ్వల బుట్టకు మొక్కుతున్నారు. చూస్తున్నారా?" అంది అవ్వ.



''చూస్తున్నా'' అన్నట్టు నవ్వు ముఖంతో తలాడించాడు సారధి. పల్లికాయలను వొలుచుకొని నోట్లో వేసుకుంటూ.

"వాళ్లు గణాచారిణులు, పూనకం వచ్చినపుడు జరిగింది, జరిగేది, జరగబోయేది చెబుతుంటారు." అన్నాడు రవి.

"గణం లేదు ఆచారం లేదు వట్టి దగా" అన్నాడు సారధి.

"కాకపోతే ఏంది మరి" అంది అవ్వ ఇంక రెండు పొట్లాలు అందిస్తూ.

ఆమెతో సంభాషణ కొనసాగించాలి కనుక తీసుకున్నారు.

ఈ లోపు ఓ యువకుడు, గుడిదగ్గిరి నుండి ఓ నిమ్మకాయను తెచ్చి నల్లదారానికి కుచ్చి నెంబర్‌ప్లేట్ తగిలించి గుడి దగ్గర పూజ ముగించుకొని తెచ్చిన కొబ్బరి చిప్పను తన తండ్రికిచ్చి బండి దగ్గరే నిలుచోమ్మని చెప్పి నాన్ వెజిటేరియన్ గుడివైపు నడిచాడు.

"వీళ్ళందరు ఈ చుట్టు పక్కల గూడెలవాళ్ళే సారూ. కష్టం చేతగాక దీనికి మరిగింద్రు. ఈ వచ్చే పోయేవాళ్లు వాళ్ళ మాటలే నమ్ముతున్నరు" అంది ఏదో దీర్ఘ శ్వాసను వొదులుతూ. ఈ లోపల ఇంతకు ముందు నాన్ వెజిటేరియన్ గుడివైపు నడిచిన యువకుడు కోడిపుంజును కొసుకొచ్చి, రక్తం కారుతున్న దాని మొండాన్ని వాహనపు మడ్‌కాడికి తాకించగా అక్కడ రక్తపు మరకలైనాయి.

అది చూసిన అవ్వ "ఎందుకయ్య బండికి రక్తం అంటిస్తున్నావ్! ఎప్పుడు నీ బండి రక్తాన్నే చూడాల్నా" అంది ఆ యువకుడివైపు చూస్తూ,

పల్లికాయలు తింటున్న తండ్రి వెంటనే పల్లికాయలను చేతిలో వంచుకుని అదే కాగితపు ముక్కతో రక్తపు మరకలను తుడిచేసాడు.

ఆ మాట ఆయనకు ఏదో గుర్తు చేసినట్టుంది, అదీ మనిషి భయమంటే. అనుకున్నాడు సారధి, కాని బయటికి అనలేదు. మిత్రుడు నొచ్చుకుంటాడేమో అని. సారధి ఆలోచనల్లోకి వెళ్ళిపోయాడు. మూఢనమ్మకాన్ని పొట్టువలిచి గింజను చేతికిచ్చినట్టు చెప్పింది ఆ అవ్వ.

"ఇక్కడ అందరూ అట్లానే చేస్తున్నారవ్వ" అన్నాడు ఆ వెహికిల్ యువకుడు.

"ఇక్కడ జరిగేదయ్య తోటోడు తోడకొసుకుంటే మరొకడు మెడ కోసుకుంటడు వెనుక ముందు ఆలోచించేదిలేదు" అన్నది తట్టను నెత్తికి ఎత్తుకుంటూ.

"అట్ల ఆలోచించేదయితే ఇక్కడికి రానేరారు" అన్నాడు ఆ యువకుని తండ్రి లింగన్న

"ఆ మూలన ఎవరో తాగుతున్నట్టుంది" అన్నాడు మళ్ళీ తానే.

"చుట్టు చూడండి అక్కడక్కడ కల్లొట్లు పొంగుతూనే ఉన్నాయి. అసలు ఎల్లమ్మ తల్లికే కళ్లు సాగ పెడతరు కదా? కాబట్టి తాగితే ఏం తప్పులేదు తాగొచ్చు. ఆ గణాచారిణిలందరు కల్లుసార తాగి ఊగుతున్నల్లె అంది" చూస్తూ వెటకారంగా.

V V V

"రవి ఇక్కడ ఈ ఎల్లమ్మ దేవత ఎట్లా వెలిసిందట? ఓ పదేండ్ల కిందట నేను ఇటు నుండి పోయినపుడు ఏం లేకుండే"

నిజమే ఓ చిన్న పుట్టవుండె. పక్క ఊరి గొల్ల మల్లయ్య మా ఊరి పాలు పోసుకుని రోజు పొద్దున్నే ఇక్కడ నుండే పోతుండేట. ఒక రోజు పొద్దున పుట్టలో నుండి పడిగ పైకెత్తి నాగుపాము సూర్యునివైపు చూస్తుందట. అది చూసి సైకిల్ ఆపి, దండంపెట్టి ఇన్నిపాలు ఆరపోసి పోయిండట. అప్పటి నుండి పాము కనిపించినా కనిపించకపోయినా పుట్టలో ఇన్నిపాలు పోసి పోయేది. ఒక రోజు మరచిపోయి పాలు పోసి పోలేదట. నల్లగొండ చేరి చూస్తే పాలన్ని పగిలిపోయాయట. ఇక అప్పటి నుండి పాలవాళ్లందరు పాలుపోసి పోతూ ఉండేది. ఇక చూడు ఆ పుట్ట రోజురోజుకు ఎంతో ఎత్తు పెరిగి మరెంతో చుట్టు పెరిగింది. అప్పటి నుండి కల్లుగీసేవాళ్లు, కల్లుకొనేవాళ్లు అక్కడ కల్లు వంచుతు వచ్చారు. రాను రాను కొందరు కొబ్బరికాయలు కొడుతూ వచ్చారు. గొల్ల మల్లయ్యే కాషాయ వస్త్రాలు ధరించి పూజలు చేస్తూ ఇక్కడే ఉంటూ వచ్చాడు. చుట్టు పక్కల గూడాల వాళ్లు ఏటేట ఎల్లమ్మ పండుగ చేస్తూ వస్తున్నారు. రాను రాను రద్ది పెరిగి ఇగో ఈ తీరుగ మారిపోయింది. చుట్టు పట్టు ఊరి జనమేకాదు పక్క పట్టణ జనాలు వచ్చి పూజలు చేయిస్తున్నారు. ఇప్పుడు ఈ గుడికి ఓ కమిటీ ఏర్పడి పనులు జరిపిస్తున్నారు. చుట్టు ఉన్న వాగులు వంకలు అన్నీ సత్రాలు, చావల్లు, ప్రతి చెట్టు దగ్గర ఓ గుంపు. ఇక్కడ సార దుకాణాలు, కొబ్బరికాయలు దుకాణాలు, సైకిల్ స్టాండ్లు, ప్రతి ఏటా వేలం పాటపాడుతరు. ఎవరు ఎక్కువ పాడితే అడ్డ అల్లదే, అది సంగతి"

గణాచారిణుల వైపు చూపిస్తూ అక్కడ వాళ్ళ ఎదురుగ పట్టణ స్త్రీలు గూడా కూర్చొని పది రూపాయల నోటు వుంచుతూ కొలుపు అడుగుతున్నారు. అదిగో ఆమె చదువుకున్నామెలాగనే ఉంది. మంచి చీరకట్టింది. ఆ పిచ్చి ముండ ముందు కూర్చొని మొక్కుతు అడుగుతూ ఉంది" అనగానే అటు చూసాడు సారధి. మెల్లగా వెళ్ళి ఎవరికోసమో ఎదిరి చూస్తున్నట్టు చూస్తూ వాళ్ళ సంభాషణ వింటున్నాడు.

"తల్లీ ఉన్నది ఉన్నట్టు చెప్పు" అంటు పది రూపాయలు నోటు వుంచి, చేతులు జోడించింది.

"చెపుత, చెపుత ఉన్నదున్నట్టె చెప్పుత. మామిరాల ఎల్లమ్మ బైలెల్లు తల్లి" అంటూ స్మరించింది. గవ్వల గుల్లను కదిలించింది. ఏవేవో జ్ఞాపకాలు తెచ్చుకున్నట్టు కళ్ళు మూసుకుంది. సారధి వాళ్ళనే గమనిస్తున్నాడు.

"ఎందుకే చెల్లి బిత్తర బిత్తరగా చూస్తున్నావు. ఆరోగ్యంగా ఉన్నవు. అందంగా ఉన్నవు. ఆ బెదురేంది? ఆ ఆదురెంది మామిరాలెల్లమ్మ కొలుపునకు రావే అంటు ముందున్న గవ్వల గుల్లకు మొక్కింది "కెక్‌కెక్" మని అరిచింది. అప్పుడు ఆమె కనుగుడ్లు కొంచెం పెద్దగాను మరికొంచెం ఎర్రగాను కనిపించాయి. మరోసారి "కెక్‌కెక్" అంది. ఎదుట కూర్చున్న స్త్రీ ఆమెనే చూస్తూ ఉండిపోగా ఆమె పెదాల మీద చూపు నిల్చింది.

"ఏం చెప్పను ఎప్పుడు ఏదో గుబులు. ఎవరో తరుముతున్నట్టు అదురు" అంది గవ్వల గుల్లనే మొక్కుతు.

"ఆమెకు ఎపుడో విన్న ఎల్లమ్మ కథ గుర్తొచ్చి వళ్ళు జల్లుమంది గుండెను చేత్తో అదిమి పట్టుకొంది. అప్పుడు కొంగు తొలగి ఎదపై వేలాడే పుస్తే కనిపించింది. దాని కింద కొట్టునే గుండె వేగం పెరిగింది.

"ఊ అను, అవునను" అన్నప్పుడు కళ్ళలో సిగ్గు, వంట్లో తెలియని భయం పెదవులు వణుకుతున్నాయి.



''చూడు చెల్లీ దేవతగూడ ఆడదేకదా. ఆడదయినందుకు ఈ బాధలు తప్పవు మరి" అంది దీర్ఘం తీస్తూ...

"చేస్తే ఓ బాధ చేయకుంటె ఓ బాధ" అన్నప్పుడు వొల్లు విరుపుతో కూడిన ఆవలింత వచ్చిపోయింది. కాని ఆమె కళ్ళు కొంచెం మసకగా మారి ఆ మసకలో తన భర్త ముఖం కదిలి మరింత భయపెట్టింది.

'పిల్లలు కాక ఎంటబడ్డోన్ని కాదనలేకపోతి, అటు పిల్లలు కారయిరి ఇటు వీడు ఎప్పుడూ ఎంటపడుతూనే వుండే ఎట్లా?" అని విసుక్కుంటూ పక్కకు చూసింది. అక్కడ అతను!

కాసేపు కళ్లు అతనినే చూస్తూ వుండిపోయినయి! చూడొద్దు అని మనస్సు చెపుతున్నా కళ్ళు వినలేదు.

అతను అంతే!

తమ చూపులు కలిసేది ఎవరన్న చూస్తున్నారేమో అనుకుంటూ చుట్టూ ఓసారి చూసి కొంగు నిండుగా వుండేటట్లు సరిచేసుకుంది.

అది గమనించిన గణాచారి ''వాడు నిన్ను నీడల వెంటాడుతున్నడు. చూసి నడుచుకో" అంది అతను నిలుచున్న వైపు తలను తిప్పి చూపిస్తూ.

V V V

"అసలు ఈలాంటి ప్లేసుల్లో రాత్రులే ఎక్కువ పని వుంటుంది. లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్స్ ఉంటాయిగద. దొంగ, దొర అందర్కి అడ్డగదా, ముఖ్యంగా దొంగగేగులు నమిలేటోల్ల సంగతి చెప్పనక్కరలేదు. అంతేనా రవి" అన్నడు నవ్వుతూ లింగన్న.

"అంటే రవి" అని అడిగాడు సారధి ఆ మాట అర్థంగాక,

"రవి సిగ్గుగా చూస్తు "సారునే అడగండి సార్" అన్నాడు లింగన్న వైపు" చూస్తూ.

"అదే చారం, వ్యభిచారం" అన్నాడు నవ్వుతు లింగన్న.

"అంతేనా" అన్నట్టు రవి చూసాడు సారధి.

"చాటు మాటొళ్ళకు ఓ అడ్డా కదా? జెర్ర చీకటి పడనీతే, ఎక్కడపడితే అక్కడ జంటలే జంటలు" అన్నడు రవి.

"ఈ జాతరలు, తిర్నాలు లంజమిండెలకు అనువైన అడ్డాలు అనుకో. నేను గిర్దావర్ చేసేటపుడు చూసేదిగ" అన్నాడు లింగన్న ముసిముసిగా నవ్వుతు.

'ఇది అనాది నుండి వస్తున్న పరంపర. మనిషి శృంగారం కోసం దేనిని లెక్కచేయడు. వెనుకట రాజ్యాలకు రాజ్యాలు కూలిపోయాయి. హత్యలు ఆత్మహత్యలతో మనిషి చరిత్రంతా మరకలు మరకలు, అన్నది గుర్తొచ్చింది సారధికి.

"సరే రక్తి విషయం వొదలండి సందు దొరికినా, చాటు దొరికినా అవి నడుస్తూనే ఉంటాయి కాని ఆ మూఢభక్తి చూడండి, ఆ తెగే ప్రాణులు, ఆ పారే సాకలు, ఎంత ఆహార పదార్థం నేలపాలై పోతుందో చూడండి?" అన్నాడు సారధి.

"మనిషికి భయం కలుగుతుంది. ఆ భయం నుండి విముక్తి పొందడానికి ఆ మొక్కులు. వాటిని తీర్చుకోవడానికి ఈ తిప్పలు, తెలియకుండా జరిగిపోయే తప్పులు, పెరిగే అప్పులు! ఈ చెట్టుకు పుట్టకు పూజలు చేయటం ఆటవిక లక్షణం. సైన్స్ పెరిగినాక కూడా ఈ మూఢ నమ్మకాలేమిటి? ఇక పుట్ట పెరగడం అంటారా వస్తు పోతూ బాట పక్కన పుట్ట ఉన్నది అందరు చూసినదే. ఎప్పుడైతే ఆ యాదవులు రోజు పాలు పోస్తూ వచ్చిరో ఆ తడికి అంటే తేమకు చెదలు పుట్టను పెంచుతూ వచ్చింది. అది చూసి జనం ఇక్కడ దేవత వెలిసిందని నమ్మసాగారు? ఆ నమ్మకం ఇంత వరకు వచ్చింది. ఈ రోజు ఇక్కడ ఓ వ్యాపార అంగడిగా మారింది" అన్నాడు లింగన్న సారధివైపు చూస్తూ.

"మీకో విషయం తెలుసా పాము పాలు తాగదు. ఈ విషయాన్ని శాస్త్రీయంగా రుజువు చేశారు. ఇక వ్యాపారం అంటారా పదుగురు కలిసిన చోటు అంగడే కదా అయ్యేది" అన్నాడు సారధి.


"అవును సార్, ఇక్కడ అమ్ముడుపోని వస్తువులేదు. మట్టిని పొట్లాల్లో కట్టి పట్టుకుంటే కొనేవాళ్ళున్నారు. గాలి మాటలను పైసలు పెట్టి వినేవాళ్ళు ఉన్నారు. అక్కడ కూర్చున్న గణాచారులనే ఆ శాడిస్టు ఆడవాళ్ళే చూడండి తోటి ఆడవాళ్ళు అనుమానాన్ని తీర్చలేరు, పోగా భయాన్ని కలిగించి అదో ఇదో మాయ మాటలు చెప్పి డబ్బులు గుంజుతూనే ఉన్నారంటే ఇక్కడ మోసం ఎంతుందో ఆలోచించొచ్చు" అన్నాడు రవి.

''జరిగే మోసాలను జనానికి తెలియజెప్పి నిజంవైపు మళ్ళించాలి" అన్నాడు సారధి.

"వాళ్ళు వినరు సార్ వింటే ఈ హంగామా ఎందుకు" అన్నాడు రవి.

"ఏదో తెలియని మూఢనమ్మకాలతో ఇట్లా చేస్తుంటారు. వాళ్ళ ఆలోచనా సరళిని మార్చాలి. వీళ్ళలో చాలా మంది రోజు కూలీలే.

పొద్దంతా పని చేసి సంపాదించిన కూలి డబ్బులను కర్పూరం లాగా కాల్చేస్తరు, మత్తు ఎక్కే వరకు మద్యం తాగేస్తరు. తిండి మీద ధ్యాస ఉండదు. పోగా అప్పులు చేయడం. ఆ మధ్య ఓ ఊరు వెళ్ళాను అక్కడ అప్పుడే ముత్యాలమ్మ పండుగ జరుగుతుంది. అది కేవలం దళితులు జరుపుకుంటున్నారు. ఊళ్ళల్లో కులాల వారీగా దేవతలుంటారుగా, చుట్టపక్కాలను పిలుచుకున్నారు. ఇంటికో ఇరువై మందికి పైగానే వచ్చారు. తలా ఓ మేకనో గొర్రెనో గుడి ముందు నరకడం, తెచ్చుకొని అందరు కలిసి ఆరగించడం, తాగడం, దగ్గరి వాళ్ళకు కొత్త బట్టలు ఇచ్చిపుచ్చుకోవడం జరిగింది. తీరా ఆ పండగ పేరు మీద ఇరువై ఇళ్ళ దళితులకు ఆ రెండు రోజులు ఖర్చు లక్షపైన్నే అయిందట. చాలా మంది చేసింది అప్పేనట, పోగా ఆ రెండు మూడు రోజుల పని మాని ఉండడంవల్ల ఆరు వేల అదనపు నష్టం ఆ ఊరివాళ్ళకు. వచ్చిన వాళ్ళు రెండు రోజుల పని మానడంవల్లా అదనంగా ఎనిమిది పది వేలు. ఇట్లా ఆర్థికంగా ఎంతో నష్టం. మనకు తెలియకుండానే జరిగిపోతుంది. మనలో చాలా మంది మామూలు పండుగలు తప్ప ఇలాంటి పండుగలు చేయరు. ఈ దుబారా చేయరు ఇట్లా చేసేది ఈ బహుజనులే" అంతే కాకుండా ఇది ఆటవిక విధానాన్ని, అవాంఛనీయమైన తీరున. జంతువులకు మనిషికి ఉన్న ఆలోచన బుద్ధి లేకున్నా మంచి చెడులను గుర్తించే గుణం ఉంది. అందుకే అవి ఎండవానలకు స్పందిస్తాయి. చావుకు భయపడి రక్షణకోసం పరుగెత్తుతయి. సంతోషం కలిగినపుడు ఎగిరి గంతులేయడం భయం కలిగినపుడు వణికిపోవడం. మనం చూస్తూనే ఉన్నాం. ఇట్లా బలిలో ఒకదాని ముందు మరొక దానిని వధించడం చూసి అవి తల్లడిల్లిపోతయి. 'ఏ ప్రాణికైన సరే చచ్చేక్షణం వరకు చావు గురించి ముందే తెలువకూడదు. అందుకే ఈ భయంకర బలిని ఆపాలి" అన్నాడు సారధి.



"మనలోనే చాలా మంది నాగరికంగా బతకడం చూస్తున్నాం." అని కాసేపు ఆగి –ఎవరి నమ్మకాలను కాదనను కాని అవి సైన్స్‌కు దగ్గరగా ఉండాలి. ఆ నమ్మకాలవల్లా అటు ఆర్థికంగా ఇటు సామాజికంగా ఎదుగుదల కూడా ఉండాలి".

సారధి సెల్ కలిపి చెవుదగ్గర పెట్టుకోగా

"హలో" అవతలి గొంతు.

"సర్ డియస్‌పిగారా, నమస్కార్ నేను సారధిని"

"చెప్పండి"

"సాయంత్రం పోర్స్‌ను పంపండి. అమ్మవారికి బలిస్తారంట"

"ఆ సరే" అంటు సెల్ ఆఫ్ చేశాడు.

సెల్‌ను తన జేబులో వేసుకుంటూ కార్యదర్శి వైపు చూసాడు సారధి.

"అవును సార్, ఎల్లమ్మను బావికి తీసి స్నానం చేయించి తిరిగి తీసుకొస్తరు. వచ్చేటపుడు జనం జీవాలను గావు పడతరట" అన్నాడు.

"ఈ రోజు అది జరగకుండా చూడాలి. పోలీసులు వస్తున్నారు" అన్నాడు సారధి.

"ఆపడం కష్టంసార్. మనం ఎంత కాపలకాసినా సరే ఆ టైమ్‌కు అవి జరిగిపోతూనే ఉంటాయి" అన్నాడు రవి.

పొద్దు బారెడుంది. ఒక్కసారే డప్పులు చప్పుడైంది. జనం గుడి చుట్టూ చేరారు. బొడ్లోని సీసాలను నోట్లో వంచుకున్నారు. మనుషుల్లో అదనపు శక్తి చేరింది. కేకలు, ఈలలు, చూస్తూ వుండగానే గుంపుగా మారిపోయారు. డప్పులు మోగగానే జనం నడకలో వేగం పుంజుకుంది. గుడి నుండి ఎల్లమ్మను కొంత దూరంలోని బావిదగ్గర్కి పరదాలు వున్న పల్లకిలో తీసుకెళ్ళి నీటిలో ముంచి, తిరిగి మళ్ళీ పల్లకిలో మోస్తూ గుడి వైపు జనం భక్తిగా, భజన చేస్తూ వస్తూ వున్నారు. కొందరు గోనె సంచులను భుజాన వేసుకొని నడుస్తున్నారు. కాలుతున్న అగరొత్తులతో వాళ్ళ వెంట వాళ్ళ వాళ్ళ ఆడవాళ్ళు, పిల్లలు నడుస్తున్నారు. దాదాపు అందరు తాగినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. వాళ్ళ పక్కమ్మటి పోలీసులు నడుస్తూనే ఉన్నారు. వాళ్ళను ఆ స్థితిలో చూడడం సారధికి కొత్త కాకపోయినా ఈసారి గావు గుర్తొచ్చి ఈ వల్లెరుగని చేతలు చూస్తుంటే మనిషి ఏమైపోతున్నాడు? తరతరాలుగా శ్రమించి సంపాదించుకున్నా శాస్త్రజ్ఞానం ఎటుపోతుంది ఈ భయంకర బలిని ఆపాలి అంతే అనుకుంటు నడుస్తూ ఉన్నాడు.

"పదండి పదండి" అని పోలీసులు లాఠీలు కదులుతూనే ఉన్నాయి.

ఒక్కసారే డప్పుల దరువు మారింది. మనుషులు స్ప్రింగుల్లా ఊగుతున్నారు.

గోనె సంచుల మూతులు విప్పేసి తెచ్చుకున్న గొర్రెలను, మేకలను చేతుల మీదుగా పట్టుకొని, గొంతులను కొరికేసారు. అంతే అట్లా కొరికిన వారి ముఖం మీద రక్తం, ఎద మీద రక్తం, కొరికిన మాంసపు ముక్కను నోట్లో కరిచి పట్టి ఎగురుతూ ఉన్నారు. ఆ గుంపులో అన్నీ రక్తం చారలే! అది ఓ బీభత్స దృశ్యం.

పోలీసులు వాళ్ళను సమీపించే లోపల అంతా జరిగిపోయింది చేసేది లేక పోలీసులు లాఠీలను అడ్డంగా రెండు చేతుల్లో పట్టుకుని పక్కకు నడిచి, జీపుల దగ్గరికి చేరారు.

సారధి రెప్ప కొట్టకుండా చూస్తూ నిలుచున్నాడు. 'అంతే జరుగొద్దు అనుకున్నది జరిగినందుకు' ఓ నిట్టూర్పు వదిలి. జనాన్ని తోసుకుంటూ గుడి దర్వాజ దగ్గర్కి వెళ్ళి నిలుచున్నాడు. అక్కడి వరకు పల్లకిని మోసుకొచ్చిన వాళ్ళు పల్లకి దించగా పరదాలు తొలగించి ఎల్లమ్మను చేతుల్లోకి తీసుకున్నాడు పూజారి అది ఓ నల్లరాయి దానిని చూసి ఓ బరువైన శ్వాసను వదిలి అక్కడి నుండి కదిలాడు సారధి.

V V V

ఆ రాత్రి అక్కడే ఒక సత్రంలో బస చేశాడు సారధి. ఆ ప్రాంతమంతా గౌలు వాసన. చుట్టూర నక్కల కూతలు. గుడి దగ్గర కుక్కల కొట్లాట.

సారధి తలనిండా ఆలోచనలు. ఆలస్యంగా పట్టిన నిద్ర. తెల్లవారుజామున కాకుల అరుపులు, ఉదయం లేవగానే ఎదురుగా ఓ దృశ్యం!

ఓ తండ్రి మేకను తగులుతో గుడివైపు గుంజుకుపోతున్న ఉన్నడు. అతని వెనకాల వంట సామానుల గంపతో తల్లి, ఇంకా చుట్టపక్కాలు.

అడ్డం తిరిగిన పదేళ్ళ బాలుడు "తన మేకను చంపొద్దు" అంటూ అరిచి తండ్రి చేతిలోని తాడును లాక్కొని పరుగే పరుగు. అతని వెంట మేక!

V

విశ్లేషణ

# స్త్రీల సాహిత్యంలో ప్రపంచీకరణ వ్యతిరేకత



**చారకొండ వెంకటయ్య**

**1990ల** తర్వాత నూతన ఆర్థిక విధానాల పేరిట భారతదేశానికి విదేశీ పెట్టుబడులు ప్రవహించాయి. పెట్టుబడితోపాటే సంస్కృతి ప్రవేశిస్తుందనేది చారిత్రక అనుభవం. ప్రపంచానంత ఒకే మార్కెట్‌లోకి కుదించాలనే ఆలోచన వినటానికి బాగానే ఉంటుంది. కానీ ఆచరణలో దాని రూపం వికృతమే. డబ్ల్యుటివొ రూపం చూసినప్పుడు ప్రపంచీకరణ అంతిమంగా బహుళజాతి కంపెనీలకు ఉపయోగపడుతుంది.

'దేశాల మధ్య పెట్టుబడి, మేథస్సు, వస్తువుల అమ్మకం అనుసంధానం కావటానికి ఎట్లాంటి పరిమితులు లేని పరిస్థితిని కల్పించటం ప్రపంచీకరణ' అయితే పరస్పర ప్రయోజనాల ప్రతిపాదికగా ఉండాల్సిన సంబంధాల స్థానంలో ఏకపక్ష విధానాలకే పై చేయి అయినప్పుడు వర్తమాన దేశాలు నష్టపోతాయి. ఈ వాస్తవాన్ని ఇవ్వాల్టి పేద దేశాలన్ని చవి చూస్తున్నాయి.

పెట్టుబడితోపాటు ప్రవేశించిన పరాయి సంస్కృతి మానవ సంబంధాన్ని ధ్వంసం చేసింది. అంతకు మించి మహిళ జీవితాలపై ప్రపంచీకరణ మరింత విష ప్రభావాన్ని చూపింది. ఈ క్రమంలోనే 1995 తర్వాత వస్తున్న సాహిత్యంలో అధిక భాగం ప్రపంచీకరణను వ్యతిరేకిస్తున్నదే.

మంజీర రచయిత సంఘం "మొగులైంది"తో మొదలై అక్షరం వారి "గ్లోబల్ ఖడ్గం' ప్రపంచీకరణపై ఖడ్గ చాలనం చేస్తే విరసం వారి "కాగితం పులి కళ్ళలో–భయం" అమెరికా సామ్రాజ్యవాద స్థితిని తెలిపిన కవితా సంకలనాలను ప్రపంచీకరణ సృష్టించిన విధ్వంసాన్ని అక్షరీకరించాయి. ఇంకో వైపు "మల్టీనేషన్ మొద్దు" పేరుతో కొండెపూడి నిర్మల రాసిన కవితా సంకలనం ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ, వచ్చిన కవిత్వంలో బలమైన వ్యక్తీకరణ.

'రెండు దేశాలు కరుణిస్తే తప్ప!
తల్లి చావుకు రాలేని పరాధీన పెళ్ళి కొడుకా!
ఐ వుడ్ లైక్ టు మిస్ యు!

డాలర్ కట్టం కింద నలిగిపోయిన మానవ సంబంధాలకు ఈ కవిత్వం అద్దం పడుతుంది.

'వీసాలో మిసాలో తక్కువైన కారణంగా
మూడేళ్ళకొక్క సిజాను లెక్క నీవు వొచ్చిపోతుంటే
చావడిలో బక్కట్టెద్దు చాటుచాటు నవ్వుతుంది
ఎంతైనా అవి మనకంటే చాలా నయ్యం
ప్రియమైన, వీడైన స్వేచ్ఛ మధుర్యంతో
ఇవ్వగల్గుతాయి?

ఇండియాలో పెళ్ళి చేసుకొని "వీసా" దొరకని కారణంగా ఎంతో మంది భార్యలను ఇక్కడే వదిలిపొయ్యే విదేశీ ఉద్యోగులను మనం ఎంతో మందిని చూస్తూ ఉంటాం. భార్యభర్తల మధ్య ఉండే కనీస సంబంధాలను కూడా లేకుండా చేస్తున్న విదేశీ మోజు కొండెపూడి నిర్మల రాసిన ఈ కవితలో అర్థం అవుతుంది.

ఇట్లా ఒకవైపు కవిత్వంలో ప్రపంచీకరణ వ్యతిరేకతను స్త్రీవాద రచయిత్రులు ప్రతిఫలిస్తూ, అంతకంటే బలంగా కథల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి అనే గ్లోబల్ ప్రచారంలో అప్రజాస్వామ్యం, అమానీయత ఉందని గ్రహించిన రచయిత్రులు తమ కలం ద్వారా దాన్ని వ్యక్తం చేశారు.

పట్టణంలోనే కాక పల్లెలోను పితృసామ్యానికి బలవుతున్న మహిళ ప్రపంచీకరణ ప్రభావంవల్ల బాధకు లోనవుతుందని తమ కథల ద్వారా తెలిపారు.

గీతాంజలి, కుప్పిలి పద్మ, పి.సత్యావతి, కొండవీటి సత్యవతి, ఓల్గా, నల్లూరి రుక్మిణి, మూదిగంటి సుజాతారెడ్డి, రంగనాయకమ్మ వంటి వారు తమ కథ రచనలతో ప్రపంచీకరణ ప్రభావంతో మానవ సంబంధాల మధ్య నలుగుతున్న మహిళ జీవితాలకు అద్దం పట్టారు.

ప్రైవేటీకరణవల్ల ప్రపంచ బ్యాంక్ ఆదేశాలతో ప్రభుత్వరంగ సంస్థలలో ఖర్చులు తగ్గించటం వలన సిబ్బంది కుదింపు, సంక్షేమ కార్యక్రమాల కోతవల్ల ముందుగా మహిళలే ఎక్కువగా బాధకు గురౌతారు.

ఈ బాధను కొండవీటి సత్యవతి "వైరస్" అనే కథలో వ్యక్తం చేసింది. ఈ కథలో ఒక రొయ్యల ఫ్యాక్టరీ. ఆ ఫ్యాక్టరీలో ఇద్దరు మహిళా కూలీలు. సంక్షేమ కార్యక్రమాల కోతలో భాగంగా ఫ్యాక్టరీ యాజమాన్యం కూలీల చేతులకు ఇవ్వవలసిన 'గ్లౌజ్'లను యాజమాన్యం ఇవ్వదు. దానితో ఆడ కూలీల చేతులకు పుండు పుడతాయి. ఆ పుండ్ల బాధ తట్టుకోలేక పని మానేస్తే భర్త కొడతాడు. అంతేకాకుండా రొయ్యలు కొనడానికి వచ్చిన అమెరికా వ్యాపారి కూలీల చేతుల పుండ్లను చూసి "డార్టి లేబర్స్' అని రొయ్యలను కొనడు. ఇంకా అనేక కారణాల రీత్యా కంపెనీ మూతపడుతుంది. దాని మీద ఆధారపడిన స్త్రీలు నిరాధారులు అవుతారు ఇట్లా ఈ కంపెనీలో ఒక ప్రేమ జంట విచ్ఛినం కావటం మరో విషాదం.

గీతాంజలి రాసిన కథ 2020లో బహుళజాతి సంస్థల ఉత్పత్తుల ప్రభావంతో గ్రామాలలోని వృత్తి పనులన్ని మూలన పడతాయి. విదేశీ కంపెనీలు షాపింగ్ కాంప్లెక్స్‌లు, బ్యూటీ పార్లర్లు ఏర్పడతాయి. కల్తీ విత్తనాలు, కల్తీ మందులవల్ల పంట నష్టం వచ్చి అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్య చేసుకోవటం కన్పిస్తుంది. రెడీమేడ్ దుస్తులవల్ల మూలపడిన టైలరింగ్ వృత్తి దర్శనమిస్తుంది. మంచినీళ్ళకు బదులు కోకోకోలాలు గ్రామాల్లో ప్రవేశించటం ఈ కథ తెల్పుతుంది.

గీతాంజలి రాసిన "చీకట్లో నుంచి చీకట్లోనికి" అనే మరో కథలో బహుళజాతి సంస్థల ధన దాహపు నీడలో కష్టాలు కనపడకుండా ఉండాలంటే వెలుతురు కంటే చీకటి ఉంటేనే బాగుండును అనే "శేఖర్" పాత్ర మనస్తత్వం తెలుస్తుంది.

# తెరచిన - మూసిన

**జాన్‌హైడ్ కనుమూరి**

రెండంచులు పట్టుకొని
ఆచ్ఛాదనలేని దేహంపై
వస్త్రాన్ని కప్పుకొన్నట్టే
కవిత చదవడమంటే

చీరలుగా, చుడీదార్లుగా
షర్టులుగా, కోటులుగా మారుతుంటే
అద్దం బళ్ళున బద్దలయినట్లే

పోటెక్కిన వరద వుధృతిలో
ఈదులాడుతున్నట్లే
వూతందొరికితే తీరం కనబడితే
వేసే బారల బారల బిగిసిన
వూపిరి తెప్పరిల్లినట్లే
కవిత చదవడమంటే

వర్తమానాన్ని సర్రున చింపి
జ్ఞాపకాల అంచుల గుండా
స్మృతుల బావిలో బొక్కెనవేసి
బాల్యాన్ని చేదుకొన్నట్లే
కవిత చదవడమంటే

చితుకులతో వుడికిన మెతుకు
కారాన్ని పులుముకొని
పంటి గాట్లకు నలుగుతూ
నకనకలాడే ఆకలి పేగులోకి
సర్రున జారిపోతున్నట్లే
కవిత చదవడమంటే

చిరుగు జేబుల జీవనదారుల్లో
అనేకానేక వత్తిడి చక్రాలలో నలిగి
పచ్చిపుండైన గుండె గాయాలకు
లేపనం పూసి, మానుకట్టైనట్లే
కవిత చదవడమంటే

శబ్దమై నిశ్శబ్దమై
తరంగాలలో అటు యిటుతేలియాడి
తీరాలకు చేర్చబడి, సేదదీరి
అనంత సూర్యస్నానమాడుతున్నట్లే
కవిత చదవడమంటే

చదివి చదివి
నలిగి నలిగి
నడచి నడచి
పరుగెత్తి పరుగెత్తి
రాలిపడిన విత్తనంగా
ఆలోచనలో అంకురించడమే
తెరిచిన కవితను మూయడమంటే

---

పి.సత్యవతి రాసిన 'ఇరుకు' అనే కథా వస్తువులపై ఉండే వ్యామోహాన్ని వివరిస్తుంది. ఆ వస్తువు సంపాదించటం కోసం భార్యభర్తలు ఇద్దరు వారి ఉద్యోగాలలో బిజీబిజీగా ఉంటూ, ఇంటికి వచ్చిన తల్లితండ్రులను కూడా పట్టించుకోరు. ఈ వస్తువు సంస్కృతి ఇంటిని ఇరుకు చేయటమే కాకుండా, ఆ వస్తువు సంస్కృతి మీద మోజు ఉన్న మనుష్యుల మనస్సులను కూడా ఇరుకు చేస్తుందని, ప్రపంచీకరణ వల్ల ప్రపంచమే ఇరుకుగా అవుతుందని ఈ కథలో ఒక పాత్ర ద్వారా సత్యవతి తెలియజేస్తుంది.

రంగ నాయకమ్మ రాసిన "మురళీ వాళ్ళ అమ్మ" అనే కథలో మానవ సంబంధాల మీద ప్రపంచీకరణ ప్రభావాన్ని తెలియజేసింది.

కుప్పిలి పద్మ రాసిన "కుబుసం" అనే కథలో మనుష్యులందరు విష సంస్కృతితో కనబడకుండా తిరిగే కుబుసం వీడిచిన పాములాగ దగ్గరలోనే తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నారని చెప్పింది.

ఈమె రాసిన "సాలభంజిక" అనే కథలో ప్రపంచీకరణ ప్రభావంతో స్టార్ హోటల్స్‌లో వ్యాపారవేత్తల ఇష్టానుసారంగా నడుచుకునే సొగ్గా ఉండే అమ్మాయిల నియామకాలను ఒక సంస్థ చేపాడుతుంది.

నల్లూరి రుక్మిణి రాసిన "పోగులు తెగిన అల్లిక" అనే కథలో ప్రపంచీకరణ మనిషి ఉనికి అంతర్జాతీయత కల్పించిన మానవ సంబంధాలు వదులై, ప్రేమ సంబంధాలు నగిలిపోతున్న తీరు కన్పిస్తుంది.

మరో "మాయజలతారు" అనే కథలో బహుళజాతి సంస్థలు గ్రామాలలో ఫ్యాక్టరీలు పెట్టేసరికి పొలంలో పని చేయటానికి కూలీలు దొరకని స్థితిని వ్యక్తం చేసింది.

ఇట్లా కవిత్వం, కథల ద్వారా ప్రపంచీకరణ స్త్రీలపై చూపుతున్న విష ప్రభావాన్ని బలంగా వ్యక్తం చేసిన రచయిత్రులు ప్రత్యామ్నాయ సంస్కృతిని, సమాజాన్ని, మానవ విలువలను కోరుకోవటం కన్పిస్తుంది.

ఆధార గ్రంథాలు


1. గ్లోబలైజేషన్ కథలు
2. వాఙ్మయి - డిసెంబరు 2004
3. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం (ఎంఫిల్ పుస్తకం)


V


సాహిత్య ప్రస్థానం లభించు చోట్లు

ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1, చిక్కడపల్లి,
హైదరాబాద్-20,
ఫోన్ : 27660013

& రామకృష్ణ న్యూస్ ఏజెన్సీస్
అబిడ్స్, హైదరాబాద్.
దాని పంపిణీ కేంద్రాలలో,
ఇతర ప్రముఖ బుక్‌షాప్‌లలో

బ్రాంచీలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 27-19-14, వి.ఎన్.ఆర్. కాంప్లెక్స్, దుర్గయ్య వీధి, **విజయవాడ-2.** ఫోన్ :2577533 | సుందరయ్యభవన్, బాలాజీనగర్ **ఖమ్మం-507001** | 140, ప్రకాశం రోడ్, **తిరుపతి-517502.** ఫోన్ : 223017 | 6-2-250, విజయటాకీస్‌రోడ్ చౌరస్తా **హన్మకొండ-506001** | సుందరయ్యభవన్ సుభాష్ విగ్రహం (ఎదుట), **నల్గొండ** | షాప్ నెం.10, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఆసీల్‌మెట్ట బస్టాప్, రామా టాకీస్ రోడ్ **విశాఖపట్నం** | 2/7, బ్రాడీపేట **గుంటూరు** |

ఇంకా కావలసిన ఏజెంట్లు, సాహితీ మిత్రులు రాయండి

## పునశ్చరణ

# "కనుమరుగవుతున్న - వేమన తత్త్వము"



**సూరపల్లి శ్రీను**

ఆంధ్ర సాహిత్యంలో వేమన పేరు తెలియని వారుండరు. విభిన్న కోణాలను సామాజిక వాస్తవాలకు దగ్గరగా మలచడంలో వేమనను మించిన వారెవరు లేరు. ఒక తాత్త్వికుడిగా, విమర్శకుడిగా, యోగిగా, భోగిగా, ప్రజాకవిగా, సర్వమానవ సౌభ్రాతృత్వం కోసం ఆరాటపడే వ్యక్తిగా వేమన కనబడతాడు. వేమన ఏ కాలానికి సంబంధించిన వాడన్న విషయమై ఈనాటి వరకు చర్చలు, పరిశోధనలు కొనసాగుతున్నాయి.

అబేదు బాయి (ఫ్రెంచి మిషనరీ, 1817) నుంచి ఆరుద్ర వరకు కొనసాగిన చర్చల్లో వేమన 17వ శతాబ్దం వాడనీ, రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడని తేలింది. వేమన వాడిన మక్కా, అల్లా మహ్మద్దు, గులాము, బిక్కలు, జింజిరీలు వంటి పర్షియా మొదలైన పదాల వల్ల వేమన కాలం ప్రశ్నార్థకమైంది. బ్రౌను సేకరించిన ప్రాచీన ప్రతుల్లో వేమన 1650వ ప్రాంతానికి సంబంధించిన వాడని తేలింది. వేమన పద్యాల్లో సంబళం, పొడ్డు, దుడ్డు, తాళిక, బిత్తలి, వలికి, మొట్ట మొదలైన పదాలవల్ల వేమన రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన వాడని పరిశోధకులు భావిస్తున్నారు.

ఉదాత్తమైన ఆశయాలు, లక్ష్యాలు కాల పరిణామంలో ఘోరంగా దిగజారాయి. కుల భేదాలతో సంబంధం లేకుండా ప్రారంభమైన వీరశైవానికి కూడా అదే గతి పట్టింది. "చిత్త శుద్ధిలేని శివపూజలేలరా" అన్న పద్యం ఈ గొడవల్లో వచ్చింది. వేమన స్త్రీజాతిని గర్హించిన తీరు అయిన వీరశైవుడు కానే కాదనడానికి నిదర్శనమని బ్రౌను చివరకు అభిప్రాయం పడినాడు. వేమన లోకాయతుడు అంటే హేతువాది అయిన చార్వాకుడని ఆరుద్ర అభిప్రాయం. వేమన దిగంబరుడుగా వున్న చిత్రపటం ఒకటి తంజావూరులో 'శరభోజి స్థాపించిన సరస్వతి మహోల్ లైబ్రరీలో దొరికింది. దాని ఆధారంగా "రెడ్డిరాణి" వంటి పత్రికల్లో దిగంబరుడుగా కూర్చుని వున్న వేమన రూపము 1920 ప్రాంతంలో ప్రచురింపబడి ప్రచారంలోకి వచ్చింది.

"తల్లి గర్భమందు తాపుట్టినప్పుడు
మొదటబట్ట లేదు తదును లేదు
నడుముబట్ట గట్టన బాటుకాదోకో..."

అని వేమన చెప్పిన వైరాగ్యభావంతో కూడిన పద్యం ఆధారంగా కూడా వేమన దిగంబరుడని లేదా! గోబీ మాత్రం పెట్టుకున్నాడని విమర్శకులు ఊహించారు. దీనికితోడు వేమన దిగంబరుడు కావడానికి ఒక ఐతిహస్యం కూడా ప్రచారంలో ఉంది. దాన్ని 1857 ప్రాంతంలో కడప జిల్లా మ్యాన్యుయల్‌లో జె.బి.బి. గ్రిబిల్ అనే బ్రిటిష్ ఉద్యోగి ఇట్లా చెప్పాడు. "బలిసి బుసలు కొట్టే రెండు కోడెలను తన మొలపంచెను విప్పి ఎగగట్టి భీమ బలంతో వాటి కొమ్ములను పట్టి చెదరగొట్టి అట్లాగే దిగంబరుడై కదిలిపోయి వేమన బైరాగి అయినాడు అని ప్రచారం వచ్చింది.

మానవుడు వచ్చేటప్పుడు ఏమితేలేదు/ పోయేటప్పుడు ఏమి తీసుకుపోడు అనే వైరాగ్యభావాన్ని వేమన" తల్లి గర్భమందు తాపుట్టినప్పుడు అనే పద్యంలో చెప్పాడు. వేమన తాంత్రికుడు శాక్తేయ పూజా విధానాన్ని అనుసరించిన వాడని వేమూరి విశ్వనాథశర్మ ఒక లేఖలో రాళ్ళపల్లి వారికి రాసాడట. వేమన బౌద్ధుడైన, నాగార్జునుని శూన్యవాదాన్ని విశ్వసించాడని త్రిపురనేని వెంకటేశ్వరరావు ప్రతిపాదించాడు. తర్వాత ఆయనే వేమన కమ్యూనిస్టు భావాలున్న ఆర్థికవేత్త అని చాటాడు. వేమన తన పద్యాల్లో అక్కడక్కడ హేతువాదాన్ని ప్రబోధించాడు. సామాజికపరమైన కుళ్ళును నిందించాడు. అవహేళన చేశాడు. ధనం కూడబెట్టే లోభులను అసహ్యించుకున్నాడు. లేమితో బాధపడే వాళ్ళను సానుభూతితో పరామర్శించాడు.

త్రిపురనేని వంటి వారు కొందరు వేమనను మార్క్సిస్టుగా చెప్పడం జరుగుతున్నది. స్త్రీజాతిని గర్విస్తూ వేమన చెప్పిన ఆ పద్యాలను యోగ వైరాగ్య భావాలున్న పద్యాలను వీరు ఉపేక్ష చేసి వేమన ఆ పద్యాలను చెప్పడానికి వెనకున్న కారణాలను వదిలేసి కొన్ని పద్యాలను మాత్రమే ఆధారంగా చేసుకొని వేమన కమ్యూనిస్టు విప్లవ కవి అని చాటారు. ఆధునిక కాలంలో మార్క్స్ చెప్పిన ఆర్థిక సూత్రాలు తక్కువ ప్రభావలేమి కలవు కావు. అది అందరూ అంగీకరించవలసిందే మార్క్స్ సిద్ధాంతం.

ప్రపంచంలో ఎన్నో దేశ సమాజాల్లో రాజకీయంగా సాంఘికంగా సాహిత్యపరంగా ఎంతో నూతనోతేజాన్ని ఉత్తేజాన్ని నింపి దిశానిర్దేశం చేసిందనడం అసత్యంగాని అతిశయోక్తిగాని కాదు. ముఖ్యముగా కమ్యూనిస్టు కమ్యూనిస్టేతర దేశాల్లో మార్క్స్ చెప్పిన భావజాలంతో సృజనాత్మక సాహిత్యం విమర్శలు కొత్త పుంతలు తొక్కినవి. దాన్ని కాదని తోసిపుచ్చలేము/ ఇది జరుగులేదని కండ్లు మూసుకోలేము.

సమాజంలో ఆదిమ కమ్యూనిజం వంటిది రావాలంటే మానవుని దోపిడి విధానం నశించాలంటే మానవునిలో జంతు సహజమైన కామక్రోధలోభి మోహమద మాత్సర్యాదులు మొదట నశించాలి. అప్పుడే మనిషి ఎదుటివాన్ని తనతో సమానంగా చూసుకుంటాడు. సంప్రదాయం, ఆధ్యాత్మకతల పేరుతో వర్ణధర్మాన్ని మూఢాచారాలను అంధ విశ్వాసాలను అహేతువాదాన్ని సమర్థించడం ఎంత చాదస్తమో! మార్క్సిజం పేరుతో వాస్తవికతను చారిత్రక అవగాహనను సంప్రదాయాన్ని కాదనడం అంతే చాదస్తమని చెప్పాలి.

వందల సంవత్సరాల క్రిందట హేతువాదంతో కూడిన మతం-నీతిని భోదించిన వేమన పద్యాలు ప్రజాసామాన్యం నోళ్ళల్లో వ్యాపించివున్నవి. సంప్రదాయ కవులు పండితులు మతాచార్యులు వాటిని పట్టించుకోలేదు. తరతరాలుగా ఆ పద్యాలు

మౌఖికంగానే ప్రచారంలో ఉండి ఆ తర్వాత శిక్షితులు, అర్ధశిక్షితులచేత తాటాకుల మీద రాయబడినవి. వేమన పేరుతో పుట్టిన స్వాములు, అవతారాలు ఇంకా అభినవ వేమనలు తమ వంతు పద్యాలను చేర్చారు. పద్యాలలో మొదట క్రైస్తవమత ప్రచారం కోసం వచ్చిన మిషనరీ ఫాదరీలను ఆకర్షించినవి. వాళ్ళ క్రైస్తవమత ప్రచారం చేస్తూ పరమత ఖండనం కోసం ఈ పద్యాలను వాడుకున్నారు. అట్లాగే 1731లోనే ఫ్రాన్స్‌కు చెందిన "ఫాదర్ లెగాక్" వేమన పద్యాలు 368 వరకు సేకరించి, ప్యారిస్ నగరంలోని లైబ్రరీలో భద్రపర్చాడు.

వేమన పద్యాలు ఒక్క ఫాదరీలనే కాదు బ్రౌను వంటి ఉదార దృక్పథంగల బ్రిటిష్ ఉన్నతోద్యోగులను కూడా ఆకర్షించినవి 1824 నుంచి బ్రౌను వేమని పద్యాల అన్వేషణకు పూనుకున్నాడు. వేమన వైరాగ్యానికి ఒక వేశ్య అని చెప్తారు. అతనికి వివాహం అయినట్లు కూడా కథలు లేవు 1914లో కట్టమంచి రామలింగారెడ్డి తన కవిత్వతత్త్వ విచారంలో తెలుగులో వేమనను మించిన కవి లేడడని ప్రశంసించాడు.

మార్క్సు చెప్పిన సమసమాజ స్థాపన జరగాలనే కాంక్ష ధనిక భూస్వామి వర్గాల, అగ్రవర్ణాల నిరంకుశత్వం మీద దోపిడీ వ్యవస్థ మీద తిరుగుబాటు ధోరణులు వ్యాపించినవి. నూతన సమాజ నిర్మాణం "మరో ప్రపంచం ఆవిర్భవించాలన్న తపనతోకూడిన భావాలు చోటు చేసుకొన్నవి. దాంతో అభ్యుదయ భావవాదులకు వేమన పద్యాల్లో ఎంతో అభ్యుదయ భావజాలం కన్పించి ఆకర్షించి అభిమానకవి అయ్యాడు. అభ్యుదయ యుగకర్త అయిన శ్రీశ్రీకి అభిమాన కవులలో వేమన ఒకడయ్యాడు. ప్రాచీన ఆంధ్రకవులలో వేమన అటువంటి వాడు అని శ్రీశ్రీ చాటాడు.

ఇంకా ఆధునికులు, వేమనను భౌతికవాది, మానవతావాది, సామాజిక స్పృహగలకవి, విశ్వకవి, ప్రజాకవి, అభ్యుదయకవి, అని రకరకాలుగా చిత్రించారు. ఇంకా కొందరు అతనిలో దయానంద సరస్వతిని మార్క్సును చూశారు మరికొందరు వేమనను విక్లిఫ్‌తో, లూథర్‌తో, ప్లేటోతో సోక్రటీస్‌తో పోల్చారు.

వేమన వైదికాదికర్మ కాండలను విగ్రహపూజలను ధార్మిక సాంఘిక మూఢాచారాలను అంధవిశ్వాసాలను నిరసిస్తూ వేమన గొప్ప హేతువాదిగా మన ముందు నిలబడ్డాడు.

"వేద విద్యలెల్ల వేశ్యలవంటివి
భ్రమల పెట్టి తేటపడగనీవు
గుప్త విద్య మొకటేకులకాంత వంటిది"

అని వేమన పరతత్త్వాన్ని తెలిపే విద్యేశ్రేష్ఠమైంది. కర్మకాండలు వ్యర్థమంటాడు లోకంలో సమాస్త ప్రలోభాలకు మూలం స్త్రీ అన్న వాళ్ళ స్త్రీ వైముఖ్యాన్ని చూపారు. స్త్రీలో చెడునే దర్శించి కఠినంగా నింద కూడా చేశారు. అందుకే నాథయోగి వేమన కూడా చాలా చోట్ల స్త్రీలను వారి మాయలను పద్యాల్లో చెప్పాడు.

"ఆడదాని జాడనర్థంబు జూడగ
బ్రహ్మకైనను బుట్టరిమ్మ తెగులు
ఆడుదాని బోంకు గోడబెట్టినయుట్లు
పసిడికన్న మిగులపడలి మాటలు తీపి
అన్యపురుష వాంఛ ఆడదానికి నుండు". అని

నిర్ణయంగా తీర్మానించాడు. ఒక వేళ స్త్రీ భర్త మాటకడ్డం వస్తే దెబ్బల వరకు పోవచ్చు అంటాడు వేమన. ఇదే విధంగా తులసీదాసు కూడా స్త్రీ గొడ్డు, రెండూ దెబ్బలతోనే మాట వింటాయన్నాడు. భావ విప్లవంగల వేమన స్త్రీల విషయంలో అనహానాన్ని చూసి సంప్రదాయబద్ధుడైనాడని నిగ్గు తేల్చారు. సంప్రదాయంలో స్త్రీకి అగౌరవ స్థానవేమీ లేదు. విరాగ సంప్రదాయంలోనే స్త్రీని మురికి కూపముగా చూస్తారు. అంతేకాకుండా వేమన కర్మకాండలను నిరసిస్తాడు. యుజ్ఞవులో పశుబలిని వేదవిదుడైన సోమయాజి పామరుల మతంలో జంతుబలిని నిరసిస్తాడు. జాతకాలు కలిసాక మూహర్తాలు, పెట్టి వివాహం చేయడంలో వున్న నిర్హేతువును వేమన ఇట్లా ప్రశ్నించాడు.

"విప్రులెల్ల జేరి వెర్రి కూతలు కూసి
సతిపతులను గూర్చి సమ్మతమున
మునుముహూర్తముంచముండెట్లు మోసెరా!..

దొంగ సన్యాసులను దొంగ యోగాసనాడులను దొంగ పూజలను అబద్ధపునియ మువ్రతాలను వేమన ఎన్నో పద్యాల్లో నిశితంగా విమర్శించి ఎత్తి చూపాడు.

అదే విధంగా వేమన వర్ణాధిక్యాన్ని కులభేదాలను మొహమాటం లేకుండా కర్కశంగా సవాలు చేశాడు. వేమన కులభేదాన్ని మతభేదాన్ని నిరసించి, పరతత్త్వము ఒక్కటే మానవజాతి ఒక్కటే అని చాటాడు. అర్థంలేని విగ్రహా పూజలను తీర్థయాత్రలను వేమన నిరసించాడు.

"రాళ్ళుదెచ్చి నరులు రమ్యమౌగుడికట్టి
రాతి ప్రతిమ చేసి ఖ్యాతిగాను
దేవుడనుచు యొక్క దీవించి పల్కునా...

విగ్రహా పూజల్లోని మూర్ఖత్వాన్ని తీర్థయాత్రలకు పోవడం, తీర్థ జలాల్లో మనగడం వంటి ఆత్మవంచనతోకూడిన పనులను నిరసించిన వేమన హేతువాదిగా మనముందు నిలుస్తాడు.

"ఆకులెన్ని దిన్న మేకపోతులకెల్లి
గాకపోయ్యెయ్యేకాయసిద్ధి
లోకులెల్ల వెర్రిపోకళ్ళు పోదరా"

ఆకులూ అలం తింటూ కాషాయి వస్త్రాలు ధరించినంత మాత్రాన కాయసిద్ధి కలుగదని తలలుబోడులు చేసుకున్న సన్యాసంతో లాభం లేదని మనస్సు విషయ సుఖాలనుంచి దూరం కావాలని వేమన అంటాడు. సంసార బంధనాలను విడిచి తిండి తిప్పలు వదిలి ఏకాంతంలో జపం చేసినంత మాత్రాన తత్త్వంబు గురించి తెలుసుకోలేరని వేమన విమర్శిస్తాడు.

వేమన వైరాగ్యాదులు సమకాలిక రాజకీయ స్థిరతను కరువు కాటకంలో అల్లాడే సంఘాన్ని ప్రతిబింబింపచేస్తున్నవని ఆ 'ఇన్‌సెక్యూర్డ్' నుండి వేమన కవితా భావాలు పుట్టిని.

నేడు వేమన పద్యాలుగాని అతని జీవితచరిత్ర, అతని బోధనలు, అతని సిద్ధాంతాలు చెప్పుకునే వారు కరువైయినారు. నేటి సమాజంలో వేమన పద్యాలు లభించని దుస్థితి వేరుపడుతుంది. వేమన ఆనాటి కాలంలో అతని రాసిన పద్యాలు ఎంతో సులభంగా అర్థవంతంగా, ఎంతో మధురంగా ఉండేవి. ప్రతి వారికి అర్థమయ్యేటట్లు రాయటం జరిగింది. అట్టి పద్యాల గురించి చెప్పుకునే పల్లెలు కరువైయినాయి. వేమన పద్యాలలో ఎంతో నీతి ఉండేది.

నేటి కాలంలో దేశంలోకి విదేశీ సంస్కృతి జొరబడిపోయి. భారతీయ సంస్కృతికి తూట్లు పొడిచింది. నీతి, న్యాయం, ధర్మం మంచి జరగాలంటే నేటి వేమన పద్యాలను జ్ఞాపకం చేసుకోక తప్పదు.

V

## సమీక్షకులకు విజ్ఞప్తి

**సమీక్షల పట్ల ఆసక్తి గల వారికి గత సంచికలో చేసిన విజ్ఞప్తికి ఆరుగురికి పైగా సంసిద్ధత తెలియ జేశారు. వారికి ధన్యవాదాలు. వచ్చే సంచిక నుంచి సమీక్షార్థం వచ్చిన పుస్తకాలు పంపించగలం.**

**కథ**

# డ్రాపౌట్

**మేరెడ్డి యాదగిరిరెడ్డి**



**జూన్** నెల
రోహిణిపోయి మృగశిర వచ్చింది.
వర్షంపడకున్నా భూమి చల్లబడింది.
వడగాలులు తగ్గాయి.
వేసవి సెలవులయిపోయి స్కూలు తెరిచారు. పిల్లల ఆటలకు చెక్.
టీచర్ల విశ్రాంతికి ఫుల్‌స్టాప్.

బడిగంట గణగణ మ్రోగింది. ఆ చప్పుడు వూరంతా విన్పిస్తుంది. అంతకు ముందు బడి ఊరి బయట వుండేది. జనం పెరిగి ఉమ్మడి కుటుంబాలు విడిపోయి తలా ఓ యిల్లు కట్టుకోవడంతో వూరు చేంతాడులా పెరిగిపోయింది. పదేల్లలో ఇండ్ల సంఖ్య రెండింతలయింది. ఫస్ట్ బెల్ తరువాత సెకండ్ బెల్ మ్రోగింది. టీచర్ల ఉరుకులు పరుగులు. ఎవరు అక్కడ నివాసముండరు పక్కనున్న పట్నం నుండి రావల్సిందే.

పిల్లలు బ్యాగులు భుజాన వేసుకుని పరుగేపరుగు. ఇంటి దగ్గర చాక్లెట్లు, బిస్కట్లు ఇప్పించే వరకు కదలని పిల్లలు. బతిమిలాడి, బంగపడి బడికి తోలిపోతున్న తల్లితండ్రులు. ఇంకా కోపిష్టితల్లితండ్రులు ఓ చేత్తో బెత్తం మరో చేత్తో పిల్లల బరాబరా ఈడ్చుకొచ్చిబల్లో వేస్తున్నవారు. కాపీలకు, పెన్నులకు, పలకలకు తల్లితండ్రుల మీద మారాం చేస్తున్నవాళ్ళు. సర్ది పంపుతున్న తల్లితండ్రులు. టీచర్ల దగ్గరికొచ్చి కాపీలు, పుస్తకాలు రాయించుకపోతున్న తల్లితండ్రులు. అంతా హడావిడి. అంతా బిలబిలమంటూ ప్రార్థనకు వచ్చి చేరారు. ప్రార్థన ముగిసి ఎవరి క్లాసుకు వారు వెళ్ళారు.

కొత్త పుస్తకాలు, కొత్త పెన్నులు, కొత్త డ్రస్సులు, కొత్త బ్యాగ్‌లు, కలరు పెన్నులు, పెన్సిల్లు, వాల్ల రంగు రంగుల ఊహలు. కొత్త... కొత్త... అంతాకొత్తే...

డి.పి.ఇ.పి, సర్వశిక్ష అభియాన్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపే మారిపోయింది. గుడిసెలు పోయి పక్కా బిల్డింగులొచ్చాయి. అంతటా తరగతి గదులు, ప్రహరీగోడలు, మంచినీటి సౌకర్యం ఏర్పాట్లు జరిగాయి. మీదు మిక్కిలి స్కూల్లన్నిటికి సున్నాలు వేయించారు. గోడలకు రంగురంగుల బొమ్మలు వేయించారు. బడంటే భయపడే పిల్లలు కూడా బడికి ఉరుకులు పరుగులు. గోడల మీద దేశ నాయకుల, దేశ, రాష్ట్ర పటాల బొమ్మలు రకరకాల అక్షరాలు. జంతువుల బొమ్మలు, ఎన్నెన్నో అంతటా బొమ్మలే...

ముగ్గురి టీచర్ల ప్రాథమిక పాఠశాల అది. హెడ్ మాస్టర్ శివరాజు. మిగతా ఇద్దరు విజయ, మమత లేడీ టీచర్లు. టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో లేడీ టీచర్ల రిజర్వేషన్ వచ్చాక ఓ.బి.బి. ప్రకారం ప్రతిపాఠశాలకు ఓ లేడీ టీచరు వచ్చారు. టౌనుకు దగ్గరుండటంవల్ల ఈ పాఠశాలకు ఇద్దరు లేడీ టీచర్లు వచ్చారు. నూటా ఇరవయి మంది దాకా పిల్లలున్న పాఠశాల అది. అటెండెన్స్ రిజిష్టర్లతో టీచర్లు ఎవరి క్లాసుకు వారు వెళ్ళారు.

ఐదవ తరగతి హాజరు రిజిష్టరుతో విజయ టీచర్ క్లాసుకు వెళ్ళింది. అటెండెన్స్ రిజిష్టర్ తీసి వన్... టూ... త్రీ....

"యస్ టీచర్"

"ఫోర్, ఫైవ్, సిక్స్"...

"సిక్స్, సిక్స్.. మళ్ళీ రెట్టించింది.

"రాలేదు టీచర్. ఇందిర రాలేదు టీచర్"

"వాల్లమ్మెంట కూలికి పోతుంది టీచర్"

"పత్తి గింజలు బెట్టపోతుంది టీచర్"

"ఇక రాదట"

పిల్లలు ఇందిర పై తలా ఓ మాట చెప్పారు.

చదువంటే ఎంతో ప్రేమ. తెలివైన అమ్మాయి. చెప్పిన విషయం ఇట్టె పసిగట్టి అప్ప చెప్పే అమ్మాయి. ప్రతి దానికి నవ్వు ముఖం. గలగల మాట్లాడే అమ్మాయి. క్లాసులో ఫస్ట్. ఆట పాటల్లో అన్నీట్లో ముందే. ఇందిర లేని క్లాసు వెల వెల బోయినట్లుంది. పిల్లల మాటలతో టీచర్ మనస్సంతా అదోలా అయిపోయింది. పరధ్యానంతో పాఠం ముగించింది.

వరుసగా వారం రోజుల నుండి రాకపోయేసరికి టీచర్లందరికి ఏదో వెలితి. క్లాసు పేలవం. ఏదో పోగొట్టుకున్నట్టయింది. ఈ లోపు ఇంటర్ వెల్ బెల్ అయింది. పిల్లలు హుషారుగా వురుకులు పరుగులు పంజరంలో చిలుకల్లా బయటపడ్డారు.

హెడ్ మాస్టర్ శివరాజు హాజరు రిజిష్టర్లు ముందు వేసుకుని హాజరు లెక్కలు వేస్తున్నాడు. మధ్యాహ్న భోజనానికి పిల్లల సంఖ్య చెప్పాలి. ఇద్దరు టీచర్లు వచ్చికూర్చున్నారు. హెడ్‌మాస్టరు రూమయినా స్టాఫ్ రూమయినా అదే. ఐదవ క్లాస్ రిజిష్టర్ ఇందిర వరుస ఆప్‌సెంట్లు చూశాడు. ఇందిర ఇన్ని రోజులు ఎప్పుడు ఆప్‌సెంట్ కాలేదు. కాపీలు లేవంటే గత సంవత్సరం తనే కొనిచ్చాడు. ఆ అమ్మాయంటే శివరాజుకు వల్లమాలిన ప్రేమ. అందరి టీచర్లకు అంతే. ఇందిర గురించి ఎదురుగా కూర్చున్న విజయ టీచర్‌ను అడిగాడు శివరాజు.



"అవున్సార్ ఎప్పుడు ఆప్‌సెంట్‌గాని అమ్మాయి కూలికిపోతుందని పిల్లలు చెబుతున్నారుసార్. ఇక బడికి రాదని కూడా అంటున్నార్‌సార్" పేపరు చదువుతూ చెప్పింది.

"ఒక్కసారి మీరు వాళ్లింటి దాకా పోయిరాకూడదుసార్"

"వెళ్లొస్తా టీచర్. లేకుంటే ఈ డ్రాపౌట్లతో మనకు తలనొప్పే"

డ్రాపౌట్ల విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్ తీసుకుంటున్నారు. ఇప్పుడున్న కలెక్టర్ మరీ స్ట్రిక్టు. ఆయన దృష్టంతా దాని మీదే. నెలనెలా రివ్యూ మీటింగులలో అధికారులకు షంటింగులు. ఎక్కడ బాలకార్మికులు కనిపించినా అధికారుల మీద చర్యలు తప్పవని హెచ్చరికలు. డి.ఇ.వో., యంఐవో, యంఇవోలు, హెడ్‌మాస్టర్లకు వార్నింగులు యిస్తున్నారు. తమ తమ గ్రామాల్లో బడి ఈడు పిల్లలు డ్రాపౌట్లయితే వారేం చేస్తున్నారు. జీతాలుకున్నారా! ఇంటి పనులు చేస్తున్నారా! పశువుల కాస్తున్నారా! గొఱ్ఱెల మేపుతున్నారా! అట్లాంటి పిల్లలుంటే జీతాలుంచుకున్న యజమానులకు నోటీసులు. డ్రాపౌట్ల లీస్టు వాల్ల వివరాలు బయట ప్రదర్శించాలి. వాళ్ళను మోటివేట్ చేసి బ్రిడ్జి స్కూల్లు, బాలకార్మిక పాఠశాలల్లో చేర్పించాలి. ఇప్పుడు మండలానికో బాల కార్మిక పాఠశాల ఏర్పాటయింది. గతంలో ఇద్దరు ముగ్గురు డ్రాపౌట్లుంటే నానా తంటాలు పడి బ్రిడ్జి స్కూల్లో చేర్పించాడు శివరాజు. ఒకరిద్దరు ఆడపిల్లలు పెళ్ళిల్లు చేసుకుని లీస్టు నుండి బయటపడ్డారు.

'చక్కగా చదివే అమ్మాయి...' ఈ అమ్మాయి కూడ డ్రాపౌట్లవుతుందా" ఇందిర గురించే శివరాజు ఆలోచనలు. హెడ్ మాస్టర్ ఇందిర ఇంటి వైపు కదిలాడు.

ఊరి చివర

ఓ కమ్మల గుడిసె. గుడిసె మీదకు పాకుతున్న బీరసొర తీగలు. చుట్టు కంపతో కంచె. ఓ తడికె గేటు. ఇంటి ముందు వేపచెట్టు. గేటు పక్క రెండు బండల అరుగులు. గుడిసె వెంట ఓ తాటాకు స్నానాల గది. దండెం మీద ఆర వేసిన బట్టలు. ఆ ప్రక్కనే ఓ కంప కట్టెల మోపు. సర్కారు ఎంత మందికి గ్యాసు పొయ్యిలిచ్చినా ఈ గ్యాసు ధరలకు అవి అటకెక్కాయి. కొంత మంది అమ్ముకున్నారు. మళ్ళీ ఎప్పటిలాగే ఈ కట్టెల వంటే.

ఆ గుడిసెలో తల్లీతండ్రీ నలుగురు పిల్లల సంసారం. ముగ్గురు ఆడ పిల్లల తర్వాత కొడుకు. ఆ కొడుకు కొరకే ముగ్గురు పిల్లలయినా ఆపరేషన్ చేయించుకోలేదు. ఆ యిల్లాలు సులోచన. ఇంటాయన మల్లేశం పచ్చి తాగుబోతు. తాగుడుతోనే లోకం. ఇల్లు గురించి పిల్లల గురించి పట్టింపు లేదు. కొంత కాలం జీతం చేశాడు. ఎక్కడా సరిగా పని చేయక తాగితందనాలాడేసరికి ఎవరూ పనిలో పెట్టుకోవడంలేదు. ఆ యిల్లు, పిల్లలు అంతా సులోచనమీదే. లేచింది మొదలు ఒకటే కష్టం.

కోడికూతతో లేచి పటేల్ ఇంద్రారెడ్డి ఇంట్లో ఉకుడు, చల్లుడు, అంట్లుతోముడు. ఇంటికొచ్చి తను తెచ్చిన సద్దన్నం పిల్లలకింత పెట్టి బడికి పంపి తను కూలికి ఉరుకులు పరుగులు. క్షణం తీరికలేదు. పెద్ద పిల్ల ఆరవ తరగతి చదివింది. పెద్ద మనిషయిందని బడి మాన్పించింది. కిందటేడే తన తమ్మునికిచ్చి పెండ్లి చేసింది.

ఆ తర్వాత పిల్ల ఇందిర.

ఇందిరాగాంధంటే వాళ్ళకు వల్ల మాలిన ప్రేమ, గాంధీ, నెహ్రూల పేర్లు వాళ్ళకు అంతగా తెలువవు "గరీబీ హఠావో"తో ఇందిరా గాంధి వాళ్ళకు ఆరాధ్యదైవమయింది. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ తర్వాత ఓడిపోయి ఎలక్షన్ ప్రచారానికి నల్గొండ వచ్చినపుడు రాత్రి 7 గం॥లకు రావలసిన ఆమె తెల్లవారు జామున 4 గం॥లకు వచ్చినా సభకు వచ్చిన లక్ష మంది జనం అలాగే కూర్చుండి ఆమెకు జేజేలు పలికారు. ఆ సభకు సులోచన కూడా వెళ్ళింది. ఎడ్లబళ్ళు, ట్రాక్టర్లతో ఊరి జనమంది కదలి వెళ్ళారు. ఇందిరా గాంధి చనిపోయిన రోజు వూరు వూరంతా ఏడ్చింది. ఆ రోజు ఎవరింట్లో పొయ్యి రాజలేదు.

అందుకే సులోచన తన బిడ్డకు ఇందిర పేరు పెట్టుకుంది. ఆ తర్వాత ఓ ఆడపిల్ల, కడగొట్టోడు మగపిల్లవాడు. వాడు ఒకటో తరగతి మల్లేశం లేచి లేవగానే రాత్రి అన్నం ఏమన్నా మిగులుంటే గబగబ తిని బయట పడతాడు. తొమ్మిదయిందంటే ఆ యింట్లో ఎవరుండరు. పిల్లలు కూడా పగలు బడిలో మధ్యాహ్న భోజనం తింటారు.

"ఈ మధ్యాహ్న భోజన పథకం" వచ్చాక పిల్లలు బడికి బాగా నే వస్తున్నారు. కాకుంటే ప్రయివేటు మోజున్న వాళ్ళు తమ పిల్లల బస్తీకి ప్రయివేటు స్కూల్లకు పంపుతున్నారు.

"ఇందిరా! ఇందిరా"

"ఏం చేస్తున్నావు" బయట నిలబడి హెడ్‌మాస్టర్ శివరాజు పిలుపు.

"అమ్మా! అమ్మా! సారొచ్చిండే"

"నేబడికి పోతానె"

"అమ్మోసార్ తిడతాడె... కొడతాడె"

"నే చెబుతాలేవె"

గుడిసెలో తల్లి పిల్లల గుసగుసలు

"ఇందిరా..."

"సార్..." దిగాలుగా బయటకు వచ్చిన ఇందిర.

జుట్టంతా చిందరవందర. ముఖం మీదికి జారిన వెంట్రుకలు. ఇంకా ముఖం కడగని వైనం. నోట్లో పండ్ల పుల్ల.

అదే బడికి వచ్చేదయితే ఎనిమిదింటికల్లా ఇంటి పనంతా చేసి బడికి తయారయ్యేది. తల్లి పాచిపనికి పోతే తల్లితో పాటే లేచి ఇల్లంతా వూడ్చి చల్లి అలికి ముగ్గులు పెట్టి, అంట్లు తోమి, చెల్లెను, తమ్ముని లేపి బడికి తయారు చేసేది.

"అయ్యా... నమస్కారం సార్" రెండు చేతులు జోడించింది.

సులోచన లోపలి నుండి బయటకు వస్తూ.

"ఏమమ్మా! సులోచనా! ఇదేమన్నా బాగుందా! బాగా చదివే అమ్మాయిని బడికి బందు చేశావేంటి"

"చక్కగా చదివే అమ్మాయిని చెడగొడుతున్నావు"

"కూచోండిసార్..." ఓ ప్లాస్టిక్ కుర్చీ తెచ్చి గుడిసె ముందు వేసి గుడ్డతో తుడిచి పెట్టింది. ఇంత సేపు నిలబెట్టినందుకు బాధపడుతూ.



"సరే కూర్చునే టైము లేదుగాని చెప్పు. ఇందిర నెప్పుడు పంపుతున్నావు".

"సార్ పూటకెల్లక మా తిప్పలు మావి. వారం రోజులు నావెంట కూలికొచ్చింది. దాని పైసలతో కాపీలు, పెన్నులు కొనుక్కుంటానంటుంది"

"నేనా కొనియ్యలేను. ఎంత చేసినా ఈ సంసారినికే సరిపోతలేదు. వీళ్ళ అయ్య సంగతి మీకు తెలుసు కదాసార్." లోపల ఎంత బాధ వున్న నవ్వుతూ చెప్పింది సులోచన.

"చూడమ్మా! ఇందిర బాగా చదివే అమ్మాయి. ఈ యేడు ఐదు అయిపోగానె నేనే నల్గొండలో హాస్టల్లో చేర్పిస్తా. దాని చదువు అది చదువుకుంటుంది"

"అంత కన్నానా సార్. రేపటి నుంచి తోలిస్తా"

"ఇంత దూరం వచ్చింద్రు. పిలిపిస్తే నేనే వచ్చి దాన్ని గదాసార్"

"అదేం లేదమ్మా! మా పిల్లల మంచి చెడ్డలు చూసుకోవాలిగదా.

తప్పకుండా రేపటి నుండి తోలించు" మరీ మరీ చెప్పి హెడ్‌మాస్టర్ శివరాజు వెళ్ళిపోయాడు.

"రేపు పొదుపులే బిడ్డా! ఇయ్యాల పటేల్ దగ్గర కూలి డబ్బులు అడుక్కొచ్చుకుందాం"

"రేపు కాపీలు, పెన్నులు, కొనుక్కుని పొదువుగానిలే. పాతవి తమ్మునికి, చెల్లెకు ఇద్దువులే."

తల్లిమాటలకు ఇందిరకు వుషారొచ్చింది. కండ్లు తుడ్చుకుని ముఖం కడుక్కొంది.

"చేతికొచ్చిన బిడ్డ. ఈ వారం రోజులు తనకెంత ఆసరయింది. పెద్ద బిడ్డ అత్తగారింటికిపోయింది. మొగుడా తాగుబోతు. ఈ బిడ్డ తనకు తోడుంటే సంసారాన్ని సులభంగా ఈద గలుగుతుంది"

"ప్చ్ దాని బతుకు పాడు చేయొద్దు. బడికి పంపాలె. తన బిడ్డ చదువుకొని మంచి నౌకరి చేయాలి" కూర్చున్న సులోచనకు మనసు నిండా ఆలోచనలు.

'అక్కా' పటేల్ కూలి పైసలిస్తుండట అందరు పోతున్నరు"

బయట నుండి ఎదురింటి మంగమ్మ పిలుపు.

ఇందిరా! పోదాం! లేవే! ఈ పటేల్ ఇప్పుడు తప్పితే పైసలకు ఎన్ని రోజులు తిప్పుతడో ఏమో"

ఇద్దరు ఆసామి ఇంటికి వెళ్ళారు.

ఆ రోజే రైతు కూలి డబ్బులు అందరికి పంచాడు. ఇందిరకు పెద్దలకిచ్చినట్లే రోజుకు ముప్పయి లెక్క రెండు వందల పది రూపాయిలొచ్చాయి. ఆ డబ్బు చూసి ఇందిర కళ్ళు మెరిశాయి. తల్లికి కూడా అంతే యిచ్చారు.

సులోచన, ఇందిర డబ్బులు తీసుకోలేదు. తన బిడ్డ ఎప్పటి నుండో కాపీలు, పెన్నులు కొనుక్కుంటానంటుంది. తనా ఎన్నడుకొనియ్యలేదు. ఈ విధంగానన్నా దాని కోరిక తీరుతుందనుకుంది. తన రెండొందల పది రూపాయలు భద్రంగా పుస్తకాల మధ్య పెట్టి బ్యాగ్‌లో దాచుకుంది ఇందిర.

రాత్రి అన్నం తిని పడుకున్న ఇందిరకు రంగురంగుల కలలు, పంచరంగుల కలలు. కొత్త బ్యాగ్, కొత్త కాపీలు, కొత్త పలక, పెన్నులు, పెన్సిళ్ళు, కాంపాక్సులు, లాంగ్ నోట్స్, బొట్టు బిల్లలు, బ్యాడ్జీలు.... అందరిలా తను బడికి పోతుంది. కొత్త డ్రెస్సు, షూ, టై, బెల్ట్, సంకకు బ్యాగ్ వేసుకుని బడికి పోతున్నట్లు కలల మీద కలలు. తను బాగా చదువుకుంటుంది. డాక్టర్, టీచర్, కలెక్టరయినట్లు కలలుకన్నది. తమ స్కూలు విజయ టీచర్‌ను చూసి టీచర్ కావాలనుకుంది. తన తల్లికి ఆపరేషన్ చేసిన డాక్టరమ్మను చూసి డాక్టర్ కావాలనుకుంది. తమ ఊరికి కార్లో దర్జాగా వచ్చిన కలెక్టరమ్మను చూసి కలెక్టరు కావాలనుకుంది.

ఆ రోజు తోటి పిల్లలందరికి చెప్పుకుంది. రేపు తను అన్నీ కొత్తవి కొనుక్కుని బడికి వస్తున్నట్లు. ఎన్నెన్నో ముచ్చట్లు. స్నేహితుల ముందు దర్జా ఒలకపోసింది తల్లి మీద చేయి వేసి కలల ప్రపంచంలో తేలిపోయింది ఇందిర.

D D D

రాత్రి ఊరంతా నిద్రపోయింది. తిరిగి తిరిగి వచ్చిన మల్లేశానికి నిద్ర రావడంలేదు. ఇంటి ముందు బయట బండ మీద కూర్చుని బీడీ మీద బీడీ తాగేస్తున్నాడు. ఎన్ని ఇండ్లు తిరిగినా పావుశేరు సారా దొరకలేదు. సర్కారు సారా నిషేధం తర్వాత గుడుంబా తయారీ ఆ ఊరిలో కుటీర పరిశ్రమే అయింది. "థూ... థూ... యదవబతుకు..." బీడీ పార వేశాడు.

వూరంతా బాకీలు చేశాడు. ఓ మోపెడు సర్కారు తుమ్మకట్టె లేస్తి ఓ పావుశేరు సార పోసే వాళ్ళు. ఈ రోజు కట్టెలకు పోలేదు. అందరి దగ్గర బాకీలు చేశాడు. ఎవరింటికి పోయినా లేదన్నవారె. భార్యా పిల్లలు బయట మంచాల మీద నిద్రపోతున్నారు. ప్రొద్దస్తమానం కష్టం చేసి వాళ్ళు మాంచి నిద్రలో వున్నారు. ఆ రోజు భార్యా బిడ్డ డబ్బులు తెచ్చింది చూశాడు. భార్యంటే డబ్బులు ఇంట్లో పెట్టదు. బొడ్లో సంచిలో దోపుకుంటుంది. ఇందిర ఎక్కడ దాచుకుందో. ఇవే అతని ఆలోచనలు పిల్లిలా గుడిసెలో దూరాడు. ఇంట్లో వున్న కుండలు, సందుకలు బుట్టలు, అన్నీ బోర్లించాడు. పెద్ద కాగులో చూశాడు. గ్యాసు

నూనె దీపంతా ఇల్లంతా గాలించాడు. ఎక్కడా ఒక్క రూపాయి కనిపించలేదు.

ఓ మూల ఇందిర స్కూలు బ్యాగ్ కనిపించింది. దాన్నిండా పుస్తకాలు, పాత కాపీలు, పలకతో దిండుగా కన్పించింది. దీపం దగ్గర పెట్టుకొని బ్యాగ్ బోర్లించాడు. పుస్తకాలు, బలపాలు, కాపీలు, చెల్లాచెదరయ్యాయి. చేతితో అటూ యిటూ కెలికాడు. మల్లేశం కల్లు మెరిశాయి. వంద రూపాయలనోటు ఓ పుస్తకంలోంచి తొంగి చూస్తుంది. పుస్తకం తీసి దులిపాడు. రెండు వంద నోట్లు ఓ పది రూపాయల నోటు కింద పడ్డాయి. గబగబ జేబులో వేసుకున్నాడు. పుస్తకాలు, కాపీలు, బుద్ధిగా బ్యాగ్‌లో పెట్టాడు. లోపల చప్పుడు సులోచన విన్నా ఎలుకల చప్పుడనుకుంది. రోజూ ఎలుకలు తిరగడం ఇంట్లో మామూలే. పక్కకు తిరిగి బండ మీద చేయి వేసి పడుకుంది.

బయట పడ్డ మల్లేశంలో హుశారె హుశారు.

వెయ్యేనుగుల బలం వచ్చినట్లయింది. ప్రక్కంటి ముందు నులక మంచంలో పడుకున్న మస్తాన్‌ను లేపాడు. ఇద్దరు తాగుడు దోస్తులు క్షణాల్లో ఇద్దరు ఊరి బయట బైపాస్ రోడ్డు వద్దకు చేరారు. రోడ్డెంట వున్న గుడిసె హోటల్లో దూరారు. ఆ హోటల్లో దొరకంది లేదు. నాటు సారా నుంచి నాణ్యమైన సీమ సరుకు దాకా బాటిళ్ళు దొరుకుతాయి. లారీ డ్రైవర్ల కొరకు తెల్లవార్లు హోటళ్ళు తెరిచే వుంచుతారు. ఇద్దరు ఓ నాటు ఫుల్‌బాటిల్ రెండు చికెన్ బిర్యానీలు తీసుకున్నారు. తన దగ్గరున్న డబ్బులు అయిపోయే దాకా తిని తాగారు.



'ఒరేయి మస్తాన్'

"ఊం..."

"ఇది నా బిడ్డ కష్టం రా" నా బిడ్డ కష్టం.

''నా బిడ్డ వారం రోజులు కూలికిపోయిందిరా" అంతలోనే ఏడుపు.

మళ్ళీ అంతలో నెసం బాలింపు. మాటలు తడబడుతున్నాయి.

"ఇక మనకు దోకా లేదురా! నా బిడ్డ కూలికి పోతుందిరా"

"ఎన్నాళ్లయిందిరా కడుపు నిండా తాగి"

"ఇంక మనకు మంచి రోజులొచ్చాయిరా"

తూలుకుంటూ తూలుకుంటూ వచ్చి గుడిసె వెనుక మంచం మీద వాలాడు మల్లేశం.

D D D

తెల్లవారంది కోడి కూతతోనే పల్లెలేచింది. బర్లపాలు పిండే వారు, వాకిళ్ళు ఊడ్చిచల్లేవారు. అలికి ముగ్గులు వేసేవాళ్ళు. పాలకేంద్రాలకు పాలు తీసుకపోయేవారు. పొలాలకు వెళ్ళే రైతులు, ఎవరి హడావిడి వారిది. చీకటితోనే ఇందిరను లేపి తను పనికి పోయింది సులోచన.

రోజు బద్దకంగా లేచే ఇందిర ఆ రోజు హుశారుగా లేచి చకచకా వూడ్చి చల్లి అలికి ముగ్గులు వేసింది. బోరింగు దగ్గర నీల్లు తెచ్చి పెట్టింది. చెల్లె, తమ్ముని, స్నానం చేయించి, తను స్నానం చేసి తయారయింది. తల్లి తెచ్చిన ఉప్మా తలాయింత తిన్నారు.

"అమ్మా"

"ఏంది బిడ్డా"

"ఇయ్యాల బడికి పోతానమ్మా"

వారం రోజుల నుండి నా పాఠాలు వెనుకబడి పోయామమ్మా"

"పెన్నులు, కాపీలు, కొనుక్కొని పోతానమ్మా"

"పో బిడ్డా మేం కొనీయకున్నా! నీ కష్టం నువ్వు కొనుక్కో నీ పైసలన్ని బెట్టి ఎన్ని వస్తే అన్నీ కొనుక్కో" సులోచన కండ్లలో నీల్లు తిరిగాయి. పైట చెరుగుతో తుడుచుకుంది.

ఇందిర హుశారుగా తన బ్యాగ్ దగ్గరికెళ్ళింది. కొట్టుకెళ్ళి తనకు కావలసినవన్నీ కొనుక్కోవాలి. పిల్లలందరికి చూపించాలి.

బ్యాగ్ తీసి తను దాచిన పుస్తకం తీసి దులిపింది.

తను అపురూపంగా దాచుకున్న కొత్త నోట్లు.

కాగితాల మధ్య అపురూపంగా దాచుకున్న నోట్లు.

రెండు మూడుసార్లు సాంఘిక శాస్త్రం పుస్తకం దులిపింది.

... లేవు... లేవు....

పుస్తకం... పుస్తకం... కాపీ.. కాపీ.... అన్నీ రెండు మూడుసార్లు తిరిగేసింది. ఎక్కడా లేవు... ఇందిర గుండెల్లోదడ.

ఎంత వెదికినా ఎక్కడా కానరాలేదు. ఇందిర కల్లలో నీల్లు.

అమ్మా! ఏడుపు గొంతులో ఇందిర

"నాపైసలేవు నువ్వుగాని దాచావా"

పనిలో వున్న సులోచన గాబరాగా వచ్చింది.

"బాగా చూడమ్మా! నీ పైసలునేనెందుకు దీస్త. నిన్నే దాచుకొమ్మంటిగదా"

"బాగానే చూశానమ్మా! రెండు మూడుసార్లు చూశా... లేవు"

ఏడ్చుకుంటూ చెప్పింది ఇందిర.

"ఏది జరుగు నేను చూస్త"

సులోచన బ్యాగ్‌ను, పుస్తకం, పుస్తకం, కాపి, కాపి అన్నీ పేజీ పేజీ తిరిగేసింది. నట్టింట్లో చతికిలబడింది.

'ఇంటెనుక మంచంల మీ అయ్యున్నాడేమో చూడు'

ఆమె మనస్సు కీడు శంకించింది. ఎన్నోసార్లు మల్లేశం ఇంటిలో పైసలెత్తుకపోయి తాగొచ్చే అలవాటుంది. పొద్దెక్కినా మల్లేశం లేవలేదు. రాత్రి మత్తు దిగలేదు.

గబగబ మంచం దగ్గిరకి పోయి చూసింది సులోచన. మందు వాసన వస్తూనే వుంది.

"ఓరి నాయినో ఈ ముదనష్టపోడు నా బిడ్డ పైసలెత్తుకపోయి తాగొచ్చిండు దేవుడో. వీనితో ఈ సంసారం నేనెట్లా చేసేది దేవుడో"

శోకాలు మొదలుపెట్టింది సులోచన.

తన కలలు కల్లలైన వేళ. తన ఆశలు అడియాసలైన వేళ.

ఇందిర నోట మాట రాలేదు. తోటి పిల్లలకు తన ముఖం ఎలా చూపాలి. వాళ్ళతో నిన్న తను ఎన్నెన్ని చెప్పింది.

అన్నీ కొత్త... కొత్త... కొత్త...

బ్యాగ్... పెన్నులు... పెన్సిల్లు... కాపీలు... కాంపాక్స్...

దీనంగా ఇందిర. కూర్చున్న చోటు నుంచి ముఖంపైకెత్తని ఇందిర.

ఇక ఆ రోజు నుండి బడి ముఖం చూడలేదు ఇందిర.

"తల్లి ఎంత చెప్పినా వినిపించుకోలేదు.

తల్లి వెంటే కూలికి...

నెల దాటాక ఇందిర పేరు డ్రాపౌట్ లిస్టుకెక్కింది.

V

నివేదిక

# నూరు పువ్వులు, వేయి భావాల కలనేత "సాహిత్యశాల"


ప్రారంభసభలో ప్రసంగిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ కె. ప్రభాకర్‌రెడ్డి

**ఉదయశంకర్**

మార్చి 5, 6 తేదీలు కృష్ణా తీరాన్ని "సాహిత్య తీరం"గా మార్చాయి. కృష్ణానదీమతల్లి ఒడి విజయవాడ, రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన మూడొందలమంది సృజనశీలురకు విడిది అయ్యింది. కథ, నవల, కవిత తదితర ప్రక్రియలకు చెందిన రచయితల ప్రయోగశాల అయ్యింది. తమ సాహిత్యవివేచన నాణ్యతలోని పసిడిశాతం చూసుకునే గీటురాయి అయ్యింది.

'సాహితీస్రవంతి' గతంలో నిర్వహించిన సాహిత్యపాఠశాలలకు, సాహిత్య తరగతులకు భిన్నంగా ఓ వినూత్న పద్ధతిలో ఈ "సాహిత్య శాల"ను నిర్వహించింది. ఈ సాహిత్యశాల ఎందరో సాహిత్య'బాట'సారుల పాలిట 'ధర్మశాల'గా వినమ్రంగా ఆహ్వానం పలికింది. దూరాభారాలనుంచి వచ్చిన బంధువులందరి పరస్పర పలకరింపుల కోలాహలానికి పందిరి వేసింది. పచ్చటి అరిటాకంతటి ఆప్యాయతను పరిచి, షడ్రుచుల సాహిత్య చర్చలను వడ్డించింది.

ఆహ్వానసంఘం విజయవాడలోని మధుకళామండపంలో ఈ సాహిత్యశాలకు వేదిక వేసింది. దేశదేశాల ప్రజా రచయితల ఫొటోల ఎగ్జిబిషన్‌ను తీర్చింది. పలు సాహిత్య గ్రంథాల ప్రదర్శన ఏర్పరిచింది. కథ, నవల ప్రక్రియల గురించి మాట్లాడుకునేందుకొక తావుని, కవిత్వం గురించి కలబోసుకునేందుకు మరొక తావుని అమర్చింది. దాదాపు మూడొందలమంది రచయితలను పాల్గొనమని పిలిచింది. ప్రపంచీకరణ, మతోన్మాదం, టెర్రరిజాలను వ్యతిరేకించే సాహితీ మిత్రులందరికీ స్వాగతం పలికింది. సాహిత్య చరిత్ర, రచనాశిల్పం, వివిధ టెక్నిక్‌లు, రచయితల అనుభవాలు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లు, చర్చలకు తెరతీసింది. జ్వాలాముఖి, అద్దేపల్లి రామమోహనరావు, శివారెడ్డి, ఖాదర్‌మొహియుద్దీన్, పాపినేని శివశంకర్, మందరపు హైమవతి, దేవేంద్ర, కె రామమోహనరాయ్, సీతారాం, జిలుకర శ్రీనివాస్, యాకూబ్ ఇంకెందరో కవులను మాట్లాడమని కోరింది. కేతు విశ్వనాథరెడ్డి, బోయ జంగయ్య, ముక్తవరం పార్థసారథి, అంపశయ్య నవీన్, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, కాలువ మల్లయ్య, ప్రతిమ, కళ్యాణరావు, గూడూరి సీతారామ్ మరికొందరు కథానవలాకారులను రప్పించింది. వీరందరితో కలసి సాహిత్యశాలకు హాజరైన ప్రతినిధులందరూ మొదటిరోజు సాహిత్య మథనం చేశారు.

కృష్ణాజిల్లా కలెక్టర్ డా. కె ప్రభాకరరెడ్డి ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించి, స్వాగతోపన్యాసం చేశారు. నిత్యం ప్రవహించే సజీవ నదిలా సాహిత్య ప్రవాహం సాగాలని, అలా సాహితీ స్రవంతి చైతన్యధారలా రచయితలను కవులను తన వెంట కొనిపోవాలని ఆశిస్తున్నాని కలెక్టర్ స్వాగతం పలికారు.

"సాహిత్య ప్రయోజనం చాలా విస్తృతమైనది. దాన్ని ప్రజా, విప్లవ ప్రయోజనాలకే కాక ఇంకా అనేక అంశాలకు విస్తృతమొనర్చాలి" అని చేకూరి రామారావు సాహిత్యశాలను ప్రారంభించారు. విలక్షణమైన సాహిత్యాన్ని సంకుచితంగా కాక విశాలదృక్పథంతో చూడాలంటారు చేరా గారు. ఏది మళ్ళీ మళ్ళీ వినాలనిపిస్తుందో, చదవాలనిపిస్తుందో అదే మంచి సాహిత్యమంటా రాయన. మార్క్స్ నుండి హోచిమెన్ వరకూ విప్లవమేధావులే కాదు సాహిత్యాభిమానులు కూడా అని చేరా గుర్తుచేశారు.

జ్వాలాముఖి మాట్లాడుతూ ప్రాచీన సాహిత్య యుగంలో శతకకారులు కనుక లేకపోతే ఈనాటికీ మనకు నిజాలు తెలిసేవి కాదన్నారు. ఉన్నతమైన సమాజం కోసం సాహిత్యాన్ని ఒక విశ్వాసంగా భావించేవారు ఓ స్రవంతిలా సాగుతారని జ్వాలాముఖి తన భావాలను పంచారు.

### సఫలమైన ప్రయత్నం

సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి ఈ మొత్తానికి అధ్యక్షత వహిస్తూ, ప్రగతిశీలభావాలకు చెందిన రచయితలనూ, కవులను ఒక విశాల వేదికపైకి సమీకరించాలని ఆశించాం. ఒకరు పాఠాలు చెప్పడం, ఇంకొకరు నేర్చుకునే పాఠశాల కాదిది. మనందరి అనుభవాలు కలబోసుకోవడం ద్వారా నేర్చుకోవడంగా ఇది సాహిత్యశాల అనంటున్నాం. మహాభారతంలో నర్తనశాల, దువ్వూరి రామిరెడ్డి పానశాల, శ్రీశ్రీ మనోప్రపంచాన కార్మికశాల మనం ఎరిగినదే. ఆ కోవలో వాటి సాహితీ చరిత్ర స్ఫూర్తి స్ఫురణకొచ్చేలా దీనిని సాహిత్యశాల అంటున్నాం" అని అన్నారు.

### మూడు సెషన్లు

అనంతరం సభ రెండు సెషన్లుగా విడిపోయింది. కథ-నవల ఒకటిగానూ, కవిత్వం మరొకటిగానూ చర్చించారు. వాస్తవానికి చాలా మంది సభికులు అన్ని కలసి చర్చించాలని లేకపోతే ఏదో ఒకటి మిస్ అవుతామని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయినా సమయం కలసి రావడానికి, సమగ్రమైన చర్చకు వీలుగా విడివిడిగానే సెషన్స్ జరిగాయి.

కవిత్వం సెషన్‌కు కవి అడిగోపుల

వెంటకరత్నం అధ్యక్షత వహించారు. కవితా పరిణామం అన్న అంశంపై జ్వాలాముఖి, కవితా రీతులుపై అద్దేపల్లి రామమోహనరావు, సమకాలీన కవిత్వంపై కె.రామ్మోహనరాయ్, కవి అభివ్యక్తిపై కె.శివారెడ్డి, కవిత్వం అల్లిక పై జిలుకర శ్రీనివాస్, సామాజిక దృక్పథంపై ఖాదర్ మొహియుద్దీన్, కవితావతరణంపై సీతారామ్ ప్రసంగించారు. ప్రసంగాలను ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సాధారణ సభా ప్రసంగాల తరహాలో గాక విషయప్రదానంగా ఉపన్యాసాలు సాగాయి.

అదే సమయంలో అనువాదకులు రచయిత కె.కేశవరెడ్డి అధ్యక్షతన కవిత్వం-నవల సెషన్ జరిగింది. అంపశయ్య నవీన్ మొదట నవాలా ప్రపంచం అనే అంశంపై మాట్లాడారు. శిల్పం-సమాజంపై కళ్యాణరావు, కథాప్రక్రియ వివిధ కోణాలపై కేతు విశ్వనాథరెడ్డి, రచనాసంబంధమైన మెళకువలపై ముక్తవరం పార్థసారధి, తమ తమ అనుభవాలతో బోయ జంగయ్య, వి.ప్రతిమ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య ప్రసంగించారు. కాలువమల్లయ్య, గూడూరి సీతారామ్ కూడా పాల్గొన్నారు.

### మధురానుభవంగా "ముఖాముఖి"

ఆరోజు సాయంకాలం డాబాపై ఓ చక్కని ప్రయోగానికి అవకాశమిచ్చింది. నాటి సాయంకాలం వరకూ తమ ఆలోచనలను పంచిన కవులకు, కథకులకు పాల్గొన్న ప్రతినిథులందరికీ మధ్య సమయాన్ని కూడా మరిచిపోయేంత గాఢమైన ముఖాముఖి జరిగింది. సాహిత్య సృజనలో అప్పుడప్పుడే రాస్తున్నవారు, ఎప్పటినుంచో రాస్తూవున్నవారు తమతమ సందేహాలను, ప్రక్రియాపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను, అవగాహనా పరంగా లోతుపాతులను నిర్మొహమాటంగా చర్చకు పెట్టారు. (ఆ వివరాలు ముందు ముందు సమగ్రంగా వెలువడతాయి)

### మీడియా-సాహిత్యం

సాహిత్యశాల రెండవరోజు 'సాహిత్యం-మీడియా' అనే అంశంపై కె ఆనందాచారి అధ్యక్షత వహించిన వేదిక నుంచి వివిధ ప్రచురణ, శ్రవ్య, దృశ్య మాధ్యమాలకు చెందిన వక్తలు తమ అభిప్రాయాలను చెప్పారు. సి రాఘవాచారి(విశాలాంధ్ర), ఎన్ వెంకట్రావు(ప్రజాశక్తి), గుడిపాటి(వార్త), ఖదీర్‌బాబు(ఆంధ్రజ్యోతి), కొత్తపల్లి రవిబాబు(ప్రజాసాహితి), నాగసూరి వేణుగోపాల్(ఆకాశవాణి), కంభాలపల్లి కృష్ణ(టీవీ-9) తమతమ అభిప్రాయాలను సాహిత్యశాల ముందు పెట్టారు. ముద్రణ, శ్రవ్య, దృశ్య మాధ్యమాలలో సాహిత్యానికి ఇస్తున్న అవకాశం, ఆ అవకాశానికున్న ప్రజాస్వామిక స్వభావం ఎంత అనే అంశం చాలా ముఖ్య చర్చగా ముందుకు వచ్చింది. వ్యాపారానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే ప్రింట్, విజువల్ మీడియాలో సంచలనాలకూ, వాదోపవాదాలకు మాత్రమే స్థానమిస్తున్నారని, పత్రికల్లో వచ్చే భాషనే ప్రమాణంగా స్వీకరిస్తారు కనుక భాషా శాస్త్రంలో అవగాహన కలిగివుండాలని అన్నారు. ప్రధాన స్రవంతికి చెందిన పత్రికల్లోనే తమ రచన అచ్చుకావాలని వెంపర్లాడేకంటే సాహిత్యసంస్థలు తమదైన వేదికగా అనేక పత్రికలను సృష్టించుకోవాలని హితవు చెప్పగా, ఆయా సాహిత్య సంస్థలకు చెందిన అభ్యుదయ, సృజన, ప్రజాసాహితి, అరుణతార, ప్రస్థానం లాంటి చిన్న పత్రికలే ఎంతో సాహిత్యాన్ని వెలువరిస్తున్నాయని సమాధానపూర్వకంగా అన్నారు. రోజువారీ పత్రికల్లో కేవలం సాహిత్యాన్ని చూసే సంపాదకులు లేరని ఉన్నమేరకు రకరకాల వాదాలకు, వర్గాలకు సమానంగా అవకాశం కల్పిస్తూ పాజిటివ్-నెగెటివ్ కోణాలను ప్రతిబింబించడం జరుగుతోందని చెప్పారు. మౌఖిక సాంప్రదాయ పద్దతిలో సాహిత్య సేవను ఆకాశవాణి, ఎంతో వ్యాపారాత్మకత మధ్య కొన్ని ఛానల్స్‌లో అతికొద్ది ఎపిసోడ్‌ల పాటి సాహిత్య కృషి మాత్రమే టీవీ మీడియా చేస్తోందని చెప్పారు. ప్రింట్, విజువల్ మీడియాల్లో కంటే డిజిటల్ మీడియాగా మన ముందుకొస్తున్న వెబ్‌సైట్ మీడియా అత్యంత ప్రజాస్వామిక స్వభావం ఉందని, కానీ అది కేవలం ఒక్కశాతం వారికి మాత్రమే చేరుతుందనే పరిమితి అతిపెద్ద అడ్డంకి అని విశ్లేషించారు.

ప్రత్యేకంగా హాజరైన విజయవాడ ఎం.పి. లగడపాటి రాజగోపాల్ కార్యక్రమంపట్ల హర్షమోదాలు తెల్పుతూ అభినందించారు.

### బాలసాహిత్యం

చివరగా బాలసాహిత్యం పై కూడా ఒక అంశంగా చర్చించారు.

### ముగింపు సభ

ముగింపు సభకు వల్లభాపురం జనార్దన్ అధ్యక్షత వహించగా ఎస్. వెంకట్రావ్ సాహిత్యశాలకు తోడ్పడిన వారికి ధన్యవాదాలు చెప్పారు. కన్వీనర్ తెలకపల్లి రవి భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయంటూ వీడ్కోలు పలికారు. కవితా పఠనంతో ఓ మరుపురాని అనుభూతిగా కలగలసి వసించిన సాహిత్యశాల నుంచి తమతమ ప్రాంతాలకు తిరిగివెళ్లారు. V

# "యుగాంతం"

**సత్యభాస్కర్ ఎ.**

ఇక్కడ...
సత్యం వనవాసం చేస్తోంది
అబద్ధం అధికారమేలుతోంది
పాదుకలు కావాలంటు
భరతుడు
అడవుల్లోని రాముడిని
ఎన్‌కౌంటర్ చేసేందుకు
కుట్రలు పన్నుతున్నాడు
అందరూ మారీచులే!
అందరూ మాయలేడిలే!
పొంచి వుండి
రావణుడిలా దాడి చేసేందుకు
ప్రతివాడు సిద్ధమే!
చాణక్యం పేరిట
చాతకానితనం
చారిత్రక విద్రోహం
వెన్నుపోట్లు
కుట్రలు, కుతంత్రాలు
రాజ్యమేలుతున్నాయి!
ఇక్కడ...
మనిషి ప్రాణం
మహాచౌక
'మానం' వెలలేని సరుకు
'ఆకలిచావు' పేదవాడి ప్రారబ్ధం,
రాజ భోగాల కోసం
మానవ శ్రమ
వంట చెరకవుతోంది!
కలి పురుషుడి కోసం
సత్యయుగం కోసం
కాలం ఎదురు చూస్తోంది!

# బాల సాహిత్యంపై చర్చ

**రావెల సాంబశివరావు**

సాహిత్యశాలలో మార్చి 6న మధ్యాహ్నం 3 గం.లకు బాలసాహిత్యంపై జరిగిన చర్చకు బాలసాహిత్య సృజనకర్త, నాగార్జున విశ్వవిద్యాలయం రిటైర్డ్ రిజిస్ట్రార్ శ్రీ రావెల సాంబశివరావు అనుసంధానకర్తగా వ్యవహరిస్తూ చర్చను ప్రారంభించారు

ముందుగా బాలసాహిత్యం స్వరూప స్వభావాలపై దృష్టి నిలిపారు పెద్దలు పిల్లల కోసం సృజియించినా, పిల్లలు పిల్లల కోసం సృజియించినా అది బాల సాహిత్యవే అవుతుందని చెప్పుకొని మన దేశంలో పిల్లలు పిల్లల కోసం రచించిన దాని కంటే పెద్దలు పిల్లల కోసం రచించినదే అధికమని తేల్చారు. పిల్లల్ని బాలసాహిత్యం సృజన చేసేందుకు బాగా ప్రోత్సహించాలన్నారు. వాళ్ళకు మాట, పాట కూడా ఒక ఆట కావాల్సి ఉందన్నారు.

పిల్లల్లోని రచనా నైపుణ్యాలపై చేసిన పరిశోధనను గుర్తుకు తెచ్చుకుంటూ చర్చలో పాల్గొన్న కొందరు ఉపాధ్యాయులు తమ తమ స్వంత ప్రయోగాలనూ, వాటి ప్రయోజనాలనూ వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో లైబ్రరీకి కేటాయించిన పీరియడ్‌ను కవితా సృజనాసక్తిని బాలల్లో పెంచేందుకు విధిగా కృషి జరగాలనే ప్రతిపాదన ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

పరుల కష్టాలు చూచి కుదురుగా కూర్చోలేని స్త్రీ పురుషులు ప్రపంచంలో పలువురు ఉంటారు. వెనుక తరముల వారి వీర చరితలకు నార్పోసి, నీర్పెట్టి ముందు తరాలకు వాటి ఫలాలను అందించవలసిన అవసరాన్ని గుర్తించారు. ఆ దినం అంటూ ఈ దినం అంటూ బాలల్ని ఎప్పుడూ ఎండల్లో తిప్పటమే చేస్తే వాళ్ళు "మీ దినాలు మీరే చేసుకోండి" అంటూ ఎదురు తిరిగే ప్రమాదాన్ని గుర్తించారు.

బాగా అభివృద్ధి చెందిన సాంకేతికరంగం పిల్లలకు అందించే అదనపు సమాచారానికి అబ్బురపడ్డారుగాని వాళ్ళు చిత్ర విచిత్రమైన ఆకర్షణలకు గురికావటాన్ని చూచి ఆందోళన చెందారు. ఇప్పుడు వాళ్ళకు 'అ' అంటే కన్న తల్లి అమ్మ గుర్తుకు రావటంలేదు. 'అ' అంటే ఆకలయితే తినే అరటిపండు గుర్తుకు రావటం లేదు. 'అ' అంటే వాళ్ళ తాత ముత్తాతలు కట్టిన అరక గుర్తుకు రావటంలేదు. 'అ' అంటే అమలాపురం అంటూ వేసే పిచ్చిగంతుల్ని చర్చాగోష్టిలో పాల్గొన్న అందరూ నిరసిస్తూ బాలలకు సరైన పెంపకాన్ని, బోధనను అందించవలసిన అవసరాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా చలం, బీవీ, నార్ల చిరంజీవి వంటి రచయితల్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. అర్థంలేని, అర్థంకాని పద్యాలు అనర్థదాయకం అనకుండా, అసలు పద్యం కనబడగానే దాని నడుములు విరగదన్నేందుకు దుడ్డుకర్రలతో బయలుదేరిన దాని ఫలితమే యివ్వాళ పిల్లల్ని శతకసాహిత్యం నుండి దూరంగా ఉంచటం జరిగిందేమో అని భావించారు కొందరు.

మిగతా సాహిత్య ప్రక్రియల్లో సృజనకర్తలు కోకొల్లలుగా పెరిగినట్లు బాలసాహిత్యంలో పెరగరేం? అందుక్కారణా లేమిటి బాలసాహిత్యం అంటే సృజనకర్తలకు చిన్న చూపా? అలక్ష్యమా? అనే విషయాలపై కూడా చర్చ సాగింది. చివరకు కొందరు బాల సాహిత్యంపై వేసిన పుస్తకాలు అమ్ముడు పోకపోవటాన్ని ఒక కారణంగా చూపెట్టగా వారికి బోయ జంగయ్యగారు కొన్ని చిట్కాలు అందించారు.

బాలల్లోని అద్వితీయ ప్రతిభకు అచ్చరువొంది ఇంతకు మించి పెద్దవాళ్ళం ఏం చెప్పగలం అని మిన్నకుందామా? తరం వాళ్ళది గనుక గళం కూడా వాళ్ళ దే కావాలందామా? కాదు కాదు మన అనుభవాల్నీ, మేథాశక్తినీ, లోకజ్ఞానాన్నీ, మనో వైజ్ఞానిక దృష్టినీ, సమతా భావాలనూ రంగరించిన సరసమైన రచనలు కూడా యిబ్బడి ముబ్బడిగా రావాలా అనే చర్చకు ఉపక్రమించటంతో సమయాభావంవల్ల ఈ విషయాలు మరో సాహిత్యశాలలో చర్చించుకుందామంటూ ఆ చర్చను అక్కడ ముగించి అందరూ ముగింపు సమావేశానికి సాగిపోయారు.

V

# కొక్కరోకో!

**మాల్యశ్రీ**



అదుగడుక్కీ
ఎదురొచ్చే కొండవాగు
పల్లె పదుచు!

కొమ్ము బూరా–
కొండదొర
షహనాయి!

కొక్కొరోకో
ప్రకృతి
మేలుకొలుపు!

ఆమనిలో మోదుగు చెట్టు
ప్రకృతి పూసుకున్న
వసంతం!

కొండల మీద ఎరగలి
బంగారు తీగల
రంగవల్లి!

తొలకరి వానకు
భూమి గుండెల పులకరింపు
రెంటికీ నెమళ్ల పలకరింపు

ఇప్పచెట్టు
మంచుకణాలు రాల్చిందా?
చుట్టూరా వెండిపూలు!

కోనలో
సెలయేటి హోరు
రేలపాట జోరు!

కొమ్ములూ – నెమలీకలూ
డోళ్లూ – కాళ్ళ గజ్జెలూ
థైంసా నృత్యం!


వెన్నెల నాట్యానికి
వెదురు పొదల సంగీతం
మరపురాని అనుభూతి!

# సాహిత్యసీమలో సరికొత్త ప్రయోగం - సమాస్వాదనం! సమిష్టి యోచనం!!



సాహిత్యశాల ప్రారంభిస్తున్న చేకూరి రామారావు. వేదికపై (ఎడమ నుంచి) కళ్యాణరావు, అద్దేపల్లి, కేతువిశ్వనాథరెడ్డి, తెలకపల్లి రవి, జ్వాలాముఖి, నవీన్,
(వెనక) శివారెడ్డి,కాలువ మల్లయ్య, గూడూరి సీతారామ్, దేవేంద్ర, ,ఆనందాచారి, జిలుకర శ్రీనివాస్, కంబాలపల్లి కృష్ణ

## కవిత్వం



కె. శివారెడ్డి



సీతారామ్



అడిగోపుల వెంకటరత్నం



జ్వాలాముఖి



కె. రామ్మోహన్‌రాయ్



ఖాదర్ మొహియుద్దీన్



అద్దేపల్లి రామ్మోహనరావు



జిలుకర శ్రీనివాస్

## మీడియా సాహిత్యం



సి. రాఘవాచారి



నాగసూరి వేణుగోపాల్



ఖదీర్‌బాబు



కొత్తపల్లి రవిబాబు



గుడిపాటి



ఎస్. వెంకట్రావ్



కంబాలపల్లి కృష్ణ



కె. ఆనందాచారి

## కథ-నవల



అంపశయ్య నవీన్



కేతు విశ్వనాథరెడ్డి



ముక్తవరం పార్థసారథి



కె. కేశవరెడ్డి



జి. కళ్యాణరావు



కాలువ మల్లయ్య



పాపినేని శివశంకర్



వి. ప్రతిమ






ముగింపు సభ: బాల సాహిత్యంపై చర్చను నివేదిస్తున్న రావెల సాంబశివరావు, అడిగోపుల, వల్లభాపురం జనార్దన్, తెలకపల్లి రవి, బోయ జంగయ్య



బాల సాహిత్యం రౌండ్ టేబుల్



సాహితీ మిత్రుల ఇష్టాగోష్ఠి చర్చలలో ఒక బృందం




అల (విజయనగరం) రాసిన 'నిప్పలవాగు' దీర్ఘ కవిత ఆవిష్కరణ



సాహిత్యశాలను ఉత్సాహపరచిన కళాకారులు



ప్రత్యేకంగా వచ్చి సందేశమిచ్చిన విజయవాడ ఎం.పి. లగడపాటి రాజగోపాల్




సభా ప్రాంగణంలో 'ప్రస్థానం' పోస్టర్




పుస్తకాలతో రచయితలు



ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్, కె. ప్రభాకరరెడ్డి, తెలకపల్లి రవి, అంపశయ్య నవీన్

# మట్టి పరిమళం మద్దూరి నగేష్‌బాబు

సి.హెచ్.వి.

"ఏ ప్రభుత్వాసుపత్రి శవాల కొట్టు ముందయినా ఒక కన్నీటి మడుగుని చూశారా – అది మా అమ్మే. ఏ సమాధుల దొడ్లోనయినా కనీసం చావుబండకి నోచుకొని బొంద మీద మొలిచిన ఏ కాకి శిలువని చూశారా – అది మా అమ్మేనండి"

దళిత సౌందర్య శాస్త్రానికి నత్తగుల్ల గజ్జెకట్టి నాట్యం చేయించి మట్టి వాసనల్ని నలుదిక్కుల వెదజల్లిన నల్లకవి మద్దూరి. కన్న పేగు గురించి చెప్పినా, కవిత్వం గురించి చెప్పిన మట్టి వారసత్వాన్ని మర్చిపోనివాడు మద్దూరి.

"కవిత్వ మంటే మార్పురా నాయనలారా!
అంతే కాని చూరు పట్టుకొని వేలాట్టం కాదు!"

శ్రీశ్రీ మహాప్రస్థానంలో కవిత్వం గురించి
విన్పించింది మద్దూరి ఈ రూపంలో చెప్పడం వర్తమానంలో ఒక పరిణతి.

1965 ఆగస్టు 15న గుంటూరు జిల్లా నరసరావు పేటలో మద్దూరి జన్మించాడు. నాగార్జున యూనివర్శిటీలో ఎం.ఏ. (ఇంగ్లీష్) చదువుకున్న మద్దూరి, ప్రేమ కవిత్వంతో ప్రారంభించి, ఏమి రాయాలి? ఎవరి కోసం రాయాలి? ఎందుకు రాయాలో లాంటి ప్రశ్నలు వేసుకొని స్పష్టమైన దారిని వెతుక్కున్నాడు.

"ఈ మబ్బులు తొలిగిపోవాలి
ఈ గోడలు కూలిపోవాలి
ఈ పాతాళంలో బెత్తెడు ఆకాశం కావాలి
ఈ దేశంలో చారెడు నేల కావాలి
తొలిగి పోనక్కరలేని బతుకు కావాలి
అన్నింటికీ మించి నా సింహాసనం నాకు కావాలి"

అంటూ 'దళిత మేనిఫెస్టో'ను ప్రకటించాడు. 1990ల ముందు దళిత గొంతు "గరగరల్ సవరించ"లేక పోతున్న సమయంలో చుండూరు ఘటన తరువాత రంగం మీదికొచ్చిన గళం నరసరావుపేట పిల్లాడైన మద్దూరి నగేష్‌ది.

మాల మాదిగ పల్లెల అసలైన భాషనూ, యాసనూ, దళిత పల్లెల ఆకాంక్షలను అందంగా వ్యక్తీకరించటం నగేష్‌బాబుతో పదునెక్కింది. దానికి చక్కటి ఉదాహరణగా 'అలగా తల్లి' కవిత. ఈ వ్యాసం ప్రారంభంలో రాసినట్లు అమ్మను వర్ణించడానికి భాష బలహీనమై పోయిందని ఎత్తిచూపాడు. ఒక దళిత స్త్రీ అత్యాచారానికి గురైన సందర్భాన్ని చెబుతూ "మానం పోతే కదుక్కుంటాను... రొమ్ములు కొరికేశావు కదరా! రెప్పొద్దున నా పిల్లలకి పాలెట్లాయివ్వాలిరా...!" ఇట్లాంటి వ్యక్తికరణలు మద్దూరికి మాత్రమే చేతనవును.

నగేష్ సాహిత్య కృషిలో
రచ్చబండ
వెలివాడ
లోయ
మీరేవుట్లు
నరలోక ప్రార్థన

శివ శంకర శర్మతో కలిసి 'ఊరు–వాడ' రాశాడు. 'వాడి ఆకాశం'కు సంపాదకత్వం వహించాడు. 'కాస్త సిగ్గుపడదాం' లాంటి సంఘీభావ కవిత్వం వెలువడడానికి ప్రేరణయ్యాడు.

ఇట్లా ఒక వైపు దళిత సాహిత్య సృష్టికి కారణమవుతూ పోటీ పరీక్షలలో కూడా నెగ్గి యం.ఆర్.ఓ.గా ప్రజలకు సన్నిహితు డయ్యాడు. మనిషి మనుగడ కోసం పోరాటం చేస్తాడని చెప్పాడు డార్విన్. నన్ను నేను రక్షించుకోవడానికి 'జీహాద్' తప్పదంటాడు మద్దూరి

అమ్మా నన్ను క్షమించు
... ... ... ... ...
వాడు నన్నో సరికొత్త అస్పృశ్యుడ్ని చేసి
నా కలం ధగ్ధావశేషాల మీద సింహాసనం
చెక్కుకుంటుంటే
నేను వాడ్ని క్షమించమని ప్రార్థించలేను.
నన్ను నేను రక్షించుకోవడానికి జీహాద్ తప్పదమ్మా
నాకు చేతులున్నాయ్!

ఈ దేశంలో పురాణాల నుంచి ఆధునికం వరకు దళితుల్ని చంపేసిన చరిత్రను ప్రేమగా, వ్యంగ్యంగా చెప్పటంలో కూడా మద్దూరికి తిరుగులేదు. "పంటికి పన్ను కంటికి కన్ను" అన్న కలంతోనే "నఫేజ్ కళ్ళు"లో ప్రేమ కురిపించగలడు.

అమాయకంగా ఈదే తాబేలు పిల్లలు
చిన్నప్పుడెప్పుడో తిట్టుకుంటూ గొణుక్కుంటూ
మా పంతులుగారు రాసిచ్చిన 'అ, ఆ'లు
కవిత్వానికి చిక్కని అనుభూతేదో అక్షరానికి
లొంగనపుడు కాగితం మీద నా మనస్సు గీసిన
రెండు చంధవాచేపలు ఆ కళ్ళకి నవ్వటం
తెలుసు.

మద్దూరి అంటరాని ప్రతీకల్ని వీపు తట్టి నిలబెడతాడు. దళిత పలుకుబడికి దళ నాయకుడు. 'రచ్చబండ' నుంచి 'నరలోక ప్రార్థన' వరకు నగేష్‌బాబు తాను గాయపడ్డ ప్రతి సంఘటననీ ఆర్ద్రంగా అక్షరీకరించినవాడు. అక్షరాలకు తల్లిపాలు రుచి చూపిన పరుష రూపి.

కసితో మొలకెత్తిన మద్దూరి విషాదంగా జనవరి 10, 2005న నిష్క్రమించటం జీర్ణించుకోలేని వాస్తవం.


దళిత సాహిత్యంలో మద్దెల శాంతయ్య, నాగప్పగారి సుందరాజు, గ్యార యాదయ్య లాంటి వర్తమాన కవులందరు నాలుగు పదులు నిండని వారే, ఈ లోపాల్ని సరిదిద్దుకోకపోతే మట్టి పరిమళాలు మాడిపోతాయి.

"దొరగారి తోలుతో కూడా చెప్పులు కుట్టవచ్చని
ఇక ఏది వల్లగాకపోతే
బోడ్రాయి దగ్గర నువ్ నాటిన కపాలాలకు చెప్పు
నాలుగు తుపాకీ పూలు పూయమని" చెప్పిన

మద్దూరి సామాజిక చైతన్య సాహిత్య కారుడు.

V

# స్వీకారం





**మట్టివాసనలు**

**పంజాల జగన్నాథం**

వెల : రు. 60


ప్రచురణ : పంజాల పబ్లికేషన్స్




**లోలోకి...**

**ఈగ హనుమాన్**

వెల : రు. 30




**ప్రవాహం**

**కథలు**

వెల : రు. 25

ప్రచురణ : విరసం



**ఇ-కుక్క (మరికొన్ని కథలు)**

**కె.వి. కూర్మనాథ్**

వెల : రు. 30

ప్రచురణ : విరసం



**తొలెరుక (జన్మ కావ్యం)**

**ఛాయరాజ్**

వెల : రు. 6150

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్




**మట్టిగంప (కవిత్వం)**

**పరిమళ్**

వెల : రు. 30

ప్రచురణ : పాలమూరు




**భూమితో మాట్లాడు...**

**వరవరరావు**

వెల : రు. 35

ప్రచురణ : యుగ ప్రచురణలు




**గమనం-ఘర్షణ-గమ్యం**

**యం. రత్నమాల**

వెల : రు. 40


ప్రచురణ : నూతన ప్రచురణలు




**మెరవణి**

**డా. వి.ఆర్.రాసాని కథలు**

వెల : రు. 60




**పోస్ట్ మాడర్నిజం**

**ఎన్. వేణుగోపాల్**

వెల : రు. 10

ప్రచురణ : స్వేచ్ఛా సాహితి

# సమీక్షా పర్వం

- శివసాగర్ కవిత్వం (1968-2004)
- జ్ఞాపకాలకొండ
- అమ్ములపొది
- తెలుగు సినిమా స్వర్ణయుగం
- గూడూరి సీతారాం కథలు
- మనోగతం
- నమ్ముకున్న రాజ్యం
- ఇంగ్లండులో ఇరవైఐదు రోజులు
- దస్త్రమ్

**తెలకపల్లి రవి**




## కొత్తనడత పాత ఘనత

**శి**వసాగర్ కవిత్వంపేరుతో విడుదలైన ఈ సంకలనంలో 1968-2004 మధ్య అంటే దాదాపు ముప్పైఅయిదేళ్లపాటు ఆయన రాసిన కవితలున్నాయి. ఇవన్నీ లోగడ వివిధ సంపుటాలుగా వెలువడినవే. గెరిల్లా విప్లవ గీతాలు(1974),జనం వూపిరితో(1982), పది వసంతాలు(1983),నెలవంక(1988),నడుస్తున్న చరిత్ర(2004) అన్న సంకలనాలను కలిపి మొత్తం 300 పేజీల ప్రస్తుత సంకలనం రూపొందించారు. ఖమ్మంలో సుపరిచితులైన సహృదయ సాహితీ మిత్రులు డాక్టర్ హరీష్, సతీష్‌లు ప్రచురణ తీసుకొచ్చారు.

విరసం సాహిత్యంలో- ముఖ్యంగా కవితలు, పాటలలో తనదైన ముద్ర వేసిన కవి శివసాగర్ ( ఇది కె.జి.సత్యమూర్తి కలం పేరు అని తెలియని వారు చాలా కొద్దిమందే వుంటారు). ఆయన విరసంలోనే గాక పీపుల్స్‌వార్ పార్టీలోనూ అనేక కీలక బాధ్యతలు నిర్వహించి, అనేక అంశాలలో విభేదించి చివరకు కన్షీరామ్‌తో కలసి పయనించి ఆ పైన ఆయననుంచి కూడా విడిపోయిన వ్యక్తి. నిర్జీవ నినాద ప్రాయమైన కవిత్వంలా కాకుండా శక్తివంతమైన భాషలో సామాజిక ప్రాకృతిక ఉపమానాలతో శివసాగర్ అనేక గేయాలు రాశారు. అభిప్రాయాలేమైనా ఆయన రాసిన ఉద్యమం నెలబాలుడు, విలుకాడా, చెల్లీ చంద్రమ్మా, వివిలా శాంటియాగో,ఉరిపాట వగైరా గేయాలు ఆయనను జనప్రియంచేశాయి. కవిత్వంలోని ప్రౌఢిమ, పాటలోని సుళువు కలసి వాటికొక కొత్త సౌందర్యం సమకూర్చడం వాటి ప్రత్యేకత. చదివినప్పుడు పాడినప్పుడు కూడా మనోజ్ఞంగా వుండే అనేక కవితలు ఆయన వెలువరించగలిగారు.

ఈ సంకలనంలో ఆయన ఆయా కవితల చారిత్రిక సందర్భాల్ని, అవి రూపొందిన క్రమాన్ని, ఆయా రచనల ప్రేరణలను పొందుపరచడం బాగుంది. ఇవి కవితలు రాయగోరే వారికి ఎంతైనా ఉపయోగపడే అనుభవాలు. ఉదాహరణకు ప్రజా గీతాలు ఎలావుండాలని చర్చిస్తున్న సందర్భంలో కరీంనగర్‌లో విన్న ఒక పాట ప్రభావం, 'నిను సంపి నీ నెత్రు బొట్టెట్టుకుందు' అని చలసాని చదివిన వాక్యం తననెంతో ఉత్తేజితున్ని చేసి, చెల్లి చంద్రమ్మ రచనకు తోడ్పడిందని చెబుతారు. కొన్ని కవితలపై స్పష్టంగా ఉదయిని ముద్ర వుంది. కాని గంగినేని కంటే కవితాపరంగానూ రాజకీయంగానూ పైనున్న శివసాగర్ కవితలలో ఆబలం లేకపోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. కొన్ని చోట్ల చాలా మనోహరంగా కనిపించే పోరాట గీతాలలో కూడా అచ్చమైన భావుకత, కాల్పనికత తొంగిచూస్తుంటే ఇది విప్లవ కాల్పనికత కాదు, కాల్పనిక విప్లవకత అన్న మాటలు నిజమనిపిస్తాయి.

ఈ సంకలనంలో అతి సాధారణమైన కవితలతో పాటు అత్యంత శక్తివంతమైన గీతాల వరకూ తూర్పు పవనం వీచెనోయ్ నుంచి బహుజనసమాజ నాయకుడుగా మారేంత వరకూ రాసినవి వున్నాయి. కాని అక్కడి నుంచి ఇక్కడి వరకూ పయనించిన కవి అనుభవాలు, అభిప్రాయాల మార్పులు, వాటి మంచిచెడ్డల గురించి మాత్రం రేఖామాత్రంగానైనా ప్రస్తావించరు.గుడిపాటి చివరలో చేసిన మూల్యాంకనంలో కవితాపరంగా శివసాగర్‌పై ప్రశంసలు కురిపించినందుకు పెద్ద అభ్యంతరం పెట్టవలసిన అవసరం లేదు.

కాని వీర విప్లవ కవిత్వానికి దళిత కవిత్వానికి కూడా శివసాగరే నిర్వచనమైనాడని వర్ణించడం పొసిగేది కాదు. ఇందులోని వైరుధ్యాలు దాచేస్తే దాగేవీ కావు.


అభిప్రాయాలు మార్చుకునే హక్కు ఎవరికైనా వుంటుంది. కాని కొత్తరూపాలెత్తుతూ కూడా పాత ఘనతను కొనసాగించాలనుకోవడం కుదిరేపని కాదు. 1970 వ దశకంలో విరసం తరఫున వెలువడిన పలు రచనలలో యాంత్రిక ధోరణిని తర్వాత వారే విమర్శించుకున్నారు. ఇందులో పునర్ముద్రించిన వరవరరావు ముందుమాటలలోనూ అలాటి విమర్శలున్నాయి. ఈ విమర్శ వ్యక్తులుగా ఆ కవులపైకాదు: ఆ దశలో వారి అవగాహనకు వారిని నడిపించిన భావాలకు వర్తిస్తుంది. వాటితో కొనసాగకుండా, వాటిని వదలకుండా శివసాగర్ వాటి తాలూకూ అత్యున్నత ప్రతిష్ట పొందాలనుకోవడం అసంబద్ధమైన విషయం.

రచనా పరంగా ఎవరు ఎంత గొప్పవారైనా నమ్రత చాలా అవసరమైంది. ప్రపంచ విప్లవకారులందరూ నిర్ద్వంద్వంగా గౌరవించే హోచిమన్‌తో తనకు పెట్టిన పోలికను ఇప్పుడు కూడా శివసాగరే నిరాకరించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాగా ఆనాడు చౌదరి తేజేశ్వరరావు వంటివారిపై విద్రోహులంటూ ధ్వజమెత్తిన వ్యక్తి ఆ ధోరణినే ఇప్పుడు ఇచ్చేనోట్సులోనూ కొనసాగిస్తారు. బయిలుదేరిన నాటి సిద్ధాంతాల పరిధినుంచి పూర్తిగా బయిటకు వచ్చినవారేమో ఇప్పటికి హోచిమన్‌తో పోల్చదగినవారు కాగా తను నమ్మిన మేరకు ఆ పరిధిలోనే పనిచేస్తున్న వారు విద్రోహులన్న మాట. ఇదో రకం విచిత్ర తర్కం. గత కవితలను నాటి పరిచయాలను యథాతథంగా పునర్ముద్రించారంటే అదో రకం. (అలా అనుకున్నా తొలిపుస్తకానికి ముందుమాట రాసింది వరవరరావు కాగా చేరా ముందు మాటను ఎందుకు తొలుత ప్రచురించారో అర్థం కాదు.) కాని కొత్తగా రాసిన నోట్సులోనైనా తాజాదనం లేకపోతే ఇంక చారిత్రిక మార్పులకు అనుభవాలకు విలువేముంటుంది?

గుడిపాటి అన్నట్టు చివరి భాగంలోని నడుస్తున్న చరిత్ర లో దళిత కవిత్వ పదజాలాన్ని ప్రతీకలున్నాయి. బిన్‌లాడెన్‌పై చిక్కడు దొరకడు అని రాసినప్పుడు, అల్లాహో అక్బర్ అన్నప్పుడు, ఆఖరుగా మణిపూర్‌బాధిత రాళ్ల తరఫున రండి మమ్మల్ని రేప్ చెయ్యండి అని రాసినప్పుడు ఆయన కలం పదును కనిపిస్తుంది. కానైతే కవితలకు వ్యాఖ్యానం ఎంత అవసరమో కవి పరిణామాన్ని కవిత్వ పరిణామాన్ని అర్థం చేసుకోవడానికి నోట్సు అంతే అవసరం కాదా? ఎప్పుడైనా సమాజానికి ఇవ్వాల్సిన వివరణను సంజాయిషీ అనుకొని దాటవేయడం సమంజం కాదు. నలభై ఏళ్ల కవిత్వాన్ని ఒకే వూపుగా చూపాలనుకోవడం సాధ్యమూ కాదు. వృద్ధాప్యంలో కూడా యవ్వన భావన భావ్యమని ఎవరూ అనుకోరు. అన్ని దశల్లోనూ అతీత స్థానాన్ని ఆశించడం కూడా అలాటిదే. శివసాగర్ కవిత్వాన్ని ఒక్కచోట చదివే ఈ అవకాశం లభించడం ఎంత సంతోషమో ఆయన భావ పరిణామం గురించి చదవాల్సిన కనీస విషయాలైనా చదవేఅవకాశం లేకపోవడం అంత ఆశాభంగం కలిగిస్తుంది.

**(శివసాగర్ కవిత్వం–1968–2004, పేజీలు :300, ధర : రు.100/–, ప్రతులకు : నవోదయ)**

**గేరా**




## జ్ఞాపకాలను విస్తరించేకొండ

ఏ పరిచయం అవసరంలేని ప్రముఖ కవి నిఖిలేశ్వర్‌గారి పాత, కొత్త మేలు కైతల కలయికతో వచ్చిన కవితా సంపుటి "జ్ఞాపకాలకొండ". ఈ పుస్తకంలో 1989 నుండి 2004 వరకు రాసిన 35 కవితలతోపాటు, 1960–65 మధ్య కె. యాదవరెడ్డి పేరుతో రాసిన మరో 34 కవితల్ని కలిపి ప్రచురించారు.

ఈ రెండు దశల్లోని కవితల మధ్య సహజ సిద్ధంగా సంభవించే మార్పులు స్వల్పంగా కనపడుతున్నప్పటికి, పోలికలు మాత్రం స్పష్టంగా ప్రతిఫలిస్తున్నాయి.

ఇక ఈ కవితా శిఖరారోహణం, "అరణ్యజ్వాల" అనే కవితతో ఆరంభించడం సముచితంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులోని గుల్‌మొహర్ వృక్షాల వర్ణన పాఠకులకు పచ్చని అడవుల్లోకి ప్రవేశించిన అనుభూతిని కలిగిస్తుంది.

"నిప్పురవ్వల స్వేచ్ఛాక్రీడ
భూమికీ ఆకాశానికి నడుమ,
రెమ్మరెమ్మను రగిలించిన
హరిత జ్వాలతో
అడవి తలమీద
అగ్ని కిరీటాల గుల్‌మొహర్!" అన్నప్పుడు మనకు గుల్‌మొహర్ పూల అరుణశోభలు కళ్ళముందు మెదిలినా, ఈ కవిత పైకి కనపడుతున్నంత అమాయకమైంది కాదు. అంతర్లీనంగా ఇందులో విప్లవ ప్రతీకలు ప్రతిధ్వనిస్తున్నాయి.

"హోరుగాలి కౌగిలింతలో
జలజలా రాలన రెక్కలన్నీ
కొండచరియల లోగిళ్ళలో
జనపథాల పొదుగునా
క్రాంతి పతాకాలను ఎగరేస్తూ
ఆరిపోని అడవి మంటల పూలు" అన్నప్పుడు మనకు గుల్‌మొహర్ వృక్షాలన్నీ అరుణ పతాకాలను ఎత్తి పట్టుకున్న హరిత సేనల్లా కనిపిస్తాయి.

అయితే అదుపు తప్పిన హింస, విచక్షణా రహిత ఆవేశం విప్లవానికి విఘాతమేనన్న విషయాన్ని నిఖిలేశ్వర్ "అప్రకటిత యుద్ధం" అనే కవితలో నిర్మొహమాటంగా చెబుతూ,

"ప్రజాబలం తోడురానపుడు
భయమే సెంట్రీగా మారుతుంది
దళచర్యలన్నీ దశల వారీగా
అజేయమైన జనశక్తిగా
జవసత్వాలను పొందనపుడు
గెరిల్లా పోరాటాలన్నీ
అడవిలో వేసిన కేకలా" నిష్ప్రయోజనమయ్యే కఠోర వాస్తవాన్ని మన ముందు నిలబడతారు.

సమాంతరంగా ప్రయాణిస్తున్నా పలకరించుకోవడానికి కూడా తీరిక లేకుండా పోయిన ఈ నాటి నగర జీవితాల్లో స్నేహం కూడా 'వన్ వే ట్రాఫిక్" అయిపోయిన వైనాన్ని కవి హృద్యంగా వర్ణిస్తారు (పుట–41). అయినా కవి నిరుత్సాహపడక, ఎడారి లాంటి బతుకుల్లో

మానవ సంబంధాల తడి ఆరిపోతున్నా, ఒయసిస్సులాంటి ఆత్మీయతా స్నేహం కోసం తపించి, పలవరించే ఆర్ద్రత "స్నేహతపన" అనే కవితలో మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. ఇలాంటి ఆత్మీయతానుబంధాలతోనే అల్లిన మరో ముచ్చటయిన కవిత "జీవన ప్రతీక" ఇందులో కవి తన మనవడితో గడిపే క్షణాల్ని నెమరేసు.

"ఆ చిట్టిపొట్టి పాదాలలోని
విద్యుత్ తరంగాలను
అదుపు చేయడం
తాతల తరంకాదు" అంటూ ఓటమిని ఆప్యాయంగా అంగీకరిస్తూ.
"వాడి చెడ్డీలో ఎప్పుడు
వాన కురుస్తుందో చెప్పలేం" అని మురిపెంగా చమత్కరిస్తాడు.

కలాలు, గళాలేకాకుండా, మానవత్వమొన్న ప్రతిహృదయం దేశ వ్యాప్తంగా తీవ్ర స్వరంతో గర్హించిన గుజరాత్ ఘోరానికి నిఖిలేశ్వర్ కూడా తనదైన ప్రత్యేక శైలిలో స్పందిస్తూ, "సబర్మతీ ఆశ్రమంలోనే/ సర్వధర్మ సమభావనకు/పోలీసు లాఠీలతో సమాధి" జరిగిన వైనాన్ని, "శాఖాహారులే ఇప్పుడు నరమాంసభక్షకులు"గా మారి "కాషాయీకరించిన నాజీ మూకలు"గా సాగించిన మారణహోమాన్ని తీవ్రంగా నిరసిస్తారు. అయితే ''ఈ ద్వేషాగ్ని కీలల్ని'' ప్రతి హింసంతో కాకుండా "మానవాంతరంగ జలం"తోను, కరుణతోను మాత్రమే ఆర్పేయగలమని చెప్పడం ఈ దిగంబర కవి తాత్విక కోణంలో వచ్చిన మార్పును సూచిస్తుంది. (పుట-21) ఇలాంటి వాస్తవ సంఘటనపై ప్రతిఘటించిన మరో కవిత "శీర్షికలేని కవిత". విద్యుత్ పోరాట అమరవీరుల స్మృతిలో రాసిన ఈ కవితలో, వెనకటి రోజుల్లో లాగా మాయమాటలతో నమ్మించి, వంచించి, మోసం చేయడం కాకుండా రాజ్యం ఇప్పుడు నేరుగా గుర్రమెక్కి జనం మీదికి దౌడు తీస్తున్నదని చెబుతూ "పాత కొయ్యగుర్రాలకు/ఎప్పుడో కాలం చెల్లిపోయింది" అంటాడు. కానీ "ముఖంలేని మూకగా ఉన్న/ సమూహమే రొమ్ము విరుచుకొని/జెండాల ఎరుపులో/కొత్త రకం"నింపుకొని ప్రజాతంత్ర ఊపిరై ఉప్పెనలా విరుచుకుపడితే తలలు తెగిన మొండాలు కూడా పలకరించడమేగాదు కంప్యూటర్ ఛాంబర్ పాలనను నిలువెల్లా వణికించగలవని కవి ఆవేశంగా ప్రకటిస్తాడు. కలిసిపోరాడే ప్రజా ఉద్యమాలు ఎలా మంచి ఫలితాలు సాధిస్తాయో చెబుతూనే, మానవ సమూహాలు ముక్కలు ముక్కలుగా విడిపోయి, ఏ ముక్కకాముక్కగా పోరాడటంవల్ల ప్రయోజనం శూన్యమన్న విషయాన్ని "జెండానీడలో" అనే కవితలో కవి సూటిగా చెబుతాడు.

ఇక ఈ పుస్తకంలోని పాత కవితల్ని చదివితే, కొండచరియలగుండా బండరాళ్ళను ఢీకొంటూ, నురగలు గ్రక్కుతూ, ఉరకలేస్తూ పరిగెత్తే నదీ ప్రవాహంలోని ఒరవడి, ఉద్ధృతి కనపడటమే కాకుండా అది దిగంబర కవిత్వపు జలపాతంగా రూపుదిద్దుకోబోయే లక్షణాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయి.

ఇందుకు,
"కోపంతో వెనక్కి చూడు
మొసళ్ళతో నిండిన
లింపోపోనదే కాదు,
హిమశిఖరాగ్రముపై
తిష్టవేసిన నిటలాక్షుడు
ఘనీభవించి ఘూర్ణిల్లు"
"నవ కవితా వెల్లువవలె
ఈ మహాజన సందోహం
నీ కొరకు చచ్చినా ఆగదు"
ఇది సాహసిక మహోయువం'' అన్న కవితా పంక్తులే సాక్ష్యం పలుకుతున్నాయి. (పుట-52)

కానీ కేవలం ఆవేశమే కాకుండా, "ప్రతి కంటి నుండి రాలే ప్రతి కన్నీటి బొట్టును/నిరాశలో నిఖిల విశ్వాన్ని నింపుకొన్న/ నా చేతి వ్రేళ్ళు తుడిచివేస్తాయి' అన్నప్పుడు, "నా దైవం మానవుడు మేధోజ్వాలలో జ్వలించి దివ్యమానవుడవుతాడు" అని విశ్వాసం ప్రకటించినపుడు, "భయ పడకుసాధీ/ మా నెత్తురుతో నిండిన దేశం దీపం/ చివరి చుక్క వరకు జ్వలిస్తూ ఉంటుంది" అని కొండంత ఆత్మవిశ్వాసం ప్రకటించినప్పుడు కవిలోని మానవీయ దృక్పథం పాఠకులకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

"రాత్రిలోని క్షుద్రత్వం
రాత్రిలోని అమరత్వం
వీధుల్లో తిరిగే వేశ్యకు తెలుసు
కొండల్లో చరించే గెరిల్లాకు తెలుసు" అన్నప్పుడు యాదవరెడ్డి నిఖిలేశ్వర్‌గా నామాంతరమేగాదు రూపాంతరం చెందుతున్న ఆనవాళ్ళు కూడా స్పష్టంగా మనకు కనిపిస్తాయి.

"అణుబలం", "వెలుగుచారలు", "మనస్సు ఉపపొరలు" వంటి కొత్త పదబంధాలే కాకుండా "సూర్యుడు వెలిగించిన చంద్రుడి వెన్నెల బల్బుకింద" "తెల్లని పావురాలమల్లే క్రైస్తవనన్‌లు" "చీకటి-వెన్నెల మిక్చరుగా ఉన్న రాత్రి" వంటి వర్ణనలు అనేకం ఈ కవితల్లో మనకు కొత్తగా కనిపిస్తాయి అలాగే "జీవన గంగ గురజాడ" "ఆకులు రాలుతున్నప్పుడు" "మేడ మీదిగది" ఇలా చెబుతూపోతే ఈ పుస్తకంలో మనల్ని బాగా ఆకట్టుకునే కవితల జాబితా పెరుగుతూ పోతుంది.

"పాడుబడిన గోపురాలపై ఎగిరే
పావురాల ఈకల సున్నిత స్పర్శ వ్యాపించగానే
స్మృతుల అలల అలజడి...
ఎక్కడెక్కడి నుండి నేను నడచివచ్చానో
అక్కడదక్కడ ఆ ముఖాలపై నేను చదివిన
ఆ అనంత విశ్వరహస్య లిపి...
విద్వేషాగ్ని కీలల్ని చల్లార్చే ఆ నవ్వు కోసం


జీవితాంతం ఈ ప్రయాణం అంటూ సాగిపోతున్న నిఖిలేశ్వర్ తనతోపాటు రమ్మని మనల్ని కూడా ఆహ్వానిస్తున్నారు. కానీ, ఆ ఆహ్వానం అలుపెరగకుండా చల్లగదలకుండా వాహనాలెక్కిపోయే ప్రయాణికులకు కాదు, తన భావాల పాలవెల్లిలో పయనిస్తూ సందెవెలుగుల భూమిని సంభ్రమాశ్చర్యాలతో తిలకింపచేసే "జ్ఞాపకాల కొండ" నెక్కగల కవిత్వ పర్వతారోహకులకు మాత్రమే!

**(జ్ఞాపకాల కొండ, కవి : నిఖిలేశ్వర్, పేజీలు : 120, ధర : రు.45/-, ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, దిశ పుస్తక కేంద్రాలు)**


## ప్రస్థానం అడ్వర్టయిజ్‌మెంట్ టారిఫ్

| | | |
|---|---|---|
| బ్యాక్ పేజి | : | 15,000 |
| కవర్ ఇన్నర్ పేజి | : | 12,000 |
| లోపలి పేజి (కలర్) | : | 10,000 |
| లోపలి పేజి (బ్లాక్ అండ్ వైట్) | : | 5,000 |

జి.బాబు




## కవితాస్త్రాలను పొదువుకొన్న అమ్ములపొది


చదవగానే సూటిగా పాఠకుల హృదయాలకు చేరి సున్నితంగా గుచ్చుకొనే చక్కని కవితలున్న పుస్తకం "అమ్ములపొది". "గుండెను తాకే ప్రతి అక్షరాన్ని/పద ప్రవాహంగా చేసి/ కవితా ఝరిగా మార్చి/ వడివడిగా ఆ కెరటాలను/గళమెత్తి గగనమదిరేలా గానం చేయాలనే ఉన్నది" అని చెప్పడంలోనే కవయిత్రి లక్ష్యం పాఠకులకు స్పష్టమవుతుంది. పబ్బంగడిచిపోయాక తల్లితండ్రులను ఇంట్లో నుండి వెల్లగొడుతున్న పిల్లల వైనాన్ని వర్ణిస్తూ సంధించిన "శిశువుగా ఎదనంటు బిడ్డడే/పశువుగా మారి ఛీత్కరించు/కుటిల కృతఘ్ను క్షణ శకలాలే/పెరిగే ఈ వృద్ధాశ్రమాలు" అనే కవితా పంక్తులు తగలాల్సిన వారికి గురితప్పకుండా తగిలే భాగాలేగదా! "విద్వేషాలు రగిలేటి వేళ/విభేదాలు వెల్లువయ్యేటి వేళ/ గులాబీలు సైతం గునపాలై గుచ్చుకొంటాయ్" అంటున్న కవయిత్రి మాటలు కూడా పాఠకుల్ని గుచ్చి తీరుతాయి.

"నేలకొరిగే ప్రతి రక్తపు బిందువు/చైతన్యంతో రగిలే అగ్నిగుండమై/ఎదఎదనూ రగిలిస్తుంది/ పోరాటం వైపునడిపిస్తుంది/విప్లవ యోధుల రక్తంతో తడిసిన విజయం/ఎర్రజెండాలా ఎగురుతుంది" అనే నిర్దిష్టమైన రాజకీయ చైతన్యంగల కవయిత్రికి క్రికెట్ ఆటపై అభిమానం ఉంటే ఉండొచ్చుగానీ కోట్ల రూపాయల పారితోషికం తీసుకొంటూ, ప్రజల ఆదరణాభిమానాల్ని పెట్టుబడిగా మలచుకొని ప్రకటనల ద్వారా మరెన్నో కోట్ల రూపాయల్ని దండుకొంటూ, మ్యాచ్ ఫిక్సింగ్ లాంటి నేరాల్లో ఇరుక్కొని నైతికంగా పతనమైపోతున్న క్రికెటర్లను "చెమటోడ్చే శ్రమజీవులు ఈ క్రికెట్ యోధులు/జాతి గుండెలోనే దాగుంది వీరి చిరునామా" అంటూ కీర్తించడంలోని ఔచిత్యమేమిటో అర్థంకాదు.

కవిత్వ సాంద్రతను మరింతగా పెంచుకొని, దీక్షతో సాధన చేస్తే సుజాత కవిత్వ బాణాలేగాదు క్షిపణుల్ని కూడా సంధించగలరని ఈ పుస్తకం నిరూపిస్తోంది.

**(పుస్తకం పేరు : అమ్ములపొది, రచన : చింతా లక్ష్మీసుజాత, పేజీలు : 72, ధర : రు.25/-, ప్రతులకు : విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు)**

తెర



## నాటి సినిమాలకు నీరాజనం

రచయితగా అనువాదకుడుగా రాజకీయనాయకుడుగా అనేక రూపాలలో పరిచితులైన ఎంవిరమణారెడ్డి తనపై చెరగని ముద్రవేసిన అలనాటి అపురూపచిత్రాల విశిష్టతను విశ్లేషిస్తూ రాసిన పుస్తకమిది. 1950-65 మధ్యకాలం తెలుగుసినిమా స్వర్ణయుగమని వర్ణిస్తూ ఆ కాలంలో వచ్చిన ఎనిమిది మంచి సినిమాలను సాకల్యంగా సందర్శింపచేస్తారు. మల్లీశ్వరి, జయభేరి, దొంగరాముడు, దేవదాసు, బంగారుపాప, పాతాళభైరవి, మాయాబజార్, విప్రనారాయణ చిత్రాలపై రమణారెడ్డి రమణీయమైన వ్యాఖ్యలు ఇందులో చూడగలుగుతాము. దీనికి ముందు మాట రాయడానికి తన అశక్తత వెలిబుచ్చుతూ ముళ్లపూడి రాసిన ముందుమాటలో ఇలా పేర్కొన్నారు:" మీ వర్ణనలూ వ్యాఖ్యానాలూ చదువుతుంటే ఆయా దృశ్యాలు మనసులో రూపుకట్టాయి. కొన్నిచోట్ల నేపథ్య సంగీతంతో సహా - వీనుల విందు చేశాయి.నాకు తెలియని సంగతులు ఎన్నోతెలుసుకున్నాను.తెలుసును అనుకున్నవి తప్పులు అని కూడా తెలుసుకున్నాను. ఇది సినిమా గదా అని తేలిక భావంతో సరదగాగా రాసింది కాదు. ప్రేమతో గౌరవంతో ఎందరో మహాకళాకారుల గొప్పతనాన్నిమంచినీ సత్కరించాలన్న సహృదయంతో మీరు రాశారు" ఈ పుస్తకం చదివాక పాఠకుడు ముళ్లపూడి మాటలు ఎంత సత్యమో తెలుసుకుంటాడు.

ఈ ఎనిమిది సినిమాలు, వాటి కథా నేపథ్యాలు, పాత్రల రూపకల్పన, కథా గమనమూ,నటీనటుల ప్రతిభా, సంగీతం, సందేశం వగైరా అంశాలన్నిటినీ రచయిత హృద్యంగా ఆవిష్కరించారు. మొదటి వ్యాసంలో మల్లీశ్వరిలో నాగరాజు- మల్లీశ్వరి మధ్య అనుబంధాన్ని దానికి ఎదురైన అవరోధాలను ఒక క్రమపద్ధతిలో విశదపరుస్తారు.ప్రేమ అనే పదం ఎక్కడా వాడని ఈ చిత్రం సగటుప్రేమకథా చిత్రాలకన్నా ఎందుకు విలక్షణంగా రూపొందిందో చెబుతారు. మల్లీశ్వరి నాగరాజు కుటుంబాలు పెద్దల నుంచి కృష్ణదేవరాయల వరకూ వివిధ పాత్రల మాటలు ప్రవర్తనలను అత్యంత సహజంగాచిత్రించిన తీరును వివరించారు. మల్లీశ్వరి నుంచి జయభేరి లోకి తీసుకెళతారు.రాష్ట్రపతి పతకం పొందినప్పటికీ తెలుగుసినిమా రచనలలో అంతగా గుర్తింపు పొందని జయభేరి గురించి చక్కగా వివరించారు." మల్లీశ్వరిలో సాహిత్యాన్ని చెట్టున మాగిన పండులా దేవులపల్లివారు అందిస్తే జయభేరిలో మల్లాదివారు జుంటితేనె అందించారు" అని తేడా చెబుతారు.జయభేరిలో కీలకమైన సంభాషణలను,సంఘటనలను పొందుపరుస్తూనే చివరలో యాంటీక్లైమాక్స్‌గా పరిణమించిన వైనాన్ని కూడా విమర్శనాత్మకంగా పేర్కొన్నారు. నిజానికి ద్వితీయార్థం బలహీనమవడం జయభేరికి పెద్ద నష్టం. రమణారెడ్డి ఈ సినిమాపై చేసిన విశ్లేషణలో కులమతభేదాలు తగవన్న అంశాన్ని పట్టుకున్నంతగా ప్రజాకళా సందేశాన్ని నొక్కిచెప్పిన తీరును గమనించలేదు.

దొంగరాముడు పై రాసిన 19 పేజీల విశ్లేషణలో కెవిరెడ్డి దర్శకత్వశైలిని, కథాగమనాన్ని సంభాషణలను పొందుపరచారు. సద్బ్రాహ్మణుల శాకాహారమే గొప్పగా చెప్పబడే రోజులలో అందులోకి రొయ్యల పొట్టు చారున్నది అంటూ నాన్‌విజ్ గీతం వినిపించడంలో

ప్రత్యేకతను కూడా బాగానే పట్టుకున్నారు. దొంగరాముడి సాహసికత, రేలంగి పాత్ర పిసినారి తనం, జగ్గయ్యతల్లి పాత్ర హుందాతనం అన్ని బాగానే విశ్లేషించారు. అయితే ఎన్నిచెప్పినా సాధారణ సాంఘిక చిత్రమైన దొంగరాముడు ఈ క్లాసిక్స్ జాబితాలో ఇముడుతుందాఅనే సందేహం తొలగదు.

దేవదాసు గురించి కొత్తగాచెప్పాల్సినపని లేదు. రమణారెడ్డి ఆ సినిమాను మెచ్చుకుంటూనే చిత్రీకరణ గొప్పకోవకు చెందినది కాదని అంటారు. చిత్రీకరణ ప్రతిభ వల్ల కాక ప్రధానంగా పాటల వల్లనే దేవదాసు అంత విజయం సాధించిందని ఆయన భావం. అయితే ఇంత గొప్పస్థానం సంపాదించిన సినిమాపై ఇలాటివ్యాఖ్యనం చేసేందుకు ఇందులో ఇచ్చిన ఉదాహరణలు మాత్రమే సరిపోవు.

మానవానుబంధాలకు మకుటాయమానమైన చిత్రం బిఎన్‌రెడ్డి 'బంగారుపాప'పైనా చక్కటి విశ్లేషణ చేశారు. ఎస్‌విరంగారావును ప్రథమశ్రేణి కళాకారునిగా ప్రపంచానికి నిరూపించిన ఆ చిత్రంలో ప్రతిసన్నివేశం ఎలా సార్థకమైందో తెలియజెప్పారు. సుప్రసిద్ధమైన పాతాళభైరవి, మాయాబజార్‌లను కూడా సవివరంగా పరామర్శిస్తూ వాటి సృష్టికర్తల ప్రతిభా విశేషాలు కళ్లకు కట్టారు. పాతాళభైరవి తెలుగు భాషలోనే హాంఫట్, జైపాతాళభైరవి, నరుడాఏమి నీ కోరిక, ఘాటు ప్రేమ, పాపం పసివాడు వంటి సరికొత్తపదసంపదను సృష్టించిందని చెప్పిన మాట పూర్తిగా నిజం. అక్కినేని అత్యుత్తమంగా నటించిన సినిమాగా విప్రనారాయణ పై విశ్లేషణతో ముగించారు. భక్తి నేపథ్యంలోనే అయినా సంక్లిష్టమైన వ్యక్తిగా తయారైన విప్రనారాయణ చిత్రీకరణను వివరంగా తెలిపారు. భానుమతి రాజేశ్వరరావుల కాంబినేషన్‌లో తయారైన రెండే రెండు చిత్రాల్లో ఒకటిగా విప్రనారాయణ గీతాలను ప్రత్యేకంగా విశ్లేషించారు.

ఈ చిత్రాలను గురించి ఇంత శ్రద్ధతీసుకుని రాయడం మంచి విషయం. సమాజంపై ప్రభావం చూపడంలో మరే ప్రక్రియకన్నా శక్తివంతమైన సినిమాను లోతుగా పరిశీలించడం చాలా అవసరమైన పని. రమణారెడ్డి ఈ సినిమాలవల్ల ముగ్ధుడైన ప్రేక్షకుడుగానే పుస్తకం రాయడం వల్ల కొన్ని పరిమితులు కూడా ఏర్పడ్డాయి. ఆయన విశేషంగా ప్రశంసించిన కొన్ని అంశాలు చాలా సాధారణమైనవే. అలాగే సినిమాను కూడా చారిత్రిక క్రమంలో చూడక తప్పదు. బయిట చరిత్ర ఎలా వున్నా కనీసం సినిమా చరిత్రనైనా పట్టించుకుంటే తప్ప మనకు సమగ్రమైన అవగాహన కలగదు. అంటే ఆ రోజులలో వచ్చిన ఇతరసినిమాలు, ఇతర భాషల ప్రభావం వగైరా అన్నమాట. బంగారుపాపకు సైలాస్ మార్నర్ ఆధారం అన్న సంగతి తెలిసిందే కాని పాతాళభైరవి అల్లావుద్దీన్ అద్భుతదీపం నమూనా అన్నది కాదనగలమా? జయభేరి కి మూలమైన సినిమా హిందీలో వుందేమో పరిశీలించవద్దా? ఇదే సినిమాల గురించి రచయితలు, దర్శకులుహీరోలు ఇప్పటికే చెప్పిన చాలా అంశాలు అందుబాటులో వున్నాయి.

సినిమా చూసి ఆనందిస్తే సరిపోయేదానికి ఇంత శోధన,పరిశోధన ఎందుకని ఎవరైనా అనుకుంటే పొరబాటే. చరిత్రలో భాగమైపోయినవని, చరిత్ర సృష్టించినవని చెప్పుకునే సినిమాలనైనా సమగ్రంగా విశ్లేషించుకోకపోతే సినిమా ఒక మిత్‌గానే మిగిలిపోతుంది. సామాజిక పాత్ర వాణిజ్యవిలువలు కూడా కలబోసుకున్న సినిమా అంటే నటులుమాటలు పాటలు కథ మాత్రమే కాకూడదు. అంతవరకే పరిమితమైతే సాంఘిక చరిత్ర రూపొందదు.

**(తెలుగుసినిమా-స్వర్ణయుగం, డా॥ ఎం.వి. రమణారెడ్డి, పేజీలు : 192, ధర : రు.100/-, ప్రతులకు : విశాలాంధ్ర - అన్ని బ్రాంచీలు)**

**కర్రా ఎల్లారెడ్డి**

## తెలంగాణ బతుకు చిత్రాలు




తెలంగాణ ప్రజలు కల్లాకపటం తెలియని అమాయకులని, నిజాయితీపరులని ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చి తెలంగాణా జిల్లాల్లో పని చేస్తూ ఉన్న అధికారులు అంటూ ఉంటారు. యాభై ఏళ్ళ కింద ఇక్కడి ప్రజల అమాయకత్వం ఎలా ఉండేదో తెలుసుకోవాలంటే గూడూరి సీతారాం రాసిన ఈ కథల సంపుటి చదివితే సరిపోతుంది. వీటిని కథలు అనే కంటే తెలంగాణ ప్రజల జీవిత శకలాలు అంటే సరిపోతుంది.

ఈ సంపుటి కవర్‌పేజీ మీద పేర్కొన్నట్టు గూడూరి సీతారాం తెలంగాణ ప్రాంత తొలితరం కథా రచయిత. ఆయన 1953 నుంచి మొదలుకొని 1965 వరకు సుమారు 85 కథలు రాశారు. కానీ అవన్ని ఇప్పుడు లభ్యం కావటం లేదు. దొరికిన 14 కథలతో ఈ సంకలనం తెచ్చినట్లు సంపాదకుడు డా॥ పత్తిపాక మోహన్ పేర్కొన్నాడు. గూడూరి సీతారాం కథల పేర్లు ఇలా ఉన్నాయి. రాజమ్మ రాజీరికం, రంగడు, లచ్చి, నారిగాని బతుకు, మారాజు, చీకటి గొడుగులు, బస్సు కదిలింది, ఎర్రని పువ్వు, పెళ్లీ-ప్రేమ, స్త్రీ స్వాతంత్ర్యం, విచ్ఛేదు, అబ్బాయి-అమ్మాయి, అందని ఆకాశం, దెబ్బతిన్న అహంభావం. ఈ కథల పేర్లు ఎలాగైతే సీదాసాదాగా ఉన్నాయో, కథల్లోని కథావస్తువు, కథనరీతి కూడా అలాగే ఉంది. అప్పటి తెలంగాణ పల్లెల్లో దాగిన తెలంగాణ మాండలికం స్వచ్ఛమైన రీతిలో ఈ కథల్లో వాడారు రచయిత. మాండలికంలోనే కథ చెబుతూ, మాండలికంలోనే సంభాషణలు పలికించటం వల్ల ఈ కథలన్నీ తెలంగాణా జీవభాషతో గుబాలించాయి.

ఈ సంపుటికి ముందుమాటలో జూకంటి జగన్నాథం ఒక చోట ఈ కథల గురించి రాసిన కొన్ని వాక్యాలు చూడండి. "గూడూరి సీతారాం కథలు అచ్చమైన తెలుగు భాషా సంస్కృతిలోంచి నిజాయితీగా పూసిన మొగిలిరేకులు. ఏమీ తెలియని వయసులో లగ్గం అయినప్పుడు పోషమ్మ గుడి దగ్గర, పెండ్లి పిల్లగాడు తన నోటితో అందుకునే 'ఆకులు పోకలు'. పిల్లకాలువ ఒరవడితో కథలు సాగుతాయి. మెట్టు బడిలో ఇటుకపొడితో దిద్దిన 'కకా'ల గుణితం. పోరగాండ్లు చదువుకునే పెద్దబాలశిక్ష." ఈ మాటలు అతిశయోక్తులు కావని సంపుటిని చదివాక తెలుస్తుంది. ఏలె లక్ష్మణ్ పెయింటింగ్ ఈ సంపుటిని పాఠకుల దృష్టిలో పడేస్తుంది. అలాగే కథల్లో చిత్రించిన తెలంగాణ బతుకులను ప్రతిబింబిస్తుంది. ఒక్కో కథను ఇక్కడ విశ్లేషించేకంటే పాఠకులే ఈ కథలన్నీ చదివితే బాగుంటుందని సమీక్షకుని అభిలాష!

**(గూడూరి సీతారాం కథలు, పేజీలు-80, వెల : రు.50/-, దొరుకుచోట్లు :5-4-47, సిరిసిల్ల, కరీంనగర్-505 301. మరియు అన్ని ప్రముఖ పుస్తక దుకాణాలు.)**

జి.ఎస్.

# మూడు ప్రక్రియల సమ్మేళనం 'మనోగతం'

**మనోగతం**


డా. దాకే అశోక్‌కుమార్,

**భూ**తకాలచందో బద్ధ పద్యాలను, వర్తమానంలోని వచన కవిత్వాన్ని, విదేశాల నుండి దిగుమతి చేసుకొన్న తంకాలను కలబోసుకొని వచ్చిన వైవిధ్య కవితా సంకలనమే డా॥ దాకే అశోక్‌కుమార్ "మనోగతం". పద్యాలకు "వసంత కాలం" వంటి వస్తువులు తీసుకొని "అవ్వసంతశోభ", మరులు గొలుపునెపుడు మనమునందు వంటి గ్రాంధిక భావకవిత్వశైలిలో రాయడం చూస్తే రూపానికి దగ్గ భాషను కవి స్వీకరించినట్టు కనపడుతుంది. వచన కవితల్లో మాత్రం సమకాలీన సమస్యలనే వస్తువులుగా స్వీకరించడానికి కవి ప్రాధాన్యతనిచ్చాడు. "హేతుబద్ధంగా వాదిస్తేవాడు కమ్యూనిస్టు/హరించిన హక్కుల కోసం పోరాడితే వాడు నక్సలైటు/ సమసమాజం కావాలని పోరాడేవాడు సోషలిస్టు/ప్రజల సొమ్ము సునాయాసంగా భోంచేసే వాడు ఏ ఇస్టు?" అని కవి ప్రశ్నిస్తాడు. "ప్రజాస్వామ్యమూవల్లకాటి దిబ్బా/ రెండోదే నయం ఎప్పటికైనా తనలో చేర్చుకొంటుంది" అంటూ తాత్వికతతో విశ్లేషించిన వైనం కూడా ఈ కవితలో కనపడుతుంది. "బెడ్డు మీది ఒగ్గువై", "ప్రాంతతత్వం", "సుజ్ఞానం" లాంటి కొత్త పదాలు ఈ పుస్తకంలో మనల్ని పలకరిస్తాయి. "ఎంత ఆనందం/ అరమరికల్లేని/ బాల్యజీవితం/ సుందర స్వప్నాలతో/తిరిగిరాని స్వర్గం" లాంటి తంకాలు ఇందులో మనల్ని ఆకర్షిస్తాయి. ఈ తెలుగు కవితా సంపుటికి ఇంగ్లీషులో కూడా ఉన్న ముందుమాట మనకు ఆశ్చర్యం కలిగించే అంశం. శుద్ధ వచన ఛాయల్లో నుండి కవిత్వ వెలుగుల్లోకి మరింత బలంగా రాగలిగితే అశోక్ కుమార్ ముందు ముందు మరింత మంచి కవిత్వం రాయగలరని ఈ పుస్తకం ఆశ కలిగిస్తుంది.

**(మనోగతం, కవి : డా. దాకే అశోక్‌కుమార్, పేజీలు : 46, వెల : రు.20/-, ప్రతులకు : 10-36/ఎ, సాయినగర్ కాలనీ, ఎఎంఎఎల్ కాలేజ్ జంక్షన్, అనకాపల్లి-531001. ఫోన్ : 08924-220060)**

వివేక్

# నమ్ముకున్న రాజ్యంలో నమ్మలేని నిజాలు!




**శాం**తినారాయణ కథారచయితగా, కాలమిస్టుగా పాఠకులకు సుపరిచితులు. ప్రజాస్వామిక చైతన్యం గల సాహిత్యకారులకు, సామాజికులకు ప్రత్యేకించి సన్నిహితులు. మూడు దశాబ్దాల సాహిత్య జీవనంలో ఆయన మూడు కవితా సంపుటాలు వెలువరించారు(రక్తపు ముద్ద పిలిచింది, రస్తా, పల్లేరు ముళ్లు) ఆ దశనుంచి చూస్తే ఆయన రచనా శక్తి సామాజిక పరిశీలన, నిబద్ధత క్రమేణా పెరుగుతున్నాయన్న వాస్తవాన్ని ప్రస్తుత కథాసంకలనం' నమ్ముకున్న రాజ్యం' నిరూపిస్తుంది. పల్లేరు ముళ్లు లో లాగే ఈ సంకలనంలోనూ ఆయన రైతాంగ వెతలను, ప్రత్యేకించి రాయలసీమలో వ్యవసాయ సంక్షోభాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రిస్తారు. ఇవి కథలు కాదు- జీవితం అనిపిస్తాయి. వాస్తవాలను జనం భాషలో సహజంగా రాయడానికి మంచి ఉదాహరణలని చెప్పదగిన కథలు ఇందులో వున్నాయి.

మొదటి కథ "ఎండమావి" లోనే వాణిజ్యపంటల వలయంలో చిక్కి నిస్సహాయంగా బలైపోయిన రైతు కుటుంబాల వ్యధ కుదిపేస్తుంది. దళారుల కల్లిబొల్లి కబుర్లు నమ్మి ఉల్లి పండించిన సంజీవప్ప అకాలవర్షానికి నాశనమై పోయని ఉల్లిని చూసి తల్లడిల్లుతుంటే మనమూ ఆయనతో పాటే తడిపొలంలో కూలబడిపోయినట్టు ఫీలవకుండా వుండలేం. కథ అడుగడుగునా రైతు మనస్తత్వానికి అద్దం పడుతుంది. సంభాషణల్లోనే కాక కథనంలోనూ రచయిత అనంతపురంలో వాడే భాషను, పదాలను ఉపయోగించిన తీరు ఆకట్టుకుంటుంది."ఈ పయనం ఎక్కడికి" కథ సరిగ్గా ఇందుకు విరుద్ధంగా అనిపిస్తుంది.పల్లెల్లో వెతలు, వలసలు చెప్పడంలో తప్పులేదుగాని వాటికి పట్టణాలకు పోటీ పెట్టి, (కోస్తాకు రాయలసీమకు మధ్య కూడా) ఇవి బాగున్నట్లు అవి బాగాలేనట్టు వర్ణించడాన్ని అర్థం చేసుకోవచ్చునేమో గాని ఆమోదించడం కష్టం. అందులోనూ వలస వచ్చిన వారి వెతలపై ఇప్పటికే ఎన్నో గొప్ప కథలు వచ్చిన నేపథ్యంలో. కథనం,భాష విషయంలోనూ దీనిలో సహజత్వం పాలు తగ్గి సామాజిక బోధన పాలు పెరిగిందనాలి. "రత్నాల సీమలో" కథ దేశాన్ని ఆవేదనపరచిన రాయలసీమ రైతుల ఆత్మహత్య చిత్రణ. టైటిల్ కథ 'నమ్ముకున్న రాజ్యం' నిరుపేద సుగాలీ జంట బతకడం కోసం కన్నబిడ్డను అమ్ముకుని బతికే నిష్టురనిజానికి చిత్రణ.

శాంతినారాయణ ఈ సంకలనంలో ఇతర సామాజికాంశాలను కూడా స్పృశించారు. అందులో ముఖ్యమైంది 'బలిపశువులు' కార్పొరేట్ విద్యాసంస్థల విద్యావ్యాపారాన్ని విమర్శించడంతోనే ఆగక పరీక్షా పేపర్లు దిద్దే ప్రహసనం ఎంత దారుణంగా వుంటుందో నిశితంగా విమర్శించారు. ఎమ్‌సెట్‌లో పదవ ర్యాంకు తెచ్చుకుని అభినందనలూ విందులూ అందుకున్న మెరిట్ విద్యార్థి ఇంటర్‌లో ప్యాస్‌కాలేదనిపించుకుని ప్రాణాలు తీసుకోవడం ఈ కథలో ఇతివృత్తం. స్వయంగా లెక్చరర్ అయిన విద్యార్థి తండ్రి స్పాట్ వాల్యూయేషన్‌లోతన చేదు అనుభవాలు నెమరేసుకుంటాడు. బందు మిత్రలు ద్వారా ఇలాటి విషయాలు వింటుంటాం. స్వయంగా అధ్యాపక వృత్తి నిర్వహించి విరమించిన శాంతి నారాయణ కలం వాటిని ధృవీకరించడం ఈ కథలో విశేషం. వ్యవస్థను, వాణిజ్య విపరీత వాణిజ్య ధోరణులను విమర్శించడంతో పాటు మన బాధ్యతను మనం నిర్వహిస్తున్నామా అని ఆలోచించుకోవలసిన అవసరాన్ని గుర్తుచేస్తుంది.

తేడా కథ విద్యాధికులు, అధికారుల మేడిపండు వ్యవస్థపై ఒక నిరక్షరాస్యుని నిరసననాదం. లంచం తీసుకోవడమే కాక పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనాలు, ఖూనీలు లేవని విచారించే ఎస్ఐ మాటలు పుట్టించిన వెగటును కథకుడు ఇలా చివరి వాక్యాల్లో వర్ణిస్తాడు:


.. ఈ దేశమూ ఈగవుర్మెంటూ,ఈ ఆఫీసర్లు, ఈళ్ల సదువులూ యెవురికోసముండాయని నా మనసు నన్నే అడగసాగింది. దీనికి జవాబు సదువుకున్నోళ్లు మీరేమన్నా చెప్పగలరేమో గానీ సదువు రానోడ్ని నేనేమి చెప్పగల్ను?' భాష వేరైనా ఈ కథ ఒక విధంగా రావిశాస్త్రి శైలిని గుర్తుచేస్తుంది.

మిగిలిన కథల్లో స్వాములు, అద్దె తల్లి, శాలిని చెప్పుకోదగినవి. శాలిని మనవైవాహిక వ్యవస్థలో డాక్టర్ వధువైనా సరే, పురుషాధిక్య ద్వంద్వనీతికి ఎలా గురవుతుందో చెబుతుంది. ఆ దశలో నాయనమ్మ తిరుగుబాటు చెయ్యడం మంచి ముగింపు. "అద్దెతల్లి" కథ పాశ్యాత్యదేశాలలో(చైనాలో దాదాపు యాభై ఏళ్లకిందటే ఇలాటి కథ వుంది) ఇప్పుడు వినిపించే సర్రోగేట్ మదర్ దృక్పధానికి కథనరూపం. తప్పనిసరి పరిస్థితుల్లో మరొకరి పొందుతో బిడ్డను కనివ్వడానికి ఒప్పుకున్న సుజాత మానసిక ఘర్షణ, సామాజిక ఘర్షణ తర్వాత తీసుకున్న చివరి చర్య ఈ కథలో చూస్తాం. ఈ కథవర్ణనల్లో కూడా సహజత్వం తక్కువే. 'స్వాములు' పేరిట రాసిన కథలో వున్నది సరైందా కాదా అనే చర్చ కన్నా నేడున్న ఉద్రిక్త వాతావరణంలో నేరుగా విశ్వాసాలను సవాలు చేసే ఇలాటి రచనలు మంచివా అన్నది ముఖ్యమైన విషయం. ఇలాటి కథల్లో రచయిత తను ప్రశ్నిస్తున్నది భక్తి మాటున చలామణి అయ్యే అవాంఛనీయ పోకడలనే కాని భక్తి విశ్వాసాలను కాదని తెలియజెప్ప గలగాలి. ఆ విధమైన మెళకువ ప్రదర్శించగలగాలి.

**(నమ్ముకున్న రాజ్యం (కథలు), శాంతి నారాయణ, పేజీలు : 123, ధర : రు.50/-, ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, దిశ పుస్తక కేంద్రం)**

**విజయరావు**

# అనుభూతులు పంచిన యాత్రా రచన




తన ఇంగ్లండు యాత్రానుభూతులను పాఠకులతో పంచుకున్నారు ఈ రచనలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్సలర్, సాహితీవేత్త డా. ఎన్ గోపి. యూరోపియన్ తెలుగు అసోసియేషన్ (ఈటా) వారి ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లిన గోపి నెలరోజుల పాటు పలు ప్రదేశాలను సందర్శించారు. తెలుగులో యాత్రా రచనలకు కొదవ లేదు. ఈ పేరు చెప్పగానే అందరికీ ముందుగా స్ఫురించేది ఏనుగుల వీరాస్వామి గారి 'కాశీ యాత్రా చరిత్ర'. యాత్రా రచన చేసే ప్రతి ఒక్కరు దాని మాదిరిగానే తమ రచన కూడ భవిష్యత్ చరిత్రకారులకు ఆకరంగా ఉపయోగపడాలని ఆశిస్తారు. గోపీ కూడ అదే స్ఫూర్తితో ఈ యాత్రారచనకు పూనుకున్నారు. ఇంగ్లండులో తాను చూసినవి చూసినట్లు కాకుండా తాను అనుభవించి అనుభూతి పొందిన రీతిలో వివరించారు.

ఒకే ప్రదేశాన్ని ఇద్దరు పర్యాటకులు సందర్శించినపుడు ప్రదేశం ఒక్కటే అయినప్పటకి వారిద్దరి స్పందన ఒకే విధంగా ఉండదు. అది వారి స్థాయి, సంస్కృతి, అభిరుచులపై ఆధారపడుతుంది. పర్యాటక గ్రంథాలు ఆ పర్యాటకుల వ్యక్తిత్వాలకు ప్రతిబింబాలు కూడ. అసలు సందర్శించాల్సిన ప్రదేశాలను ఎంచుకునేటపుడే వారి వారి ప్రత్యేకతలు వెల్లడి అవుతాయి. గోపి కవి కావడంతో సహజంగానే ఆయన షేక్స్‌పియర్, డీలాన్ థామస్, వర్డ్స్ వర్త్, రస్కిన్, బైరన్ లాంటి ప్రఖ్యాత బ్రిటిష్ కవులు, రచయితలకు సంబంధించిన స్మృతిచిహ్నాలను సందర్శించడానికి అధిక ఆసక్తి కనపరిచారు. చరిత్రపట్ల కూడ ఆసక్తి ఉన్న గోపి వారి వారి రచనల ప్రాశస్త్యాన్ని తెలియచేయడమే కాకుండా వారికి, ఆ ప్రదేశాలకు ఉన్న చారిత్రిక విశేషాలను కూడ వివరిస్తారు. డిలాన్ థామస్ మెమోరియల్ హాల్‌లో గోడకు వేలాడదీసిన ఆయన ప్రసిద్ధ గేయం ఒక దాన్ని అక్కడే కూర్చొని కాయితంపై రాసుకున్నారంటే గోపి ఈ పర్యటనలో ఎంతగా పులకించి పోయారో అర్థమవుతుంది. షేక్స్‌పియర్ జన్మస్థల ఆవరణలో రవీంద్ర నాథ్ టాగూర్ ప్రతిమ వృత్తాంతాన్ని దాన్ని జ్యోతిబాసు ఆరిష్కరించిన విశేషాన్ని ఆయన ప్రత్యేకంగా వివరించారు. ఇంగ్లండులోని పారిశ్రామిక విప్లవానికి సంబంధించిన పలు ప్రదేశాలను కూడ ఆయన సందర్శించారు. వాటి చారిత్రక ప్రత్యేకతలను కూడ ఆయన చక్కగా తెలిపారు. ముఖ్యంగా భారత దేశంలో చేనేత పరిశ్రమకు మరణశాసనం రాసిన మాంచెస్టర్‌ను ఆయన స్కాట్‌లాండ్ లాంటి సుందర ప్రదేశాన్ని కాదని మరీ సందర్శించారు. స్వాతంత్ర్యోదమ కాలంలో రౌండ్‌టేబుల్ సమావేశానికి వచ్చిన గాంధీజీ ముందుగా మాంచెస్టర్‌నే సందర్శించాడని చెప్పడంతో బాటు మార్క్స్ చిరకాల సన్నిహితుడు ఎంగెల్స్ ఇక్కడి కార్మికుల జీవితాలను పరిశీలించి పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ స్వభావాన్ని ప్రత్యక్షంగా తెలుసుకున్నాడని కూడ గోపి గుర్తు చేస్తారు. బ్రిటిష్ రాజప్రాసాదాన్ని సందర్శించి కోహినూర్ వజ్రాన్ని చూడాలనిపించలేదని చెప్పిన గోపి చివరిలో సమయం తక్కువగా ఉన్నప్పటకీ లండన్‌లో మార్క్స్ సమాధిని ప్రత్యేకంగా సందర్శించారు. వైస్ చాన్సలర్ బాధ్యతలు నిర్వహించిన గోపి ఇంగ్లండు లోని విశ్వవిద్యాల తీరుతెన్నులను తెలుసుకోకుండా ఎలా ఉంటారు? ఆయన ఆక్స్‌ఫర్డ్, బర్మింగ్ హాం విశ్వవిద్యాలయాలను సందర్శించి అక్కడి విశేషాలను ఆసక్తికరంగా వివరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద పాత పుస్తకాల వూరు హే ఆన్ వైన్ సందర్శన గోపి పర్యటనలో చెప్పుకోదగిన ఒక విశేషం. లండన్‌లోని నెహ్రూ సెంటర్‌లో వేమనపై తాను చేసిన ఉపన్యాసం కన్నా వారాంతం కానప్పటికీ అక్కడి తెలుగు మిత్రులు ఓ రోజు రాత్రి కుటుంబాలతోసహా సమావేశమయి తాను కొత్తగా రచించిన కవిత్వం వినడం గురించే ఎక్కువ సంబరంతో చెబుతారు గోపి. హైదరాబాదులో ఆయన పుష్కర స్నాన ప్రయాణం హడావిడితో ఆరంభమయిన ఈ యాత్రా రచన హైగేట్ స్మశానంలో మార్క్స్ సమాధి వద్ద ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ పిడికిలి బిగించి నివాళులర్పించడంతో ముగియడం ఆసక్తి కరంగా ఉంది.

**(ఇంగ్లండులో ఇరవై ఐదు రోజులు, డా. ఎన్. గోపి, పేజీలు : 132, ధర : రు.60/-, ప్రతులకు : విశాలాంధ్ర - అన్ని బ్రాంచీలు)**

→

# జయకాంతన్‌కు జ్ఞానపీఠం

**త**మిళరచయిత డి.జయకాంతన్‌కు 2002 సంవత్సరానికి గాను జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. రచయిత డా.ఎం.ఎం.సంఘ్వీ నాయకత్వాన గల ఎంపిక కమిటీ సమావేశమై జయకాంతన్‌కు అవార్డు ఇవ్వాలని నిర్ణయించింది. జయకాంతన్ తన రచనల ద్వారా తమిళసాహితీ సంప్రదాయాలను ప్రస్ఫుటింపచేయడమే కాకుండా భారతదేశ సాహిత్యానికి దిశానిర్దేశం చేశారని సంఘ్వీ అభివర్ణించారు. మానవజాతి విలువలను తన రచనల ద్వారా చాటిచెప్పారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జయకాంతన్ మాట్లాడుతూ 'అనేక భాషలు కలసి భారతీయ సాహిత్యాన్ని సృష్టించాయి. తమిళం వాటిలో ఒకటి. ఆ కోణం నుంచి ఈఅవార్డుకు ప్రాధాన్యత ఏర్పడుతున్నది. నేను నా సంతోషాన్ని ఇతరులతో పంచుకుంటున్నాను అన్నారు. మీ రాజకీయ దృక్పథం ఏమిటని అడగ్గా ప్రతిపక్షం లేని దేశం ఏర్పడాలని కోరుకుంటానన్నారు.

1934లో వామపక్ష నేపథ్యం గల సంపన్న కుటుంబంలో జన్మించిన జయకాంతన్ స్కూలులో చదువుకోలేదు. వ్యసనాల కారణంగా ఆస్తినంతా పోగొట్టుకుని, భార్యాబిడ్డలను వదిలేసి మద్రాసు వెళ్లి ప్రభుత్వోద్యోగంలో చేరారు. మళ్లీ పెళ్లి చేసుకుని సాహిత్యంలో జెకెగా స్థిరపడ్డారు. మొత్తం 70 నవలలు, 200 చిన్నకథలు రాశారు. చిన్న కథల్లో ఏడు సినిమాలుగా వచ్చాయి. అందులో ఒకటైన 'సిలనే రంగాయిల్ సిల మణిత్తరల్' సినిమాకు జాతీయ ఉత్తమ చిత్రంగా అవార్డు వచ్చింది. కొన్ని సమయాల్లో కొందరు వ్యక్తులు పేరిట ఆయన నవల ఒకటి తెలుగులో సాహిత్యఅకాడమీ ప్రచురించింది. మరొక




నవల కళ్యాణి వెడ్స్ దివాకర్ పేరిట ప్రస్తుతం నవ్యలో ధారావాహికంగా వెలువడుతోంది.

తమిళంలో లోగడ పి.వి.అఖిలాండంకు ఈ పురస్కారం లభించింది. ఈ అవార్డు ఆలస్యంగా వచ్చిందని అనుకోవడం లేదని, ఏదీ ఆలస్యం కాదని జయకాంతన్ అన్నారు. ఇదేదో గుర్తింపు కాదు: ధృవీకరణ మాత్రమే నని వ్యాఖ్యానించారు. కాలంతో పాటు మీ అభిప్రాయాలలో వచ్చిన మార్పులేమిటని అడగ్గా బతికున్నంత వరకూ కాలంతోపాటు మార్పు జరుగుతూనే వుంటుందని వ్యాఖ్యానించారు. అధికారికంగా సాహిత్యరంగంలో అత్యున్నతమైన ఈ అవార్డు కింద అయిదులక్షల నగదు వగైరా లభిస్తాయి. V

**పీపీ**

# విస్మృత కథలపై విలువైన సమాచారం



**1910-1956** మధ్య కాలంలో నాటి తెలంగాణా ప్రాంతం నుంచి వెలువడిన కథల గురించిన విలువైన వివరాలు పొందుపరచిన పరిశోధనాత్మక రచన ఇది. ఆ దశలో వెలువడిన వెయ్యికి పైగా కథలు, కథకుల సమాచారం ఈ పుస్తకంలో లభిస్తుంది. అదే విధంగా ఆనాటి కథా సంపుటాల గురించి, వీటిని ప్రచురించిన పత్రికల గురించి కూడా వివరాలు చూడగలుగుతాము. కారణాలేమైనా తెలంగాణాప్రాంతం నుంచి ఆ నాడు వెలువడిన కథల గురించి, కథకుల గురించి ఇంత సమాచారం ఇప్పటివరకూ సాహిత్యాభిమానుల దృష్టిలో లేదనేది వాస్తవం. ఇలా జరగడానికి వెనక ఏవో ఉద్దేశ్యాలు, ఏవో శక్తులు వున్నాయని రచయిత, ఆయనను మెచ్చుకున్నవారు చేసే ఆరోపణలు విమర్శలతో అందరం ఏకీభవించలేకపోవచ్చు. కాని చరిత్ర అధ్యయనంలో భాగంగా ముఖ్యంగా సాంస్కృతిక చరిత్ర పట్ల సమగ్ర అవగాహన కోసం ఇలాటి అలభ్య సమాచారమంతటినీ వెలికి తీసి అధ్యయనం చేయవలసిన అవసరం చాలావుంటుంది. ఇందుకు సంబంధించిన అపోహలనైనా అపార్థాలనైనా తొలగించుకోవడానికి అంతకు మించిన మార్గం లేదు.

కె.శ్రీనివాస్ తన ముందుమాటలో చెప్పినట్టు సంగిశెట్టి శ్రీనివాస్ ఈ సంకలనంకోసం చేసిన శ్రమ అభినందనీయమైంది. భవిష్యత్తులో సాహిత్య పరిశోధన చేసే వారికి వనరుగా ఉపయోగపడేది. ఎవరు ఎక్కడ రాశారనే దాన్నిబట్టి సాహిత్య విలువ సామాజిక ప్రాధాన్యతలు నిర్ణయించబడటాన్ని సహృదయులెవరూ ఎప్పుడూ హర్షించరు. తెలంగాణా ప్రాంతం నైజాం ఫ్యూడల్ నిరంకుశ పాలనలో మగ్గిపోయినప్పటికీ అక్కడ వెల్లివిరిసిన చైతన్యం మీద ఎవరికీ ఎలాటి చిన్నచూపు వుండకూడదు, లేదు కూడా. చారిత్రిక కారణాల రీత్యా మరుగుపడిన ఈ సమాచారాన్ని ముందు ముందు మరింతగా భద్రపరచి విశ్లేషించుకోవడం, ఈ విలువైన వారసత్వం కొనసాగింపుగా వెలువడుతున్న మంచి రచనలను ప్రోత్సహించడం అవశ్య కర్తవ్యం. దస్త్రమ్ సందేశం అదే అనుకోవాలి. ఇందులో ప్రకటించిన ప్రకారం 1956 తర్వాతి కాలంలో వచ్చిన కథల సమాచార సేకరణ కూడా కొనసాగించాలి. కాకపోతే ఒక్కసూచన- సంకుచితంగా ఎవరో ఏదో అన్నా అనుకొన్నారనుకున్నా దాన్ని లక్ష్యంగా చేసుకుని గాక తెలుగు ప్రజల సుసంపన్న వారసత్వంలోని వైవిధ్యాన్ని చాటిచెప్పే విశాల లక్ష్యంతో ఈ కృషి సాగితే ఎక్కువ ప్రయోజనం.

**(దస్త్రమ్ (తొలితరం తెలంగాణ కథల సూచి 1910-1956), సంగిశెట్టి శ్రీనివాస్, పేజీలు : 100, ధర : రు.50/-, ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, నవయుగ, దిశ పుస్తక కేంద్రం)**

V

# "పావలా తాత"



పురిమళ్ల సునంద

'పావలా'కు ఒకప్పుడు ఎంత విలువుండేది. పచారీ కొట్టుకెళ్ళి పావలాకు సేరు ఉప్పు తెచ్చుకున్న రోజులు. పొయ్యి వెలిగించడానికి పావు లీటరు కిరసనాయిలు తెచ్చుకున్నాం. పావలాకు ఓ అగ్గిపెట్టె. పావలాకు పావుకిలో కూరగాయలు వచ్చిన రోజలున్నాయి. ఇలా పావలా గురించి చెప్పుకుంటూ పోతే రూపాయిలో పావువొంతైన 'పావలా' విలువెంతో తెలుస్తుంది.

పిల్లలకు 'పావల' ఇస్తే గుప్పెడు బిస్కెట్లో, పిడికెడు పిప్పరమెంట్లో. నాలుగైదు జీడీలో, చాక్లెట్లో వచ్చేవి. పసివాళ్ళ మొహాల్లో పావలా ఇచ్చిన ఆనందం తియ్యగా ముద్దొస్తుండేది.

నిన్న మొన్నటి వరకు పావలాకు అయిసుఫ్రూటో, పల్లీపట్టో, పప్పుండో, బొంగుండో వచ్చేది.

'పావల' విలువ పడిపోయిందని తెలియని నేను నా మనవడు మారాం చేస్తుంటే పావలా బిళ్ళ చేతిలో పెట్టాను. అంతే... వాడు పావలాను నావైపు విసిరేస్తూ పావలా చెల్లదని తెలియదా అన్నట్లు విసుగ్గా మొహం పెట్టాడు. అదేంట్రా నిన్నగాక మొన్న పావల చేతికిస్తే ఎగిరి గంతేసి కొట్టుకు పరుగెత్తిన వాడివి ఇవ్వాళేమిట్రా ఇలా మాట్లాడుతున్నావు అన్నాన్నేను.

గీతాసారం బోధించే కృష్ణుడిలా నిలబడి అయ్యో! తాతయ్యా! రోజూ పేపరు చూస్తావు. సినిమాలు, సీరియల్స్ చూస్తానంటే మండిపడుతూ ఎప్పుడూ వార్తలంటావు. ఇది కూడా తెలీదా నీకు అన్నాడు. వాడి భంగిమ, మాటతీరు, సమయం దొరికిందని వాడంటించే చురకలు చూసి నవ్వూ, కోపం కలగలిపి వచ్చాయి. అయితే ఏంటోయ్! రోజూ పేపరు చదువుతున్నాను. టి.వి. చూస్తున్నాను కానీ పావలాలు చెల్లవని ఎక్కడా లేదు అన్నాను.

నేనేదో చాలా అజ్ఞానంలో ఉన్నట్టు, వాడికి తెలిసిన దాంట్లో నాకు పావలా వంతు కూడా తెలియదన్నట్లుగా నావైపో చూపు చూసి మాట్లాడ్డం మొదలెట్టాడు.

ద్రవ్యోల్బణం, ప్రపంచ మార్కెట్, రూపాయి విలువ అంటూ చాలా పెద్ద ఉపన్యాసమిస్తూ అక్కడ మన రూపాయి విలువ ఎప్పుడైతే పడిపోయిందో ఇక్కడ పావలాలు చెల్లకుండా పోయాయి తెలుసా అన్నాడు.

అదేంట్రా ఆ మధ్య పేపర్లో చూశాను కొన్ని నోట్లు, నాణాలు చెల్లవని పుకార్లొస్తున్నాయి. వాటిని నమ్మొద్దని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రాసింది కదరా అన్నాను.

పేపర్లో చూసినవి టివిలో విన్నవి ఎవరు పట్టించుకుంటున్నారు తాతయ్య! మా పిల్లలందరం పావలాలతో చాక్లెట్లు, బలపాలు కొనుక్కుందామని మనూరి కొట్టుకెళితే చెల్లవని వెళ్ళగొట్టారు. తెలుసా! అన్నాడు.

ఈ మధ్య ఓసారి అడుక్కునే వాడికి పావల దానం చేస్తుంటే నువ్వే ఉంచుకో బాబయ్యా! అంటూ అదోలా మొహం పెట్టి, పావలా నా చేతిలో పెట్టిపోవడం గుర్తొచ్చింది.

నా మనవడు విసిరిన 'పావల' నాతో ఏదో చెప్పుకోవాలన్నట్లు దీనంగా చూస్తుంటే జాలేసి ఏమిటో చెప్పమన్నాను.

తన పూర్వీకులకు గుర్తు చేసుకుంటూ గతమంతా తవ్విపోయసాగింది.

అయ్యో! రూపాయికి వంద పైసలు కదా! పైస పైసకు ఎంతో విలువుండేది. పైసకు పట్టెడు సరుకులొచ్చిన రోజులున్నాయి. రెండు (2) మూడు (3) పైసల వైభవమే వేరు. ఎంత ఠీవిగా, దర్పంగా, వివిధ లోహాలతో తయారయ్యేవి. పావలా కనుమరుగవబోతున్న సమయంలో 5 పైసలు, 10 పైసలు విలువను పంచుకున్నాయి. అవి గర్వంగా నాలుగు కాలాలు మనగలిగాయో లేదో ఇరవై (20) పైసల నాణాలు వచ్చాయి. అందంగా బంగారంలా మెరిసిపోతూ మురిపిస్తూ ఉండేవి. ఇత్తడి పుత్తడి కాదన్నది ఎంత నిజమైనా పేదవారి మెడలో అందమైన నగలుగా మారి ఆనందాన్నిచ్చేవి.

ఎవరి విలువ వారికి ఉంటూ మేమంతా ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్ళం. మా అమ్మ రూపాయి కడుపున పుట్టిన మా అందరినీ ఆనవాలుకే గానీ, అవసరానికి పనికిరాకుండా కాలగర్భంలో కలిపేస్తున్నారీ మనుషులు. అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ ఇక నేనూ అర్ధరూపాయి బిళ్ళైనా జంట వీడకుండా ఉందామనుకుంటే చివరికి నన్ను కూడా బతికుండగానే సమాధి చేస్తున్నారంటూ ఘొల్లుమని ఏడ్చింది.

నాకూ కళ్ళల్లో గిర్రుని నీళ్ళు తిరిగాయి. పిల్లల పసి గుప్పెట్లో యిమిడిపోయి ఓ చాక్లెటో, ఐసుఫ్రూటో అయి తీయగా నోటిలో (కరిగిపోయేదాన్ని) కరిగిపోయి నా జన్మ ధన్యమని మురిసేదాన్ని. విలువలేని పావలానై విసురుగా నీ చేతికొచ్చాను బాబయ్యా అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది పావల.

అయ్యో! ఎంత కష్టకాలమొచ్చింది నీకని బాధపడుతూ చరిత్ర పుటల్లో నీ స్థాయి చెక్కు చెదరదని ఓదారుస్తూ, నా దగ్గరున్న పావలాలన్నింటిని, నేను సేకరిస్తూ వచ్చిన 1,2,3,5,10, 20 పైసల నాణాల డబ్బాలో వేశాను.

నన్నూ, నాణాల డబ్బాను అసహనంగా చూస్తున్న మనవడిని దగ్గరికి తీసుకొని రూపాయిలో వాటి విలువెంతో విడమర్చి చెప్పి, జేబులోంచి అర్ధబిళ్ళ తీసి చేతికిచ్చాను. ఒక్క అంగలో ఎగిరి గంతేసి కొట్లో దూరుతాడనుకున్న నా మనవడు అర్ధరూపాయిని అరచేతిలో పెట్టుకొని అలాగే దానివైపు చూస్తుండిపోయాడు.

V

## కవిత

# దగ్ధమౌతున్న పాట

గవిడి శ్రీనివాస్

రైలు కూసింది
దగ్ధదేహాల
ఊహల తోరణాల
నిశ్శబ్ద నిశిని పగులగొడుతూ...
గమ్యాల ఊయల్లో పరుగెడుతోంది
పచ్చదనం కళ్ళ సరస్సుల్లో
మునిగిన కొండలు తేలడంలేదు
కుదిపిన 'టీ–టీ' ధ్వనులు
చిటుక్కుమన్న టైంపాస్ చెనక్కాయలు
ఉడికిన ఇడ్లీ పొగలు
చురుక్కుమన్న సమోసా
తాకిన వ్యధ సొదల ఊట
ఆ క్షణం
చెమ్మగిల్లిన రెల్లిదుబ్బలు ఈ కళ్ళు
వీడిన గుడ్డోడి జముకు స్వరంతో
జల్లున వొళ్ళు విప్పిన మల్లెలా
ఆత్మగాథల గేయాలు
వీనుసందుల్లో ఘుమాయిస్తున్నపుడే
రాలిన గతం
తడిపిన జ్ఞాపకమై మనసు పట్టాల మీద పోతుంది
అలా స్వరం వాలి
మళ్ళీ కదిలిన మనసై ఎగురుతుంది
జానపదం జడలు తొడిగితే
ధరించిన ఆకాశం కింద
తడిసిన హృదయాలను లెక్కించలేం
పైసలు ఊతకర్ర పట్టాల్సినప్పుడే
క్షణకాలం మూగబోయిన కళ్ళు
మనసుల్ని ద్రవించనీయడంలేదు
ఆగని పాట ఊగుతూనే వుంది
నిలువని మనసు మునుగుతూనే వుంది
పిడుగుల గుండెల్లో
నిదురోయిన జనావాసం
అచటే ధ్వనించే హృదయవేదిక నివేదనలూ
స్వరాలన్నీ అలానే గుచ్చుతుంటాయి
పగిలిన పాట గాయమై కదిలిపోతుంది
దగ్ధమౌతున్న పాట దేహమైపోతుంది.

# ఒక అభయార్ణవంకావాలి

గేరా



ఇంకా మేఘాల్ని నమ్ముకొని కూర్చోడానికి
నేనేం కాళిదాసుకాలంలోలేను
అదిగో అక్కడ నిలబడి,
మబ్బులవైపు, మాడిపోతున్న మొలకలవైపు
మట్టిపిసుక్కొంటూ వెర్రిచూపులు చూస్తున్నాడే
వాడికింకా నమ్మకం మిగిలుండొచ్చు!
సకలప్రాణికోటిలో
మనిషే ఓ వింత జీవనుకొంటే
వాళ్ళల్లో వీడు మరీ విచిత్రమైన ప్రాణి!
ఇప్పుడు ప్రపంచంయావత్తూ విత్తం చుట్టూ తిరుగుతుంటే
వీడి చూపులింకా విత్తనంచుట్టే
చివరికావిత్తనం కూడా వీడిలాంటిదే
వేల సంవత్సరాల నుండీ అవే కోరికలు
పిడికెడు మట్టి,
పిసరంతవెలుగు
చిటికెడుచెమట,
దోసెడునీళ్ళు
అసలది మొలకెత్తడమే
మొయిళ్ళకు మొక్కుతున్నట్టుంటుంది
మబ్బులమీద వీడికి ఆకాశమంత ఆశ
వాటి కోసం వీడు చేయని తపస్సులేదు
గంగజాతరనాడు వీడు నరికిన పొట్టేళ్ళ రక్తంతో
నేలతడిసి ముద్దయిందేగాని,
ఆమరకల్ని చెరిపేస్తూ
ఒక మబ్బుతునకయినా చినుకుకాలేదు!
కప్పలపెళ్ళి చేస్తూ
వీడుకొట్టిన డప్పులమోతకు
రాళ్ళుపగిలాయేమోగానీ,
ఒక్క ఉరుమైనా వినపడలేదు!
బోరుబావులు తవ్వుకొంటూపోయిపోయి
పాతాళంలో పడ్డాడేగానీ,
అక్కడిగంగైనా వీడిగొంతుకందలేదు!
శూన్యాలు వర్షించిన
పాలకుల మేఘమథనాలకింద,
చిగురెండిపోయిన చేల మధ్య
అడుగంటిపోయిన ఆశలతోవాడు
తననితాను బలిచ్చుకొంటూవాడు...
ఇంకా ఈ బండ మబ్బుల్ని
ఎలా నమ్మమంటావునన్ను?!
కరువు మబ్బులకు పురుడుపోస్తున్న
కసాయిసాగరమా
వాడి చితాభస్మాన్ని నీలోకలిపేముందు
నాదోవిన్నపం,
ఉప్పెనల్తో ఉత్పాతాలతో
ఉసురుతీసే ఉన్మాదిలాకాకుండా
అంతరించిపోతున్న అనాదివృత్తికి
నీవో అభయార్ణవంకావాలి!
అల్పపీడనమై ఆదుకొంటావో
రుతుపవనమై రుణం తీర్చుకొంటావో
మానవజాతికి మాత్రం
మెతుకుల భాగ్యం కలిగించు!!

# డైరీ

## మనిషి జీవన వెత 'మట్టిగంప'




మట్టి గంప ఆవిష్కరణ సభలో కె.సుభాష్, సీతారాం, ప్రసాదమూర్తి, కె.శివారెడ్డి,వల్లభాపురం, పరిమళ్

ప్రపంచీకరణ వేగం పుంజుకుంటున్న తరుణంలో వెలువడిన 'మట్టి గంప' పుస్తకం మానవ వెతలకు ప్రతి రూపమని వక్తలు అభిప్రాయపడ్డారు. యువకవి బి.పరిమళ్ రచించిన 'మట్టిగంప' పుస్తకాన్ని ఫిబ్రవరి 27వ తేదీన బ్యాంక్ ఉద్యోగి కె.సుభాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాసాహిత్య వేదిక ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ మీటింగ్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన ప్రముఖ కవి, కె.శివారెడ్డి ప్రతి కవిపైన పుట్టిపెరిగిన వాతావరణం, అతను నివసిస్తున్న ప్రాంత ప్రభావం ఉంటుందన్నారు. కవి నిత్యం అధ్యయనం చేయాలని, అధ్యయనం చేయని వారిలో అభివృద్ధి నిలిచి పోతుందన్నారు. ప్రస్తుత సంక్లిష్ట రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో కవులు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పోరాట సంస్కృతిని భవిష్యత్తరాలకు అందివ్వాలని కోరారు. పరిమళ్ కవిత్వంలో కులం,వర్గం, ఉందని అయినా చివరికి అతను విముక్తిని కూడా చూపిస్తున్నారని అన్నారు. కవి ప్రసాదమూర్తి పుస్తక పరిచయం చేస్తూ అణగారిన వర్గాల నుండి కొత్తశక్తులు పుట్టుకొస్తున్నాయని అన్నారు. దీనికి మంచి ఉదాహరణ పరిమళ్ 'మట్టిగంప' అని అన్నారు. ఈ పుస్తకం పాలమూరు మట్టి పరిమళాలను మోసుకొస్తున్నదని చెప్పారు. కవి, విమర్శకులు సీతారాం పుస్తకాన్ని సమీక్షిస్తూ ఈ పుస్తకంలో అణువణువునా ఆక్రోశం నిండి ఉందన్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో అస్తవ్యస్థం అవుతున్న ప్రజాజీవితాన్ని ఇందులో ప్రతిబింబింప చేశారని అన్నారు. రైతులు, కూలీలు, దళితులు ఇలా అన్నిరకాల వారి జీవన ప్రతిబింబాలు ఈ పుస్తకంలో ఉన్నాయని అన్నారు. కవి పరిమళ్ మాట్లాడుతూ తాను కవిత్వం రాయడానికి ప్రేరణ నిచ్చిన వ్యక్తులను, ప్రదేశాలను ప్రస్తావించారు. తాను కవిగా రూపాంతరం చెందడానికి దోహదం చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ప్రజాసాహిత్యవేదిక జిల్లా అధ్యక్షులు వల్లభాపురం జనార్దన అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హన్వాడ కిరణ్ పాటలు పాడారు. అంతకు ముందు సభా పరిచయం యువకవి నవీన్, విరజాజిరామిరెడ్డి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, ఉదయ్, కెల్.సత్యవతి, కరువు వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, బుర్రి వెంకట్‌రాంరెడ్డి, పి.చంద్రయ్య, మంగనూరు వెంకటేష్, బాలపీరు, ఎస్.ఎం.ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

–జి.బుచ్చయ్య, మహబూబ్‌నగర్.

## పండుగచీర

**ఉదయమిత్ర**

వానపండుగలాగ వొచ్చింది
నేలపండుగ చీర గట్టింది
ఎటు జూసినా పండుగ సందడే
ఎటు జూసినా నవ్వుల పువ్వులే..
కొంగలు తమ ప్రతిబింబాలకు మురిసిపోతున్నాయి
ఆకుల దోనెల మీద
నీటి బిందువులు హోయలు వోతున్నాయి
సీతాకోక చిలుకలు
గాల్లో వింత ముగ్గులేస్తున్నాయి
బూరీగలు మైక్రోవిమానాలై
గాల్లో విన్యాసాలు చేస్తున్నాయి
బేషరమ్ చెట్లు పేర్లలాగ ఊగుతూ
'మొహర్రం' పండుగను తలపిస్తున్నాయి
పశువులు హాయిగ చెట్ల కిందనెమరేస్తుంటే
గట్టుమీద రైతుల గుండెల్లో
జలపాతపుగల గలలు

అయినా
ఇదంతా కొద్దిసేపు మురిపెమే
ఈ ఆనందమంతా
రేపటి సుడి గుండంలో
మునిగిపోయే నందివర్ధనమే

రేపు
మండుటెండలు
భూమిని నిర్దాక్షిణ్యంగా ముట్టడిస్తాయి
శాడిస్టు భర్తకు అలవాటైన భార్యలా
భూమి ప్రచండతాపాన్ని మోస్తుంది
భూమిని తిరగేసినట్టు
మట్టి తప్పమరేమీ కనబడదు
తీతువు పిట్టలచప్పుడు తప్ప
ఎక్కడా కోలాహలముండదు
పచ్చదనం కరువైనచోట
పక్షులు దిక్కుల చెదురుతాయి
పశువులు కబేళాకు తరలివెళ్తాయి
బతుకుదెరువు కరువైన చోట
వలసబాటలో రైతు ముఖం చెక్కుకుపోతుంది



నేల పండుగ చీర విడిచి
ఎప్పట్లాగే చింకిపాత చీర గప్పుకొంటుంది
ఎడారినిదలపించే
ఒక విషాద దృశ్యం గుండెను పిండిజేస్తుంది

# డైరీ

## జన కవనంలో పులకించిన ఏకశిల!

కదన శౌర్యానికేగాక కళా సాహిత్యాలకూ కాణాచి అయిన చారిత్రిక నగరం ఓరుగల్లులో సిపిఎం 21 వ రాష్ట్ర మహాసభ సందర్భంగా ఆహ్వానసంఘం నిర్వహించిన 'జన కవనం' సాహిత్యాభిమానులను ఉర్రూతలూపింది. నూట యాభై మందికి పైగా కవులు జన కవనంలో పాల్గొని సామ్రాజ్యవాదాన్ని, మతోన్మాదాన్ని, పాలకుల కపట నీతిని నిరసిస్తూ కవితాస్త్రాలు సంధించారు. ఉదయం 11గంటల నుంచి రాత్రి 7.30 వరకూ ఏకధాటిగా సాగిన కార్యక్రమంలో అభినందనీయమైన సృజనాత్మకత, సామాజిక సృహ వ్యక్తమైనాయి.

2002 ఫిబ్రవరిలో సిపిఎం అఖిల భారత మహాసభకు ముందు జరిగిన 'జన కవనం' తెలుగు సాహిత్యంలో ప్రగతిశీల శక్తుల విశాల ఐక్యతకు వేదికగా నిలిచింది. నూతన సాహిత్య శక్తులకు స్వాగతం పలికింది. సాహిత్య లోకంలో స్తబ్దత ఏర్పడిందనే అంచనాలు పటాపంచలు చేస్తూ ఒక నూతనోత్సాహం నింపింది. ఆ సందర్భంలో కవులు వినిపించిన కవితలను నెల రోజులలోనే ప్రచురించి ఆవిష్కరించడం మరో సంచలనమైంది. ఇప్పుడు రాష్ట్ర మహాసభ సందర్భంలోనూ ఆ వరవడిని కొనసాగించడం అందరి అభినందనలు చూరగొన్నది. హైదరాబాదు వెలుపల ఒక జిల్లా కేంద్రంలో ఇంత పెద్ద సాహిత్య కార్యక్రమం జరగడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమమన్న మాట అంతటా వినిపించింది.

మొత్తం 174 మంది కవులు అధికారికంగా నమోదు చేయించుకున్నారు. అన్ని వయో బృందాలకు చెందిన వారు, అన్ని ప్రగతిశీల భావ స్రవంతులకు సంబంధించిన వారు పాలు పంచుకున్నారు. కవితలపై ఎలాటి ఆంక్షలు పెట్టలేదు. అయినా ఇంత మంది హాజరైనప్పటికీ కవితా సందేశంలో ఒకే స్ఫూర్తి తొణకిసలాడటం గొప్ప ప్రాదాన్యత గల విషయం. ప్రపంచీకరణ, మతోన్మాదం, టెర్రరిజాలను వ్యతిరేకించే వారందరికీ స్వాగతం అన్న నిర్వాహకుల ఉద్దేశం పూర్తిగా సార్థకమైంది. గత జన కవనంతో పోలిస్తే సామ్రాజ్యవాద వ్యతిరేకత ప్రప్రధానమైన అంశంగా తయారైంది. కేవలం నినాద ప్రాయంగా రాయడం గాక తమవైన విభిన్న రీతుల్లో కవులు అమెరికా దాష్టీకంపై ధ్వజమెత్తారు. తర్వాత ఎక్కువ మంది మతోన్మాదంపై తీవ్ర నిరసన ప్రకటించారు. అలాగే అనేక మంది రాష్ట్ర పరిస్థితులకు అద్దం పట్టే విధంగా నేటి గందరగోళపు ద్వంద్వ రాజకీయాలను ఎండగట్టారు. ఇంతమంది పాల్గొన్నా సభికులకు విసుగు పుట్టకపోగా మధ్య మధ్య కరతాళధ్వనులు చేస్తూ ఉత్సాహం ప్రకటించారు. ప్రారంభించిన ప్రముఖ కవి జ్వాలాముఖి జన కవనం ప్రజాస్వామ్య




నిర్వచనం అన్నారు. నిజంగానే అదో కార్యక్రమంగా గాక ప్రత్యామ్నాయ ప్రజాసాహిత్య సంస్కృతిలా గోచరించింది. ఇంత మంది కవులు ఒకచోట చేరడంలో అపూర్వమైన సమిష్టితనం, సాహిత్య చైతన్యం, సాంస్కృతిక స్పృహ ప్రస్ఫుటమైనాయి. సహజంగానే గత పర్యాయం జన కవనంతో దీన్ని పోల్చిచూస్తారు. రాశిలోనూ వాసిలోనూ కూడా ఈ మూడేళ్లలో కవులు మరింత మెరుగుదల సాధించినట్లు స్పష్టమైంది. మొత్తం 174 మంది కవితలు తెచ్చినట్టుగా నమోదు చేసుకున్నారు. సాయింత్రం సెషన్ ప్రారంభంలో కరెంటు పోయినప్పటికీ కవులు, సభికులు చెక్కుచెదరకుండా వుండి తమ ఆసక్తి చాటుకున్నారు.

చాలా మంది కవయిత్రులు పాల్గొని తమ కవితలు వినిపించారు. తమ కవితలు చదవడంతో పాటు ఇతరుల కవితలలో వున్న మంచి అంశాలను నోట్ చేసుకోవడాన్ని బట్టి కవులు చాలా సీరియస్‌గా వున్నట్టు కనిపించింది. అర డజను వరకు పాటలు వచ్చాయి. ఆర్టిస్టు మోహన్ గీసిన బ్యాక్‌డ్రాప్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దానిపైనా ఒకరు కవిత రాశారు.

**ప్రముఖుల అభినందన**

మూడు భాగాలుగా జరిగిన జన కవనం సీనియర్ కవి జ్వాలాముఖి ఉత్తేజకర ప్రసంగంతో మొదలైంది. ఆదినుంచి కవిత్వం సామాజికుల వేదనలను ప్రకటించడంతో మొదలైందని, కవి ఎప్పుడూ తటస్థుడుగా లేడని చెప్పారు. రామాయణం రాసిన వాల్మీకి, భారత కర్త వ్యాసుడు తమ కథలు సంక్షోభంలో పడినప్పుడు తామే పాత్రలుగా ప్రవేశించడం చూస్తామని గుర్తు చేశారు. ఈ విధమైన సంప్రదాయం మరే సాహిత్యంలోనూ చూడలేమంటూ ఇది కవి సామాజిక పాత్రకు ప్రతిబింబమని చెప్పారు. సాటి మనుషుల బాధావేదనలకు స్పందించడంలోనే కవితా సృష్టి ప్రారంభమవుతుందన్నారు. కవిత్వం ఎప్పుడూ ప్రైవేటు ప్రాపర్టీ కాకూడదని, పబ్లిక్ సెక్టార్‌లో వుండాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి ప్రపంచంలో సామ్రాజ్యవాద ప్రమాదం పెరిగిపోయిందని, అది అన్ని విధాల జనం మధ్య చీలికలు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నదని హెచ్చరించారు. తాను పాలస్తీనాపై రాసిన కవిత చదివి జన కవనం ప్రారంభించారు.


అంపశయ్య నవీన్ మాట్లాడుతూ కవిత్వానికి మానవ మనోభావాలను ప్రభావితం చేసే మహత్తర శక్తివుందని అంటూ చిన్నప్పుడు తనను మహాప్రస్థానం కదిలించిన తీరును ఉదహరించారు. జన కవనం ఒక గొప్ప ప్రయోగమని అన్నారు. పి. ఆనంద్‌కుమార్ అధ్యక్షత వహించిన ఈ మొదటి సెషన్‌లో ఇంకా రావెళ్ల వెంకట రామారావు, కాత్యాయని విద్మహే, వి.ఆర్.విద్యార్థి సందేశాలిచ్చారు.

రెండవ సెషన్‌కు కటకోర్జ్వుల ఆనందాచారి అధ్యక్షత వహించగా చెకుముకి ఎడిటర్ ఏ. రామచంద్రయ్య, సీనియర్ కవి, పరిశోధకులు డా.దిలావర్, అనిశెట్టి రజిత, వల్లభాపురం జనార్ధన, ఎ.కుమార స్వామి సందేశాలిచ్చారు. మూడవ సెషన్‌కు స్ఫూర్తి అధ్యక్షత వహించగా కవి, విమర్శకుడు సీతారాం, రచయితలు బోయ జంగయ్య, బివిఎస్‌రాములు, దేవేంద్ర, షాజహానాలు సందేశాలిచ్చారు. కవితా పఠనం మధ్య మధ్యలో క్లుప్తంగా సందేశాలు నడిచాయి. వక్తలందరూ ఇంత విశాల ప్రాతిపదికన సాహిత్య కార్యక్రమం జరగడం పట్ల హర్షం వెలిబుచ్చారు. వచ్చిన కవితలలో సామాజిక స్ఫూర్తిని అభినందిస్తూ కవితా రచనలో మెళకువలు, మెరుగుదలకు సూచనలు అందజేశారు. తెలకపల్లి రవి జన కవనం కన్వీనర్‌గా వ్యవహరించారు. సీతారాం స్వాగతం పలుకగా కె.లక్ష్మయ్య వందన సమర్పణ చేశారు.

–తెర

# డైరీ

## క"న్నీటి" తపన "జలగండం"




"జలగండం" పుస్తకావిష్కరణ సందర్భంగా కవి యక్కలూరి వై. శ్రీరాములు, డిఐజి ఎన్. జయరామిరెడ్డి, కవి నగ్నముని మొదలగువారు

యక్కటలూరి శ్రీరాములు "జలగండం" దీర్ఘ కవితా పుస్తకం 2004 డిసెంబర్ 26న అనంతపురం లలిత కళాపరిషత్‌లో ప్రజల ముందు ఆవిష్కరణ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఈ సభకు డిఐజి ఎన్. జయరామిరెడ్డి, ఆవిష్కర్తగా నగ్నముని విచ్చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ "నీటి విలువ, ప్రాముఖ్యత, పర్యవసానం, ప్రభావం ఎలా వుంటుందోనన్న సత్యాన్ని బాధగా, అతి భయంకరంగా, నిక్కచ్చిగా, సూటిగా "జలగండం"లో యక్కలూరి శ్రీరాములు పేర్కొనడం అభినందనీయమని హృదయ విదారకమైన విషయాలు తనదైన శైలిలో, పుస్తక రూపంలో సమాజానికి అందించడం ప్రశంశనీయమన్నారు. రాయలసీమకు చక్కని సమాధానం, ప్రపంచానికి ప్రాణప్రదమైన నీరు గురించి ప్రాంతీయ, దేశ, ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయంగా ఈ పుస్తకంలో తెలియజేయడం జరిగిందని తెలిపారు. నగ్నముని మాట్లాడుతూ సీమగుండె చప్పుడు ఈ కావ్యం... జలగండం అద్భుతమైన కావ్యమని, కొత్త అర్థాన్ని, నూత్న దర్శనాన్ని కలిగించి భాషకి, ప్రయోగానికి ఊపునిస్తుందని జలం లేకపోవటంవల్ల సంభవించే అపాయాన్ని కవి యక్కలూరి శ్రీరాములు సంపూర్ణంగా అభివర్ణించారని ఈ లోచన వినూత్నం ఆదర్శం, అభివృద్ధికి సూచికని నీరు, భూమి గాలి వ్యాపార వస్తువులుగా మార్చిన వారికి ఈ పుస్తకం పాదరక్షల ద్వారా వారికి జవాబు చెప్పిందని నీటిని వ్యాపార వస్తువుగా మార్చిన కార్పొరేటు, బహుళజాతి కంపెనీలను దుమ్మెత్తి పోశారని తెలిపారు.

యక్కలూరి శ్రీరాములు మాట్లాడుతూ "మన నీటిని మనకే అమ్ముతుండటం విచారకరమన్నారు. గోదావరి ఒడ్డున, తుంగభద్ర డ్యాంపైన, కృష్ణాతీరంలో నీళ్ళను క్యాన్లలో నింపి, ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపి మినరల్ వాటర్‌ను అమ్మడం నిత్యం మనం చూస్తున్నామని భూమి తరువాత నీళ్ళు వ్యాపార వస్తువులుగా మారటం అత్యంత దారుణమని గాలి కూడా అమ్ముతుండటం అత్యంత ప్రమాదకరమని" అన్నారు. తదనంతరం వై. శ్రీరాములు "ఒక్కసారే" నాటికను ప్రదర్శించారు.

**– టి. రాజారాం**

## 'నిషిద్ధాక్షరి'కి ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

ఆధునిక కవిత్వానికిచ్చే "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు – 2004 సంవత్సరానికి గాను ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మందరపు హైమవతిగారి 'నిషిద్ధాక్షరి' కవితా సంపుటి ఎంపికైందని అవార్డు వ్యవస్థాపకులు కవి రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ అవార్డుకు న్యాయనిర్ణేతలుగా డా॥ పాపినేని శివశంకర్ డా॥ ఎండ్లూరి సుధాకర్, ప్రొ ఎస్వీసత్యనారాయణ వ్యవహరించారు. ఈ అవార్డు పొందిన వారిలో రచయిత్రి పదిహేడవ వారని ఆయన అన్నారు.

**"ఎన్నాళ్ళు ఈ పూర్వకాలపు పాఠాలు**
**మనసును గుర్తించలేని పాత కాలపు భావాలు**
**అందరం కలిసి ఈ జీవితం సిలబస్ మార్చలేమా"** – అంటూ ఆకాశంలో సగమైన స్త్రీల పక్షాన ఆర్తిగా పలికిన కవితాస్వరమే 'నిషిద్ధాక్షరి' అని న్యాయనిర్ణేతలు పేర్కొన్నారు.



మేరెడ్డి యాదగిరిరెడ్డి "మట్టికథలు" కథా సంకలనం ఆవిష్కరిస్తున్న శీలావీర్రాజు, అధ్యక్షత వహించిన డా. నోముల సత్యనారాయణ మరియు నాళేశ్వరం శంకరం, డా. బోయ జంగయ్య, వేణు సంకోజు, పున్న అంజయ్య, ఎన్.కె. రామారావు తదితరులు

## 'మట్టికథలు' కథా సంకలనం ఆవిష్కరణ

జనవరి 16న నల్గొండలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత మేరెడ్డి యాదగిరిరెడ్డి 'మట్టికథలు' కథా సంకలనాన్ని ప్రముఖ రచయిత శీలావీర్రాజు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి డా. నోముల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నాళేశ్వరం శంకరం, డా. బోయజంగయ్య, వేణుసంకోజు, కథకులు ఎన్.కె. రామారావు, పున్న అంజయ్య పాల్గొన్నారు. ఈ పుస్తకం దివంగత అభ్యుదయవాది రచయిత కాంచనపల్లి చిన వెంకట రామారావు అంకితమీయడం పట్ల వక్తలు రచయితను అభినందించారు. ముఖ్యఅతిథి శీలా వీర్రాజు మాట్లాడుతూ కవిత్వమైనా కథలయినా పట్టు వుండాలన్నారు. నాళేశ్వరం శంకరం పుస్తకాన్ని విశ్లేషిస్తూ ఈ కథలు సమాజంపట్ల రచయితకున్న అభ్యుదయ భావాలు గుర్తు చేస్తున్నాయన్నారు. ఇంకా కథా సంకలనం పై వేణుసంకోజు, ఎన్.కె. రామారావు విశ్లేషించారు. విక్టర్‌బాబు వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

# డైరీ

## గూడూరి సీతారాం సాహిత్య స్వర్ణోత్సవం



జనవరి 11న సిరిసిల్లలో జరిగిన సాహిత్య స్వర్ణోత్సవ సందర్భంగా తెలంగాణా తొలితరం కథకులు గూడూరి సీతారాంగారి కథల సంపుటిని డా॥ సి. నారాయణరెడ్డి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో వరుసగా ఎన్. అరుణ, పత్తిపాక మోహన్, ఆడెపు రవీందర్, గూడూరి సీతారాం, రంగినేని మోహన్‌రావు, డా॥ ఎన్. గోపి, డా॥ సి. నారాయణరెడ్డి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పార్థసారథి, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్, రుద్ర శంకరయ్య

తెలంగాణా తొలితరం కథకుడు గూడూరి సీతారాం కథలు రాయడం ప్రారంభించి 50 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా అభిమానులు సాహిత్య స్వర్ణోత్సవం జరిపారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో జనవరి 11న ఈ స్వర్ణోత్సవ సాహిత్య సమావేశం డా. సి. నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా డా. ఎన్. గోపి అధ్యక్షతన జరిగింది. సినారె ఈ సభలో గూడూరి సీతారాంతో తనకు గల 60 ఏళ్ళ అనుబంధం గురించి వివరించారు. డా. ఎన్. గోపి తెలుగు కథా సాహిత్యంలో గూడూరి సీతారాం స్థానాన్ని, విశిష్టతని విశ్లేషించారు. మానేరు రచయితల సంఘం నిర్వహించిన ఈ సభలో వేదికపై కరీంనగర్ జిల్లా కలెక్టర్ పార్థసారథి, రచయిత, విమర్శకులు బి.ఎస్. రాములు, కవి వద్దేపల్లి కృష్ణ, రుద్ర శంకరయ్య, ఆడెపు నారాయణ, మున్సిపల్ ఛైర్మన్ ఆడెపు రవీందర్, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, రంగినేని మోహనరావు, పెద్దింటి అశోక్‌కుమార్, కొలిపాక శోభారాణి, మారసం కార్యదర్శి, పత్తిపాక మోహన్ మొదలైన వారు వేదికను అలంకరించారు.

తొలుత డా. సి. నారాయణరెడ్డి, ఎన్. గోపి, నిర్వాహకుల తరఫున గూడూరి సీతారాంగారిని ఘనంగా సత్కరించారు. తరువాత పలు సంస్థల తరఫున సన్మానం చేశారు.

ఈ సందర్భంగా గూడూరి సీతారాంగారి సాహిత్య కృషిని అభినందిస్తూ జూకంటి జగన్నాథం, నలిమెల్ల భాస్కర్, సంగిశెట్టి శ్రీనివాస్, వద్దేపల్లి కృష్ణ, డా. రాఘవేంద్ర, జిల్లా కలెక్టర్ పార్థసారథి, అన్నవరం దేవేందర్, పెద్దింటి అశోక్‌కుమార్, తదితరులు తమ సందేశాలు ఇచ్చారు. యువ సినీ గేయ రచయిత గుండేటి రమేష్, దేవత సుధాకర్‌లు గూడూరి సీతారాంపై పాటలు రాసి వినిపించారు. ఈ సందర్భంగా 5 పుస్తకాలు ఆవిష్కరించబడ్డాయి. సినారె, గోపి, జిల్లా కలెక్టర్ పార్థసారథి చేతులమీదుగా సురమౌళి కథా పురస్కారం, పెద్దింటి అశోక్‌కుమార్ 'ఊటబాయి' కథాసంపుటికి, కొలిపాక శోభారాణి 'చలనం' కవితా సంపుటికి రుద్ర రవి స్మారక కవితా పురస్కారం అందించి సత్కరించారు. తెలంగాణా జిల్లాల నుండి పలువురు రచయితలతోపాటు స్థానిక అభిమానులు, బంధుమిత్రులు, వందలాది మంది విచ్చేసి ఈ సభను జయప్రదం చేశారు.

ఈ సందర్భంగా 'కానుగ చెట్టు' పేరుతో గూడూరి సీతారాం సాహిత్య స్వర్ణోత్సవ సంచికను, గూడూరి సీతారాం కథల సంపుటిని, జి. రాములు పెరటిచెట్టు కథల సంపుటిని, గుండేటి రమేష్ సంకలించిన పద్మదర్శిని, దేవత సుధాకర్ సేకరించిన సిరిమల్లెలు జానపద పాటలు పుస్తకాన్ని డా. సి. నారాయణరెడ్డి ఆవిష్కరించారు. పత్తిపాక మోహన్ రాసిన పిల్లల కోసం మన కవులు పుస్తకాన్ని డా. ఎన్. గోపి ఆవిష్కరించారు. సాహిత్య స్వర్ణోత్సవం సందర్భంగా దిన, వార, మాస పత్రికలు గూడూరి సీతారాం సాహిత్య కృషిపై ప్రత్యేక వ్యాసాలను ప్రచురించాయి. సత్కార గ్రహీత గూడూరి సీతారాం, సాహిత్య పురస్కార గ్రహీతలు పెద్దింటి అశోక్‌కుమార్, కొలిపాక శోభారాణి స్పందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన రచయితలకు, కళాకారులకు నిర్వాహకులు జ్ఞాపికలు అందించారు.

–పత్తిపాక మోహన్

## ఇండియన్ హైకూ క్లబ్ ఆధ్వర్యంలో పత్రిక, పుస్తక, సిడి, క్యాసెట్ ఆవిష్కరణ

ఇండియన్ హైకూ క్లబ్ ఆధ్వర్యంలో డిసెంబరు 28వ తేదీ 2004న అనకాపల్లిలోని విజయా రెసిడెన్సీ హోటల్ ఆడిటోరియంలో సాహితీసభ జరిగింది. ఈ సందర్భంగా డా. తలతోటి పృథ్విరాజ్ సంపాదకత్వంలో రూపొందించిన "పద్య మంజూష" ఆడియో, సిడి, క్యాసెట్‌ను ఏ.ఎం.ఏ.ఎల్. కళాశాల తెలుగుశాఖ పూర్వాధ్యక్షురాలు డా. శ్రీమతి వి. సీతాలక్ష్మీ ఆవిష్కరించారు. ఆమె సభకు అధ్యక్షత వహించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రసిద్ధ విమర్శకులు కడియాల రామమోహనరాయ్ పుస్తక సమీక్షా త్రైమాస పత్రిక 'సంవీక్షణ'ను ఆవిష్కరించారు.

విశిష్ట అతిథిగా విచ్చేసిన కవి సాదనాల వెంకటస్వామి నాయుడు 'హైకూ త్రైమాస పత్రిక'ను ఆవిష్కరించారు. ప్రముఖ కవి మాకినీడి సూర్యభాస్కర్, డా. తలతోటి రచించిన 'వసంతం' హైకూ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'పద్యమంజూష'ను గానం చేసిన ఇవటూరి గౌరీశంను, అతిథులను ఎం. కామరాజు తదితరులు ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు ఇండియన్ హైకూ క్లబ్ వ్యవస్థాపకుడు కవి డా. తలతోటి పృథ్వీరాజ్ కృషిని అభినందించారు.

–బాణోతు బాలు

## గురజాడ గృహంలో "పక్షి" సమీక్ష

ఫిబ్రవరి 8న గురజాడ స్వగృహం విజయనగరంలో వి. ప్రతిమ "పక్షి" కథా సంకలనం సమీక్ష జరిగింది. జియన్ చలం సమీక్షించారు. జి. మురళీధర్, అల, లక్ష్మణరావుతోపాటు సుమారు యాభై మంది సాహితీ మిత్రులు పాల్గొని వారి అభిప్రాయాలను తెలిపారు.

# డైరీ

## 'మట్టివాసనలు' ఆవిష్కరణ

కరీంనగర్‌లోని డాక్టర్ టి.ఆర్.కె. ఫౌండేషన్ వారి అక్షరసాహితి ఆధ్వర్యంలో పంజాల జగన్నాథం 'మట్టివాసనలు' కథా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేయబడిన సభలో ముఖ్యఅతిథిగా సీనియర్ కథారచయిత గూడూరి సీతారాం మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో గ్రామీణ ప్రజల కన్నీటి బతుకులను రచయిత పంజాల జగన్నాథంలో తన కథలలో చక్కగా ప్రతిబింబింప చేశారని పేర్కొన్నారు. సంకలనాన్ని ఆవిష్కరించిన రచయిత, బహుభాషావేత్త డా. నలిమెల భాస్కర్ మాట్లాడుతూ 'మట్టివాసనలు'లోని ప్రతి కథా సందేశాత్మకంగా మలచబడిందని అన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన ప్రముఖకవి జూకంటి జగన్నాథం మాట్లాడుతూ 'మట్టివాసనలు' పుస్తకంలోని ప్రతి కథలో గ్రామీణ భారతాన్ని ఆవిష్కరింప ప్రయత్నించిన రచయిత కృషి అభినందనీయమని తెలిపారు. అక్షర సాహితి ప్రధాన కార్యదర్శి శ్రీ దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ రచయితకు తెలంగాణా మాండలీకాలపై చక్కని పట్టున్నట్లు 'మట్టివాసనలు' కథలు తెలుపుతున్నాయని అన్నారు. అక్షర సాహితి అధ్యక్షులు డా. టి.ఆర్.కె. చారి మాట్లాడుతూ వర్ధమాన కథా రచయితలను ప్రోత్సహించడానికి దాతలు ముందుకు రావాలని సూచించారు.

ఈ సభలో కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు సి.హెచ్. అయోధ్య రామారావు, డా. వి. రంగాచార్య, నేదునూరి కనకయ్య, పరుశరాంరావు తదితరులు జగన్నాథంను అభినందిస్తూ ప్రసంగించారు. తనకు జరిగిన సన్మానానికి రచయిత పంజాల జగన్నాథం ధన్యవాదాలు తెలిపి మాట్లాడుతూ సమాజంలో అతలాకుతలమవుతున్న పరిస్థితులే తనని కథా రచయితగా నిలబెట్టాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు డా. పత్తిపాక మోహన్, సుబ్బారాయశాస్త్రి, అన్నవరం దేవేందర్, వేణుశ్రీ, బి.వి.ఎన్. స్వామి, కె. సుజాత, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

## 'వానచూపు' ఆవిష్కరణ

ఫిబ్రవరి 24న గజపతి నగరంలో "వానచూపు" కవితా సంకలనం ఆవిష్కరణ జరిగినది. గ్రంథాలయోద్యమ నాయకులు జయంతి రామలక్ష్మణమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక పరిచయాన్ని యువకవి "అల" చేశారు. ఈ కార్యక్రమానికి చీకటి దివాకర్ విజయనగరం సాహితీ స్రవంతి కన్వీనర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నవలా రచయిత జి.యన్. చలం కవి లక్ష్మణరావు మొదలగువారు పాల్గొన్నారు.




**జనవరి 13న అనంతపురంలో జరిగిన 'రాధేయ కవితా పురస్కార సభ'లో ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగం చేస్తున్న ప్రముఖ నేపాలీ రచయిత్రి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బింద్యా సుబ్బా వారి హిందీ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదిస్తున్న కొమ్మిశెట్టి మోహన్.**




**కాకినాడ సూర్యకళా మందిరంలో 19.2.05న (1) కడలి తరంగాలు (2) దమ్మపద సుభాషితములు రచయిత కడలి సూర్యనారాయణతోబాటు వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు, బి.వి. బంగారురాజు, జి. సుబ్బారావు, జి.ఎస్. గోపాలస్వామిశెట్టి, డా॥ అద్దేపల్లి రామమోహనరావు, డా॥ పి. చిరంజీవినీ కుమారి, మంతెన ఆదినారాయణరాజు, జి.వి. కృష్ణప్రకాష్.**

## తరంగాల కడలి కవితలు! సమకాలీన వస్తురూపాలు!!

ఇటీవల కాకినాడ సూర్యకళా మందిరంలో రిటైర్డ్ డి.ఆర్.వో. కడలి సూర్యనారాయణ "కడలి తరంగాలు" "దమ్మపద సుభాషితములు" అనే వచన, పద్య కవితా సంపుటాల ఆవిష్కరణ సభ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సమాఖ్య నిర్వహణలో జరిగింది. అద్దేపల్లి రామమోహనరావు "కడలి తరంగాలు ఆవిష్కరిస్తూ సమకాలీన సమస్యలను కేంద్రీకరిస్తూ నేడు నిరాదరణకు గురవుతున్న వివిధ వృత్తుల వారి గురించి ప్రతి స్పందించి రాసిన కవితలుగా పేర్కొన్నారు. బుద్ధుని బోధనల ప్రేరణతో "దమ్మపద సుభాషితములు" సుబోధకములుగా బౌద్ధ జీవన విధానంగా సాగాయన్నారు.


కవి, ప్రయోక్త వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు, సభా నిర్వహణ చేయగా, డా॥ పి. చిరంజీవినీ కుమారి అధ్యక్షతన, డా॥ అద్దేపల్లికి కవి కడలి సూర్యనారాయణతోబాటు, హైకోర్టు సీనియర్ న్యాయవాది మంతెన ఆదినారాయణరాజు (హైదరాబాద్)చే సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎండోమెంట్స్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ జి.వి. కృష్ణ ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. కాకినాడలో ప్రముఖ న్యాయవాది గెద్దాడ సుందర గోపాల స్వామిశెట్టి దమ్మపద సుభాషితములు గ్రంథాన్ని ఆవిష్కరించారు, బియ్యపుగింజ కవి జి. సుబ్బారావు సుభాషితముల సమీక్ష చేశారు. కె. రాధాదేవి, బి.వి. బంగారు రాజు, కుడిపూడి సత్యనారాయణ ప్రభృతులు పాల్గొన్నారు. కడలి రచించిన గేయాల్ని స్థానిక నాయకులు పెండ్యాల శాంతారాయ్, సుబ్బారావు సప్తులు ఆలపించారు. కడలి తనకు జరిగిన సన్మానానికి కతజ్ఞతలు తెలిపారు. కవిత్వానికి మూలబిందువు మనిషి అనే భావంతో రచనలు చేస్తున్నాను అని, సమాజం కవుల్ని సాహితీ వేత్తల్ని గుర్తించగలిగినప్పుడే శ్రేయస్సుంటుందన్నారు.

వి.ఎస్.ఆర్.ఎస్. సోమయాజులు నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో మాకినీడి సూర్యభాస్కర్ శిరీష, పి. అనంతరావు, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, ఎ.వి.ఆర్. మూర్తి, మాల్యాద్రి, ఎ.జ్యోతి, శ్రీకళ, భగ్వాన్, ఉండవిల్లి మల్లిఖార్జునరావు. బాక్కర్ తాతారావు, పి. పద్మజావాణి, కె. నాగభూషణం, ఎస్. సూర్యప్రకాశరవు అవధానుల మణిబాబు పాల్గొని సమాజ గమనానికి ఆలోచింపచేసే కవిత్వాన్ని వెలార్చారు.

# డైరీ

## ఈగ హనుమాన్ "లోలోకి..." ఆవిష్కరణ

పాశ్చాత్యధోరణులు భారతీయ సాహిత్య సాంప్రదాయాలను కలుషితం చేస్తున్నాయని ప్రముఖ కవి విమర్శకుడు అద్దేపల్లి రాంమోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ.పి. జెన్‌కో అతిథి గృహం పాల్వంచ (ఖమ్మం జిల్లా)లో ఫిబ్రవరి 27న ఈగ హనుమాన్ రచించిన "లోలోకి..." వచనా కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ సామ్రాజ్యవాద విధానాలవలన సమాజంలో ఏర్పడిన దుష్పరిణామాలను విశ్లేషించడంలో తెలుగు సాహిత్యం సఫలీకృతమైందని అన్నారు. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబిస్తుందని, సమాజానికి దూరమైన కవి, సాహిత్యం మనుగడ కోల్పోతుందని అన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను రికార్డు చేయడంలో తెలుగు సాహిత్యం సఫలీకృతమైందని ఆయన అన్నారు. సమకాలీనత పాటించిన కవిగా ఈగ హనుమాన్ సఫలీకృతమయ్యారని ఆయన అభినందించారు. "లోలోకి.." కవితా సంపుటి రచించిన ఈగ హనుమాన్ మాట్లాడుతూ సామాజిక సంక్షోభం, సంస్కరణలు, గ్రామాలు ఆత్మహత్యలకు కేంద్రంగా మారడం, మృగ్యమవుతున్న మానవత్వం తనను ఆందోళనకు గురి చేశాయని అన్నారు. ఆ ఆందోళనే తనచే "లోలోకి..." సంపుటిని ప్రకటింపచేసింది అన్నారు. కవితా సంపుటిని, కవి తల్లితండ్రులైన ఈగ పుష్ప, దామోదర్‌లు ఆవిష్కరించారు. సాహితీ




ఎస్వీ నారాయణ, కవి ఈగ హనుమాన్, కవి తల్లితండ్రులు ఈగ పుష్ప, దామోదర్, అద్దేపల్లి రామ్మోహన్, కెటిపిఎస్, సి. రాధాకృష్ణ

స్రవంతి ఖమ్మం జిల్లా శాఖ కార్యదర్శి కటుకోజ్వుల ఆనందాచారి అధ్యక్షత వహించగా "లోలోకి..." కవితా సంపుటిని పలువురు విశ్లేషించారు. ఈ సభలో కెటిపిఎస్, ఎస్ఇ సి. రాధాకృష్ణ, ఎస్.వి. నారాయణ, ఎమ్మెస్సార్, పి. విద్యాసాగర్, ఆదెపు ముత్యాలరావు, సాధనాల, కాంతారావు, రంగారావు, రాంకుమార్‌లు పాల్గొని ప్రసంగించారు.

## ఎన్.గోపి 'నానీలు' హిందీ అనువాదం ఆవిష్కరణ

మార్చి 6న హైదరాబాద్‌లో హిందీ సాహిత్య సమ్మేళన ప్రయాగ వారు నిర్వహించిన 57వ వార్షిక సమావేశంలో ఎన్. గోపి రచించిన 'నానీలు' హిందీ అనువాదం 'నన్హేముక్తక్' ఆవిష్కరణ జరిగింది.

స్వతంత్ర వార్త సంపాదకుడు గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ అనువాదంలో మూలభాషలోని ధ్వని గత సౌందర్యం తేవడం కష్టమైనా మంచి అనువాదంలో దానిని ఊహించవచ్చు. నానీలు హిందీలో ప్రఖ్యాతిగాంచిన 'ఛోకే చౌపదుల' లాంటివన్నారు.

సభకు అధ్యక్షత వహించిన అలహాబాద్ విశ్వవిద్యాలయం హిందీ శాఖాధ్యక్షులు, సాహిత్య సమ్మేళనం సాహిత్య మంత్రి ఆచార్య సత్యప్రకాశ్ మిశ్ర మాట్లాడుతూ అనువాదం ఏ భాషలోనికి చేయబడుతుందో ఆ భాష శక్తి వంతమవుతుందనీ, భక్తి సాహిత్యాన్ని ప్రస్తావిస్తూ మధ్యయుగంలో దక్షిణ భారతం ఉత్తర భారతాన్ని బలోపేతం చేసిందని అన్నారు.

అఖిల భారత నాగరీ పరిషత్ మహా మంత్రి డా॥ పరమానంద పాంచాల్ మాట్లాడుతూ భారతీయ భాషల మధ్య అనువాద ప్రక్రియ నిరంతరం జరుగుతూనే వుండాలనీ, కాని అనువాదం కోసం ఇంగ్లీషును ఆశ్రయిస్తే మాత్రం భారతీయ భాషల సమైక్యత దెబ్బతింటుందని అన్నారు.

నానీల అనువాదకుడు ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ మాజీ ఛైర్మన్ డా. పోలి విజయరాఘవరెడ్డి, అనువాద విశేషాలను గురించి




ఎన్. గోపి రచించిన 'నానీలు' హిందీ అనువాదం 'నన్హేముక్తక్'ను స్వతంత్ర వార్త సంపాదకుడు డా॥ రాధేశ్యాం శుక్ల ఆవిష్కరిస్తున్న దృశ్యం. గోపి, ఎబికె ప్రసాద్

ప్రసంగించారు. ఈ గ్రంథాన్ని సీనియర్ పాత్రికేయులు ఎబికె ప్రసాద్ అంకితం పొందారు. సభలో గోపి నానీలను తెలుగులో చదవగా డా. శుభదవాంజెపె వెంటవెంటనే హిందీలో చదవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభ చివర క్షితిజ ప్రకాశన్ (ఢిల్లీ) అధినేత ఉమేష్ చంద్ర అగర్వాల్‌ను, డా. విజయరాఘవరెడ్డిని గోపి సత్కరించారు. హిందీ సాహిత్య సమ్మేళన్ ప్రచార మంత్రి డా. జగన్నాథరావు కులకర్ణి సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravindranath.**

విజయనగరం నుంచి సాహిత్యశాలకు హాజరైన
సీనియర్ చిత్రకారుడు, రచయిత శశి అక్కడ సాహిత్యాస్వాదనలో
మునిగితేలుతున్న కొందరు సాహితీమిత్రులను ఇలా చిత్రించారు.



# మాక్సిం గోర్కీ

(1868-1936)



ప్రముఖ రష్యన్ రచయిత. కథలు, నవలలు ఎన్నో రాశాడు. నిరుపేదగా, కూలీగా బతికాడు. ఇతని రచనలు ముఖ్యంగా 'అమ్మ' విప్లవానికి ఎంతో తోడ్పడ్డాయి.